

# పీపుల్స్‌వార్

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక

(మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)

మార్చి 2017

11

## కేంద్రకమిటీ

## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# పీపుల్స్‌వార్

కేంద్రకమిటీ సిద్ధాంత పత్రిక

(మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక)

మార్చి 2017

11

కేంద్రకమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

భారీ స్థాయిలో ఉత్పత్తి కోసమే కాకుండా, .....కమ్యూనిస్టు చైతన్యం కోసమూ, ఆశయం విజయవంతం కావడం కోసమూ, పెద్ద ఎత్తున మనుషులను మార్చడం అంటే, ఒక ఆచరణాత్మక ఉద్యమం, ఒక విప్లవం వల్లనే సాధ్యం అవుతుంది. పాలక వర్గాన్ని కూలదోయడానికి మరో మార్గం లేదు కాబట్టి ఈ విప్లవం అవసరం. అంతే కాకుండా కూలదోసే వర్గం యుగాల నాటి మురికిని వదిలించుకుంటేనే విప్లవంలో విజయవంతం అవుతుంది. సమాజాన్ని నూతనంగా నిర్మించడానికి తగిన విధంగా తయారవుతుంది.

- మార్క్స్, జర్మన్ ఐడియాలజీ

గత శతాబ్దపు రైతాంగం, ఉత్పత్తి కార్మికులూ పెద్ద పరిశ్రమలోకి వచ్చిన తరువాత తమ యావత్తు జీవిత విధానాన్నీ మార్చుకుని భిన్నమైన మనుషులుగా మారినట్టుగానే, సమాజం ఒక మొత్తంగా ఉత్పత్తి మీద సమిష్టి అదుపు, దీని ఫలితంగా ఏర్పడే నూతన మార్పు, ఈ రెండింటి కోసం పూర్తిగా భిన్నమైన మానవ పదార్థం అవసరం అవుతుంది. - *ఎంగెల్స్, ప్రిన్సిపల్స్ ఆఫ్ కమ్యూనిజం*

సోషలిస్టు భావజాలాన్ని ఏ రకంగానన్నా తక్కువ చేయడం, అత్యంత స్వల్పంగానైనా దాని నుంచీ పక్కకు తొలగడం అంటే బూర్జువా భావజాలాన్ని పటిష్టం చేయడమే అవుతుంది. - *లెనిన్, ఏం చేయాలి?*

సమస్త దేశాల బూర్జువా వర్గ, దాని సంస్కరణవాదుల ప్రధాన ప్రయత్నం ఏమంటే కార్మికవర్గానికి తన సొంత బలంలో విశ్వాసాన్ని చంపివేయడం. దాని విజయానికి ఉన్న అవకాశాలు, అనివార్యత గురించిన విశ్వాసాన్ని చంపివేయడం. తద్వారా పెట్టుబడిదారీ బానిసత్వాన్ని ముందుకు తీసుకురావడం. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానం ఇంకా కూలదోయబడకుండా, దాని ఉనికి ఇంకా కొనసాగుతున్నదంటే, కార్మికవర్గానికి తన విజయావకాశాల మీద ఇంకా తగినంత విశ్వాసం లేదు కాబట్టేననీ, తన ప్రతిభ వల్ల కాదనీ బూర్జువా వర్గానికి తెలుసు.

*- స్టాలిన్, 18వ కాంగ్రెస్‌కు కేంద్రకమిటీ పని గురించిన నివేదిక, 1939 మార్చ్ 10*

పెట్టుబడిదారీ విధానం నుంచీ సోషలిజానికి సాగే పరివర్తనా కాలంలో ప్రధాన (లేక మౌలిక) వైరుధ్యం సోషలిజానికీ పెట్టుబడిదారీ విధానానికీ మధ్య వైరుధ్యమే.

*- మావో, 'సీపీసీ ఎనిమిదో సీసీ విస్తార మూడో ప్లీనరీ సెషన్‌లో ఉపన్యాసం'*



కామ్రేడ్ మావో

- రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచండి !

- వర్గపోరాటాన్ని మరిచిపోవద్దు !

- కీలక లింకు వర్గపోరాటమే !

- విప్లవ ప్రతీఘాతకులకు వ్యతిరేకంగా తిరగబడడం ప్రజల జన్మహక్కు !

- బూర్జువా కేంద్రాన్ని బద్దలు కొట్టండి !

- 'సుగంధ పుష్పాల్ని' 'విషపూరిత కలుపు మొక్కల' నుండి వేరుచేయండి !

- స్వార్థాన్ని విడనాడండి, రివిజనిజాన్ని తిరస్కరించండి !

- రివిజనిజాన్ని కాదు, మార్క్సిజాన్ని ఆచరించండి; కుట్రలూ, కుహకాలూ చేయకండి, పారదర్శకంగా ఉండండి; చీలిపోవద్దు, ఐక్యంగా ఉండండి !

- మరిన్ని గొప్ప విజయాల సాధనకై ఐక్యంకండి !

- విప్లవాన్ని కొనసాగించండి, ఉత్పత్తిని పెంచండి !

- కార్మికవర్గం అన్ని విషయాల్లో నాయకత్వ పాత్ర వహించాలి !

- మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పతాకను సమున్నతంగా ఎత్తిపట్టండి !

- సామ్రాజ్యవాదం, అభివృద్ధి నిరోధకులందరూ నశించాలి !

- ప్రపంచ సోషలిస్టు విప్లవానికే విజయం !

- కార్మికవర్గ అంతర్జాతీయతా పతాకను సమున్నతంగా ఎత్తిపట్టండి !

**పీపుల్స్‌వార్-11**
**మార్చి 2017**

# విషయసూచిక


1. అమరులకు జోహార్లు 8

2. సంపాదకీయం 19

3. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ వార్షికోత్సవాలపై సి.పి.ఐ.(మావోయిస్టు)

(1) మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రాముఖ్యత, విజయాలు - గుణపాఠాలు
– కేంద్రకమిటీ, సి.పి.ఐ.(మావోయిస్టు), ఫిబ్రవరి 2017 21

(2) మహత్తర సాంస్కృతిక విప్లవంపై ఎం.ఐ.బి-33 సంపాదకీయ వ్యాసం 61

(3) సి.పి.ఐ.(మావోయిస్టు) డాక్యుమెంట్ల నుండి ఉల్లేఖనలు 80

4. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంపై చైనా కమ్యూనిస్టు పార్టీ

(1) సి.పి.సి. కేంద్రకమిటీ సర్క్యులర్, మే 16, 1966 85

(2) సి.పి.సి, సి.సి. మే 16 సర్క్యులర్ 10వ వార్షికోత్సవం సందర్భంగా చైనా పత్రికల సంపాదకీయం, మే 21, 1976 92

(3) మావో రచనల నుండి, సి.పి.సి. డాక్యుమెంట్ల నుండి, వ్యాసాల నుండి ఉల్లేఖనలు 101

5. సి.సి. సి.పి.ఐ.(మావోయిస్టు) తీర్మానం, సర్క్యులర్లు

(1) వెటరన్ కామ్రేడ్స్‌పై సి.సి. 5వ సమావేశ తీర్మానం 112

(2) ప్రస్తుత పరిస్థితి-మన కర్తవ్యాలు, కేంద్రకమిటీ సర్క్యులర్ 116

(3) బోల్షివీకరణపై సి.ఆర్.బి. సర్క్యులర్ 140

# అమరులకు జోహార్లు

భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దోపిడీ పాలకవర్గాలు దేశవ్యాప్తంగా గ్రీన్‌హంట్ మూడవ దశ దాడిని మరింత తీవ్రంగా కొనసాగిస్తున్నాయి. ప్రత్యేకంగా 2016లో మిషన్ 2016-అభియాన్ పేరుతో హత్యాకాండను, దాడులను తీవ్ర స్థాయిలో కొనసాగించాయి. దానిని ఓడించేందుకై మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ వీర కామ్రేడ్స్, ప్రజామిలీషియా, విప్లవ ప్రజలు తమ నులివెచ్చని నెత్తుర్లను ధారపోస్తూ ప్రతిఘటన యుద్ధాన్ని సాగించారు. ఈ ప్రజాయుద్ధం మన దేశ పీడిత ప్రజలనే గాకుండా ప్రపంచ పీడిత ప్రజలను ఉత్తేజపరుస్తున్నది. వారిలో మన పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తున్నది. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంలో భారత దోపిడీ వర్గాలు అమలు జరుపుతోన్న ఫాసిస్టు అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు ఉద్యమిస్తున్నారు.

ఈ క్రమంలో 2016 జులై నుండి 2017 మార్చి వరకూ గడచిన 9 నెలల ప్రజాయుద్ధ/పోరాట క్రమంలో దేశవ్యాప్తంగా సుమారు 180 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. అక్టోబర్ చివరి వారంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని రామగూడలో ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ బలగాలు జరిపిన భారీ దాడిని మన కామ్రేడ్స్ వీరోచితంగా ప్రతిఘటిస్తూ తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తూ నాయకత్వాన్ని కాపాడుకున్నారు. అందులో 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు. ఈ విధంగా మొత్తంగా సిసి సభ్యులు ఒకరు, డికెలో 120 మంది, బిజెలో 14 మంది, ఏఓబిలో 34 మంది, పశ్చిమ బంగ్‌లో ముగ్గురు, పశ్చిమ కనుమలలో ఒక సి.సి. సభ్యునితో పాటు ఒక ఎస్.జడ్.సి. సభ్యురాలు అమరులయ్యారు. వీరిలో దాదాపు సుమారు 90 మందిని ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాలు బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేశాయి. బిజె సాక్ సభ్యుడు కామ్రేడ్ అశీష్‌ను శత్రువు ఒక కోవర్ట్ చర్యలో హత్య చేశాడు. శత్రు బలగాలు మాటుగాచి నిర్వహించిన దాడుల్లో 7 గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. 2017 మార్చిలో జార్ఖండ్ రాష్ట్రం పలామూ జిల్లాలో విప్లవ ప్రతీఘాతక టిపిసి ముఠా చేసిన దాడిలో జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ అజిత్ యాదవ్‌తో సహా ముగ్గురు కామ్రేడ్స్ నేలకొరిగారు. సుమారు 70 మంది కామ్రేడ్స్ శత్రు బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో వీరోచితంగా పోరాడుతూ తమ ప్రాణాలు ధారపోశారు. విస్థాపన వ్యతిరేక ఆందోళనలపై చేసిన దాడుల్లో ఝార్ఖండ్‌లో 4 గురు, ఒడిశాలో 5 గురు ప్రజలను పోలీసు బలగాలు హత్య చేశాయి.

ఈ కాలంలో అమరులైన వారిలో మన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ కుప్పు దేవరాజ్(యోగేష్); సాక్/ఎస్‌జెడ్‌సి/ఎస్‌సి సభ్యులు కామ్రేడ్స్ హిమాద్రి రాయ్ (విధాన్‌దా, సోమెన్,

పశ్చిమ బంగ్), విజేంద్ర యాదవ్ (ఆశీష్, బిజె), బాకూరి వెంకటరమణ (గణేష్, ఏఓబి), చామల కిష్టయ్య (దయ, ఏఓబి), అజిత (కావేరి, పశ్చిమ కనుమలు) ఉన్నారు. డివిసి/జడ్‌సి స్థాయిలో కామ్రేడ్స్ ప్రభాకర్ (గంగాధర్, ఏఓబి), సువర్ణరాజు (కిరణ్, ఏఓబి), జగత్ (కుర్సం రాంమూర్తి, పశ్చిమ బస్తర్, డికె), పాలి (దర్భ, డికె), అజిత్ యాదవ్ (పలామూ, ఝార్ఖండ్), ఏసి/పిపిసి స్థాయిలో 30 మంది, 60 మంది పార్టీ సభ్యులు/పీ.ఎల్.జీ.ఏ. యోధులు, ఆరుగురు ఆర్‌పిసిల నాయకులు, కార్యకర్తలు, 8 మంది ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు, 21 మంది ప్రజా మిలీషియా కమాండర్లు, యోధులు, 40 మంది విప్లవ సానుభూతిపరులు, ప్రజలు ఉన్నారు. పౌరహక్కుల నేత కామ్రేడ్ బొజ్జా తారకం, ఆర్.వై.ఎల్. సంస్థాపక అధ్యక్షుడు, తొలితరం విరసం సభ్యుడు కామ్రేడ్ వర్ధన్‌రావు వృద్ధాప్యంతో మరణించారు. వీరు తమ అమరత్వంతో నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గాన్ని మరింత ప్రకాశవంతం చేశారు. ఆ అమరులందరికీ పిడికిలెత్తి విప్లవ జోహార్లు అర్పిద్దాం. వారి ఆశయ సాధనకు పునరంకితమవుదాం.

భారత విప్లవ నాయకుడు, మన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ దేవరాజ్‌తో పాటు కామ్రేడ్ అజిత 2016 నవంబర్ 24వ తేదీన కేరళ రాష్ట్రంలోని నీలంబూర్ అటవీ ప్రాంతంలో బూటకపు ఎదురుకాల్పులలో హత్యకు గురయ్యారు. కామ్రేడ్ దేవరాజ్‌కు 62 సంవత్సరాలు, కామ్రేడ్ అజితకు 45 సంవత్సరాలు.

కామ్రేడ్ దేవరాజ్ బెంగుళూరులో ఒక ఫాక్టరీలో పని చేస్తూ 1970ల చివరిలో పార్టీ పరిచయంలోకి వచ్చారు. ఆయన పట్టణ పేద కుటుంబానికి చెందినవాడు. ఆయనకు భార్య, పిల్లలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు ఉన్నారు. పార్టీ పరిచయాల లోకి రాక ముందే కామ్రేడ్ దేవరాజ్ మరి కొందరితో కలిసి కార్మికులలో విప్లవ రాజకీయ కృషి ప్రారంభించారు. కామ్రేడ్ చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) నాయకత్వంలో దేవరాజ్ త్వరలోనే వృత్తి విప్లవకారుడిగా ముందుకు వచ్చాడు. ఆయన కార్యకర్తగా రూపొందిన తరువాత వారి ఇల్లు పార్టీ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ఆయన చురుకైన పార్టీ కార్యకర్తగా విద్యార్థులు, కార్మికులు, యువతలో రాజకీయ, నిర్మాణ కృషిలో పాల్గొన్నారు. కామ్రేడ్స్ దేవరాజ్, కా. సాకేత్ రాజన్, మరొకరితో కూడిన పార్టీ బెంగుళూరు, మైసూర్, కోలార్ నగరాలలో కార్మికులు, విద్యార్థులు, యువతలో పని చేస్తూ వివిధ సమస్యల మీద పోరాటాలు చేపట్టింది. ఒక సాంస్కృతిక సంస్థను కూడా ఏర్పరిచింది. కా. దేవరాజ్ ఏఐఎల్ఆర్‌సిలో చేరాడు. ఈ క్రమంలో 1985 నాటికి కామ్రేడ్ ఆజాద్ నాయకత్వంలో సైద్ధాంతిక, రాజకీయ ఐక్యత కలిగిన ఒక నాయకత్వ బృందం ఏర్పడింది. వీరిలో దేవరాజ్ కీలకమైన వ్యక్తి.

కేంద్ర కమిటీలో 1985లో వచ్చిన పార్టీ సంక్షోభ సమయంలో కర్నాటక రాష్ట్ర నాయకత్వ

బృందం సీసీలోని విచ్ఛిన్నకర ముఠాకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడింది. ఈ ఆంతరంగిక పోరాటంలో కామ్రేడ్ దేవరాజ్ ఒక కీలక పాత్ర వహించారు.

1987లో జరిగిన ప్రథమ రాష్ట్ర మహాసభలో కామ్రేడ్ ఆజాద్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా కుప్పు దేవరాజ్, సాకేత్ రాజన్, మరొకరు ఈ కమిటీలో సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలోనే గ్రామీణ ప్రాంతంలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలనే నిర్ణయం తీసుకొని రాయచూర్–బీదర్ (ఆంధ్రప్రదేశ్‌కు ఆనుకొని ఉన్న ప్రాంతం) మైదాన గ్రామీణ ప్రాంతానికి ఉద్యమ నిర్మాణాన్ని ఆరంభించారు. పార్టీ అక్కడ రైతాంగ కూలీ సంఘాన్ని నిర్మించి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, రాజ్య వ్యతిరేక పోరాటాలు చేపట్టింది. ఇదే కాలంలో కైగా అణు కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వాన్ని అందించింది. బెంగళూరు, శివమొగ్గ, మైసూర్, ధార్వాడ్, బీదర్, రాయచూర్, చిత్రదుర్గలలో విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసింది.

1985–'87 మధ్య కేంద్ర కమిటీలో తలెత్తిన సంక్షోభం వల్ల రాష్ట్రాలలో ఉద్యమాల మధ్య సమన్వయం లేకుండా పోయింది. ఈ కాలంలో ఆజాద్, దేవరాజ్‌లు కలిసి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల కేడర్‌ను నిలబెట్టడానికి ఎంతగానో కృషి చేశారు. తమిళనాడు కేడర్‌ను నిలబెట్టడంలో కామ్రేడ్ దేవరాజ్ చాలా ముఖ్యమైన పాత్ర వహించారు. 1985లో పార్టీలో తలెత్తిన సంక్షోభంతో తమిళనాడు పార్టీలో తలెత్తిన గందరగోళ స్థితిని అధిగమించడంలో, తమిళనాడు పార్టీని గైడ్ చేసే బాధ్యతను చేపట్టి, తిరిగి అక్కడ నూతన రాష్ట్ర కమిటీని, ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో కా.దేవరాజ్ కృషి చాలా ప్రాధాన్యత కలిగినది.

కర్నాటకలో జాతి సమస్య ముందుకు వచ్చినప్పుడు పార్టీ దీని ప్రాముఖ్యతను గుర్తించి కర్నాటక విమోచన రంగ అనే సంస్థను నిర్మించింది. ఈ సంస్థ నిర్మాణంలోనూ ఈ సమస్యపై ఉద్యమాన్ని నిర్మించడంలోనూ కా.దేవరాజ్ పాత్ర ఉన్నది.

1990లో పార్టీ రెండో రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ మహాసభలో రాష్ట్ర ఉద్యమాన్ని సమీక్షించి వ్యవసాయ విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడంలోని లోపాల నుంచి పాఠాలు తీసుకుంది.

1991లో కేంద్రకమిటీలో రెండో సంక్షోభం వచ్చింది. ఈ సంక్షోభం సమయంలో కర్నాటక రాష్ట్ర కమిటీ కేంద్రకమిటీ లోని అవకాశవాద మైనారిటీ ముఠా ముందుకు తెచ్చిన తప్పుడు ధోరణులను ఎండగట్టడానికి ఒక డాక్యుమెంటును రూపొందించింది. ఈ ముఠాకు వ్యతిరేకంగా పోరాడవలసిందిగా పిలుపునిచ్చింది.

కర్నాటక పార్టీలో అన్యవర్గ ధోరణులు సరిదిద్దడం కోసం 1993లో రాష్ట్రకమిటీ రాష్ట్ర ప్లీనం నిర్వహించింది. ఈ ప్లీనం ప్రజా సమస్యలపై ఉద్యమాలను పురోగమింపజేయాలనే

కర్తవ్యాన్ని చేపట్టింది. బెంగుళూరులో 1999లో శత్రువు తనను చుట్టుముట్టినప్పుడు ఎంతో ధైర్యంగా చాకచక్యంగా తప్పించుకోగలిగారు.

1995లో అఖిల భారత ప్రత్యేక మహాసభకు ముందు జరిగిన కర్నాటక 3వ రాష్ట్ర మహాసభలో దేవరాజ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికైనారు. అఖిల భారత ప్రత్యేక మహాసభలో ఆయన ప్రత్యామ్నాయ సీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1997లో సీసీ సభ్యునిగా కోఆప్ట్ చేసుకోబడినారు. 2004 సెప్టెంబర్ 21న సి.పి.ఐ.(మావోయిస్టు) ఏర్పడినప్పుడు, పార్టీ ఐక్యతా కాంగ్రెస్–తొమ్మిదో కాంగ్రెస్‌లో కేంద్రకమిటీలో, సౌత్ వెస్ట్ రీజియన్ బ్యూరోలో సభ్యునిగా ఎన్నికైనారు. 2002లోనే కర్నాటక పశ్చిమ కనుమల్లోని మల్నాడ్ పర్స్‌పెక్టివ్ ప్రాంత ఉద్యమాన్ని నీరుగార్చడానికి రాష్ట్రకమిటీలోని మైనారిటీ అవకాశవాద విచ్ఛిన్నకర ముఠా ప్రయత్నాలను కామ్రేడ్స్ దేవరాజ్, సాకేత్ రాజన్‌లు దృఢంగా అడ్డుకున్నారు. ఈ కాలం లోనే మల్నాడ్ ప్రాంతంలో కామ్రేడ్ సాకేత్ రాజన్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరత్వం పొందాడు. ఆయన అమరత్వం తరువాత ఆ విచ్ఛిన్నకర అవకాశవాద ముఠా సిపిఐ (మావోయిస్టు) ఏర్పాటును వ్యతిరేకిస్తూ 2005 నవంబర్‌లో రివిజనిస్టు పంథాను ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా సిసి, ఆర్‌బిల గైడెన్స్‌లో కామ్రేడ్ దేవరాజ్ ఈ మితవాద అవకాశవాద ముఠాకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించి రాష్ట్రంలో మెజారిటీ కామ్రేడ్స్‌ను పార్టీ పంథాలో సమైక్యపరిచాడు. 2006లో రాష్ట్ర మహాసభలో ఈ అవకాశవాద రివిజనిస్టు ముఠా పార్టీని విడిచిపెట్టి వెళ్లిపోయింది. ఈ అవకాశవాదులను ఎండగట్టడం కోసం, 'అవకాశవాదులు ఎన్నడూ విప్లవ గతితర్కాన్ని అర్థం చేసుకోరు' అన్న పేరుతో ఒక పొలిమికల్ డాక్యుమెంటును సి.సి. విడుదల చేసింది. ఈ డాక్యుమెంటు రాయడంలో కామ్రేడ్ దేవరాజ్‌ది ప్రధాన పాత్ర.

2002లో తమిళనాడులో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికై పర్‌స్పెక్టివ్ ప్రాంతాన్ని నిర్ధారించుకొని సాయుధ పోరాటాన్ని అభివృద్ధి చేయడం కోసం మిలటరీ క్యాంపు నిర్వహిస్తున్న సమయంలో శత్రు దాడి జరిగి రాష్ట్ర కార్యదర్శితో పాటు అనేక మంది అరెస్టు కావడంతో 2003 ప్రారంభంలో కా. దేవరాజ్ ఆ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో కేరళలో జనశక్తి, ఇతర మితవాద పార్టీలను విడిచి బయటికి వచ్చిన నిజమైన విప్లవ శక్తులతో సీసీ తరఫున చర్చలు జరిపి పార్టీలో చేర్చుకున్నారు. దీనితో కేరళలో సరైన పంథాలో పార్టీ ముందుకు సాగింది. నాయకత్వ టీమును ఏర్పాటు చేసి అక్కడ విప్లవోద్యమం బలపడేలా ఆయన గైడ్ చేశారు. 2006–07లలో ఆర్‌బీ కార్యదర్శితో పాటు సభ్యుడొకరు అరెస్టు కావడంతో ఆర్.బి.లోని ఇద్దరు అమరులయ్యారు. ఇటువంటి కఠిన పరిస్థితిలో ఆయన దృఢంగా నిలబడి కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని కేడర్‌ను దృఢంగా నిలబెట్టాడు.

తమిళనాడులో వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించే లక్ష్యంతో కా. దేవరాజ్ నాయకత్వంలో

2007లో స్టేట్‌కమిటీ మధురై, దిండిగల్ ప్రాంతాల పర్‌స్పెక్టివ్‌ను రూపొందించింది. దానిని అమలుపర్చేందుకు కార్యాచరణకు దిగిన కొద్ది కాలం లోనే పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్ సందర్భంగా ఒక సాయుధ గెరిల్లా దళం అరెస్టు కావడం, మరొక దళంపై కూడా పోలీసు దాడి జరిగి కమాండర్ అమరుడు కావడం జరిగింది. దీనితో గెరిల్లా దళాలను వెనక్కి తీసుకొని ఆ వ్యూహాత్మక పథకాన్ని తాత్కాలికంగా విరమించుకోవాల్సి వచ్చింది.

విప్లవోద్యమ అణచివేతకు పాలకవర్గాలు దేశవ్యాప్తంగా కొనసాగించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ పశ్చిమ కనుమల్లో కూడా తీవ్రంగానే అమలు జరిగింది. ఈ నిర్బంధం నడుమనే కా.దేవరాజ్ నాయకత్వంలో తగిన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణపర సన్నాహాలు పూర్తి చేసుకొని కర్నాటక, కేరళ, తమిళనాడు కామ్రేడ్స్ ట్రైజంక్షన్ (కేరళ–తమిళనాడు–కర్నాటక) వ్యూహాత్మక ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. కామ్రేడ్స్ ఆ ప్రాంత ప్రజల్లోకి వెళ్లి సర్వే (వర్గపరిశీలన) నిర్వహించి కా. దేవరాజ్ నాయకత్వంలో డాక్యుమెంట్ రూపొందించారు. కా. దేవరాజ్ అక్కడ ఎస్.జడ్.సి.ని ఏర్పాటు చేసి తాను స్వయంగా దాని కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ప్రజావిముక్తి గెరిల్లా దళాలు దీర్ఘకాల సాయుధ పోరాట రాజకీయాలను ఆదివాసీ ప్రజల్లో బహుళ ప్రచారం చేశాయి. పార్టీ నాయకత్వాన పి.ఎల్.జి.ఏ. రాజకీయ–సైనిక ప్రచార క్యాంపెయిన్‌ని విజయవంతం చేసింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా పి.ఎల్.జి.ఏ. కొన్ని బడాబూర్జువా, బహుళజాతి కంపెనీల, ప్రభుత్వ ఆస్థులు ధ్వంసం చేసింది. ఈ దళాలు మరింతగా ప్రజలతో సమైక్యమైనాయి. ట్రైజంక్షన్‌లో ఉద్యమం రివిజనిజానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడడంతో అది కేరళ పాలక రివిజనిస్టులకు గొడ్డలి పెట్టుగా మారింది. ఈ క్యాంపెయిన్ అంతటిలోనూ కా. దేవరాజ్ నాయకత్వ భూమిక నిర్వహించారు.

ఇతర విప్లవ కమ్యూనిస్టు గ్రూపులతో ఐక్యత కోసం కామ్రేడ్ దేవరాజ్ కృషి చేశాడు. 2013 డిసెంబర్‌లో సిపిఐ (ఎంఎల్) నక్సల్బరీ పార్టీ మన పార్టీతో ఐక్యం కావడంలో ఆయన చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. పార్టీ, ప్రజా సంఘాల పత్రికలు నడిపారు. కేంద్రపత్రికలకు (వ్యాన్‌గార్డ్–పీపుల్స్‌మార్చ్) వ్యాసాలు రాశారు. ఎల్.టి.టి.ఇ. పోరాటం ఓటమి చెందడానికి కారణాలను విశ్లేషించి పీపుల్స్‌మార్చ్ పత్రికలో వ్యాసాలు రాశారు.

దేశంలో సాయుధ పోరాటం అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్ర నాయకత్వం రూపొందించిన ప్లానును సఫలం చేయడంలో భాగంగా కా. దేవరాజ్ ఆయుధాలు, మందుగుండు, గ్రెనేడ్స్ తదితరాల ఉత్పత్తి లోనూ, సరఫరాల్లోనూ చాలా ముఖ్యపాత్ర నిర్వహిస్తూ వచ్చారు.

కామ్రేడ్ దేవరాజ్ కేంద్రకమిటీ నిర్ణయించిన ఏ కర్తవ్యాన్నైనా తన కర్తవ్యంగా స్వీకరించి అమలు చేయడానికి కృషి చేసేవాడు. మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతాన్ని, మన దేశ, ప్రపంచ విప్లవ చరిత్రను, పార్టీ మౌలిక డాక్యుమెంట్లను లోతుగా అధ్యయనం

చేస్తూ సైద్ధాంతికంగా, రాజకీయంగా దృఢంగా ఉండేవాడు. పార్టీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను అంటి పెట్టుకుని ఉన్నాడు. పార్టీలో జరిగిన తీవ్రమైన అంతర్గత పోరాటాల్లో రాటు దేలాడు. తక్కువ స్వీయాత్మక శక్తులతోనైనప్పటికీ  గొప్ప ధైర్యంతో, దృఢమైన పట్టుదలతో వ్యూహాత్మక ప్రాంతాల్లో  సాయుధ పోరాట నిర్మాణానికి కృషి చేశాడు. కేంద్రకమిటీతో సంబంధాలు తెగినా, రీజియన్‌లో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ మొక్కవోని విశ్వాసంతో ఆయన వ్యవహరించారు. ప్రతి కామ్రేడ్‌తో కలిసి మెలిసి మెలిగేవాడు. కేడర్‌లలో ప్రజాస్వామిక వాతావరణం పెంపొందించాడు. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఆయన త్యాగనిరతి, అంకితభావం, పట్టుదల, కఠిన శ్రమ, ధైర్యం యావత్తు  పార్టీ కామ్రేడ్స్‌కు ఆదర్శనీయమైనవి. ఏటికి ఎదురీదడం కామ్రేడ్ దేవరాజ్ నుంచీ నేర్చుకోవాలసిన ఒక గొప్ప లక్షణం. ఆయన ఆదర్శాల నుండి నేర్చుకొని ఏ కామ్రేడైనా మంచి కమ్యూనిస్టు కార్యకర్తగా తయారు కావచ్చు.

కా. దేవరాజ్‌కు తమిళం, ఇంగ్లీషు, కన్నడ భాషల్లో పట్టు ఉండేది. ఆయన విప్లవ ప్రయోజనాల కోసం తెలుగు, హిందీ, మళయాళ భాషలు నేర్చుకున్నాడు. అవకాశవాదులకు వ్యతిరేకంగా పొలిమికల్ డాక్యుమెంట్లు రాయడం, పార్టీ కార్యకర్తలను సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా ఎదిగించే కృషి చేయడం, సర్క్యులర్లు రాయడం, బోధించడంలో ఆయన నేర్పరి. పార్టీలో రెక్టిఫికేషన్ నిర్వహించేందుకూ, నూతన నాయకత్వాన్ని అభివృద్ధి చేసేందుకూ నాయకత్వ తర్ఫీదు కార్యక్రమం (లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్-ఎల్.టి.పి.) నిర్వహించారు.

కామ్రేడ్ దేవరాజ్ అమరత్వంతో మన పార్టీ, భారత విప్లవం ఒక గొప్ప  నాయకుడిని కోల్పోయింది. ఇది ట్రైజంక్షన్ ఉద్యమాభివృద్ధికి చాలా పెద్ద నష్టం. మూడున్నర దశాబ్దాలకు పైగా కాలంలో ఆయన భారత విప్లవోద్యమ అభివృద్ధికి అందించిన సేవలు భౌతికరూపంగా నేటి ఉద్యమంలో నిక్షిప్తమై ఉన్నాయి. కామ్రేడ్ దేవరాజ్ నెలకొల్పిన ఆదర్శాల నుండి నేర్చుకోవలసిందిగా ఆయన అందించిన గొప్ప స్ఫూర్తితో దృఢంగా పురోగమించవలసిందిగా మొత్తం పార్టీకీ, ప్రత్యేకంగా సౌత్‌వెస్ట్ రీజియన్‌లోని మూడు రాష్ట్రాల కామ్రేడ్సందరికీ సీసీ పిలుపునిస్తున్నది. ఆయనను అమితంగా ప్రేమించి గౌరవించి ఆయనకు ఎంతో తోడ్పడిన తన కుటుంబానికీ, సహ కామ్రేడ్స్‌కూ, మిత్రులకూ కేంద్రకమిటీ ప్రగాఢ సంతాపం తెలుపుతున్నది. మన ప్రియతమ అమరుడు కామ్రేడ్ దేవరాజ్ ఆశయ సాధనకు కేంద్రకమిటీ శపథం పూనుతున్నది. ఇదే ఆ గొప్ప అమరుడికి అసలైన నివాళి.

పశ్చిమ బంగ్ రాష్ట్రంలో కామ్రేడ్ హిమాద్రి రాయ్ (సోమెన్) ఆ రాష్ట్ర విప్లవోద్యమంలో అత్యంత సీనియర్ కామ్రేడ్. 2002లో మునుపటి పిడబ్ల్యు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. ఐక్య పార్టీ నిర్మాణం తర్వాత రాష్ట్ర కమిటీ సభ్యునిగా కొనసాగుతూ విప్లవోద్యమానికి తన సేవలు అందించాడు. ఆ క్రమంలో అరెస్టయి సుదీర్ఘకాలం జైలు జీవితం అనుభవించాడు.

జైలులో ఆయన ఆరోగ్యం క్షీణించడం వల్ల జైలు నుంచి విడుదలైన అనతి కాలంలోనే తుదిశ్వాస విడిచాడు. ప్రస్తుత పరిస్థితిలో ఆయన అమరత్వం ఆ రాష్ట్ర ఉద్యమానికి తీరని లోటు. అమరుడు సోమేన్‌కు వినమ్రంగా జోహార్లర్పిద్దాం. అమరుడు సోమేన్ ఆశయ సాధనకు శపథం చేద్దాం.

బీహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (సాక్) సభ్యుడు కామ్రేడ్ విజేంద్ర యాదవ్ (ఆశీష్) సెప్టెంబర్ 11న ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లా రాయడీహ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌడాడీహ్ అడవిలో పోలీసులు నిర్వహించిన ఒక కోవర్టు ఆపరేషన్(ఆంబుష్)లో వీరోచితంగా పోరాడుతూ గాయపడ్డాడు. గాయపడిన స్థితిలో ఆయనను పోలీసులు పట్టుకొని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో వెల్లువెత్తిన జహానాబాద్ జిల్లాలో బిగహా గ్రామంలో ఒక దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఆయన జన్మించాడు. తండ్రిని భూస్వాములు హత్య చేయడంతో చిన్నతనం నుండే భూస్వామ్య వ్యతిరేక, రాజ్య వ్యతిరేక పోరాటంలో దూకాలనే కోరిక ఆయనలో బలపడింది. అదే విధంగా ఆయన విప్లవ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూనే పార్టీలో చేరాడు. పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ 2013లో బిజె సాక్ సభ్యునిగా ఎన్నికైనాడు. ఆయన బిఆర్‌సి పరిధిలోని కోయల్-శంఖ్ జోన్‌లో పనిచేస్తుండినాడు. కామ్రేడ్ విజేంద్ర ఉత్తమ కమ్యూనిస్టు కార్యకర్త. క్యాడర్లకు ఆదర్శవంతమైన నాయకుడు. ఆయన మంచి కమ్యూనికేషన్ పర్సన్, డాక్టర్ కూడా. అందరితోనూ కలిసిపోతూ అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఉద్యమం కఠిన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, ఎంతో మంది ఉద్యమాన్ని విడిచి పారిపోతున్నప్పటికీ, కొందరు ద్రోహులుగా మారుతున్నప్పటికీ, ఆయన పార్టీకీ, పార్టీ పంథాకు, ఉద్యమానికి అంటిపెట్టుకొని ఉన్నాడు. కామ్రేడ్ విజేంద్ర అమరత్వం బిజె సాక్‌కు పెద్ద నష్టం. అమరుడు విజేంద్రకు తలవంచి శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఆయన ఆశయాల సాధనకై చివరి వరకూ పోరాడుతామని శపథం చేద్దాం.

కామ్రేడ్ బాకూరి వెంకటరమణరాజు (గణేష్, ప్రసాద్) ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా, హుకుంపేట మండలం, బాకూరు గ్రామంలో మధ్య తరగతి ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. మన్యంలో 'ఆదివాసీల పోరాటాలు మిన్నంటుతున్న' కాలంలో కామ్రేడ్ ప్రసాద్ పుట్టి, పెరిగి, విద్యాభ్యాసం కొనసాగించాడు. ఆ ప్రభావంతో విద్యార్థి దశలో వున్న కామ్రేడ్ ప్రసాద్ ఆర్.ఎస్.యు.లో చేరాడు. దాని కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకున్నాడు. కామ్రేడ్ ప్రసాద్ డిగ్రీ పూర్తయిన తర్వాత 1990ల ఆరంభంలో విశాఖ ప్రాంతంలో ఏర్పడిన 'గిరిజన హక్కుల పరిరక్షణ సంస్థ' (ఒ.పి.జి.ఆర్.) వ్యవస్థాపకులలో ఒకరు. ఈ సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ప్రభుత్వం 1992లో పార్టీనీ, ప్రజా సంఘాలతో పాటు ఒ.పి.జి.ఆర్. కార్యకలాపాలను కూడా నిషేధించింది. అయినప్పటికీ గిరిజన విద్యార్థి సంఘం (జి.ఎస్.యు.) పేరుతో 2000ల వరకు కూడా విద్యార్థుల్ని, ఇతరులను ఆర్గనైజ్ చేయడంలో కామ్రేడ్ ప్రసాద్

పాత్ర కీలకమైనది.

కామ్రేడ్ ప్రసాద్ 1997లో గెరిల్లా దళ సభ్యునిగా చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ 2006లో ఎ.ఒ.బి. 3వ మహాసభలో ఎస్.జడ్.సి.లోకి ఎన్నికయ్యాడు. 2002లో ఈస్ట్ డివిజన్‌ను విశాఖపట్టణం, తూర్పు డివిజన్లుగా వేరు చేసినప్పుడు విశాఖ డివిజన్‌కూ, తిరిగి 2008లో ఆ రెండిటినీ కలిపి ఒకే ఈస్ట్ డివిజన్‌గా ఏర్పాటు చేసినప్పుడు ఈస్ట్ డివిజన్‌కూ కామ్రేడ్ ప్రసాద్ కార్యదర్శిగా ఎన్నికైనాడు. ఆ విధంగా కామ్రేడ్ ప్రసాద్ జీవితం ఈస్ట్ డివిజన్ ఉద్యమంతో పెనవేసుకుపోయింది. వివిధ పోరాటాలకు సరైన గైడెన్స్ ఇస్తూ ప్రజలకు తల్లో నాలుకయ్యాడు. 2013 వరకు ఎస్.జడ్.సి. నుండి ఉమ్మడి డివిజన్‌ను చూసే బాధ్యతను కొనసాగించాడు. ఆ తర్వాత ప్రజా సంఘాలను గైడ్ చేసే బాధ్యతలు నిర్వహించాడు. మిలటరీ నైపుణ్యం కలిగి వుండటంతో ఎస్.ఎమ్.సి. సభ్యుడిగా కొంతకాలం పని చేశాడు. పలు సాయుధ దాడులకు నాయకత్వం వహించాడు. కొంతకాలం సాంస్కృతిక రంగానికి బాధ్యత వహించాడు. ఈ విధంగా ఎస్.జడ్.సి. సభ్యుడిగా పరిస్థితులకు అనుగుణంగా అనేక బాధ్యతలు నిర్వహించాడు. డివిజన్ సెక్రటరీగా పనిచేస్తూనే ఐక్య సంఘటన పోరాటాలను సమన్వయం చేసేవాడు. ఐక్య సంఘటనలో పని చేస్తున్న ఇతర కామ్రేడ్స్‌కు సరైన మార్గదర్శకత్వం అందించాడు. కామ్రేడ్ ప్రసాద్ ప్రభుత్వ నిర్బంధంపై, బాక్సైట్ పోరాటం తదితర విషయాలపై మర్రి కామయ్య, నాగమణి తదితర పలు కలం పేర్లతో అనేక సామాజిక పత్రికలకు రచనలు చేశాడు. ఏ.ఓ.బి. పత్రిక 'బోల్షివిక్'కు కూడా రచనలు చేశాడు.

స్థానికంగా కింది స్థాయి నుంచి ఎదిగిన విప్లవ నాయకుడు కామ్రేడ్ ప్రసాద్. శత్రువు తనని సరెండర్ కావాలని ఎన్ని మోసకారి ఎత్తులు, ఒత్తిడులు చేసినా, కుటుంబాన్ని కూడా మానసికంగా కృంగదీసినా పార్టీ గర్వించదగిన ఒక నాయకునిగా ఎలాంటి వూగిసలాటకు గురి కాకుండా వర్గపోరాట రాజకీయాలను దృఢంగా ఎత్తిపడుతూ చివరి ఊపిరి వరకూ విప్లవోద్యమంలో తన బాధ్యతలు నిర్వహించాడు. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో ఎదురుపడిన అనేక ఎగుడుదిగుడులను దృఢంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. సహచర కామ్రేడ్స్‌కు ప్రేమ, ఆప్యాయత, స్వేచ్ఛ, భరోసాలను అందించడంలో కామ్రేడ్ ప్రసాద్ అందరికీ ఆదర్శంగా వుండేవాడు. ఆయన అమరత్వంతో ఏఓబి ఉద్యమం ఒక గొప్ప నాయకుడిని, పెద్ద అండను కోల్పోయింది. కామ్రేడ్ ప్రసాద్‌కు అరుణాంజలి ఘటిస్తూ ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకొని పోతామని శపథం చేద్దాం.

కామ్రేడ్ చామల కిష్టయ్య (దయ) నాటి తెలంగాణా సాయుధ పోరాటంలోనూ, తర్వాత దక్షిణ తెలంగాణాలో మావోయిస్టు ఉద్యమంలోనే కాక ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ

పోరాటంలోనూ వీరోచిత పాత్ర వహించిన పోరాటాల ఖిల్లా నల్గొండ జిల్లా (తెలంగాణా) లోని, వలిగొండ మండలం, దాసిరెడ్డిగూడం గ్రామంలో నిరుపేద కుటుంబంలో చామల చంద్రమ్మ, రామయ్య దంపతులకు జన్మించాడు. ఆయన వయసు 45 సంవత్సరాలు. కామ్రేడ్ దయ డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్.ఎస్.యు) కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. 1990లో పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో చేరాడు. నాలుగు సంవత్సరాలు దక్షిణ తెలంగాణా ఉద్యమంలో పని చేశాడు. 1994లో పార్టీ నాయకత్వం కామ్రేడ్ కిష్టయ్యను శ్రీకాకుళం ఉద్యమ పునర్నిర్మాణ లక్ష్యంతో పంపించింది. అప్పటి నుంచి కామ్రేడ్ దయ జీవితాన్ని శ్రీకాకుళం-విజయనగరం-కోరాపుట్ ఉద్యమం నుంచి విడదీసి చూడలేము.

కా. కిష్టయ్య శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం దళ డిప్యూటీ కమాండర్గా దయ పేరుతో పని చేశాడు. ప్రజలతో ఐక్యమవుతూ అనేక పోరాటాల్లో ప్రజలకు నాయకత్వం వహించాడు. ఉద్దానం ఏరియాలో భూస్వామి పంజాబ్ సింగ్కి 100 ఎకరాల కొబ్బరితోట ఆక్రమణ పోరాటంలో, రెట్టికొండ, మెట్టిలలో పోరాటాల ద్వారా వందలాది ఎకరాల గవర్నమెంట్ జీడితోటల స్వాధీన పోరాటాలలో, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే డిమాండ్తోనూ వేలాది మంది ప్రజలను సంఘటితం చేయడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. 1998 కోపర్డంగ్ ఎన్కౌంటర్లో పార్టీకి భారీ నష్టం జరిగిన తర్వాత నాగావళి ఏరియాకు బదిలీ అయినాడు. అక్కడ గొట్ట, ముకుందాపురం, పాంద్రతల వంటి గ్రామాలలో నిర్వహించిన భూ పోరాటాలలో, విశ్వ అనే భూస్వామికి చెందిన 600 ఎకరాల భూమి స్వాధీన పోరాటాల్లో, కోరాపుట్లో రాయ్గఢ, విజయనగరంలో కువ్వి ప్రజలను ఐక్యం చేసి చింతపండుకు గిట్టుబాటు ధర కోసం సాగించిన పోరాటంలో కామ్రేడ్ దయ పాత్ర కీలకమైనది.

నారాయణపట్నాలో సొండి పెత్తందార్లు, భూస్వాములు మోసకారి పద్ధతుల్లో ప్రజలను సారా మత్తులో ముంచుతూ వారి భూములను అక్రమంగా ఆక్రమించుకున్నారు. వారు అనేక మోసాలకు పాల్పడి ప్రజలకు కూడు, గుడ్డ, గూడు లేకుండా చేశారు. ఆ క్రమంలో పార్టీ నాయకత్వంలో మొదట ప్రజలు సారాకు వ్యతిరేకంగా కదిలి సొండీల సారాను బందు పెట్టారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నారాయణపట్నా భూ పోరాటం వెల్లువెత్తింది. అందులో విశాల ప్రజానీకాన్ని సాయుధం చేస్తూ ఘెనువా బాహిని అనే ప్రజా మిలీషియాను ఏర్పాటు చేశారు. ఆపరేషన్ గ్రీన్హంట్తో తీవ్రమైన శత్రు దాడి వలన, 2012 చివరి నుంచి భూ పోరాటం తాత్కాలికంగా వెనుకంజ వేసినా 2015 నుంచి తిరిగి క్రమంగా పుంజుకుంటోంది. ఈ ఉద్యమానికి కామ్రేడ్ దయ నాయకత్వాన్ని అందించాడు.

మాలి, దేవమాలి, రక్తఖండి వంటి ప్రాంతాలలో విస్థాపన సమస్యపై ప్రజలను చైతన్యపరిచి, వివిధ ఐక్య వేదికల నాయకత్వంలో పోరాటాలు సాగించడంలో కామ్రేడ్ దయ పాత్ర ముఖ్యమైంది. భూపోరాటాలు, సారా పోరాటాలు, గిట్టుబాటు ధర పోరాటాలు, విస్థాపన పోరాటాలలో విస్తృతంగా వ్యవసాయ కూలీలు, రైతాంగం, మహిళలను కదిలించడంలో కామ్రేడ్ దయ పాత్ర ముఖ్యమైంది. ప్రజాసంఘాలనూ, మిలీషియాను ఏర్పాటు చేయడం, ప్రజల సమస్యల్ని ప్రజా కోర్టులలో పరిష్కరించడం వంటి కార్యకలాపాలను క్రియాశీలంగా నిర్వహించాడు.

మిలటరీ రంగంలో కూడా కామ్రేడ్ దయ ప్రముఖ పాత్ర వహించాడు. అనేక దాడుల్లో కామ్రేడ్ దయకు ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం వుంది.

దయ ఏ ప్రాంతంలో పని చేస్తే ఆ ప్రాంత భాషను నేర్చుకునేవాడు. ప్రజల భాషలో చొరవగా మాట్లాడుతూ వాళ్లలో ఒకడిగా మెలిగేవాడు. ఎక్కడకు వెళ్లినా ఆ ఏరియాలోని టెర్రయిన్ మీద పట్టు సంపాదించేవాడు. ప్రజలను ప్రేమించడంలో, వారితో సజీవ సంబంధాలు ఏర్పర్చుకోవడంలో ఆదర్శంగా ఉండేవాడు. ఏ మీటింగు జరిగినా తను ఉండాలని ప్రజలూ, క్యాడరే కాకుండా తను కూడా కోరుకునేవాడు. తన ఉపన్యాసాలతో, పాటలతో ప్రజలను ఉత్తేజపర్చేవాడు. పోలీసులు ప్రజలను అరెస్టు చేసిన సందర్భాలలో వారి కుటుంబాలను కలవడం, ఓదార్చడం, ధైర్యం చెప్పడం, రాజకీయంగా అర్థం చేయించడం, వారిని ఉద్యమం వైపు నిలబెట్టడం, జైలు నుండి విడుదలై వచ్చిన వారిని కలిసి ఉద్యమ పక్షాన నిలబెట్టడం పట్ల శ్రద్ధ పెట్టేవాడు. ప్రజలను ఎంత ప్రేమిస్తాడో శత్రువుపై అంతే కసితో వుండేవాడు.

అభివృద్ధిలో వెనుకబడుతున్న మహిళా కామ్రేడ్స్‌కు సహకరించేవాడు. సహచరులను కోల్పోయిన కామ్రేడ్స్‌కు తోడ్పాటునందించేవాడు. కొత్తగా వచ్చిన కామ్రేడ్స్‌ను అభివృద్ధి చేయడం, సమస్యలు ఎదుర్కొంటున్న కామ్రేడ్స్ విషయంలో సన్నిహితంగా ఉంటూ, రాజకీయంగా వారి ఎదుగుదలకు సహకారాన్ని అందించడం తనలో వున్నటువంటి మరో మంచి లక్షణం. తన పెళ్లి విషయంలో కూడా కామ్రేడ్ దయ ఆదర్శంగా ఆలోచించాడు. కామ్రేడ్ దయ తన లోపాలను సరిచేసుకోవడంలో అంతర్గతంగా ఘర్షణ పడుతూ ఎప్పటికప్పుడు స్వయం విమర్శ చేసుకోవడమే కాక వాటి నుండి బయటపడటానికి కృషి చేసేవాడు. ఈ విధంగా కమ్యూనిస్టు ఆదర్శాలు కలిగిన, ప్రజా ఉద్యమాలలో అనుభవం ఉన్న కామ్రేడ్ దయను కోల్పోవడం ఏఓబి ఉద్యమానికి తీరని లోటు. కామ్రేడ్ దయ కలలు కన్న నూతన ప్రజాస్వామిక విప్లవం, ఆ తర్వాత సోషలిజం-కమ్యూనిజం కోసం తుదిశ్వాస వరకూ పోరాడుతామని ప్రతిన బూనుదాం.

కా. అజిత (కావేరి)(45) తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో పేద కుటుంబంలో జన్మించింది. ఆమె 1980ల చివరిలో విప్లవ విద్యార్థి ఉద్యమం లోకి అడుగుపెట్టింది. విద్యార్థిగా

ఉన్నప్పుడే కా. అజిత 'తమిళనాడు పెన్నూరిమై కజగం' అనే మహిళా సంఘంలో చేరి చురుగ్గా, మిలిటెంట్‌గా పనిచేస్తూ నాయకురాలిగా ఎదిగింది. మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా ఆమె ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి వారిని విప్లవమార్గంలో నడిపించేందుకు కృషి చేసింది. పట్టణోద్యమ నిర్మాణంలో భాగంగా కొన్ని సంవత్సరాలు చెన్నైలో అడ్వొకేట్‌గా పనిచేసింది. తమిళనాడులో రాజ్య నిర్బంధం తీవ్రతరం కావడంతో 2002లో ఆమె రహస్య జీవితానికి వెళ్లి పట్టణ ఉద్యమానికీ, ప్రజాసంఘాలకు నేతృత్వం వహించింది. పట్టణోద్యమంలో భాగంగా ఆమె ట్రేడ్‌యూనియన్ పోరాటాలను నడిపింది.

2000 దశకం మధ్య తమిళనాడు పార్టీలో తలెత్తిన మితవాద అవకాశవాద పంథాకి వ్యతిరేకంగా పోరాడుతూ మన పార్టీకి చెందిన సరైన పంథా వైపు దృఢంగా నిలబడింది. తన జీవిత సహచరుడు అవకాశవాద పంథా చేపట్టి పార్టీ నుండి వెళ్లిపోయి చిన్న ముఠానేర్పరచినప్పటికీ ఆమె విప్లవ పంథా వైపే దృఢంగా నిలబడింది. పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా సమాజం లోనూ, పార్టీ లోనూ మార్క్సిస్టు అవగాహనతో పోరాటం చేసింది. 2012లో ఆమె ఎస్.జడ్.సి.లోకి ఎన్నికైనారు. 2014 మేలో జరిగిన కోయంబత్తూర్ అరెస్టుల తర్వాత కా. అజితను అరెస్టు చేసేందుకు పోలీసులు అనేకసార్లు ప్రయత్నించారు. ఎస్.జడ్.సి. నిర్ణయం మేరకు ఆమె గెరిల్లా దళాల్లో ఉండి ట్రైజంక్షన్ ఉద్యమానికి నాయకత్వం వహించింది. అధ్యయనం పట్ల, వర్గపోరాటం పట్ల కా. అజితకు ఆసక్తి మెండు. మహిళా సమస్య పట్ల సరైన మార్క్సిస్టు దృక్పథం కలిగి ఉండేది. విప్లవ విజయానికి మహిళల భాగస్వామ్య ప్రాధాన్యతను బలంగా నొక్కి చెబుతూ రెండున్నర దశాబ్దాలకు పైగా అకుంఠిత దీక్షతో కృషి చేసింది. మొదటి నుండి అనారోగ్యం పీడిస్తున్నా అవిశ్రాంతంగా విప్లవోద్యమంలో క్రియాశీలంగా, సమరశీలంగా దృఢసంకల్పంతో నాయకత్వాన్నందించింది. భారత విప్లవోద్యమం అందించిన గొప్ప కమ్యూనిస్టు కా. అజిత. ఆమె సాహసిక కమ్యూనిస్టు యోధ. కా. అజిత కలలు గన్న కమ్యూనిజం స్థాపనే పరమాశయంగా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేద్దామని శపథం చేద్దాం.

భారత దోపిడీ పాలకవర్గాలు విప్లవకారులను హత్య చేసి విప్లవాన్ని ఆపగలమని పగటి కలలు కంటున్నారు. ఎన్నెన్నో పథకాలు పన్నుతున్నారు. శత్రు ప్రతీఘాతుక యుద్ధం మీద ప్రజల విప్లవ యుద్ధంలో నేటి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశలో సాధారణ విప్లవ ప్రజల నుంచీ గ్రామ, ఏరియా, డివిజన్, రాష్ట్ర, కేంద్ర నాయకత్వం వరకు ప్రతి నిత్యం ఎందరో కామ్రేడ్స్ అమరులు అవుతున్నారు. ఈ అందరు కామ్రేడ్స్ అమరత్వం ప్రజా ఉద్యమాలకు, పార్టీకి తీరని నష్టమే అయినప్పటికీ వారు అజరామరంగా మనలో, ప్రజల్లో నిలిచే ఉంటారు. నిరంతరం వారి విప్లవ స్ఫూర్తిని మదిలో నింపుకొని పురోగమిద్దాం. అమరుల ఆశయ సాధనకై అంకిత భావంతో ఉద్యమిద్దాం. అమరుల ఆశయాలను పూరిద్దాం. *

# సంపాదకీయం

సోషలిస్టు చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం (1966-76) చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రపంచాన్ని కుదిపివేసిన ఘటన. సోషలిజం, కమ్యూనిజం నెలకొల్పడానికి ప్రపంచ కార్మికవర్గ ఉద్యమంలో పాజిటివ్, నెగిటివ్ అనుభవాల క్రోడీకరణ ఫలితం ఈ విప్లవం. మావో నాయకత్వంలో ఈ విప్లవం అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవ సిద్ధాంత ఆచరణలను నూతన, మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధి చేసింది. సోషలిజం, కార్మికవర్గ నియంతృత్వ పరిస్థితులలో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం నడిపిన మున్నెన్నడూ లేని అద్వితీయ విప్లవం. ఇది సోషలిస్టు ఆర్థిక పునాదికి అనుగుణంగా ఉపరితలాన్ని రూపొందించే విప్లవం. పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు దేశ విదేశీ రివిజనిస్టులు, అభివృద్ధి నిరోధకుల ప్రయత్నాలను ఓడిస్తూ మధ్యంతర సోషలిజం దశ గుండా పెట్టుబడిదారీ విధానం నుంచీ కమ్యూనిజానికి పరివర్తనా కాలపు విప్లవం ఇది. శత్రు కేంద్రాలను ధ్వంసం చేయడానికి తుఫాను కెరటాల మాదిరిగా ఎగసిన లక్షలాది ప్రజలు చేసిన విప్లవం. ఈ క్రమంలో వాళ్లు తమ ప్రాపంచిక దృక్పథాన్ని కూడా మార్చుకున్నారు. సోషలిస్టు విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఇది తప్పనిసరి. ఇది విప్లవాన్ని తుది విజయం వరకూ - చివరికంటా సోషలిస్టు విప్లవాన్ని కొనసాగిస్తూ కమ్యూనిజం నెలకొల్పేందుకు కొనసాగించే విప్లవం.

నిరంతర విప్లవం గురించిన మార్క్సిస్టు సైద్ధాంతిక సూత్రీకరణను మరింతగా అభివృద్ధి చేసిన దాని ఫలమే జీపీసీఆర్. మావో నాయకత్వంలో కార్మికవర్గ నియంతృత్వం కింద వర్గ పోరాటానికి సంబంధించి సోషలిజం విజయానికి హామీనిచ్చే నూతన సైద్ధాంతిక సూత్రాలను ఇది అభివృద్ధి చేసింది. అంతే కాదు, జీపీసీఆర్ ఆచరణలో ఈ సిద్ధాంతాలు రుజువయాయి, నిగ్గుదేలాయి. ఇది ప్రపంచ కార్మికవర్గానికీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికీ అద్వితీయ, నూతన ఉన్నత స్థాయి అనుభవం.

యావత్తు చైనా సమాజాన్నీ మార్చడంతో పాటుగా జీపీసీఆర్ ప్రపంపవ్యాప్త ప్రభావం కూడా వేసింది. ప్రపంచంలో కమ్యూనిస్టు, జాతి విముక్తి ఉద్యమాల ఒక నూతన వెల్లువకు ఇది ప్రేరకంగా పని చేసింది. సైద్ధాంతికంగా, రాజకీయంగా రివిజనిజంతో నిర్ణయాత్మకంగా విడిపోవడానికి ఇది చోదకంగా పని చేసింది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ఎత్తిపట్టిన పెట్టుబడిదారీ దేశాలలో నూతన రకపు కార్మికవర్గ ఉద్యమాలకు, భారతదేశంతో సహా అనేక పీడిత దేశాలలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాలకూ నేపథ్యంగా పని చేసింది.

మన దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో విప్లవ అగ్రగాములైన కామ్రేడ్స్ సీఎం, కేసీ వంటి వారి నాయకత్వంలో అప్పటికే ఒక సైద్ధాంతిక పోరాటం జరుగుతూ ఉన్నది. ఈ సైద్ధాంతిక పోరాటం 1967 నాటి చారిత్రక నక్సల్బరీ సాయుధ వ్యవసాయ విప్లవ తిరుగుబాటుకు దారి తీసింది.

ఇలా, జీపీసీఆర్ అంతర్జాతీయ నేపథ్యంలో కామ్రేడ్స్ సీఎం, కేసీ నాయకత్వంలో భారతదేశంలో ప్రజాయుద్ధం ప్రారంభమయింది. గడచిన ఐదు దశాబ్దాలుగా కఠిన మార్గంలో ప్రయాణిస్తున్న ఈ మహత్తర ప్రజాయుద్ధం యాభయ్యవ వార్షికోత్సవం పూర్తి చేసుకోనున్నది.

నాలుగు దశాబ్దాల క్రితం జీపీసీఆర్ ముగిసిన నాటి నుంచీ బూర్జువా వర్గానికీ కార్మికవర్గానికీ మధ్య వర్గ పోరాటం కొనసాగుతూనే ఉన్నది. జీపీసీఆర్ సమయంలో నిర్మాణం, లేదా పునర్నిర్మాణం అయిన అనేక నిజమైన విపవ కమ్యూనిస్టు పార్టీలు ఇంకా ఉనికిలో ఉండి, అనేక దేశాలలో వర్గ పోరాటానికి నాయకత్వం వహిస్తున్నాయి. ఈ పార్టీల నాయకత్వాలు మార్క్సిజం–లెనినిజం–మావోయిజం విశ్వజనీన సత్యాన్ని – ప్రత్యేకించి జీపీసీఆర్ గుణపాఠాలను సృజనాత్మకంగా అన్వయించగలిగిన చోట విప్లవోద్యమ విజయాలు, ఓటములు, ఎగుడు దిగుడులు, మెలికలు, మలుపుల మధ్యనే పార్టీలు నిలదొక్కుకోగలిగాయి, లేదా పటిష్టం కాగలిగాయి. నాయకత్వం ఇలా చేయని సందర్భంలో పార్టీలు దిగజారిపోయాయి, ఉద్యమం నష్టపోయింది.

తమ దేశ నిర్దిష్ట పరిస్థితులకు మాలెమాను సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా, దాని మార్గదర్శకత్వంలో వర్గ పోరాట రంగంలోకి విశాల ప్రజానీకాన్ని తీసుకురావడం ద్వారా, అపారమైన ధైర్య సాహసాలతో, త్యాగనిరతితో, బలమైన పార్టీ లేని చోట ఒక బలమైన పార్టీని నిర్మాణమవుతుంది, బలమైన సైన్యం లేని చోట ఒక బలమైన సైన్యాన్ని నిర్మాణమవుతుంది, రాజకీయాధికారం లేని చోట రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం సాధ్యమవుతుంది. మన తక్షణ, అంతిమ లక్ష్యాలను సాధించడానికి మాలెమాను, జీపీసీఆర్ స్ఫూర్తినీ లోతుగా అర్థం చేసుకోవడం మన ముందున్న కర్తవ్యం. మరణశయ్య మీద ఉన్నప్పటికీ చరిత్ర వేదిక నుండి దానంతట అది తొలగిపోదు. కనక దానికి వ్యతిరేకంగా ప్రభావవంతంగా పోరాడి, అంతిమంగా దానిని సమాధి చేసే సవాలును కార్మికవర్గం ఈ రకంగా మాత్రమే తీర్చగలుగుతుంది.

జీపీసీఆర్ అపారమైన ప్రాధాన్యతను అర్థం చేసుకోవడానికి మన కామ్రేడ్స్ అందరూ దాని అనుభవాలను లోతుగా అధ్యయనం చేయాలి, దాని విస్తృత గుణపాఠాల నుంచి నేర్చుకుని, తమ విప్లవ కార్యాచరణలో సృజనాత్మకంగా అన్వయించాలి. ఈ కృషికి దోహదపడుతుందని ఆశిస్తూ, జీపీసీఆర్ యాభయ్యవ వార్షికోత్సవం సందర్భంగానూ మన పార్టీ జరుపుతున్న వార్షికోత్సవాలలో భాగంగానూ పీపుల్స్ వార్ ఈ సంచికను ప్రత్యేక సంచికగా తీసుకువస్తున్నాం. ఈ సంచికలో ఈ సందర్భంగా రాసిన రెండు వ్యాసాలు, రెండు చారిత్రక డాక్యుమెంట్లు, జీపీసీఆర్ ఖండికలు, ఉల్లేఖనలూ ఉన్నాయి. అనేక చారిత్రక డాక్యుమెంటులు, వ్యాసాలు, సారాంశాలు, ఉల్లేఖనలతో మన కేంద్ర కమిటీ *ది గ్రేట్ ప్రొలిటేరియన్ కల్చరల్ రివల్యూషన్ విల్ షైన్ ఫర్ ఎవర్* అనే ప్రత్యేక స్మృతి సంపుటిని కూడా విడుదల చేస్తున్నది. *

# మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంపై
# సి.పి.ఐ. (మావోయిస్టు)

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రాముఖ్యత
## విజయాలు–గుణపాఠాలు

**– సిసి, సిపిఐ (మావోయిస్టు), ఫిబ్రవరి 26, 2017**

***(చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవం సందర్భంగా)***

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానికి 2016 మే 16 నాటికి 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. చైనాలో 1966 మే 16 నుండి మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రారంభమై 1976 అక్టోబర్ వరకు కొనసాగింది. కామ్రేడ్ మావో సే-టుంగ్ నాయకత్వం కింద చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా కొనసాగించిన గ్రేట్ డిబేట్ (1956– 1966) ఈ నూతన ఆరంభానికి సంకేతంగా నిలిచింది. ఈ గ్రేట్ డిబేట్ నడుస్తున్న క్రమంలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీలోని ముఖ్యమైన లీ షావ్-చీ, డెంగ్ లాంటి కొద్ది మంది పెట్టుబడిదారీ మార్గీయులు 'ఉత్పత్తి శక్తుల' ఆధునిక రివిజనిస్టు సిద్ధాంతాన్ని ఆశ్రయించారు. ఈ గ్రేట్ డిబేట్ మరింత తీవ్రతరమవుతూ చివరకు ప్రపంచాన్ని కుదిపివేసిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానికి దారితీసింది. 1956 నుండి చైనా కమ్యూనిస్టు పార్టీలో పెట్టుబడిదారీ మార్గీయులకూ (లీ షావ్-చీ మరియు తన రివిజనిస్టు ముఠాకూ), నిజమైన విప్లవకారులకూ మధ్య ఆరంభమైన అంతర్గత పోరాటం క్రమంగా లీ షావ్-చీ విద్రోహ చర్యల ఫలితంగా శత్రు వైరుధ్యంగా మారింది. అందువల్ల మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ "పెట్టుబడిదారీ కేంద్రాన్ని బద్దలు కొట్టండి" అంటూ మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానికి 1966 మే 16న పిలుపు ఇచ్చింది. సోషలిస్టు చైనాలో ఇది ఒక సైద్ధాంతిక, రాజకీయ పోరాటం, అపూర్వమైన విప్లవ ప్రజా వెల్లువ. నూతన నిర్మాణ రూపాలైన సాంస్కృతిక విప్లవ గ్రూపులు, విప్లవ కమిటీలు, కాంగ్రెస్‌లు, ప్లీనరీల ద్వారా సిపిసి నాయకత్వంలో కార్మికులు, రైతాంగం, సైనికులు, విద్యార్థి-యువజనులు, రెడ్‌గార్డులు, విప్లవ మేధావులు, విప్లవ క్యాడర్లు, నాయకత్వం సాంస్కృతిక విప్లవాన్ని విజయవంతం చేసేందుకై జాగృతమయ్యారు.

కార్మికవర్గ నియంతృత్వం కింద కొనసాగుతున్న సోషలిస్టు ఆర్థిక విధానాన్ని కమ్యూనిస్టు సమాజ నిర్మాణం వైపు పురోగమింపజేయడానికి అనుగుణంగా ఉపరితలంలో అన్ని రంగాలలో విప్లవాన్ని కొనసాగించడం, నూతన ప్రజాస్వామిక విప్లవంలో కూలదోయబడిన వర్గాలు (సామ్రాజ్యవాదానికి సేవ చేసే బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలు) తిరిగి తలెత్తడానికి గల అవకాశాలను సమూలంగా నిర్మూలించి, అవి పెట్టుబడిదారీ పునరుద్ధరణకై తలపెట్టే ప్రయత్నాలను వమ్ము చేయడానికి కార్మికవర్గ నియంతృత్వం ఆధ్వర్యంలో విప్లవాన్ని కొనసాగించడం – మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ధ్యేయంగా నిర్ణయమైంది. అలాగే రివిజనిజాన్ని తుదముట్టించడం, పార్టీ నాయకత్వంలో, పార్టీ నిర్మాణంలో పాగా వేసిన పెట్టుబడిదారీ మార్గీయులను తొలగించడానికి ప్రజాపంథాపై ఆధారపడిన పోరాట రూపముతో ప్రజాబలాన్ని ప్రయోగించడం మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ తక్షణ కర్తవ్యంగా ఉండింది. ఇది పెట్టుబడిదారీ మార్గానుయాయులకు వ్యతిరేకంగా జరిగిన కఠోరమైన వర్గ పోరాటం. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి చైనాలో ఇది కొనసాగింపు. చైనా విప్లవ పురోగమనంలో ఒక కొత్త దశకు సంకేతం. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ విషయంలో మన పార్టీ నిబంధనావళి ఇలా చెప్పింది : "సోషలిస్టు సమాజం చెప్పుకోదగ్గ దీర్ఘ చారిత్రక కాలం గుండా పయనిస్తుంది. ఈ చారిత్రక కాలమంతటా వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటం ఉంటూనే ఉంటాయి. సోషలిస్టు బాటకు, పెట్టుబడిదారీ బాటకు మధ్య పోరాటం ఉనికిలో ఉంటూనే ఉంటుంది. కార్మికవర్గ నాయకత్వం కింద విప్లవాన్ని కొనసాగించడం అనే సిద్ధాంతంపై ఆధారపడుతూ, దానిని మునుముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఈ వైరుధ్యాలన్నింటిని సవ్యంగా పరిష్కరించవచ్చు. ఈ సందర్భంగా, కామ్రేడ్ మావో ఆరంభించి, నాయకత్వం వహించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం కార్మికవర్గ నియంతృత్వాన్ని సుసంఘటితపర్చడం ద్వారా పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడడానికి గానూ బూర్జువాలకు, ఇతర దోపిడీ వర్గాలన్నింటికీ వ్యతిరేకంగా కార్మికవర్గం సోషలిజం పరిస్థితులలో నడిపిన ఒక రాజకీయ మహా విప్లవమే." (పేజి 2–3).

"కమ్యూనిజం సాధనలో ఇంకా చాలా సాంస్కృతిక విప్లవాల అవసరం ఉంది" అని మావో బోధించిన అవగాహనను మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం రుజువుపరిచింది. ఇది సోషలిస్టు సమాజాన్ని నిర్మాణం చేసి సంఘటితపరుచుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. అంతర్జాతీయంగా ఈ కాలంలో వివిధ దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాల్లో పొడసూపిన రివిజనిస్టు ధోరణులపై పోరాడుతూ వాటితో తెగతెంపులు చేసుకొని, ఎంఎల్ఎం దిశానిర్దేశంలో విప్లవ పంథాను ఎంచుకోవడానికి మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం దోహదం చేసింది. దాదాపు అన్ని దేశాలలో మావోయిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని చాలా దేశాలలో కార్మికవర్గ పార్టీలు (ఫిలిపైన్స్, టర్కీ, ఇండియా, పెరూ) సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటాలు, దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నాయి.

గ్రేట్ డిబేట్ కొనసాగింపుగా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రేరణతో ఇండియాలో సిపిఐ, అనంతరం సిపిఐ (ఎం) నాయకత్వపు రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ప్రాతినిధ్యం వహించే శక్తులు సైద్ధాంతికంగానూ, అంతకంటే ముఖ్యంగా తమ విప్లవ కార్యాచరణలోనూ ఎంఎల్ఎంను సమర్థించి జీర్ణం చేసుకోసాగాయి. దాంతో సిపిఐ (ఎం) 7వ కాంగ్రెస్ కార్యక్రమం రివిజనిజం అని ఖండిస్తూ కామ్రేడ్ సిఎం, కామ్రేడ్ కెసిల వంటి మొదటి శ్రేణి, గొప్ప నాయకులతో సహా పెద్ద సంఖ్యలో మావోయిస్టు శక్తులు రంగం మీదకు వచ్చాయి. కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో మే 23, 1967న ఆరంభమైన మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు భారతదేశంలో 'వసంతకాల మేఘగర్జన'కు శంఖారావమైంది. అప్పటి నుండి భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర గుణాత్మకమైన నూతన మలుపును తీసుకుంది.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50 సంవత్సరాల వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఈ విప్లవ ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని, సిద్ధాంత అవగాహనను అందుకోవాలి. దీనిని పరిరక్షిస్తూ భవిష్యత్తు పోరాటాలలో ఈ సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా అమలు చేయాలి. ఈ గొప్ప పోరాటంలోని మంచి, చెడులను గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం వెలుగులో సంశ్లేషించాలి. చెడును తొలగించుకోవడం ద్వారా సరైన విప్లవ స్ఫూర్తితో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ సిద్ధాంతాన్ని సరిగా అమలు చేయగలుగుతాం. సామ్రాజ్యవాదులు, రష్యా, చైనా ఆధునిక రివిజనిస్టులు, అభివృద్ధి నిరోధకులు, పశ్చిమ యూరప్ పెట్టుబడిదారీ మార్గీయులు మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ సిద్ధాంతంపై నాడు, నేడు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రపంచ కార్మిక-రైతాంగ తదితర విశాల పీడిత ప్రజానీకంలో ఎండగట్టాలి. సోషలిజం, కమ్యూనిజం సాధనతోనే ప్రపంచ కార్మిక-కర్షక తదితర పీడిత ప్రజలందరూ విముక్తి పొందుతారు. ఈ దృక్పథంతో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని అర్థం చేసుకోవడానికి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చారిత్రక అనుభవాన్ని క్లుప్తంగా అర్థం చేసుకుంటూ, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ నేపథ్యాన్ని, క్రమాన్నీ, దొర్లిన పొరపాట్లను, విజయాలను, గుణపాఠాలను అధ్యయనం చేయాలి.

## అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చారిత్రక అనుభవం క్లుప్తంగా

17వ శతాబ్దంలో ఇంగ్లాండులో ఆరంభమైన బూర్జువా విప్లవం 19వ శతాబ్దం చివరి వరకూ వాయువ్య యూరప్, ఉత్తర అమెరికా ప్రాంతాలలో అభివృద్ధి నిరోధకమైన భూస్వామ్య విధానంపై పెట్టుబడిదారీ విధానం తిరుగులేని విజయం సాధించింది. అయితే ఈ ప్రపంచ బూర్జువా విప్లవం గెలుస్తూ, ఓడిపోతూ, తిరిగి గెలుస్తూనే దీర్ఘకాల క్రమంలోనే విజయాన్ని సాధించగలిగింది. ఆ తర్వాత ఏర్పడిన ఆ నూతన పెట్టుబడిదారీ వ్యవస్థే స్వయంగా పోరాటశీలమైన కార్మికవర్గానికి జన్మనిచ్చింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల విశ్లేషణ, కార్మికవర్గ భావజాలం ఆవిర్భవించడం అనివార్యమైంది. 18వ శతాబ్దంలో జర్మన్ తత్వశాస్త్రం,

(బ్రిటన్ కేంద్రంగా సాగిన పారిశ్రామిక విప్లవం నుంచి ఆవిర్భవించిన) ఇంగ్లీషు అర్థశాస్త్రం, (1789 నాటి ఫ్రెంచి విప్లవం నుంచి ఆవిర్భవించిన) ఫ్రెంచి సోషలిజం రూపాల్లో మానవ జాతి సృష్టించిన విజ్ఞానమంతటిలోనూ ఉత్తమమైన దానినంతటినీ స్వీకరించడం ద్వారా విప్లవకర సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలంగా మార్క్సిజానికి భౌతిక ప్రాతిపదిక ఏర్పడింది. అది 1848 నాటి కల్లా కమ్యూనిస్టు ప్రణాళికలో అత్యుత్తమంగా సూత్రబద్ధమైంది.

మార్క్సిజం సృష్టికర్తలైన మార్క్స్, ఏంగెల్స్‌లు స్వేచ్ఛా వ్యాపార దశలో ఉన్న పెట్టుబడిదారీ విధాన కాలంలో జరిగిన తీవ్ర వర్గ పోరాటంలో పాల్గొన్నారు. సమాజంలో జరిగిన, జరుగుతున్న వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగాలు అనే మూడు మహత్తర విప్లవ ఆచరణల నుండి కార్మికవర్గ నాయకులైన మార్క్స్, ఏంగెల్స్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించడానికి, అభివృద్ధి చేయడానికి తమ జీవితాలను పూర్తిగా వెచ్చించారు. తీవ్ర అధ్యయనాన్నీ, సకల రంగాలలోనూ తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించే క్రమంలో, మార్క్స్, ఏంగెల్స్ మార్క్సిజంలోని మూడు భాగాలను – తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం – వర్గ పోరాటం మౌలిక సూత్రాలను రూపొందించారు.

యూరప్‌లో ప్రారంభంలో మార్క్సిజం ఆవిర్భవించినప్పుడు కార్మికవర్గం తనదైన సిద్ధాంతాన్ని స్వీకరిస్తున్న క్రమంలో దాని శత్రువులు మార్క్సిజం నుంచి తీవ్ర ముప్పు ఉన్నదని వెంటనే గ్రహించారు. నేడు యూరపు ఖండాన్ని కమ్యూనిజం అనే భూతం ఆవహించిందంటూ, దాన్ని భూస్థాపితం చేయడానికి పాత యూరప్‌లోని పాలకవర్గాలన్నీ కలిసి 'పవిత్ర కూటమి'గా ఏర్పడ్డాయి. ఈ తీవ్రమైన ప్రతిదాడుల మధ్యనే మార్క్సిజం అభివృద్ధి చెందుతూ పురోగమించింది.

మార్క్సిజం దిశానిర్దేశంలో కార్మికవర్గ సంస్థలు, పోరాటాలు ఈ కాలంలో అభివృద్ధి చెందాయి. మార్క్సిజం, కార్మికవర్గ ప్రజారాశులతో పెనవేసుకుపోయే విధంగా పురోగమించింది. స్వతంత్ర కార్మికవర్గ పార్టీలు – మొదటి ఇంటర్నేషనల్, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ – మొట్టమొదటిసారిగా మార్క్సిస్టు నాయకత్వం కింద ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పశ్చిమ యూరప్ పెట్టుబడిదారీ దేశాలన్నింటిలో ఒకేసారి విప్లవం వచ్చే అవకాశం ఉందని మార్క్స్ ఊహించారు. ఇక మార్క్సిజం – బూర్జువా వర్గాన్ని సవాల్ చేయడం ప్రారంభించిన ఒక పెద్ద కార్మికవర్గ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

కమ్యూనిస్టు లీగులో, మొదటి ఇంటర్నేషనల్‌లో ఉన్న కార్మికవర్గ ఉద్యమంలోని పెడధోరణులకు ప్రత్యేకించి బకునిన్ అరాచకవాదానికీ, బ్లాంక్విస్టు ధోరణికీ, లాసాలియనిజానికీ (బూర్జువా అవకాశవాద ధోరణి) వ్యతిరేకంగా మార్క్సిజం పోరాడి ఓడించింది. మార్క్స్ సిద్ధాంతం శాస్త్రీయ సోషలిజానికీ భావవాద సోషలిజానికీ అన్ని రకాల బూటకపు సోషలిజానికీ మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసింది.

అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమ అనుభవాలను సంశ్లేషిస్తూ దాని అభివృద్ధి కోసం

ఎప్పటికప్పుడు రూపొందిస్తూ వచ్చిన ఎత్తుగడలు పూర్తిగా సరైనవి అని మార్క్స్, ఏంగెల్స్ కళ్ల ముందే చరిత్ర రుజువు చేసింది. ప్రత్యేకించి పార్టీ, రాజ్యం, కార్మికవర్గ నియంతృత్వం వంటి అంశాలపైన మార్క్సిస్టు అవగాహన పూర్తిగా సరైనదని పారిస్ కమ్యూన్ తిరుగులేని విధంగా రుజువు చేసింది.

1871 పారిస్ కమ్యూన్ విజయవంతమైనా అనతికాలంలోనే పతనమైంది. కానీ వర్గ పోరాటానికి సంబంధించిన, కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించిన సిద్ధాంతం విలువ ఏమాత్రం తగ్గలేదు సరికదా మరింత పెరిగింది. 46 యేళ్ల తర్వాత, మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. ఒక విప్లవ ఓటమి అంటే అది శాశ్వతంగా ముగిసిపోయిందని అర్థం కాదు.

మార్క్స్, ఏంగెల్స్ మరణానంతరం మార్క్సిజం నిర్మాణపరంగా విస్తరిస్తుండగా పెట్టుబడిదారీ గుత్త సంస్థలు ఆవిర్భవించడంతో, సామ్రాజ్యవాద ఆవిర్భావంతో దాని ప్రధాన శత్రువు బయట నుండి అమలు చేసే అణచివేత నుండే గాక, సోషలిస్టు పార్టీల లోపల నుండి కూడా దాడి చేశాడు. దీనితో కార్మికవర్గ నాయకత్వంలో, దాని పార్టీలు-సంస్థలలో అవకాశవాదం, రివిజనిజం తలెత్తింది. అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమానికి ప్రధాన ముప్పుగా రెండవ ఇంటర్నేషనల్ మారింది. లెనిన్ నాయకత్వంలో ఉన్న ఒక్క బోల్షివిక్ పార్టీ తప్ప, రెండో ఇంటర్నేషనల్‌లో ఉన్న దాదాపు అన్ని పార్టీలూ మార్క్సిజానికి ద్రోహం చేశాయి లేదా అవకాశవాద ధోరణులకు గురయినాయి. రెండో ఇంటర్నేషనల్‌లో రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో, రష్యా విప్లవాచరణకు లెనిన్ మార్క్సిజాన్ని సృజనాత్మకంగా అన్వయించారు, పరిరక్షించారు, మరో దశకు మార్క్సిజం-లెనినిజం అనే ఉన్నత దశకు అభివృద్ధిపర్చారు.

సామ్రాజ్యవాద, సోషలిస్టు విప్లవ యుగం ఆవిర్భవిస్తున్న కాలంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులైన లెనిన్, స్టాలిన్‌లు మార్క్స్, ఏంగెల్స్‌ల విప్లవ వారసత్వాన్ని కొనసాగించారు. రష్యా విప్లవోద్యమంలోని తప్పుడు ధోరణులకు (నరోడ్నిక్‌లు, ఆర్థికవాదులు, సోషల్ రివల్యూషనరీలు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీవాదులు, బుఖారిన్‌వాదులు, (సంకుచిత) జాతీయవాదులు మొదలైన పెటీ బూర్జువా పార్టీలకు) వ్యతిరేకంగా సాగిన పోరాటాల పరంపర ద్వారా లెనినిస్టు పార్టీకి గట్టి పునాదులు పడ్డాయి. స్వేచ్ఛా వ్యాపార దశలో ఉన్న పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదమనే ఒక నూతన దశకు అభివృద్ధి అయ్యింది. లెనిన్ సామ్రాజ్యవాదాన్ని "మరణావస్థలో ఉన్న పెట్టుబడిదారీ విధానం" అని పేర్కొన్నారు. లెనిన్ సామ్రాజ్యవాదపు ప్రత్యేక లక్షణాల నిర్దిష్ట రూపాలను, నియమాలను అధ్యయనం చేసి ఈ ముఖ్యమైన నిర్ధారణకు వచ్చారు : "అసమాన ఆర్థిక రాజకీయ అభివృద్ధి కారణంగా సామ్రాజ్యవాదాన్ని దాని బలహీనమైన లింకు దగ్గర ధ్వంసం చేయాలి; కార్మికవర్గ విప్లవం మొదట ఒక దేశంలో లేదా అనేక దేశాలలో విజయవంతమవుతుంది." మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సామ్రాజ్యవాదంలోని

సకల వైరుధ్యాలకు రష్యా ఒక కేంద్ర స్థానంగా ఉండింది. అందుచేత లెనిన్ సామ్రాజ్యవాదుల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి, విప్లవ హింసతో రష్యన్ బూర్జువా వర్గ నియంతృత్వాన్ని కూలదోయడానికి రష్యన్ కార్మికవర్గానికి నాయకత్వం వహించారు. ఇలా మొదటి ప్రపంచ యుద్ధకాలంలో పెంపొందిన విప్లవోధృతిని వినియోగించుకొని కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని సమీకరించి సంఘటితపరిచి రష్యాలో మహత్తర సోషలిస్టు అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేసి కార్మికవర్గ నియంతృత్వం కింద ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు దేశాన్ని నెలకొల్పారు.

దీనికి భిన్నంగా రెండవ ఇంటర్నేషనల్‌కు నాయకత్వం వహించిన కాట్స్కీ సామ్రాజ్యవాదాన్ని 'అధిసామ్రాజ్యవాదం'గా, నిర్మాణయుతమైన, సుస్థిరమైన పెట్టుబడి ప్రపంచాన్ని నెలకొల్పే వ్యవస్థగా, వైరుధ్యాలు లేని సామ్రాజ్యవాదంగా, పెట్టుబడిదారీ వ్యవస్థలోనే యుద్ధాలకు తావులేని దశగా నిర్వచించి శాంతియుత మార్గం ద్వారా సోషలిజం వస్తుందనే సామ్రాజ్యవాదాన్ని పరిరక్షించే రివిజనిస్టు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చాడు. ఇలా వర్గ పోరాటానికి, కార్మికవర్గ నియంతృత్వానికి తిలోదకాలు ఇచ్చాడు. స్వేచ్ఛా వ్యాపార దశలో ఉన్న పెట్టుబడిదారీ విధానంలో మార్క్స్ చెప్పిన మాటలను వల్లిస్తూ "యూరప్ వ్యాపితంగా ఒకేసారి విప్లవం వస్తుంది తప్ప మరో మార్గం లేదు" అనే పిడివాద సిద్ధాంతాన్ని రెండవ ఇంటర్నేషనల్ ముందుకు తెచ్చింది. అలాగే అభివృద్ధి నిరోధక భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు జరుగుతున్న ప్రారంభ కాలంలో వాటి అభివృద్ధికర స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని 'మాతృ దేశ రక్షణ'కు మార్క్స్ ఇచ్చిన పిలుపును సామ్రాజ్యవాద దశలో పిడిగా అమలు జరిపి మొదటి ప్రపంచ యుద్ధానంతరం యూరప్ ఖండంలోని వివిధ దేశాలలో సోషలిస్టు విప్లవాలు జయప్రదం కావడానికి ఉండే అవకాశాలను రెండవ ఇంటర్నేషనల్ వమ్ము చేసింది.

సామ్రాజ్యవాదులు, వారికి సేవ చేసిన 2వ ఇంటర్నేషనల్ రివిజనిస్టు "వీరులు", అన్ని దేశాల్లోని విప్లవ వ్యతిరేకులు, విద్రోహులు మార్క్సిజం-లెనినిజానికి వ్యతిరేకంగా "ఒక పవిత్ర కూటమి"లో చేరి అన్ని వైపుల నుండి దాడులను తీవ్రతరం చేశారు. ఇంకొక వైపు అతివాద పదజాలం ముసుగులో శాశ్వత విప్లవాన్ని గూర్చి వల్లిస్తూ, ఏదైనా ఒక దేశంలో విప్లవం నెగ్గినప్పటికీ అది మనగల్గడం అసంభవమనే సిద్ధాంతంతో ట్రాట్స్కీ ముఠా బ్రెస్ట్‌లిటోవస్క్ సంధిని తిరస్కరించి విప్లవానికి ద్రోహం చేసింది.

రష్యాలో ఏర్పడిన కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితపరచుకుంటూ, ఆ దేశాన్ని ప్రపంచ విప్లవ స్థావర ప్రాంతంగా వినియోగించుకొని తక్కిన ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న సామ్రాజ్యవాద నిర్మూలనని వేగిరపరచాలని లెనిన్, స్టాలిన్‌లు స్పష్టీకరించారు. అందువల్లనే వారు సామ్రాజ్యవాద యుగంలో ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో జరిగే జాతీయ ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలన్నీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అనివార్యమైన భాగాలే

అనే దృక్పథాన్ని వెల్లడించారు. ఒక దేశంలో విప్లవం విజయవంతమైతే స్వయం సంపూర్ణం కాదు, దాని అంతిమ విజయం ప్రపంచ సోషలిస్టు విప్లవం పూర్తి కావడంపై ఆధారపడి ఉంటుందనేది కూడా వారు స్పష్టపర్చారు.

రెండవ ఇంటర్నేషనల్ రివిజనిస్టు విద్రోహకర నాయకత్వాన్ని ఎండగట్టడంతో పలు పెట్టుబడిదారీ దేశాలలో పాత పార్టీలలోని విప్లవ శక్తులు సమీకరించబడి కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. ఈ శక్తులన్నీ సమైక్యం కావడంతో 1919 మార్చిలో లెనిన్ నాయకత్వంలో మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) ఏర్పడింది. మొదటి కాంగ్రెస్ జరిపింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కమిటీని ఎన్నుకుంది. "సకల దేశాల కార్మికులూ కార్మికవర్గ నియంతృత్వం కోసం, ప్రపంచవ్యాప్తంగా సోవియట్ల విజయం కోసం పోరాడాలని పిలుపు ఇస్తూ, సకల దేశాల కార్మికుల కోసం ఒక ప్రణాళికను ఆమోదించింది."

లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలోని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) (సిపిఎస్‌యు (బి)) 'యుద్ధకాల కమ్యూనిజం' విధానాన్ని సరిగా అమలు జరిపింది. సాపేక్షికంగా వెనుకబడిన ఒక దేశంలో సోషలిజాన్ని నిర్మించే క్రమాన్ని ప్రారంభించింది. సామ్రాజ్యవాద (రెండవ ప్రపంచ) యుద్ధంలో స్టాలిన్ నాయకత్వాన అది సరైన ఎత్తుగడలను అనుసరించి యుద్ధాన్ని కార్మికవర్గానికి అనుకూలంగా ఉపయోగించుకొంది. వలసలు, అర్ధవలసలలోని జాతీయ విముక్తి పోరాటాల వెల్లువకు మార్గదర్శకత్వాన్ని అందించింది. ఆ దేశాలకు అనువైన వ్యూహం, ఎత్తుగడలను రూపొందించింది. పలు దేశాలలో అది విజయాన్ని సాధించి తద్వారా మానవాళిలో మూడవ వంతుతో సోషలిస్టు శిబిరాన్ని ఏర్పాటు చేసింది. మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం ముందడుగు వేసి చారిత్రాత్మకమైన పురోగతిని సాధించింది.

లెనిన్ మరణానంతరం వెంటనే స్టాలిన్, మార్క్సిజానికి లెనిన్ చేసిన ప్రధానమైన చేర్పులను క్రోడీకరించారు. లెనినిజపు చారిత్రక మూలాలను పరిశోధించి, పద్ధతి, సిద్ధాంతం, పార్టీ, కార్మికవర్గ నియంతృత్వం, రైతు సమస్య, జాతుల సమస్య, వ్యూహం-ఎత్తుగడలు, పార్టీ పనిశైలులకు సంబంధించిన లెనినిజం ప్రధాన లక్షణాలను వివరించారు.

సోషలిజం కింద సోవియట్ యూనియన్‌లో వ్యవసాయ రంగ సమిష్టీకరణ, సోషలిస్టు పారిశ్రామికీకరణల కర్తవ్యాలు మౌలికంగా సాధించబడ్డాయి. స్టాలిన్ నాయకత్వంలోని సోవియట్ యూనియన్ ప్రభుత్వం రెండవ ప్రపంచ యుద్ధపు నిర్దిష్ట పరిస్థితికి అనుగుణంగా మౌలికంగా సరైన ఎత్తుగడలను రూపొందించుకుంది. ఫాసిస్టేతర సామ్రాజ్యవాద శక్తులు జర్మనీని సోవియట్ యూనియన్‌పైన దాడికి రెచ్చగొడుతుండినప్పుడు, స్టాలిన్ జర్మనీతో 1939 ఆగస్టులో నిర్యుద్ధ సంధిని కుదుర్చుకున్నారు. తద్వారా రెండవ ప్రపంచ యుద్ధం మొదట సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా ప్రారంభమైంది. 1941 జూన్‌లో ఫాసిస్టు జర్మనీ సోషలిస్టు స్థావర ప్రాంతమైన సోవియట్ యూనియన్‌పైన దాడి చేయడంతో యుద్ధ స్వభావం ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంగా

మారిపోయింది. మూడవ ఇంటర్నేషనల్ అంతకు ముందు రూపొందించిన ఎత్తుగడలు అన్వయంలోకి వచ్చాయి. ఆ ఎత్తుగడలు సోవియట్ యూనియన్ రక్షణ దిశగానూ, ఫాసిస్టు యుద్ధోన్మాదుల ఓటమి దిశగానూ, జాతీయ విముక్తి పోరాటాల విజయం దిశగానూ, సాధ్యమైనన్ని దేశాలలో సోవియట్ అధికారాన్ని స్థాపించడం దిశగానూ ఉన్నాయి. ఇలా మూడవ ఇంటర్నేషనల్ రూపొందించిన వ్యూహం-ఎత్తుగడలు మౌలికంగా సరైనవని చరిత్ర రుజువు చేసింది.

అయితే రష్యాలో మాదిరిగానే మిగతా దేశాలన్నిటా విప్లవ మార్గము సార్వత్రిక సాయుధ తిరుగుబాటుగానే ఉంటుందనే పిడివాదానికి మూడవ ఇంటర్నేషనల్ గురైంది. అలాగే ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనలో కూడా ఐక్యతనే చూసి, పోరాటాన్ని విడిచిపెట్టడం ద్వారా యూరప్‌లోని కొన్ని కమ్యూనిస్టు పార్టీలు, భారత కమ్యూనిస్టు పార్టీ సంస్కరణవాదంతో పాలకవర్గాలకు తోకలుగా మారాయి. తర్వాత కాలంలో ఈ పార్టీలన్నీ రివిజనిస్టు మార్గాన్ని చేపట్టాయి. మూడవ ఇంటర్నేషనల్ ఈ రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడలేకపోయింది. వివిధ సభ్య దేశాలు అత్యంత వైవిధ్యపూరితమైన పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల వాటికి మార్గదర్శకత్వాన్ని అందించడంలో అది తన సమర్థతను కోల్పోయింది. అందుచేత మూడవ ఇంటర్నేషనల్ (కొమింటర్న్) 1943 జూన్ 10న రద్దయిపోయింది.

సామ్రాజ్యవాదంలోని అసమానాభివృద్ధి సూత్రాన్ని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో చైనాలోని ప్రత్యేక (అర్ధభూస్వామ్య, అర్ధవలస, వలస) పరిస్థితులకు అనుగుణ్యంగా అన్వయించి ఆ దేశమంతా ఒకేసారి విముక్తి కావడానికి అవకాశం లేదనీ, శత్రువు బలహీనంగా ఉండే విశాల వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలలో ఒక స్థావర ప్రాంతం నుండి అనేక స్థావర ప్రాంతాలకు, చిన్న చిన్న ప్రాంతాల నుండి విస్తార ప్రాంతాలకు విస్తరిస్తూ గ్రామీణ ప్రాంతాలను ముందు విముక్తి చేసి అంతిమంగా నగరాలను చుట్టుముట్టి ఆక్రమించుకోవడం ద్వారా దేశవ్యాప్త విజయం సాధించే దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గాన్ని అన్వేషించారు. చైనాలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం పురోగమిస్తున్న ప్రపంచ సోషలిస్టు విప్లవంలో విడదీయరాని భాగమని మావో చెప్పారు. సిపిసి 28 సంవత్సరాల పాటు ఓటమి, విజయాలను అనేక ఎగుడుదిగుడులు, కష్టనష్టాలు ఎదుర్కొంటూ, దీర్ఘకాల ప్రజాయుద్ధం సాగిస్తూ, చివరికి 1949 అక్టోబర్‌లో దేశవ్యాప్తంగా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నది. ఇది వలస, అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలన్నింటికి అనుసరణీయమైన మార్గమైంది. మావో చైనా కమ్యూనిస్టు పార్టీలో పలు దఫాలుగా పొడచూపిన మితవాద, అతివాద అవకాశవాదాలకూ, పలు పెడధోరణులకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాల ద్వారా, చైనా విప్లవ నిర్దిష్ట పరిస్థితులకు, విప్లవంలోని వివిధ రంగాలకు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా అన్వయించడం ద్వారా పరిరక్షించారు, అభివృద్ధిపర్చారు. ఈ విధంగా చైనా విప్లవ వర్గ పోరాటం, మార్క్సిజం-లెనినిజం అభివృద్ధికి ఒక ప్రధాన కేంద్రమైంది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో పెనుమార్పులు సంభవించాయి. చైనా తదితర ఆసియా, యూరప్ దేశాలలోని జాతీయ విప్లవాలు గొప్ప విజయం సాధించాయి. సామ్రాజ్యవాదులు చాలా బలహీనపడ్డారు. ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ కుంచించుకు పోయింది. సామ్రాజ్యవాదపు రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం మరింత తీవ్రమైంది. అయితే సామ్రాజ్యవాద దశ కొనసాగింది. ఈ పరిస్థితుల్లో మావో ఇలా అన్నారు, "మనమింకా సామ్రాజ్యవాద దశలోనే, కార్మికవర్గ విప్లవ దశలోనే ఉన్నాము. మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలపై ఆధారపడి సామ్రాజ్యవాదాన్ని గురించి లెనిన్ చేసిన శాస్త్రీయమైన విశ్లేషణ పూర్తిగా సరైనది, లెనినిజం యొక్క మౌలిక సూత్రానికి కాలం చెల్లలేదు." అలాగే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాలకు విప్లవ కేంద్రం మారిందని మావో స్పష్టీకరించారు.

సిపిఎస్‌యు (బి), స్టాలిన్‌ల అవగాహనలో, ప్రత్యేకించి, సోషలిజంలో వర్గాల ఉనికీ, అవి నిర్వహించే పాత్రా, వర్గ పోరాటం అనే అంశాలకు సంబంధించిన కొన్ని తప్పుడు ధోరణులు తలెత్తాయి. 1939 మార్చిలో జరిగిన పార్టీ 18వ కాంగ్రెస్‌కు ఇచ్చిన నివేదికలో స్టాలిన్ ఇలా అన్నారు, "సోవియట్ సమాజంలో వైషమ్యపూరితమైన వర్గాలు, శత్రు వర్గాలు ఇకలేవనేదే." దీని ద్వారా వర్గ పోరాటం యొక్క ఆవశ్యకతే లేదు, ఆర్థిక పునాదిలో జరిగిన విప్లవం, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం ద్వారా దానంతటదే కమ్యూనిజం వైపు పురోగమిస్తుందనే పిడివాదానికి గురవ్వడమైంది.

1953లో స్టాలిన్ మరణానంతరం నూతన తరహా పెట్టుబడిదారీ వర్గ నాయకత్వాన్ని చేపట్టిన కృశ్చేవ్ ముఠా విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటును సంఘటితం చేసింది. ఆ ముఠా పార్టీలోని విప్లవకారులను చంపివేసింది లేదా వెళ్లగొట్టింది. ఈ నూతన వర్గ ఆధిపత్యం రివిజనిస్టు రాజకీయ పంథాపై ఆధారపడి సిపిఎస్‌యు (బి)లో అంతర్గతంగా పుట్టి పెరిగింది. ఇది ఎటువంటి ఆటంకం లేకుండా పెరిగింది. 1956 కల్లా సోవియట్ విద్రోహ ముఠా పార్టీనీ, ప్రభుత్వాధికారాన్నీ గుంజుకున్న తర్వాత రష్యన్ బూర్జువా విశిష్టాధికార వర్గం (bourgeo's privileged stratum) తన స్వంత రాజకీయ, ఆర్థిక అధికారాన్ని పెద్దెత్తున విస్తృతపరుచుకుంది. ఈ విశిష్టాధికార వర్గం పార్టీ, ప్రభుత్వం, సైన్యాలలోనూ, ఆర్థిక సాంస్కృతిక రంగాలలోనూ ఆధిపత్య స్థానంలోకి వచ్చింది. సిపిఎస్‌యు (బి) 20వ కాంగ్రెస్‌లో ఇతర కమ్యూనిస్టు పార్టీలలోకి తమ రివిజనిస్టు విషాన్ని వ్యాపింపజేయడం మొదలుపెట్టింది. అదే సమయంలో ఆ ముఠా స్టాలిన్ వ్యక్తి పూజ అనే దానిపైన దాడి ప్రారంభించి, తమ రివిజనిస్టు మూడు 'శాంతి'ల సిద్ధాంతాన్ని – శాంతియుత పరివర్తన, శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీలను ప్రవేశపెట్టింది.

ప్రపంచంలోని అత్యధిక 'కమ్యూనిస్టు' పార్టీల నాయకత్వాలు (అప్పటికే అవి రివిజనిస్టుగా మారిపోవడంతో) రివిజనిస్టు కృశ్చేవ్ ప్రతిపాదించిన రివిజనిస్టు పంథాను ఆమోదించాయి.

అప్పటికే 1948లోనే టిటో ముఠా విద్రోహంతో సోషలిస్టు రాజ్యమైన యుగోస్లావియా పెట్టుబడిదారీ దేశంగా దిగజారిపోయింది. మూడవ ఇంటర్నేషనల్‌లో ఫ్రాన్స్ నాయకునిగా ఉండిన థోరెజ్ బూర్జువా జాతీయ దురహంకార వైఖరి చేపట్టాడు. ఫ్రెంచి సామ్రాజ్యవాద బూర్జువా వర్గతొత్తుగా మారాడు. ఇటలీకి చెందిన టోగ్లియాటీ పెట్టుబడిదారీ విధానాన్ని బూర్జువా పార్లమెంటు ద్వారా 'వ్యవస్థాగతమైన సంస్కరణలు చేపట్టటం ద్వారా సోషలిజంగా సంస్కరించాలనే' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అప్పటికే శాంతియుత మార్గాన్ని గుర్తించడానికి గానూ తన ఎత్తుగడల పంథాను మార్చుకుంది. 'శాంతియుత పరివర్తన'ను బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థ ద్వారా చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రయత్నించిన పార్టీలు - బ్రెజిల్ (1964), ఇండోనేషియా (1965), చిలీ (1975)లలో ఫాసిస్టు దోపిడీ పాలకవర్గ ప్రభుత్వాలు అమలు చేసిన సైనిక చర్యల ద్వారా, పాశవిక తెల్ల బీభత్సంతో నిర్మూలించబడ్డాయి.

మావో మార్గదర్శకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) కృశ్చేవ్ ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అగ్రభాగాన నిలిచింది. స్టాలిన్‌ను అత్యంత గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టుగా గుర్తించింది. 1956 నుండే సిపిసి కృశ్చేవ్ రివిజనిజంతో పార్టీ వేదికలలోనే అంతర్గతంగా పోరాడి, దానిని ఓడించడం కోసం యేడేళ్ల సుదీర్ఘకాలం పాటు ప్రయత్నించింది. 1957లో జరిగిన 60 సోదర పార్టీల సమావేశాలలోనూ, 1960లో జరిగిన 80 సోదర పార్టీల సమావేశంలోనూ, సిపిఎస్‌యు (బి) నాయకత్వంతో సిపిసి జరిపిన సమావేశాలలోనూ ఈ కృషి సాగింది. ఈ పోరాటం 1963లో బహిరంగ పోరాట రూపాన్ని తీసుకొని 1964 అంతటా కొనసాగింది. ఆ బహిరంగ పోరాటమే గ్రేట్ డిబేట్ (బృహత్తర చర్చ)గా సుప్రసిద్ధమైంది. ఈ గ్రేట్ డిబేట్ ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా సాగిన సూత్రబద్ధమైన, సమగ్రమైన పోరాటం. అది ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ విప్లవకారులందరినీ సమీకరించే కేంద్ర బిందువైంది. ఈ గ్రేట్ డిబేట్ ద్వారానే మావో, అంతర్జాతీయ కార్మికవర్గపు ముఖ్యమైన సమస్యలకు - ప్రపంచంలోని మౌలిక వైరుధ్యాలు, ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు, ఉద్యమ లక్ష్యాలు, ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయాన్ని సాధించే మార్గం - వీటికి పరిష్కారం కోసం రూపొందించిన పాలసీల ద్వారా మార్క్సిజం-లెనినిజాన్ని మరింత అభివృద్ధిపరిచారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథాను సూచిస్తూ సిపిసి, సిపిఎస్‌యు (బి)కు రాసిన సుప్రసిద్ధమైన 1963 జూన్ 14 లేఖ, ఆ తదుపరి సిపిసి, నయా వలసవాదం, యుద్ధం-శాంతి, శాంతియుత సహజీవనం, యుగోస్లావియా, కృశ్చేవ్ రివిజనిజం, దాని నుండి నేర్చుకోవాల్సిన గుణపాఠాలు వంటి వివిధ సమస్యలను వివరిస్తూ తొమ్మిది వ్యాఖ్యానాలను ప్రచురించింది. ఇవే గ్రేట్ డిబేట్ డాక్యుమెంట్లుగా ప్రసిద్ధి చెందాయి. గ్రేట్ డిబేట్ కాలంలో పలు విప్లవ శక్తులు మావో నాయకత్వంలోని సిపిసి యొక్క విప్లవ పంథా చుట్టూ సమీకృతమయ్యాయి. ఈ కాలంలోనే

ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలలోనూ మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు భావజాలం ప్రాతిపదికపై విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి.

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం - నేపథ్యం

1949లో చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం పూర్తి అయిన పిమ్మట, జాతీయ పెట్టుబడిదారీ (ప్రైవేటు) పరిశ్రమలను వినియోగించుకుంటూ, అదుపులో పెడుతూ, మార్చుతూ సోషలిస్టు పరివర్తనా ప్రక్రియని పురోగమింపజేయాలనేది మావో విప్లవకర విధానం. దీనికి విరుద్ధంగా 'చైనాలో పెట్టుబడిదారీ విధానం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. దానికి పరిమితిలేని విస్తరణ ఉండాలి. ఈ స్థితిలో పెట్టుబడిదారీ దోపిడీ అభివృద్ధికర లక్షణమే కానీ నేరం కాదు' అనేది లీ షావ్-చీ బూర్జువా అవకాశవాద విధానం. 1950లో విప్లవ భూ సంస్కరణలు పెద్దెత్తున అమలు జరిగాయి. లీ షావ్-చీ గ్రూపు ఈ భూ సంస్కరణల్ని వ్యతిరేకించింది. 1951లో 5 రకాల వ్యక్తిగత సంబంధాలలో ఉండే సంకుచిత దృక్పథాల మీద విమర్శనోద్యమం సాగింది. కార్మిక సంఘాలలో ఆర్థిక వాదానికీ, నాయకుల పెత్తందారీతనానికీ (బ్యూరాక్రసీకి) వ్యతిరేకంగా ఉద్యమం నడిచింది. ప్రభుత్వంలో లంచగొండితనమూ, దుబారా, పెత్తందారీతనమూ అనే మూడు చెడులకు వ్యతిరేకంగా ఉద్యమం నడిచింది. 1952లో 5 చెడులకు వ్యతిరేకంగా, అలాగే ప్రైవేటు సంస్థల మీద కొన్ని నిబంధనలు అమలు జరిపే ఉద్యమాలు నడిచాయి.

చైనా కమ్యూనిస్టు పార్టీ మావో మార్గదర్శకత్వాన 'మూడేళ్ల సన్నాహం, పదేళ్ల ప్రణాళికా బద్ధమైన ఆర్థిక నిర్మాణం' అనే విధానాన్ని చేపట్టి, తొలికాలంలో గణనీయమైన విజయాలు సాధించింది. అందువల్లనే 1956 నాటికి వ్యవసాయంలోనూ, చేతి వృత్తులలోనూ, పెట్టుబడిదారీ పరిశ్రమలలోనూ, వర్తకంలోనూ, ఉత్పత్తి సాధానాలపై వ్యక్తి యాజమాన్యం మౌలికంగా రద్దయింది. వ్యవసాయంలో సమిష్టి పద్ధతి దేశవ్యాప్తంగా అమలుల్లోకి వచ్చింది. నూతన ప్రజాస్వామిక విప్లవం సోషలిస్టు విప్లవంగా మారింది. ప్రాథమికంగా సోషలిస్టు సమాజం ఏర్పడింది. ఈ విజయాన్ని 1956 సెప్టెంబర్‌లో జరిగిన సిపిసి 8వ కాంగ్రెస్ సంశ్లేషించింది.

సిపిఎస్‌యు (బి)లో రివిజనిజం తలెత్తిన కాలంలోనే చైనా కమ్యూనిస్టు పార్టీలోని అత్యున్నత స్థాయిలలో రివిజనిస్టు ధోరణులు ప్రాబల్యాన్ని సంపాదించుకోవడం ప్రారంభమైంది. ఈ 8వ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శి లీ షావ్-చీ రివిజనిస్టు అవగాహన ఆధిపత్యం వహించింది. రాజకీయ నివేదికపైన కాంగ్రెస్ ఆమోదించిన తీర్మానం ఇలా చెప్పింది : 'మన దేశంలోని ప్రధాన వైరుధ్యం.... సారాంశంలో, అభివృద్ధి చెందిన సోషలిస్టు సామాజిక వ్యవస్థకూ సమాజంలో వెనుకబడిన ఉత్పత్తి శక్తులకూ మధ్య ఉన్న వైరుధ్యమే.' ఇలా ఈ కాంగ్రెస్ సోషలిస్టు సమాజంలో వర్గ వైరుధ్యాల గూర్చి స్పష్టమైన అవగాహన ఇవ్వలేకపోయింది. ఈ బలహీనతను ఆసరా చేసుకొని లీ షావ్-చీ బూర్జువా అవకాశవాదం మరింత బలపడసాగింది. ఆయన రివిజనిస్టు 'ఉత్పత్తి శక్తుల' సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చాడు. చైనాలో వర్గాలే లేవు కనుక వర్గ

పోరాట ఆవశ్యకతే లేదనీ, దాని ప్రతిబింబంగా పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటమే ఉండదనీ అన్నాడు. సిపిసి 8వ కాంగ్రెసు తర్వాత మరింత నగ్నంగా విప్లవ విద్రోహి కృశ్చేవ్ అడుగుజాడల్లో పెట్టుబడిదారీ పునరుద్ధరణకు లీ షావ్–చీ పూనుకున్నాడు. తనకి అనుకూలంగా ఉండే బూర్జువా ప్రతినిధులను చాలామందిని చాప కింద నీరులా కింది నుండి పైకి పార్టీ నిర్మాణంలోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ కీలక స్థానాల్లో ప్రవేశపెట్టి తన ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి కుట్ర పన్నాడు.

1956లో 'వంద పువ్వులు వికసించనీయండి, వంద ఆలోచనలు పోటీ పడనియ్యండి' ఉద్యమం (క్యాంపెయిన్) 2 నెలలు (ఏప్రిల్ నుండి జూన్ వరకూ) నడిచిన తర్వాత, లీ షావ్–చీ ముఠా కుట్రపూరితంగా దాన్ని నిలిపివేసింది. 1957లో మావో 'ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగ్గా పరిష్కరించడం' అన్న గొప్ప రచన చేశారు. కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో కార్మికవర్గ నియంతృతం అమలులో ఉన్నప్పటికీ వైరుధ్యాలు, వర్గాలు, వర్గ పోరాటం ఉంటాయని వివరించారు. సోషలిస్టు సమాజంలో రెండు భిన్న రకాల వైరుధ్యాలు – ప్రజలకూ, శత్రువుకూ మధ్యనూ, ప్రజల మధ్యనూ ఉంటాయని చెప్పారు. ఇదే వ్యాసంలో 'సుగంధ పుష్పాల్ని' 'విషపూరిత కలుపు మొక్కల' నుండి వేరుచేయడంలో ప్రజలకు తోడ్పడేందుకు మావో ఆరు ప్రమాణాల్ని ముందుకు తెచ్చారు. 1957 అక్టోబర్‌లో జరిగిన 8వ కేంద్రకమిటీ 3వ ప్లీనంలో సోషలిస్టు సమాజంలో బూర్జువా వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యంగా ఉంటుందని మావో పేర్కొన్నారు. అది రాజకీయాలు, భావజాల రంగాలలో వ్యక్తమవుతుందని అన్నారు. ప్రధాన వైరుధ్యం వెనుకబడిన ఉత్పత్తి శక్తులకూ, పురోగామి సోషలిస్టు వ్యవస్థకూ మధ్య ఉంటుందని చెప్పే లీ షావ్–చీ, డెంగ్ సూత్రీకరణలను మావో సవాలు చేశారు.

1957లో 'స్వావలంబన' సూత్రం మీద ఆధారపడ్డ 'పురోగమనానికి ఒక గొప్ప ముందడుగు' (గ్రేట్ లీప్ ఫార్వార్డ్) ఉద్యమం నడిచింది. వ్యవసాయం, పరిశ్రమలపై ఆధారపడుతూ సమన్వయంతో వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగాల ద్వారా పురోగమించాలనే అవగాహనను అది ముందుకు తెచ్చింది. వ్యవసాయ రంగంలో, పరిశ్రమల అభివృద్ధిలో విప్లవకరమైన మార్పులు జరిగాయి. 1957లో బూర్జువా మితవాదులకు వ్యతిరేకంగా పోరాటం నడిచింది. 1959లో లూషాన్ సమావేశంలో పెంగ్ టే–హుయే పార్టీ వ్యతిరేక ముఠా బహిర్గతమైంది.

1962 సంవత్సరంలో ప్రారంభమైన సోషలిస్టు విద్యా ఉద్యమంలో వర్గ పోరాటానికి ప్రాధాన్యతా, నాలుగు పరిశుభ్రతలూ, పార్టీ కార్యకర్తలు, నాయకత్వం ఉత్పత్తిలో పాల్గొనడం వంటి 10 అంశాలు ఉన్నాయి. 1962లో పార్టీలో సమైక్యతను సాధించడానికి వీలుగా 8వ పార్టీ కాంగ్రెస్ 10వ ప్లీనంలో మావో సోషలిస్టు సమాజ కాలానికంతటికీ మౌలిక పంథాను రూపొందించారు. ఆనాటి నుండి మావో మరణం వరకూ సిపిసి పార్టీకి ఇది మార్గదర్శకంగా

ఉండింది. పార్టీలో దాగి ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులకు వత్తాసు పలుకుతూ లీ షావ్–చీ సోషలిస్టు విద్యా ఉద్యమంపై నిర్బంధ చర్యలకు ఉపక్రమించాడు. కార్మిక–కర్షక–సైనిక తదితర పీడిత ప్రజలపై ప్రత్యక్షంగా కత్తికట్టాడు. 1964 ప్రారంభంలో మావో రెండు నినాదాలను రూపొందించారు, "వ్యవసాయ రంగంలో తాచై నుండి నేర్చుకోండి", "పారిశ్రామిక రంగంలో తాచింగ్ నుంచి నేర్చుకోండి". 1964 చివర మావో ఆధ్వర్యంలో సిపిసి సోషలిస్టు విద్యా ఉద్యమాన్ని సమీక్షించి, 'గ్రామసీమలలో కొనసాగిన సోషలిస్టు విద్యా ఉద్యమంలో తలెత్తిన తక్షణ సమస్యలు' అనే పేరుతో తక్షణ సమస్యల పరిష్కారానికి 23 పాయింట్ల డాక్యుమెంట్‌ను రూపొందించింది. మొట్టమొదటిసారిగా పార్టీలో దాగి ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులపై ఆ ఉద్యమం ఎక్కుపెట్టబడింది. పెట్టుబడిదారీ, సోషలిస్టు పంథాల మధ్య అంతర్గత పోరాటం మరింత తీవ్రరూపం దాల్చి, 1964 ఆఖరి నుండి ప్రజా రూపం తీసుకున్నది. 1966 అక్టోబర్‌లో జరిగిన సిసి సమావేశంలో లీ షావ్–చీ, డెంగ్ సియావో–పింగ్‌లు ఆత్మవిమర్శ చేసుకొని బయటపడాలని ప్రయత్నించారు. అయితే సిసి దాన్ని తిరస్కరించింది. ఈ ముఠా అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకునేందుకు 1968 సెప్టెంబర్ 7న చిట్టచివరి కుట్రకు పాల్పడింది. చివరికి 1968 అక్టోబర్‌లో జరిగిన సిపిసి 8వ కాంగ్రెస్ 12వ విస్తృత ప్లీనం సమావేశం లీ షావ్–చీని పార్టీ ముసుగులో దాగి ఉన్న విప్లవ ద్రోహి, విచ్ఛిన్నకుడు, పెట్టుబడిదారీ మార్గీయుల నాయకుడిగా ప్రకటించి, పార్టీ లోపలా, బయటా ఉన్న అన్ని స్థానాల నుండి లీ షావ్–చీని బహిష్కరించింది.

చైనా ప్రజా రిపబ్లిక్ స్థాపన జరిగినప్పటి నుంచి రాజకీయ, భావజాల రంగాలలో నిర్వహించబడిన ఇతర ప్రధాన సైద్ధాంతిక పోరాటాలన్నీ సోషలిస్టు దిశలో పార్టీ మౌలిక పంథాను ఎత్తిపట్టడం లేదా వ్యతిరేకించడానికి సంబంధించిన సమస్యతో ముడిపడి వున్నవే. ఈ పోరాటాలలో, 'యు సున్ జీవితం' అనే అభివృద్ధి నిరోధక సినిమాను విమర్శించడం, 'ది డ్రీమ్ ఆఫ్ రెడ్ చాంబర్' అనే నవలను అధ్యయనం చేయడంలో బూర్జువా భావవాదాన్ని విమర్శించడం, అభివృద్ధి నిరోధక హు ఫెంగ్ ముఠాను విమర్శించడం, మితవాదులకు వ్యతిరేకంగా పోరాటం, మావో చెప్పిన "ఒకటి రెండుగా విభజితమవుతుంది" అనే విప్లవ గతితార్కిక సూత్రానికి వ్యతిరేకంగా యాంగ్ హ్సెయిన్ చెన్ "రెండు ఒకటిగా కలుస్తాయి" అనే అభివృద్ధి నిరోధక అధిభౌతికవాద సిద్ధాంతాన్ని విమర్శించడం ఉన్నాయి.

ఇలా సోషలిస్టు నిర్మాణంలో వస్తున్న ప్రధాన సమస్యల్ని పరిష్కరించే సమస్య మావో మార్గదర్శకంలో సిపిసి ముందుకు వచ్చింది. మొదటి సమస్య, ఉత్పత్తి విధానంపై యాజమాన్యం వహిస్తున్న మొత్తం ప్రజానీకాన్ని అంటే సోషలిస్టు యాజమాన్యాన్ని మెట్టు మెట్టుగా పరివర్తన చెందించడంలో ఉన్నది. దీన్ని సాధిస్తే ఉత్పత్తి శక్తులు పురోగమిస్తాయి. అయితే ఈ పురోగామి ఉత్పత్తి శక్తులకు, వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలకు మధ్య అంతరం ఏర్పడుతున్నది. ఉత్పత్తి సంబంధాలను మరింత విప్లవీకరించకపోతే, ఇవి ఉత్పత్తి శక్తులు మరింత అభివృద్ధి చెందేందుకు

ఆటంకంగా మారతాయి. ఉత్పత్తి సంబంధాల్ని విప్లవీకరించాలంటే కమ్యూన్లలో, ఫ్యాక్టరీల్లో, విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వంలో, సైన్యంలో, ఇంటిలో సోషలిస్టు సంబంధాల్ని ప్రజలు ఆమోదించాలంటే, ఉపరితలాన్ని నిరంతరాయంగా విప్లవీకరించడం అవసరం. ఇందుకోసం అవసరమైనవి – బలంగా పాతుకుపోయిన పాత దోపిడి వర్గాల ప్రభావాన్ని, అవశేషాలను తొలగించడం; కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య, పట్టణాలకూ, గ్రామీణ ప్రాంతాలకూ మధ్య, మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ మధ్య వైరుధ్యాల్ని పరిష్కరించడం; చిన్న తరహా సరుకుల ఉత్పత్తి వల్ల యాదృచ్ఛికంగా వృద్ధి అయ్యే బూర్జువా వర్గంతో సరిగ్గా వ్యవహరించడం; పాత అలవాట్లు, ఆచార-వ్యవహారాలను మార్చడం. ఈ విధంగా చేయాలంటే, బూర్జువా హక్కులను నియంత్రించాలి, 'విలువ సూత్రానికి' కళ్లెం వేయాలి. ఈ సమస్యలను పరిష్కరించే క్రమంలోనే అనేక ప్రయోగాలు చేసి అంతిమంగా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం అనే రూపాన్ని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో కనుగొన్నారు.

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ క్రమం

1962లో జరిగిన 8వ కేంద్రకమిటీ 10వ ప్లీనరీ సమావేశం సోషలిస్టు సాంస్కృతిక విప్లవాన్ని అధికారికంగా ఆమోదించినప్పటికీ, దాని అమలు అర్ధమనస్కంగానూ మావో రూపొందించిన పంథాకు వ్యతిరేక దిశలోనూ జరిగింది. చివరికి మావో నిర్దేశకత్వాన కేంద్రకమిటీ 1966 మేలో సాంస్కృతిక విప్లవానికి నాయకత్వం వహిస్తూ వెన్నుపోటు పొడుస్తుండిన 'అయిదుగురి గ్రూపు'ని రద్దు చేసింది. ఒక కొత్త 'సాంస్కృతిక విప్లవ గ్రూపు'ను పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ ప్రత్యక్ష పర్యవేక్షణ కింద ఏర్పాటు చేసింది. దీనితో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం నిజంగా ప్రారంభమైంది. సిపిసి 1966 మే 16వ తేదీ సర్క్యులర్‌లో జిపిసిఆర్‌కు సిద్ధాంతాన్నీ పంథానూ సూత్రాలనూ విధానాలనూ రూపొందించింది. పార్టీలోకి చొరబడిన బూర్జువావర్గ ప్రతినిధులకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టమని యావత్తు పార్టీకీ యావత్తు దేశ ప్రజలకూ పిలుపు నిచ్చింది. 1966 ఆగస్టు 5న మావో స్వయంగా పెద్ద అక్షరాలతో "పెట్టుబడిదారీ కేంద్రాన్ని బద్దలు కొట్టండి" అంటూ ఒక పోస్టర్ వేశారు.

1966 ఆగస్టు 8న మావో పార్టీ 8వ కేంద్రకమిటీ 11వ ప్లీనరీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అధ్యక్షత వహించారు. ఈ సమావేశం మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానికి కార్యక్రమపర డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. 16 అంశాల విధాన పత్రం (సర్క్యులర్)గా ఇది చారిత్రకంగా ప్రసిద్ధి చెందింది. అది ప్రజాపంథాపై ఆధారపడిన పోరాట రూపాన్ని ఎన్నుకున్నది. అది ప్రతి ఒక్కదాన్ని ధైర్యంగా ప్రకటించమని, పెద్ద అక్షరాలతో పోస్టర్లు వేయడాన్ని సమర్థించమని, బృహత్తర చర్చలు నిర్వహించమని, ప్రజలను విశ్వసించమని, వారిపై ఆధారపడమని, వారి చొరవను గుర్తించి గౌరవించమని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారి పనిలోని బలహీనతలను, లోపాలను విమర్శించేలా వారిని ప్రోత్సహించమని వివిధ

స్థాయిల్లోని క్యాడర్లను కోరింది. పార్టీ తన 16 అంశాల విధాన పత్రంలో ఈ విధంగా సూచించింది : "ప్రస్తుతం మన లక్ష్యం పెట్టుబడిదారీ మార్గాన్ని చేపట్టిన అధికారంలో ఉన్న వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాడడం, వారిని కూలదోయడం, అభివృద్ధి నిరోధక బూర్జువా విద్యా అధికారులను, బూర్జువా వర్గం, ఇతర అన్ని దోపిడీవర్గాల భావజాలాన్ని విమర్శించడం, తిరస్కరించడం, విద్య, సాహిత్యం, కళలను, ఉపరితల నిర్మాణంలో సోషలిస్టు ఆర్థిక పునాదికి అనుకూలంగా లేని ఇతర అన్ని అంశాలను పరివర్తన చెందించడం ద్వారా సోషలిస్టు వ్యవస్థను సంఘటితం చేయడం, అభివృద్ధి చేయడానికి మార్గం సుగమం చేయడం."

సిసి ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత, సమస్యల్ని విచారించడం, పరిశీలించడం, పరిశోధించడం, సోషలిస్టు విద్యా ఉద్యమాన్ని నిర్వహించడం కోసం సిసి 'వర్క్ టీములను' ఉపయోగించుకునే పద్ధతిని ఉపసంహరించుకున్నది. స్థానిక స్థాయిలో ప్రజాస్వామికంగా ఎన్నికైన సాంస్కృతిక విప్లవ కమిటీల చేతికి చొరవ అప్పగించింది. కేంద్రకమిటీ పిలుపుకు స్పందనగా విశాల విప్లవ ప్రజానీకం పోరాటంలోకి దిగారు. కార్మికులు, రైతాంగం, విద్యార్థులు, యువతీ యువకులు, మేధావులు, విప్లవ కార్యకర్తలు, రెడ్‌గార్డులు లక్షల్లో వెల్లువలా ముందుకు వచ్చారు. ధైర్యంగా, సాహసంగా సాంస్కృతిక విప్లవంలో ముందడుగు వేశారు. విప్లవ ప్రతీఘాతకులకు వ్యతిరేకంగా తిరగబడడం ఒక హక్కు అన్న నినాదం ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. మూడు నెలల లోపు విద్యా సంస్థలలో 2 కోట్ల మంది యువత రెడ్‌గార్డు దళాల్లో సంఘటితమయ్యారు. పెకింగ్‌లో జరిగిన ఒక పెద్ద ర్యాలీలో ఆ దళాల గురించి మావో సమీక్షించారు. అప్పటి నుంచి రెడ్‌గార్డులు విప్లవానికి పట్టుగొమ్మలయ్యారు. ప్రభుత్వ వ్యవహారాల పట్ల దృష్టి సారించారు. అధికారంలో ఉన్నవారిని విమర్శించారు. సాంస్కృతిక విప్లవాన్ని విశాల ప్రజల్లో ప్రచారం చేశారు. పాత భావాలను, సంస్కృతిని, ఆచార-అలవాట్లను ధ్వంసం చేసి, వాటి స్థానంలో నూతనమైన వాటిని తీసుకొచ్చేందుకు కృషి చేశారు. రైతాంగంతో, కార్మికులతో మమేకమయ్యారు. హింసను నివారించేందుకు ప్రయత్నించారు. 16 అంశాల విధాన పత్రాన్ని అధ్యయనం కోసం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు పంపిణీ చేశారు. దాన్ని ప్రజలు ఎంతో శ్రద్ధాశక్తులతో చదివి, చర్చించారు.

మావో తన అపారమైన ప్రతిష్టను ఉపయోగించి సాంస్కృతిక విప్లవ విధానాలను ఆమోదింపజేసినప్పటికీ, 1966 నాటికి సిసిలో ఆయన మైనారిటీ స్థానంలోనే ఉండినారు. సిసిలోని 7 గురి సభ్యుల స్టాండింగ్ కమిటీలో కేవలం ముగ్గురు - మావో, లిన్ పియావో, చౌ ఎన్-లై మాత్రమే కార్మికవర్గ విప్లవ పంథా వైపు నిలబడ్డారు. ప్రజా రిపబ్లిక్ అధ్యక్షుడు లీ షావ్-చీ, పార్టీ ప్రధాన కార్యదర్శి డెంగ్ సియావో-పింగ్ నాయకత్వంలోని మితవాదుల చేతుల్లో పెకింగ్‌లోని ప్రెస్ నియంత్రణ, కేంద్ర పార్టీకి చెందిన ప్రచార విభాగం ఉండేవి. 1966 అక్టోబరు సిసి మీటింగ్ నాటికి లిన్ పియావో (అప్పటి ఉప ప్రధాన మంత్రి), చెన్ పో-టా

(పార్టీ పత్రిక రెడ్ ఫ్లాగ్ సంపాదకుడు)లు సాంస్కృతిక విప్లవంలో ముఖ్య నాయకులుగా ముందుకు వచ్చారు.

1966లో పెకింగ్ నగరం సాంస్కృతిక విప్లవానికి కేంద్రం అయ్యింది. లక్షలాది మంది విద్యార్థులు, రెడ్‌గార్డులు పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా ప్రజా వెల్లువకు నాయకత్వం వహించారు. అనతి కాలంలోనే సాంస్కృతిక విప్లవ కేంద్రం ప్రధాన కార్మిక నగరం షాంఘైకు మారింది. ప్రధాన బూర్జువా కేంద్రాన్ని (షాంఘై మున్సిపల్ పార్టీ కమిటీని) ధ్వంసం చేయండి, నగరాలు, రాష్ట్రాల్లో పారిస్ కమ్యూన్ శైలిలో అధికార అంగాలను స్థాపించండి అనే పిలుపుతో ఉద్యమం ఒక నూతన రూపం తీసుకున్నది. మితవాదులు పెద్దెత్తున వేలాది మంది కార్మికుల్ని సమీకరించడం ద్వారా, హఠాత్తుగా బోనసుల చెల్లింపులు, వేతనాల పెంపు, బహుమతులు ఇస్తూ వారిని ఆకర్షించడం ద్వారా విప్లవాన్ని తిప్పికొట్టాలని చూశారు. లీ షావ్-చీ కూలిపోయిన తర్వాత అతని రివిజనిస్టు ముఠా, ఏజెంట్లూ వివిధ ప్రాంతాలలో తమ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వచ్చారు. అనేక మంది మీద దెబ్బకొట్టి కొద్ది మంది తమ వారిని కాపాడుకోవడానికి అందర్నీ అనుమానించడం, అందర్నీ కూలదోయడం వంటి రూపంలో అతివాద వాగాడంబరంతో మితవాద నినాదాల్ని ముందుకు తెచ్చారు. విప్లవ ప్రజానీకంలో చీలికలు తీసుకొచ్చారు. తమ్ము తాము కాపాడుకోవడం కోసం ప్రజల్లో ఒక సెక్షన్‌ను పక్కదారి పట్టించి మోసం చేశారు. వీరి పథకాలను కార్మికవర్గ విప్లవకారులు వమ్ము చేసినప్పుడు ఉన్మాదంతో మరో ప్రతిదాడి ప్రారంభించేవారు. 1966 శీతాకాలం నుండి 1967 వసంత కాలం వరకూ వీచిన వ్యతిరేక గాలిలో షాంఘైలో మున్సిపల్ పార్టీ కమిటీ నాయకులు చెన్, చావోలు రెడ్ మిలీషియాను సంఘటితం చేశారు. కార్మికవర్గ విప్లవకారులకు వ్యతిరేకంగా హింసను ఆరంభించారు. ఉత్పత్తిని విచ్ఛిన్నం చేశారు. గందరగోళాన్ని సృష్టించేందుకూ, సాంస్కృతిక విప్లవాన్ని అప్రతిష్ట పాలుజేసేందుకూ వాళ్లు నగరానికి విద్యుచ్ఛక్తి, నీటి సరఫరాలను, రవాణా సదుపాయాలను తెంచేసేంత వరకూ వెళ్లారు. కానీ ఈ చర్యల వల్ల వాళ్లే కార్మికుల దృష్టిలో మరింత అపప్రతిష్ట పాలయ్యారు. దీంతో ఓడరేవుల్లో, రైల్వేలోని కార్మికులు అధికారాన్ని గుంజుకోవాల్సిన అవసరాన్ని గుర్తించడం మొదలైంది. మావో సకాలంలో షాంఘైలో 1967 జనవరి తుఫాను అనుభవాన్ని క్రోడీకరించి ఇలా పిలుపిచ్చారు : కార్మికవర్గ విప్లవకారులారా ఐక్యంకండి. అధికారంలో ఉన్న పెట్టుబడిదారీ వర్గీయులైన కొద్ది మంది పార్టీ వ్యక్తుల నుంచి అధికారాన్ని గుంజుకోండి. దీని తర్వాత ప్రజా విముక్తి సైన్యం కార్మికవర్గ విప్లవకారుల నాయకత్వంలోని విశాల ప్రజానీకానికి మద్దత్తు యివ్వాలని ఆదేశం ఇచ్చారు.

1967 జనవరిలో షాంఘైలో అధికారాన్ని గుంజుకునేందుకై దాడి ఆరంభమైంది. కార్మికవర్గ విప్లవకారులు మొదట రెండు ప్రధాన దినపత్రికలపై నియంత్రణ సాధించారు. తర్వాత వాళ్లు రైల్వేను, నీళ్లు, విద్యుచ్ఛక్తి సరఫరాను, బ్యాంకులను తమ నియంత్రణలోకి తీసుకున్నారు.

షాంఘై మున్సిపల్ ప్రభుత్వాన్ని విప్లవకారులు హస్తగతం చేసుకున్నారు. మూడు శక్తులతో కూడిన ఒక విప్లవ కమిటీ నిర్మాణమైంది. దీంట్లో విప్లవ నాయకత్వ కేడర్లు, ప్రజా విముక్తి సైన్య ప్రతినిధులు, విప్లవ ప్రజానీకపు ప్రతినిధులు ఉన్నారు. తద్వారా అధికార స్వాధీనానికి దేశవ్యాప్త పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లారు. అయినప్పటికీ, 16 అంశాల ప్రకారం, "విప్లవాన్ని కొనసాగించడానికీ, ఫ్యాక్టరీలలో ఉత్పత్తిని పెంచడానికీ" స్వల్పంగా అంతరాయం ఏర్పడింది.

కేంద్ర విప్లవ గ్రూపు "స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడండి, మన స్వంత మెదళ్ల నుంచి రివిజనిజాన్ని తుడిచిపెట్టండి" అనే పిలుపు ఇవ్వడం ద్వారా 1967 అక్టోబర్ నుంచి ఒక కొత్త పరిస్థితి అభివృద్ధి అయ్యింది. ఒక కొత్త దృక్పథాన్ని అంటే స్వార్థాన్ని రూపుమాపేందుకు తమ ఆలోచనా దృక్పథాన్ని కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథంగా మలిచే ప్రయత్నం జరిగింది. 1967 చివరి నాటికి షాంఘై ఫ్యాక్టరీలలో 90 శాతంపై అధికారాన్ని విప్లవ కమిటీలు స్వాధీనం చేసుకున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి ఇదే విధంగా మారింది.

1968 నూతన సంవత్సరం విప్లవ కమిటీల విస్తృతితో ప్రారంభమైంది. ఏప్రిల్ నాటికి 27 రీజినల్ ప్రభుత్వాల్లో 23 ప్రభుత్వాల అధికారం మావో నాయకత్వంలోని కార్మికవర్గ విప్లవకారుల చేతుల్లోకి వచ్చింది. "నైతిక ప్రోత్సాహకాలు", "ప్రజా సమీకరణల" ద్వారా దృక్పథాలు, ప్రోత్సాహకాలు, నిర్మాణం, ఉత్పత్తి సామర్థ్యంపై ప్రగాఢమైన ప్రభావాన్ని వేస్తూ ఆర్థిక వ్యవస్థను నిలకడగా నడిపించే ప్రయత్నం జరిగింది. వీటన్నింటినీ మించి సాంస్కృతిక విప్లవకారులు పార్టీలోని బ్యూరాక్రాట్లు, మేనేజర్లు, టెక్నోక్రాట్లు, "నిరంకుశ విద్యా అధికారులకు" చెందిన ఒక ప్రత్యేక గ్రూపు అధికారాన్ని కూలదోశారు. ఈ కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కమిటీలు నూతన అధికార అంగాలుగా ప్రకటిత పథకాల్ని వీలైనంత తర్వగా పరిపూర్తి చేసేందుకై "విప్లవాన్ని కొనసాగించడం, ఉత్పత్తిని అభివృద్ధి చేయడం", పాదార్థిక ప్రోత్సాహకాల స్థానంలో నైతిక ప్రోత్సాహకాలను అందించడం, కార్మికులకు అధ్యయన తరగతులు ఫ్యాక్టరీ జీవితంలో అంతర్భాగం అయ్యాయి.

1968 జులై నుంచి విద్యపై అధిక దృష్టిని సారించారు. మావో ఇలా అన్నారు, "స్కూళ్లలో పాఠాల నిడివిని తగ్గించడం, కార్మికవర్గ రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచడం, కార్మికుల నుంచి టెక్నీషియన్లను తయారు చేసేందుకై షాంఘై టూల్ ప్లాంట్ మార్గాన్ని అనుసరించడం అవసరం. ప్రాక్టికల్ అనుభవం కలిగిన విద్యార్థులను కార్మికులు, రైతులే ఎంపిక చేయాలి. వారు కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగి ఉత్పత్తిలో పాల్గొనాలి."

1968 మధ్య భాగంలో, "పోరాటం–విమర్శ–పరివర్తన" అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. రాజకీయ నిర్మాణాల్లో, ఉత్పత్తి యాజమాన్యంలో కార్మికుల పాత్రను పెంపొందించారు. "పోరాటం–విమర్శ–పరివర్తన" ఉద్యమ లక్ష్యం రెండు అంచెలతో కూడినది. మొదటిది "స్వార్థంతో

పోరాటం చేయడానికీ, రివిజనిజాన్ని తిరస్కరించడానికీ" తోడ్పడే విధంగా అధ్యయన తరగతుల పద్ధతిని ముందుకు తేవడం. అంటే, మావో చెప్పినట్లుగా విప్లవ వారసులకు కావలసిన ఐదు ఆవశ్యకతల ప్రకారం, స్వార్థానికి వ్యతిరేకంగా పోరాడడం అంటే మన మీద మనం పోరాటం చేసుకోవాలి. రివిజనిజాన్ని విమర్శించాలి. తమ ప్రాపంచిక దృక్పథాన్ని మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానానికి అనుగుణంగా (మావోయిజంతో) జాగ్రత్తగా మలుచుకోవాలి. రెండవది, 1968 ప్రారంభంలో మావో జారీ చేసిన "ప్రభుత్వ అధికార అంగాలను సంస్కరించేందుకు అత్యంత ప్రధానమైన సూత్రం, అవి ప్రజలతో సంబంధాల్ని కలిగి ఉండడం". అంతకు ముందే జారీ చేసిన "విప్లవాన్ని కొనసాగించడం, ఉత్పత్తిని పెంచడం" అనే నిర్దేశాల్ని పూర్తిగా అమలు చేయడం. సోషలిస్టు ఆర్థిక పునాదికి ఉపరితలం మరింత మెరుగ్గా సేవ చేయగలిగేట్టు చేసే "పోరాటం–విమర్శ– పరివర్తన" మౌలిక సూత్రం ఇదే. ఈ సాంస్కృతిక విప్లవంలో పెద్దెత్తున కమాండర్లు, యోధులు మూడు మద్దతులూ, రెండు సైనికాల (అంటే పరిశ్రమకు మద్దతు, వ్యవసాయానికి మద్దతు, విశాల కార్మికవర్గ విప్లవ ప్రజానీకానికి మద్దతు, సైనిక అదుపు, రాజకీయ–సైనిక శిక్షణ) కృషిలో చురుగ్గా పాలు పంచుకున్నారు.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రధాన లక్ష్యానికి చారిత్రక ప్రాధాన్యత ఉన్నప్పటికీ, అందులో కొన్ని నెగిటివ్ ధోరణులు అభివృద్ధి చెందాయి. మొదటిది, అరాచకవాదులు సృష్టించిన ముఠాతత్వం, రెండవది అతివాదులు జరిపిన విధ్వంసం. దీనికి ఒక ఉదాహరణ, మే 16 కుట్ర గ్రూపు. మావో ఆధ్వర్యంలో 'పెట్టుబడిదారీ కేంద్రాన్ని బద్దలు కొట్టండి' అనే పోస్టర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈ కుట్ర గ్రూపు 'ప్రధాన మంత్రి చౌ ఎన్–లైని కూలదోయండి' అంటూ పెద్ద అక్షరాలతో పోస్టర్లు వేసింది. కేంద్ర సాంస్కృతిక గ్రూపు నుంచి బహిరంగంగా వ్యతిరేకత వచ్చిన తరువాత మాత్రమే ఇది పతనమైంది.

నాలుగు సంవత్సరాలలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం తన తక్షణ లక్ష్యాన్ని జయప్రదం చేసింది. మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ గొప్ప విజయాలు సాధించిన ఆ విప్లవానికి జేజేలు పలుకుతూ, సోషలిస్టు ఫలితాలను సంఘటితపరచి, కమ్యూనిస్టు సమాజ నిర్మాణం వైపు ముందడుగు వేసే లక్ష్యంతో 1969 ఏప్రిల్‌లో పార్టీ 9వ కాంగ్రెస్ జయప్రదమైంది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ నూతన అనుభవాన్ని సమీక్షించింది. రహస్య ద్రోహి, రెనగేడ్, విచ్ఛిన్నకారుడైన లీ షావ్–చీని అన్ని పదవుల నుంచి తొలగించి పార్టీ నుంచి బహిష్కరించడాన్ని 9వ కాంగ్రెస్ ఆమోదించింది. లిన్ పియావోను సిపిసి  నూతన డిప్యూటీ ఛైర్మన్‌గా, మావో వారసుడిగా ప్రకటించింది. ఈ కాంగ్రెస్‌లో ఎన్నికైన నూతన సిసిలో 40 శాతం మంది పాతవారు. మిగతా వారంతా రైతులు, సైనికులు, కార్మికుల నుంచి ఎన్నికయ్యారు. ఇదే సమయంలో పార్టీ, సైన్యంలో ఉన్నతస్థాయిలో ఉన్న కొంతమంది 'అతివాదులు' బహిర్గతమై తొలగించబడ్డారు.

9వ కాంగ్రెస్ నిర్ణయం ప్రకారం అతివాద ధోరణులకు, ఆధిపత్యవాదానికి (కమాండిజం), పెత్తందారీతనానికీ వ్యతిరేకంగా సాంస్కృతిక విప్లవాన్ని పార్టీలో కొనసాగించాలని నిర్ణయమైంది. విప్లవ కమిటీలలో రొటేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. ఈ రొటేషన్ విధానంలో విప్లవ కమిటీలలో ఒక మూడవ వంతు సభ్యులు నాయకత్వ బాధ్యతల్లో క్రియాశీలంగా ఉంటారు. మరో మూడవ వంతు సభ్యులు తమ సాంప్రదాయ వృత్తులు కొనసాగిస్తారు. మరో మూడవ వంతు సభ్యులు ఇంటి వద్ద ఉంటూ ఏదో ఒక సమయంలో మే 7 కేడర్ స్కూల్‌లో అధ్యయనం కొనసాగిస్తారు. అలాగే పునాది స్థాయిలో పార్టీని పునస్సంఘటితం చేయడం, విప్లవ కమిటీలపై, సైన్యంపై దాని నాయకత్వాన్ని స్థాపించే వైపుగా ప్రధాన దృష్టి ఉండాలని 9వ కాంగ్రెస్ నిర్దేశించింది.

1970 సెప్టెంబర్‌లో 9వ సిసి 2వ ప్లీనం 'అతివాదులకు' చెందిన రహస్య పథకాలను బహిర్గతం చేసింది. లిన్ పియావోను చైనా రిపబ్లిక్ అధ్యక్ష పదవిలో నియమించింది. లిన్ పియావో, అతని ముఠాకు చెందిన సైనిక జనరళ్లు బహిర్గతం కానప్పటికీ చెన్ పో-టా బహిర్గతమయ్యాడు. అతని అతివాద వాగాడంబరం విమర్శలకు గురైంది. అతనిని పార్టీ నుంచి తొలగించారు. అతని లాంటి 'రాజకీయ మోసగాళ్లకు' వ్యతిరేకంగా ఒక క్యాంపెయిన్ నిర్వహించారు. అప్పుడే మావో 'ఎర్రజెండాకు వ్యతిరేకంగా ఎర్రజెండాను ఊపడం' అనే ప్రకటనను జారీ చేశారు. ఈ ప్లీనం తర్వాత అతివాద వాగాడంబరానికి వ్యతిరేకంగా, శృతి మించిన మావో వ్యక్తి పూజకు వ్యతిరేకంగా ఒక క్యాంపెయిన్ నిర్వహించారు. ఇందులో భాగంగా మావో వ్యక్తి పూజను ప్రోత్సహించడంలో ప్రధాన పాత్ర పోషించిన, 'జీనియస్' సిద్ధాంతాన్ని రూపొందించిన లిన్ పియావోపై పోరాటం నడిచింది. అదే సమయంలో మే 16 కుట్రదారులకు, అనేక చోట్ల విధ్వంసానికి కారణమైన అతివాదులకు వ్యతిరేకంగా మరింత విస్తృతంగా ఈ క్యాంపెయిన్ జరిగింది. దీంతో పాటు సైన్యంలో కీలకమైన స్థానాల నుంచి కొంత మంది అతివాదుల్ని తొలగించడంతో లిన్ పియావో ప్రభావాన్ని అరికట్టారు. సాంస్కృతిక విప్లవంలో లిన్ పియావో ద్వారా నిలిపివేయబడిన ప్రజా మిలీషియాకు ట్రైనింగ్ తిరిగి ఇవ్వడం ప్రారంభమైంది.

1971 ఆగస్టులో పార్టీని పునర్నిర్మాణం చేశారు. మొదట కింది స్థాయిల్లో (వ్యవసాయ పని టీములు, కర్మాగారాల్లో వర్క్‌షాపులు, గ్రామాలు, జిల్లాల్లో) పార్టీ సెల్స్‌ను పునర్నిర్మాణం చేశారు. దుష్టశక్తులను తొలగించారు. నూతన సభ్యులను రిక్రూట్ చేసుకున్నారు. కమ్యూన్లలో, జిల్లాల్లో, రాష్ట్రాల్లో, ఉన్నత స్థాయి పార్టీ కాన్ఫరెన్స్‌లలో కమిటీలను ఎన్నుకున్నారు. ఇదే విధమైన క్రమం ప్రభుత్వ, సైనిక సంస్థల్లో, పాత-కొత్త ప్రజా సంఘాల్లో అమలు జరిపారు.

అంతిమంగా, చైనా నాయకత్వాన్ని హస్తగతం చేసుకోవాలనే తన ఆకాంక్షలు నెరవేరేందుకు ఎటువంటి అవకాశం కనపడకపోవడంతో లిన్ పియావో మావోను హత్య చేసేందుకు, సైనిక తిరుగుబాటు ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు పథకం రూపొందించాడు. ఇది బహిర్గతమైంది. సోషల్ సామ్రాజ్యవాద సోవియట్ యూనియన్‌కు పారిపోయే ప్రయత్నంలో భాగంగా అతడు విమాన ప్రమాదంలో మంగోలియాలో మరణించాడు. పార్టీ, సైన్యం, అన్ని జాతుల ప్రజలకూ చెందిన కార్మిక-కర్షక, విద్యార్థి-మేధావి వర్గాలు, సెక్షన్లు ఈ విషయాన్ని గంభీరంగా చర్చించి వ్యతిరేకించారు. ఆ తర్వాత, రెనగేడ్ లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠాను ప్రజా బలంతో రూపుమాపారు. లిన్ పియావోను విమర్శించి, పని శైలిని సరిదిద్దే ఉద్యమం ప్రజల్లో వేళ్లూనుకుంది.

1973 ఆగస్టులో 10వ కాంగ్రెస్ జరిగింది. దీంట్లో బూర్జువా కెరీరిస్టు, విశ్వాస ఘాతకుడైన లిన్ పియావో కుట్రను సమీక్షించడమైంది. లిన్ పియావోను విమర్శించి, పని శైలిని చక్కదిద్దుకునే ఉద్యమం, లిన్ పియావోను, కన్‌ఫ్యూషియస్‌ను విమర్శించే ఉద్యమం సైద్ధాంతిక రంగంలో జరిగే పోరాటంలో భాగమైంది. తద్వారా విప్లవ ఐక్యత బలోపేతం అయ్యేలా కాంగ్రెస్ దిశానిర్దేశం చేసింది. దీన్నంతటినీ సమీక్షించడం ద్వారా మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు (మావోయిజం) సిద్ధాంతంతో మరింత జ్ఞానాన్ని పెంచుకోవాల్సిన ప్రాధాన్యతను అది యావత్తు పార్టీ శ్రేణులకూ గుర్తింపజేసింది. ఈ కాంగ్రెస్‌లో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉన్నత స్థాయి నాయకులందరూ పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు.

అతివాదానికి వ్యతిరేకంగా జరిగిన క్యాంపెయిన్‌లో డెంగ్ సియావో-పింగ్ 1975లో తిరిగి సిపిలోకి వచ్చాడు. కానీ అతను తన రివిజనిస్టు సిద్ధాంతాన్ని కొనసాగించాడు. "పిల్లి ఎలుకను పట్టినంత వరకూ అది నల్లదా, తెల్లదా అనేది నాకు అనవసరం", ఉత్పత్తిని పెంచడమే ముఖ్యం, అంతే కానీ పెట్టుబడిదారీ విధానమా లేదా సోషలిస్టు విధానమా అనేది సమస్య కాదు అనేదే ఆయన అభివృద్ధి నిరోధక బూర్జువా సిద్ధాంతం. మావో మరణానికి ఐదు నెలల ముందు ఇతన్ని తిరిగి అన్ని పదవుల నుంచి తొలగించారు.

మావో మరణానికి ముందు తిరిగి మితవాద ధోరణి వచ్చింది. పునాది స్థాయిలో విప్లవ కమిటీలు నిర్వీర్యం కావడం మొదలైంది. అవి పని చేయడం ఆగిపోయింది. ఎన్నికైన కమిటీ సభ్యుల్ని ప్రజల ద్వారా వెనక్కు పిలిచే సూత్రాన్ని, సమయావధి పూర్తి అయ్యాక తిరిగి ఎన్నుకునే ప్రక్రియను విడిచిపెట్టారు. కార్మికుల మేనేజ్‌మెంటు గ్రూపులు, ఇతర అంగాలు ఇదే విధంగా నిర్వీర్యం అయ్యాయి. ఈ వెనుకపట్టు 'యాదృచ్ఛికంగా' సంభవించలేదు. చాప కింద నీరులా విప్లవ ప్రతీఘాతుక కార్యకలాపాలు విస్తరించడం ద్వారా బూర్జువా ప్రభావం పెరగడం వల్ల,

అమెరికా సామ్రాజ్యవాదులు, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు దేశ, విదేశీ శత్రువులు అందరూ 'ఒక పవిత్ర కూటమి'గా ఏర్పడి విప్లవ శక్తులపై స్థిరంగా దాడిని ఎక్కుపెట్టడం వల్ల, ఈ 'పవిత్ర కూటమి' అండతో ప్రభుత్వం, పార్టీ, సైన్యం, ఇతర యంత్రాంగంలో దాగి ఉన్న బూర్జువా శక్తులన్నీ తమ అధికారాన్ని బలోపేతం చేసుకోవడానికీ, ప్రజలను మోసగించి వారి నిఘా నుంచి తప్పుకోవడానికీ ప్రయత్నించడం వల్ల ఈ వెనుకపట్టు సంభవించింది. సాంస్కృతిక విప్లవ కాలంలో మితవాదానికి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో నాయకుడిగా నమ్మబలికి, మావో వారసుడిగా ముందుకు వచ్చిన లిన్ పియావో అనతి కాలంలో ద్రోహిగా బయటపడడం అనే పరిణామం చైనా సమాజంపై, కమ్యూనిస్టు విప్లవ శక్తులపై కొంత వరకు ప్రతికూల ప్రభావాన్ని వేసింది. విప్లవాన్ని చివరి వరకూ కొనసాగించాలనే కామ్రేడ్ మావో బోధనను కొనసాగించడంలో విప్లవ శక్తులు మునుపటిలా ప్రభావశీలంగా కృషి చేయలేదు. దీనితో పాటు కేవలం 1976 సంవత్సరంలోనే చైనా విప్లవానికి చెందిన ఐదుగురు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు - మావో, చౌ ఎన్-లై, చూ-టే, కాంగ్ షెన్, టుంగ్ పి-వు (పార్టీ సంస్థాపకుల్లో ఒకరు)ల మరణంతో చెడు ధోరణులకు వ్యతిరేకంగా కొనసాగుతున్న సాంస్కృతిక విప్లవానికి పెద్ద దెబ్బ తగిలింది.

చౌ ఎన్-లై మరణించిన తర్వాత హువా కువా-ఫెంగ్ కార్యవాహక (యాక్టింగ్) ప్రధానమంత్రి, సార్వజనిక (పబ్లిక్) భద్రతా మంత్రి అయ్యాడు. తాను మావోకు గట్టి అనుచరుడినని ఆయన చెప్పుకున్నప్పటికీ, నిజానికి అతను పెట్టుబడిదారీ మార్గీయుడు. హువా రెండు పక్షాలలోనూ ఉండేవాడు (డబుల్ డీలర్), క్రమంగా రాజ్యం, పార్టీ, సైన్యంలో అత్యున్నత అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. కామ్రేడ్ మావో 1976 సెప్టెంబర్‌లో మరణించారు. హువా-డెంగ్ ముఠా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పెట్టుబడిదారీ మార్గీయులకు ప్రతిపక్షం లేకుండా ధ్వంసం చేసేందుకై మావో అనుచరులను అందరినీ అణచివేసింది. మావో మరణించిన ఒక నెల లోపే హువా-డెంగ్ ముఠా చియాంగ్ చింగ్, చాంగ్ చున్-చియావో, యావో వెన్-యువాన్, వాంగ్ హుంగ్-వెన్‌లను "దుష్ట చతుష్టయం"గా ప్రకటించి, వారు అధికారాన్ని హస్తగతం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని అంటూ అరెస్టు చేసింది. వాళ్లు మావో రూపొందించిన విధానాలను వ్యతిరేకిస్తున్నారంటూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నించింది. కానీ, ప్రజలు ఈ ఆరోపణలను అంగీకరించలేదు, వీధుల్లోకి వచ్చి ఈ పెట్టుబడిదారీ జిత్తులను ప్రతిఘటించారు. ఫుకియన్, హెూపీ, హెూనాన్, షాన్సీలతో సహా అనేక రాష్ట్రాల్లో సాయుధ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ ప్రతిఘటనా పోరాటాలు నిర్దాక్షిణ్యంగా అణచివేయబడ్డాయి. కార్మికవర్గ నియంతృత్వం ధ్వంసమైంది, దీనికి భిన్నంగా పెట్టుబడిదారీ నియంతృత్వం నిరంకుశంగా రుద్దబడింది.

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ విజయాలు

చైనా సమాజంలో సాంస్కృతిక విప్లవం రాజకీయ, భావజాలపరమైన ఉపరితలంలో జరిగిన మొట్టమొదటి విప్లవం. సోవియట్ యూనియన్‌లో 1956లో కృశ్చేవ్ నాయకత్వంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగిన తర్వాత, దీనిని నిరోధిస్తూ, సోషలిజాన్ని పరిరక్షిస్తూ, కమ్యూనిజం వైపుగా ఎలా పురోగమింపజేయాలనే చర్చ అంతర్జాతీయంగా విప్లవ శిబిరంలో పరిష్కరించబడని జటిల సమస్యగా ఉండింది. కార్మికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించడం ద్వారా సమూలంగా పెట్టుబడిదారీ అవశేషాలను నిర్మూలించడం, పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రయత్నాలను నిరోధించడం, కమ్యూనిస్టు సమాజ నిర్మాణ లక్ష్యంతో సుస్థిర పునాదులపై శక్తివంతమైన సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం అనేది మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత ఆయుధాగారానికి మార్క్సిస్టు మహోపాధ్యాయులు మావో సమకూర్చిన శక్తివంతమైన నూతన ఆయుధం అని మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ పోరాట చరిత్ర రుజువు చేసింది.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం లీ షావ్-చీ, లిన్ పియాపోలకు చెందిన రెండు బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను ధ్వంసం చేసింది. వారి రివిజనిస్టు పంథాను విమర్శించింది. అది స్వతంత్రంగా, స్వావలంబనతో అభివృద్ధి చెందే విప్లవ సోషలిస్టు పంథా పట్ల ప్రజల అవగాహనను పెంపొందించింది. సోషలిస్టు లక్ష్యాన్ని ముందుకు తీసుకొనిపోయేందుకై విజయవంతమైన అభివృద్ధి క్రమాన్ని అది ప్రోత్సహించింది. ఈ రకంగా చైనాలో 10 సంవత్సరాల పాటు పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరగకుండా నివారించింది.

పెద్ద కలకలం పుట్టించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవపు విజయంతో ఉపరితలంలో విప్లవ మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే వర్గాలు, వర్గ పోరాటం కొనసాగుతూ, పెట్టుబడిదారీ శక్తులు, వాటి ప్రభావం కొనసాగాయి. సైద్ధాంతిక రంగంలో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికీ (ప్రస్తుతం మావోయిజం), రివిజనిజానికీ మధ్య పోరాటం పదునుగా, క్లిష్టంగా కొనసాగింది.

విద్య, ప్రజాస్వామీకరణ, పరిశ్రమలు, వ్యవసాయంలో, పితృస్వామిక ఆధిపత్యాన్ని, మహిళలు-పురుషుల మధ్య అసమానతలను ఎదిరించడంలో, ఆరోగ్య సంరక్షణ, సంస్కృతి, సైన్య రంగాలలో "నూతన సోషలిస్టు అంశాలు" ముందుకు వచ్చాయి.

**మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం మొట్టమొదటగా విద్యా వ్యవస్థను విప్లవీకరించింది:**

సాంస్కృతిక విప్లవ విద్యా విధాన లక్ష్యం - విప్లవ తత్వము, నైపుణ్యము (రెడ్ అండ్ ఎక్స్‌పర్ట్) కలిగిన విద్యార్థులను తయారు చేయడం. సమాజంలోని తీవ్ర అసమానతలను పరిష్కరించే విధంగా, అందుకు ఉపయోగపడేలా వారి జ్ఞానాన్ని, నైపుణ్యాలను (స్కిల్స్‌ను) అభివృద్ధి చేయడం. రెండవ లక్ష్యం, కార్మికుల, రైతుల పిల్లలకు మరిన్ని విద్యా అవకాశాలు

కల్పించడం. మూడవది, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులు తమ జీవితాంతమూ విద్యను కొనసాగించేలా సామూహిక విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం. అత్యంత ముఖ్యమైన లక్ష్యం – కార్మికవర్గ రాజకీయ విద్యను అందించడం.

సాంస్కృతిక విప్లవానికి ముందు స్కూలుకు వెళ్లే పిల్లల్లో చాలా తక్కువ మంది మాత్రమే అప్పర్ ప్రైమరీ స్కూల్, హైస్కూల్ వరకూ వెళ్లగలిగేవారు. చాలా తక్కువ మంది కాలేజీ వరకూ వెళ్లగలిగేవారు. కాలేజీకి వెళ్లగలిగేవారిలో చాలా మంది ధనిక కుటుంబాలకు చెందినవారే ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల్లో చాలా మంది ప్రాథమిక పాఠశాలలకు కూడా వెళ్లలేకపోయేవారు. చైనాలోని విశాల గ్రామీణ ప్రాంతాల్లో విద్య అందరికీ అందుబాటులో లేకపోవడం అనేది చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన 17 సంవత్సరాల వరకూ కొనసాగింది. అది అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన విద్యా వ్యవస్థ గత దోపిడీ వర్గ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన దానికంటే అంత వైవిధ్యం ఉన్నది కాదు. కాలేజీలు కార్మిక–కర్షక వర్గాల పిల్లలకు చాలా వరకూ అందుబాటులో ఉండకపోవడమే కాక అవి ధనికవర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దే బూర్జువా విద్యాలయాలుగానే ఉండినాయి.

సాంస్కృతిక విప్లవంలో భాగంగా విద్యా రంగంలో తీవ్రమైన మార్పు చైనాలోని ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల్లో జరిగింది. సాంస్కృతిక విప్లవానికి ముందు, విద్యా రంగ నిపుణులు చైనాలో విద్యా వ్యవస్థను నడిపించేవారు. వీరు వీలైనంత మంది పిల్లలు స్కూళ్లకు వెళ్లే విధంగా విద్యా వ్యవస్థను విస్తరించడం కాక, విద్యా ప్రమాణాల పేరుతో మోయలేని భారాన్ని విద్యార్థులపై మోపేవారు. సాంస్కృతిక విప్లవం వీరి నియంత్రణ నుంచి విద్యా విధానాన్ని విముక్తి చేసింది. తమ పిల్లలకు విద్యను అందించే విషయంలో కార్మికుల, రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రతి గ్రామమూ స్థానిక సామగ్రితో తన స్కూల్‌ను తానే నిర్మించుకునేది, టీచర్లను నియమించుకునేది, గ్రామంలో పిల్లలందరికీ అందులో ప్రవేశం కల్పించేది. ఇలా సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రతి గ్రామమూ ఒక ప్రాథమిక పాఠశాలను నిర్మించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలందరూ ఎటువంటి ఖర్చు లేకుండా స్కూళ్లకు వెళ్లగలిగేవారు. ప్రతి నాలుగు గ్రామాలకు ఒక మాధ్యమిక పాఠశాల నిర్మాణమైంది. ప్రాథమిక విద్యలో ఉత్తీర్ణులైన పిల్లలందరికీ ఎటువంటి పరీక్షలు రాయాల్సిన అవసరం లేకుండానే, ఎటువంటి ఫీజు లేకుండానే ఈ మాధ్యమిక పాఠశాలల్లో ప్రవేశం లభించేది. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రతి కమ్యూనుకూ మూడు హైస్కూళ్లు నిర్మాణమయ్యాయి. మాధ్యమిక విద్య పాసయ్యే విద్యార్థులందరూ హైస్కూల్‌కు వెళ్లగలిగేవారు. బాలికలకూ, బాలురకూ మాధ్యమిక పాఠశాలలో సైనిక శిక్షణ లభించేది. మాధ్యమిక పాఠశాలలో ఉత్తీర్ణులైన తర్వాత పెద్ద సంఖ్యలో వాళ్లు ప్రజా మిలీషియాలో చేరేవాళ్లు.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో బీజింగ్‌లో విద్యార్థులు డిమాండ్ చేసిన

ఫలితంగా చైనా ప్రభుత్వం విద్యా వ్యవస్థను మార్పు చేసేందుకు పూనుకున్నది. ఈ మార్పు ఫలితంగా విద్యార్థుల్ని ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేసే కాలేజీ ప్రవేశ పరీక్షా విధానం రద్దయ్యింది. విద్యార్థులు ఏ విధంగా తమ పనిలో రాణిస్తున్నారనే దానిపై ఆధారపడి కార్మికులు, రైతులు వారిని ఎంపిక చేసేవారు. మరో ముఖ్యమైన మార్పు – కాలేజీ పట్టా పొందినవారు తమ స్వంత ప్రాంతాల ప్రజలకు సేవ చేసేందుకై తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేవాళ్లు. కాలేజీ విద్యార్థుల్ని ఎంపిక చేసేందుకై ఈ నూతన విధానం అమలులోకి రావడంతో, కాలేజీలు ధనిక వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికలనే భావన చైనా సాంస్కృతిక విప్లవంలో తొలగిపోయింది. విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల కోసం పాకులాడడం కాకుండా తమ విద్యను కార్మిక–కర్షక ప్రజానీకంతో మమేకం చేశారు. వ్యక్తి వికాసం, అభివృద్ధి కోసం కాక ప్రజలకు సేవ చేసేందుకు అంకితమైన ఒక నూతన దృక్పథంతో కాలేజీ పట్టభద్రులను (గ్రాడ్యుయేట్లను) తయారు చేయడం మొదలైంది. వాళ్లు సోషలిస్టు సమాజం అభివృద్ధి కోసం తమ సామర్థ్యాన్ని పెంపొందించు కునేందుకు కష్టపడి కృషి చేసేవాళ్లు. కార్మిక, కర్షక, సైనిక కాలేజీ విద్యార్థులు చైనాలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యుత్తమ కాలేజీ విద్యార్థులుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

1966 మేలో విద్యా విధానంలో సంస్కరణలకు సంబంధించి మావో ఒక దిశానిర్దేశాన్ని జారీ చేశారు. అది ఇలా పేర్కొంది : “విద్యార్థులు విద్యను తమ ప్రధాన ధ్యేయంగా పెట్టుకుంటూనే, అదే సమయంలో వాళ్లు ఇతర విషయాలను కూడా నేర్చుకోవాలి, ఉదాహరణకు, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ, వాళ్లు పరిశ్రమలు, వ్యవసాయం, సైనిక శాస్త్రం గురించి కూడా తెలుసుకోవాలి. వాళ్లు బూర్జువావర్గాన్ని కూడా విమర్శించాలి. విద్యను నేర్చుకునే కాలం తక్కువగా ఉండాలి, విద్యను విప్లవీకరించాలి. మన స్కూళ్లు బూర్జువా మేధావుల పాలన కింద కొనసాగే పరిస్థితి ఉండరాదు.” ఈ దిశానిర్దేశానికి అనుగుణంగా, లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు రైతాంగంతో, కార్మికులతో మమేకమయ్యేందుకూ ఆచరణయోగ్యమైన (ప్రాక్టికల్) అనుభవాన్ని సంపాదించుకునేందుకై ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనేందుకూ, ప్రజల నుంచి నేర్చుకునేందుకూ గ్రామీణ ప్రాంతాలకు, కర్మాగారాలకు తరలివెళ్లారు. శారీరక శ్రమ పట్ల చిన్నచూపు, శారీరక శ్రమ కంటే మానసిక శ్రమ గొప్పదనే భావన పరివర్తనకు గురైంది.

చైనా చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవకాలంలో విద్య అభివృద్ధి చెందింది. ఇది చైనా ప్రజల్లో, సమాజంలో పెనుమార్పులు తీసుకొని వచ్చింది. ప్రజలు విద్యావంతులయ్యే కొలదీ రాజకీయ, ఆర్థిక కార్యకలాపాల్లో వారి సాధికారత మరింత పెరుగుతూ వచ్చింది. ఇలా విద్యా రంగంలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం అనేది లోతుగా పెంపొందే సామూహిక స్వభావంతో కూడిన ఒక సోషలిస్టు విప్లవం.

కార్మికులు, రైతులు, సైనికుల నుంచి కాలేజీ విద్యార్థుల్ని ఎంపిక చేసే ఈ విధానం 1977 నుంచి హఠాత్తుగా రద్దయ్యింది. మావో మరణానంతర చైనా ప్రభుత్వ పెట్టుబడిదారీ నాయకులకు

సాంస్కృతిక విప్లవ కాలంలో ముందుకు వచ్చిన నూతన విద్యా విధానంతో పని లేకుండా పోయింది. వాళ్లు బూర్జువా అవసరాల కోసం తిరిగి పాత విద్యా వ్యవస్థనే పునరుద్ధరించారు.

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం – చైనా సమాజ ప్రజాస్వామీకరణ :

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం సాధించిన అతి ముఖ్యమైన విజయాలలో ఒకటి సామాన్య ప్రజలకు సాధికారత కల్పించడం, చైనా సమాజాన్ని ప్రజాస్వామీకరించడం. ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని గూర్చి మాట్లాడుతూ చాలా మంది ప్రజాస్వామ్య భావనను చాలా సంక్లిష్టం చేస్తారు. అయితే ప్రజాస్వామ్యం గురించిన భావన చాలా సరళమైనదీ, సూటిగా ఉండేది. ప్రజాస్వామ్యం అంటే సామాన్య ప్రజలకు నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వామ్యం కల్పిస్తుంది, అది రాజకీయ వ్యవహారాల్ని ధనిక వర్గాలు చలాయించడానికి అనుమతించే పాత వ్యవస్థకు భిన్నమైంది. ప్రజాస్వామ్యం అంటే అర్థం, సామాన్య ప్రజలకు తమ సమాజాన్ని పాలించడంలో భాగస్వామ్యం ఉంటుంది. ప్రజాస్వామ్యం అమలు జరగాలంటే సామాన్య ప్రజలందరికీ (కార్మిక, కర్షక, సైనిక, విద్యార్థి, మేధావి, మహిళ, వివిధ జాతుల, తెగల, సెక్షన్ల ప్రజలందరికీ) సమానంగా సాధికారత కల్పించాలి. ఒక ప్రజాస్వామిక సమాజంలో, అదనపు సౌకర్యాలు కల్గిన వర్గాలు, ధనిక వర్గాలు ఉండవు. ప్రతి ఒక్కరూ రాజకీయంగా, ఆర్థికంగా సమానంగా ఉంటారు. అది ప్రజాస్వామ్యానికి ముందు షరతు.

ప్రజాస్వామిక వ్యవస్థలుగా చలామణీ అవుతున్న పాశ్చాత్య (పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా ఖండాల) దేశాల్లో, ఇండియా లాంటి వెనుకబడిన దేశాల్లో ఒక శాతం ధనికుల చేతిలో దాదాపు సంపదంతా పోగుబడి ఉంది. సంపదలోని ఈ వ్యత్యాసం వల్ల పిడికెడంత ధనిక మైనారిటీ అధికారాన్ని, ప్రభావాన్ని, నియంత్రణను కొనివేయగలదు. వారికి అక్షరాలా గుత్తాధికారం ఉంటుంది. అది ఎంత మాత్రమూ నిజమైన ప్రజాస్వామ్యం కాదు. ఆ ప్రజాస్వామ్యం నామమాత్రమైనదే. అది బూటకం. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం నిజమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు ప్రయత్నించింది. అది సామాన్య ప్రజలకు తమ నాయకుల్ని విమర్శించేందుకై పెద్ద అక్షరాల పోస్టర్లను రాసి వేసే సాధికారతను కల్పించింది. అందరి లాగానే తమ నాయకులు శారీరక శ్రమలో పాల్గొనేవారు. చైనా సమాజ అభివృద్ధిలో ఇది ఒక పెద్ద ముందంజ. సాంస్కృతిక విప్లవకాలంలో, చాలా మంది చైనా అధికారుల జీవన విధానం సామాన్య ప్రజల మాదిరిగానే ఉండేది. సామాన్య ప్రజల మాదిరిగానే వారి నివాసాలుండేవి. ఇతర చైనా ప్రజల పిల్లలు వెళ్లిన స్కూళ్లకే తమ పిల్లలు కూడా వెళ్లేవారు. అందరి లాగానే వాళ్లు సైకిళ్లపై పనికి వెళ్లేవారు. ప్రతి రోజూ పొలంలో రైతులు ఉత్పత్తి టీముల నాయకుల్ని ఎన్నుకునేవారు, వారు రైతులతో కలిసి పనిచేసేవారు. గ్రామ అవసరాల కోసం మీటింగులకు హాజరు కావాల్సి రావడం, పథకాలు తయారు చేయాల్సిన అవసరం ఉండడం వల్ల, గ్రామ

నాయకులు సంవత్సరంలో 300 రోజులు పొలాల్లో రైతులతో కలిసి పని చేసేవారు. కమ్యూన్ నాయకులు సంవత్సరంలో 250 రోజులు పొలాల్లో రైతులతో కలిసి పని చేసేవారు. కౌంటీ ప్రభుత్వ అధికార్లు సంవత్సరానికి 200 రోజులు రైతులతో కలిసి పని చేసేవారు.

చెన్ యాంగ్ గుయి తన జీవితాంతం రైతు లాగానే పనిచేశాడు. కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆయన షాంగ్సీ రాష్ట్రంలోని జియాంగ్ కౌంటీలో ద ఝాయి గ్రామ పార్టీ కార్యదర్శి అయ్యాడు. సుందర భవిష్యత్తు నిర్మాణానికై ఆయన గ్రామ ప్రజలకు సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించాడు. సాంస్కృతిక విప్లవ కాలంలో ఆయన చైనా ప్రజా రిపబ్లిక్‌కు ఉపాధ్యక్షుడిగా పదోన్నతి (ప్రమోషన్) పొంది, చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉంటూ చైనా వ్యవసాయ రంగ ఇన్‌చార్జిగా పనిచేశాడు. అయినప్పటికీ ఆయన తన మూడవ వంతు సమయాన్ని పొలాల్లో రైతులతో కలిసి పని చేసేందుకు వినియోగించేవాడు. విదేశీ ఉన్నతాధికారులను కలిసేటప్పుడు ఆయన రైతు లాగానే బట్టలు ధరించేవాడు. ఆయన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో ఆవిర్భవించిన రైతాంగ, కార్మిక, సైనిక అధికారులకు ఒక నమూనాగా నిలిచాడు. వాళ్లు ప్రభుత్వ అధికారులే అయినప్పటికీ రైతులు, కార్మికులు, సైనికుల లాగానే వాళ్లు జీవితాన్ని గడిపారు. అదీ మావో నాయకత్వంలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో నిర్మించ తలపెట్టిన/నిర్మించిన ప్రజాస్వామ్యం – కార్మికవర్గ ప్రజాస్వామ్యం. అది ఒక శాతం ధనిక వర్గాలపై 99 శాతం ప్రజలకు సాధికారత కల్పించిన ప్రజాస్వామ్యం.

చెన్ యాంగ్ గుయి లాగానే జాతీయ నాయకులు అనేక మంది ఉన్నారు. వాంగ్ జింగ్సి – నీ ఝిఫులోని చమురు పరిశ్రమలో సాధారణ కార్మికుడు. ఇతను అత్యంత ప్రభావశీలమైన డ్రిల్ బిట్‌లను కనిపెట్టాడు. హౌ జియాంగ్సి – షాన్‌డంగ్ రాష్ట్రంలోని క్వింగ్ డావోకు చెందిన ఒక సమర్థవంతమైన వస్త్ర కార్మికుడు. వీరంతా జాతీయ నాయకులుగా ఎదిగిన తర్వాత కూడా తమ తమ రంగాల్లో పని చేయడం ఆపలేదు. స్థానిక ప్రభుత్వం కింద అనేక మంది కార్మికులు, రైతులు ఇలా సేవ చేశారు. వాళ్లు ఈ విధంగా ప్రభుత్వం కింద పని చేస్తూనే కార్మికవర్గం, రైతాంగంలో తమ పనిని కొనసాగించారు.

సాంస్కృతిక విప్లవ కాలంలో కార్మికవర్గ నియంతృత్వం దాని నిజమైన స్ఫూర్తితో అమలైంది. లెనిన్ చెప్పినట్లుగా "కార్మికవర్గ నియంతృత్వం అంటే కార్మికవర్గం ఒక పాలకవర్గంగా పరివర్తన చెందటం తప్ప మరేమీ కాదు." అది ప్రజలకు విస్తృతమైన ప్రజాస్వామ్యాన్ని, కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని అందిస్తుంది. సాంస్కృతిక విప్లవ క్రమంలో ప్రజలు నగరాలు, గ్రామాలలో తమ పాలనను నేరుగా చలాయించారు. సిపిసి కేంద్రకమిటీ పత్రిక రెడ్‌ఫ్లాగ్ ఇలా పేర్కొంది, "ప్రజలు పార్టీ, ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ యంత్రాంగంలోని సంబంధాలను విమర్శించే హక్కు, తమ సూచనలను తెలియజేసే హక్కు కలిగి ఉండేవారు. (పార్టీలో) అన్ని స్థాయిల్లో

నాయకత్వ కాడర్లను – వారు ఎంతటి గొప్ప సేవలు అందించినవారైనప్పటికీ, వారు ఎంతటి పై స్థాయిలోని వారైనప్పటికీ లేదా వారు ఎంతటి సీనియర్లు అయినప్పటికీ – ప్రజలకు విమర్శించే హక్కు ఉండేది. పారిస్ కమ్యూన్‌లో లాగా, సాంస్కృతిక విప్లవానికి నాయకత్వం వహించే అన్ని అధికార అంగాలకూ సార్వత్రిక ఎన్నికల వ్యవస్థను ఎటువంటి మినహాయింపులూ లేకుండా వ్యవస్థీకరించడం తప్పనిసరి అయ్యింది. ఎన్నికైన ఏ సభ్యుడు/సభ్యురాలి స్థానంలో మరొకరిని ఏ సమయంలో అయినా ఎన్నిక ద్వారా గానీ లేదా వెనక్కు పిలవడం ద్వారా గానీ ఎన్నుకునే అధికారం ప్రజలకు ఉండేది. ప్రజల అవగాహనలను, ఆలోచనా విధానాన్ని సమైక్యం చేసేందుకూ, వారి రాజకీయ స్పృహను పెంపొందించేందుకూ, ఎంఎల్ఎంలో వారు పట్టు సాధించేందుకూ ప్రజలు తమ కోసం తాము విస్తృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేశారు. ప్రజలు తమకు తాము చైతన్యవంతమయ్యేందుకు ఇటువంటి విస్తృత ప్రజాస్వామ్యం ఉత్తమమైన పద్ధతి."

"అటువంటి విస్తృత ప్రజాస్వామ్యం లేకుండా, ప్రభుత్వ వ్యవహారాల పట్ల కోట్లాది మంది ప్రజలు శ్రద్ధ వహించకుండా, పార్టీ, ప్రభుత్వ అంగాలను పర్యవేక్షించకుండా, అన్ని స్థాయిల్లో నాయకత్వ కాడర్లను పర్యవేక్షించకుండా విప్లవ ప్రతీఘాతక రివిజనిస్టు శక్తులు పార్టీ నాయకత్వాన్ని, ప్రభుత్వ అధికారాన్ని హస్తగతం చేసుకోకుండా నివారించడం అసాధ్యం. కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువా నియంతృత్వంగా మారకుండా నివారించడం అసాధ్యం."

కనుక, సరైన విధానాల్ని రూపొందించేందుకై, ప్రజలకు సేవ చేయడం; పార్టీలో తప్పుడు ధోరణుల పెరుగుదలను నివారించడం; ప్రజలు తమ రాజకీయాధికారాన్ని నేరుగా చలాయించేలా చేయడం; ప్రభుత్వ యంత్రాంగాన్నీ, పార్టీని పర్యవేక్షించడం; అధికారంలో ఉన్నవారిని విమర్శించడం, దిగజారిన శక్తులను బహిష్కరించడం, పెట్టుబడిదారీ పునరుద్ధరణను, కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువా నియంతృత్వంగా మార్చకుండా నివారించే లక్ష్యంతో "ప్రజాపంథా" సూత్రం అభివృద్ధి అయ్యింది.

ఈ విధంగా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం చైనాలో ఒక బలమైన సమసమాజ సామాజిక వాతావరణాన్ని సృష్టించింది. శ్రమ పట్ల గౌరవాన్ని పెంచింది. ఇది ప్రపంచ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఆర్థిక అభివృద్ధికి దారితీసింది. సాంస్కృతిక విప్లవ కాలంలో, మేనేజ్‌మెంట్ చేసేవారు శారీరక శ్రమలో పాల్గొనేవారు. కార్మికులు మేనేజ్‌మెంట్‌లో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో భాగస్వామ్యం వహించేవారు. కార్మికులు, ఇంజనీర్లు, మేనేజ్‌మెంట్ పరస్పరం సహకారంతో సాంకేతిక సమస్యల్ని, మేనేజ్‌మెంట్ సమస్యలను పరిష్కరించేవారు. కార్మికుల సహకారంతో కార్మికులకు ఉపయోగపడని నియమాలను, నిబంధనలను సంస్కరించారు. విప్లవకర మేనేజ్‌మెంట్ సిద్ధాంతం, శైలి – కార్మికులు, ఇంజనీర్లు, మేనేజ్‌మెంట్ చేసేవారు సమైక్యంగా పని చేసేలా వారిని అభివృద్ధి చేశాయి. ఇది పెద్దెత్తున ఉత్పాదకత పెరుగుదలకు దారితీసింది.

## పరిశ్రమలు, వ్యవసాయంపై సాంస్కృతిక విప్లవ ప్రభావం :

చైనాలో ప్రజా రిపబ్లిక్ స్థాపించినప్పుడు, దాని పారిశ్రామిక పునాది అతి చిన్న దేశమైన బెల్జియం దేశం కంటే చిన్నదిగా ఉండేది. దాని తలసరి పారిశ్రామిక ఉత్పత్తి బెల్జియం దేశంతో పోల్చితే 1/5వ వంతు ఉండేది. మార్క్సిస్టు మహోపాధ్యాయులు మావో కాలంలో చైనా పారిశ్రామిక ఉత్పత్తి సంవత్సరానికి సగటున 13.5 శాతం పెరిగింది. ఈ కాలంలో జరిగిన పారిశ్రామికీకరణ వేగం మరి ఏ ఇతర దేశాల కంటే వేగంగా ఉండింది. అది ఈ కాలంలో జర్మనీ, జపాన్, సోవియట్ యూనియన్‌ల పారిశ్రామిక అభివృద్ధిని మించిపోయింది. సాంస్కృతిక విప్లవం జరుగుతున్న కాలంలో కార్మికులు పాదార్థిక ప్రోత్సాకాల్ని తిరస్కరించారు. వాళ్లు మావో రూపొందించిన విధానం – విప్లవానికి అంటిపెట్టుకొని ఉండండి, ఉత్పత్తిని అభివృద్ధి చేయండి, ఆర్థిక కృషి అంతటికీ రాజకీయ కృషే జీవనాడి అనే విధానాన్ని అనుసరించారు.

చైనాలో ప్రభుత్వం ఈ కాలంలో అమలు చేసిన మూడవ, నాల్గవ పంచవర్ష ప్రణాళికల కాలంలో, మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రంగంలో 3,16,642 బిలియన్ యువాన్లను పెట్టుబడిగా పెట్టింది. దాని పారిశ్రామిక ఆస్తులు 2,15,740 బిలియన్ల యువాన్లకు పెరిగాయి. 1979 నాటికి, అక్కడ 3,55,000 పరిశ్రమలు ఉండినాయి. 1965 సంఖ్యతో పోల్చితే ఇది 2.25 రెట్లు ఎక్కువ. ప్రభుత్వ యాజమాన్యంలో ఈ పరిశ్రమలు దేశమంతటా విస్తరించాయి. ఈ పరిశ్రమల్లో పెద్ద, మధ్య స్థాయి పరిశ్రమలు 4,500 వరకూ ఉంటాయి. చమురు రంగంలో 1967 నుంచి 1976 మధ్య చైనా చమురు ఉత్పత్తి సంవత్సరానికి సగటును 18.6 శాతం పెరిగింది. 1978 నాటికి, దాని సంవత్సరిక చమురు ఉత్పత్తి 100 మిలియన్ టన్నులకు చేరుకుంది. 1965 నాటితో పోల్చితే ఇది 5 రెట్లు ఎక్కువ. పది సంవత్సరాల సాంస్కృతిక విప్లవ కాలంలో, చైనాలో బొగ్గు, రసాయనాలు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో సంవత్సరానికి 9.2 శాతం పెరుగుదల రేటు కొనసాగింది.

1965 నుంచి 1970ల మధ్య వరకూ చైనా థర్డ్ లైన్ (ప్రభుత్వ రంగ) పరిశ్రమల్లో 205 బిలియన్ యువాన్లు మదుపు పెట్టింది. మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో స్టీల్ ప్లాంట్లు, యంత్ర పరికరాలు తయారీ పరిశ్రమలు, విమానాల తయారీ పరిశ్రమలు, అంతరిక్ష కార్యక్రమాలు, ఎలక్ట్రానిక్ ప్లాంట్లు నిర్మించబడ్డాయి. 1970ల చివరి నాటికి, థర్డ్ లైన్ (ప్రభుత్వ రంగ) రంగంలో పారిశ్రామిక ఆస్తులు మొత్తం చైనా పారిశ్రామిక ఆస్తుల్లో 1/3వ వంతుకు చేరుకున్నాయి. చైనా పారిశ్రామిక ఉత్పత్తి 3.92 రెట్లకు పెరిగింది. మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి ఒక జాతి లేదా దేశంగా చైనా జాతీయ భద్రతకు ఎంతో వ్యూహాత్మక ప్రాధాన్యతను కల్పిస్తూ చైనా పారిశ్రామిక అభివృద్ధి స్థూల చిత్రాన్ని మెరుగుపరిచింది. సోషలిజంలో అధిక లాభాల కోసం కాకుండా, సమాజపు అవసరాలు తీర్చడం కోసం ఉత్పత్తికై పథకాలు రూపొందించారు.

ప్రత్యేకించి, ప్రభుత్వం ఆధ్వర్యంలోని కార్మాగారాల్లో అభివృద్ధి చెందిన సోవియట్ లేదా పాశ్చాత్య దేశాల విదేశీ టెక్నాలజీపై ఆధారపడే తత్వం విమర్శలకు గురైంది. ఈశాన్య చైనాలోని తాచింగ్ చమురు క్షేత్రాలను చైనా సాధన సంపత్తి, ఇంజనీరింగ్ ద్వారానే తెరచి, అందులో పనిని నిర్వహించారు. చైనా పరిస్థితులకు సరిపోయే విధంగా నూతన ఉత్పత్తి పద్ధతుల్ని, ఉత్పత్తులను సృష్టించిన స్వావలంబన కృషికి జాతీయ నమూనాగా వీటిని ఎత్తిపట్టారు. ఈ విధానం చైనా రాజకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి తోడ్పడింది.

మావో స్వావలంబనపై నొక్కి వక్కాణిస్తూనే, అవసరమైతే టెక్నాలజీని దిగుమతి చేసుకోవాలని చెప్పేవారు. 1972లో మావో, చౌ ఎన్-లై ఇరువురూ కలిసి మొత్తం 5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సహా 26 విదేశీ పారిశ్రామిక ప్లాంట్లను దిగుమతి చేసుకునే పథకాన్ని ఆమోదించారు. చమురు, రసాయనాల ప్లాంట్లకు చెందిన ఒక పెద్ద గ్రూపును నిర్మించడంతో చైనాలో ఎరువులు, రసాయనాల ఉత్పత్తులు, కృత్రిమ వస్త్రాల ఉత్పత్తి పెరిగింది. ఈ కాలంలో 13 పెద్ద ఎరువుల కర్మాగారాలు నిర్మించబడ్డాయి. వీటి ఉత్పత్తి చైనా రసాయన ఎరువుల ఉత్పత్తిలో 1/5వ వంతుతో సమానం. 1970లలో, చైనా అనేక చిన్న స్థాయి రసాయన ఎరువుల కర్మాగారాల్ని నిర్మించింది. 1978 నాటికి చైనాలో 1,534 చిన్న రసాయన ఎరువుల కర్మాగారాలు ఉండేవి. చైనాలో ఈ చిన్న ఎరువుల కర్మాగారాలు దేశ వ్యవసాయాభివృద్ధిలో ముఖ్యమైన పాత్రను పోషించాయి.

1960, 1970లలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు భారతదేశం, మెక్సికో, బ్రెజిల్, ఫిలిప్పైన్స్, ఇంకా ఇటువంటి వెనుకబడిన దేశాలకు 'హరిత విప్లవ' సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరింపజేశాయి. ఈ వెనుకబడిన దేశాల్లో 'హరిత విప్లవ' సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ ఆ దేశాల్లోని వ్యవసాయంపై వినాశకరమైన ప్రభావాన్ని చూపింది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, భారీ యంత్రాలు వ్యవసాయోత్పత్తిని పెంచాయి. కానీ ఉత్పత్తి పెరుగుదలతో పంటల రేట్లు (ధరలు) పడిపోయాయి. అంతేకాక, కాలం గడిచే కొద్దీ ఉత్పాదకాల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. అనేక మంది చిన్న రైతులు మార్కెట్‌లో వచ్చే ఒడిదుడుకులకు తట్టుకోలేకపోయారు. పెద్ద సంఖ్యలో చిన్న రైతులు దివాలాతీశారు. తమ భూముల్ని కోల్పోయారు. వారు బ్రతుకుదెరువు కోసం పట్టణాలకు వలస పోవాల్సి వచ్చింది. వెనుకబడిన దేశాల్లో పెద్దెత్తున మురికివాడల ఆవిర్భావం, తలదాచుకోవడానికి ఇల్లు లేని ప్రజల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం పాశ్చాత్య దేశాల 'హరిత విప్లవ' సాంకేతికత విస్తరణ వల్ల ఏర్పడిన పరిణామమే. ఇది వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాలు, రైతాంగం సంక్షోభాన్ని మూడు రెట్లు పెంచింది. నేడు ఈ సంక్షోభపు ప్రభావాన్ని అంచనా వేయడం కష్టం.

ఈ వ్యవసాయ సంక్షోభాన్ని ఒక్క చైనా దేశం మాత్రమే విజయవంతంగా నివారించగలిగింది. అది అవలంబించిన సమిష్టి వ్యవసాయ పద్ధతులే దీనికి కారణం. సంఘటిత చైనా రైతులు

తమదైన శైలిలో స్వదేశీ వ్యవసాయ (హరిత) విప్లవాన్ని అభివృద్ధి చేశారు. ఎందుకంటే, చైనా రైతులకు భూమిపై సమిష్టి యాజమాన్యం ఉంది. వ్యవసాయ (హరిత) విప్లవ సాంకేతిక ఫలాలను వాళ్లు సమానంగా పంచుకున్నారు. వాళ్లు వినాశకరమైన చెడు ప్రభావాల్ని నివారిస్తూ లబ్ది పొందారు. స్వదేశీ (స్వావలంబ) వ్యవసాయ విప్లవ సాంకేతికత వ్యవసాయ శ్రమ తీవ్రతను తగ్గించింది. అంతేకాక అనేక గ్రామీణ వ్యవసాయ పరిశ్రమల ఆవిర్భావానికి తోడ్పడింది. ఈ గ్రామీణ వ్యవసాయ పరిశ్రమల ఆవిర్భావం కారణంగా రైతులు పారిశ్రామిక పనిలో పాల్గొనేందుకై పొలాల్ని వదలిపెట్టాల్సి వచ్చేది కానీ గ్రామాలను కాదు. సాంస్కృతిక విప్లవ కాలంలో, ఈ వ్యవసాయ విప్లవ సాంకేతికత అభివృద్ధితో, స్థానికంగా తయారైన వ్యవసాయ యంత్రాల వినియోగంతో, గ్రామీణ పరిశ్రమల ఆవిర్భావంతో, చైనా రైతుల జీవన ప్రమాణాలు చెప్పుకోదగిన స్థాయిలో మెరుగుపడ్డాయి.

వ్యవసాయంలో రెండు వైరుధ్యాత్మకమైన నినాదాలు – ఒకటి మావో ముందుకు తెచ్చిన "తాచై నుండి నేర్చుకోండి", మరొకటి లీ షావ్–చీ ముందుకు తెచ్చిన "తావో యువాన్ నుంచి నేర్చుకోండి" వ్యవసాయంలో రెండు పంథాలకు సంకేతంగా నిలిచాయి. తాచై షాన్సీ రాష్ట్రంలో రాళ్లు, బండలతో కూడిన, భూ సారం క్షీణించిన ప్రాంతం. తాచై కమ్యూన్‌కు చెందిన ఒక బ్రిగేడ్ స్వంత కాళ్లపై నిలబడాలనే స్ఫూర్తితో, ప్రభుత్వ సహాయం లేకుండా, రాళ్లను తొలగించడం, గోడల వంటి గట్లను నిర్మించడం, మట్టిని తవ్వి భూమిని సమతలం చేయడం ద్వారా కొండల్ని, వాగులు వంకల్ని సారవంతమైన భూములుగా మార్చివేసింది. సుదీర్ఘకాలం పాటు రాజకీయ విద్యను గరపడం, సామూహిక కృషి నిర్వహించడం ద్వారా, వ్యక్తివాదానికి, వ్యక్తిగత ఆస్తి మనస్తత్వానికి వ్యతిరేకంగా స్థిరంగా పోరాటాన్ని కొనసాగించడం ద్వారానే ఈ మార్పు సాధ్యమైంది. వర్క్ పాయింట్ వ్యవస్థను అమలు చేసే స్థానంలో ఒక సంవత్సరంలో ప్రతి బ్రిగేడ్ మెంబర్ పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించే నూతన ప్రాతిపదికను అమలు జరపడంలో తాచై ముందు నిలిచింది. ఇది సామూహిక స్పృహలో, పనిచేయగలిగే సామర్థ్యంలో, ఉమ్మడి ప్రాజెక్టులలో ఇతరులకు నాయకత్వం వహించడంలో ప్రతిబింబించింది. నేరుగా పాదార్థిక ప్రోత్సాహం కల్పించడంతో, బ్రిగేడ్ సభ్యులు ఏ మేరకు ఉత్పాదక సామర్థ్యాన్ని వెలికితీశారు అనే దానితో తెగతెంపులు చేసుకోవడానికి ఇది ప్రాతినిధ్యం వహించింది.

తావో యువాన్ తూర్పు హెూపీ మైదానంలో ఉన్న కమ్యూన్‌లో నిర్మాణమైన ఒక బ్రిగేడ్. అక్కడ ప్రకృతి సిద్ధమైన పరిస్థితులు పెద్దెత్తున ఉత్పత్తికి, అధిక ఫలసాయానికి అనుకూలంగా ఉండినాయి. లీ షావ్–చీ అనుచరులు ఈ బ్రిగేడ్‌ను ఎంపిక చేసుకొని, పెట్టుబడిని కల్పించడం ద్వారా చెప్పుకోదగిన రీతిలో ఫలితాలను రాబట్టగలమనే భావనతో ప్రత్యేక సహాయాన్ని అందించారు. అయితే సుదీర్ఘకాలంలో ఈ బ్రిగేడ్ చేసింది తక్కువ. మొదట లభించిన అధిక ఫలసాయాన్ని అది నిలబెట్టుకోలేకపోయింది. దీనితో దాని మానసిక స్థైర్యం (మోరల్), రాజకీయ

స్పృహ పడిపోయాయి. కష్టాలు ఎదురు కావడంతో బ్రిగేడ్ సభ్యులు సర్వశక్తులు ధారపోసే విధంగా సమీకృతులు కావడం కాక ప్రభుత్వ సహాయాన్ని డిమాండ్ చేశారు. మనుషులూ, వారి చైతన్యం కంటే యంత్రాలకు, సాంకేతికత (టెక్నిక్‌లకూ) ప్రాధాన్యత ఇస్తూ తావో యువాన్ పార్టీ క్యాడర్లు రైతాంగానికి శల్య సారధ్యం వహించారు. పాదార్థిక ప్రోత్సాహకాలపై ఆధారపడడంతో అది రైతాంగ అనైక్యతకూ, వారి మధ్య కలహాలకూ దారితీసింది.

'తాచై మార్గానికీ' 'తావో యువాన్ మార్గానికీ' మధ్య వ్యత్యాసం సారాంశంలో "రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచడానికీ" "సాంకేతికత(టెక్నిక్)ను ఆధిపత్యంలో ఉంచడానికీ" మధ్య ఉన్న వ్యత్యాసమే. ఇది మావో మరియు లీ షావ్-చీ మార్గాల్లోని ప్రధాన వ్యత్యాసాన్ని ప్రతిబింబిస్తుంది. మావో యాంత్రీకరణ కంటే సహకారం ముఖ్యమైందని సూచించగా, లీ షావ్-చీ దీనికి పూర్తి భిన్నంగా పేర్కొన్నాడు. (మావో సూచించినట్లు) "రాజకీయాలను ఆధిపత్యంలో ఉంచడం" అంటే, సోషలిజాన్ని నిర్మించడం కోసం ఎవరైనా గానీ పేద, మధ్యతరగతి రైతాంగంపై తప్పనిసరిగా ఆధారపడతారు, ఉత్పత్తి సంబంధాలలో, చైతన్యంలో విప్లవాన్ని కొనసాగించడం ద్వారా వాటిపై ఆధారపడి వ్యవసాయంలో ఉత్పత్తి శక్తులను అభివృద్ధి అవుతాయి. లీ షావ్-చీ చెప్పిన "సాంకేతికత(టెక్నిక్)ను ఆధిపత్యంలో ఉంచడం" అంటే కార్మికవర్గ రాజకీయాలపై బూర్జువా రాజకీయాల్ని ఆధిపత్యంలో ఉంచడం. సాంకేతికతపై అతని వక్కాణింపు, వర్గ పోరాటాన్ని విస్మరించడం - ఉత్పత్తి శక్తులను పరివర్తన చెందించడం గురించి తప్ప ఉత్పత్తి సంబంధాలను అభివృద్ధి చేయడం, చైతన్యాన్ని పెంపొందించడంపై శ్రద్ధ వహించదు. అది బూర్జువా ఉత్పత్తి సంబంధాలనే బలోపేతం చేస్తుంది. సాంకేతికతను ఆధిపత్యంలో ఉంచడం అంటే సోషలిజాన్ని నిర్మించడంలో అది ఏదో ఒక ప్రత్యామ్నాయ మార్గం కాదు, దానికి భిన్నంగా పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించే (పెట్టుబడిదారీ పునరుద్ధరణకు) మార్గం. అది ప్రజల అధికార అంగాలుగా, ఉత్పత్తి యూనిట్లుగా కూడా ఉన్న ప్రజా కమ్యూన్లను ధ్వంసం చేసే ప్రయత్నం, భూమి తదితర ఉత్పత్తి సాధనాల సహకార ప్రాతిపదికను అంతం చేసే ప్రయత్నం, ఉత్పత్తిలోనూ, మార్కెట్‌లోనూ రైతులను ఎవరి మానాన వారిని వదిలివేయడం, సోషలిస్టు నిర్మాణానికి అత్యంత ఆవశ్యకమైన కార్మిక-కర్షక ఐక్యతను బలహీనపరచడం, వ్యవసాయానికీ, పరిశ్రమకూ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వేరుచేయడం.

సాంస్కృతిక విప్లవం గ్రామీణ ప్రాంతంలోని అన్ని విప్లవకర శక్తులనూ వాటిలోని సంకుచిత స్వార్థ ప్రయోజనాన్ని అధ్యయనం ద్వారా, ఆత్మవిమర్శ, పరస్పర విమర్శ ద్వారా అధిగమించి ఐక్యం చేసింది. పరస్పర సమైక్య మార్గంలో ఆ శక్తుల యాజమాన్యాన్ని, ఉమ్మడి ఉత్పత్తిని, ఉమ్మడి సామాజిక సేవలను బలోపేతం చేసింది. బూర్జువా వర్గ శక్తుల కుట్రలను ఓడించింది.

### మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం - మహిళల విముక్తి :

చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రాకముందు, చైనా మహిళలకు చైనా సమాజంలో

చాలా పరిమితమైన రాజకీయాధికారం ఉండేది. మహిళలు పెళ్లికి తమకు ఇష్టమైనవారిని ఎంచుకోలేకపోయేవారు. వారి తల్లిదండ్రులే (వారు చనిపోయిన పక్షంలో అన్నదమ్ములే) నిర్ణయించేవారు. పెళ్లయిన తర్వాత వారి బతుకులు భర్తల (భర్తలు చనిపోతే వాళ్ల కొడుకుల) అధీనంలో ఉండేవి. మహిళలకు ఆస్తి హక్కు లేదు. తండ్రులకు లేదా భర్తలకు మాత్రమే ఆస్తి హక్కు ఉండేది. తమ స్థాయిని బట్టి పురుషులు మరో మహిళను ఉంపుడుగత్తెగా తెచ్చుకునేవారు. పాత చైనాలో, ధనవంతులైన వృద్ధులు తరచు పడుచు పిల్లలను ఉంపుడుగత్తెలుగా తెచ్చుకునేవారు. చైనా రచయిత బాజిన్ తన నవల 'కుటుంబం'లో ఈ పరిస్థితిని విశదీకరించాడు. అందులో 80 యేళ్ల వృద్ధుడు తన స్నేహితుడి వద్ద నుండి 16 యేళ్ల పడుచు నౌకరిని కొనుక్కొని తెచ్చుకుంటాడు.

యువతుల క్రియాశీల ఉద్యమానికి అధికార పాలసీ ద్వారా, ప్రత్యేకించి, మావో దూరదృష్టితో జారీ చేసిన రెండు ప్రకటనల ద్వారా మద్దతు లభించింది. "మహిళలు ఆకాశంలో సగం", "పరిస్థితులు మారాయి, నేడు పురుషులు, మహిళలు సమానం", పురుష కామ్రేడ్స్ ఏది సాధించగలిగితే దాన్ని మహిళా కామ్రేడ్స్ కూడా సాధించగలరని అవి ఉద్బోధించాయి.

కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వం ఆమోదించిన మొదటి చట్టం పెళ్లి గురించిన చట్టమే. 1950 ఏప్రిల్ 13న ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. అందులో మహిళలకు, పిల్లలకు చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం రక్షణ కల్పించింది. పెళ్లిలో భార్యలు, భర్తలు సమానమేనని అది చెప్పింది. ఒక పెళ్లిలో ఒక భర్త, ఒక భార్య మాత్రమే ఉంటారు. ఉంపుడుగత్తెల్ని తెచ్చుకునేందుకు పురుషుల్ని అనుమతించరు. తమ పెళ్లి విషయంలో తమ సహచరులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ యువతులకు రాజ్యం కల్పించింది. విడాకులు తీసుకునే పక్షంలో, కోర్టు ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు భద్రత కల్పించే విధంగా చూసేది.

చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఆమోదించడమే కాక, ఈ చట్టం గురించి ప్రజలను చైతన్యవంతం చేసేందుకై మునుపెన్నడూ లేనివిధంగా మీడియా, కళల (నాటకాలు, సినిమాలు) ద్వారా సామాజిక ఉద్యమాన్ని నిర్వహించింది. ఈ నూతన పెళ్లి చట్టంతో చైనా సమాజంలో చైనా మహిళల సామాజిక, రాజకీయ హోదా చెప్పుకోదగిన రీతిలో పెరిగింది. సోషలిస్టు చైనాలో మహిళలకు స్వాతంత్ర్యం అంటే – నిర్భయంగా ఇంటి నుంచి బయటకు వెళ్లి పని చేసే స్వాతంత్ర్యం, రాజకీయాల్లో, వర్గ పోరాటాల్లో పాల్గొనే స్వాతంత్ర్యం, లైంగిక వస్తువులుగా పరిగణించబడకుండా ఉండే స్వాతంత్ర్యం, లైంగిక స్వాతంత్ర్యం కాదు అనే భావన ఉండింది.

చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో సమాన పనికి సమాన వేతనాన్ని కూడా అమలు చేసింది. ప్రభుత్వ రంగంలో పని చేసే మహిళలు సమాన వేతనాన్ని పొందగలిగేవారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని పరిశ్రమలు బాలింతలకు మూడు నెలల (మెటర్నిటీ) సెలవును మహిళలకు

కల్పించేవి. ఈ సెలవును ఆరు నెలల పాటు పొడిగించే అవకాశం ఉండేది. పని స్థలాల్లో తల్లులకు పిల్లల సంరక్షణా సదుపాయాలను కల్పించేవారు. పిల్లలకు పాలిచ్చేందుకు తల్లులకు సమయాన్ని కేటాయించేవాళ్లు.

మహిళల హక్కుల పరిరక్షణకై చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం చైనా వ్యాప్తంగా మహిళా సమాఖ్య కమిటీలను ఏర్పాటు చేసింది. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రతి చైనా గ్రామం, ఫ్యాక్టరీ, స్కూలు, ప్రభుత్వ కార్యాలయంలో మహిళా సమాఖ్య కమిటీలు ఉండేవి. భర్త భార్యను సరిగ్గా చూడకపోతే, గ్రామంలోని మహిళా సమాఖ్య మహిళల్ని సంఘటితం చేసి భర్తతో పోరాడేది, భార్యకు క్షమాపణలు చెప్పించేది. భర్త తిరిగి అదే విధంగా వ్యవహరిస్తే మహిళా సమాఖ్య కమిటీ మళ్లీ రంగంలోకి దిగేది. పట్టణ ప్రాంతాల్లో, మహిళలు మహిళా సమాఖ్య కమిటీకి ఫిర్యాదు చేసేవారు, వారి తరుపున ఆ కమిటీ వారిపై చర్య తీసుకునేది. చైనా మహిళా సమాఖ్య కమిటీలతో పాటు, ప్రభుత్వం అన్ని స్థాయిల ప్రభుత్వ రంగాలకు చెందిన కమిటీలలో మహిళా ప్రతినిధులను కలిగి ఉండేది. ప్రభుత్వ చట్టాలు, నిబంధనల ప్రకారం మహిళల జీవనంలో వారి ప్రత్యేక అవసరాలను పరిగణనలోకి తీసుకోవలసి వచ్చేది. మహిళల నెలసరి సమయంలో తమ పనిలో మార్పు చేసుకునే హక్కు వారికి ఉండేది. కమ్యూన్ జీవితంలో సామాజీకరణకు ప్రోత్సాహం లభించేది. తద్వారా మహిళలకు ఇంటి చాకిరి నుంచి విముక్తి లభించేది. వృద్ధులకు, పిల్లలకు సామాజిక భద్రత పెరిగేది.

చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం మహిళల హక్కుల సమస్యను గంభీరంగా తీసుకుంది. ఇందులో భాగంగా అది పిల్లలు, కుటుంబం, మొత్తం జాతుల, దేశ సంక్షేమం గురించి శ్రద్ధ పెట్టింది. మహిళల హక్కులను పరిరక్షించ లేకపోతే దాని ప్రభావం కేవలం మహిళలకే పరిమితమవ్వదు. పిల్లలు ఇబ్బందుల పాలవుతారు, కుటుంబాలు ఇబ్బందుల పాలవుతాయి. చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే మాదక ద్రవ్యాల వ్యసనం, వ్యభిచారం, మహిళలు-పిల్లల అక్రమ రవాణా, పథకం ప్రకారం సాగించే నేరాలు-దోపిడీలు వంటి సామాజిక అవరోధాలను అత్యంత సమర్థవంతంగా నిర్మూలించగలిగింది. చైనా మహిళలకు సాధికారత కల్పించడం వల్ల వారు చైనా సమాజ ఉత్పాదక శక్తులలో భాగమయ్యారు. అది చైనా సామాజిక, రాజకీయ జీవితంలో వారికి సమాన భాగస్వామ్యం కల్పించేందుకు తోడ్పడింది. చైనాలో 1952లో 35 సంవత్సరాలుగా ఉన్న మనిషి సగటు జీవిత కాలం 30 సంవత్సరాల కంటే తక్కువ కాలంలోనే అంటే 1976 నాటికి దాదాపు రెండు రెట్లు - 69 సంవత్సరాలకు పెరిగింది. ఇది భారతదేశంలో 1976 నాటికి 50 సంవత్సరాలు మాత్రమే. అంటే దాని కంటే చైనాలో మనిషి జీవిత కాలం 19 సంవత్సరాలు ఎక్కువ.

సాంస్కృతిక విప్లవ కాలంలో మహిళలు చాలా మంది ఉన్నత స్థానాల్లోకి ప్రవేశించారు. సిపిసిలో ఒక పొలిట్ బ్యూరో సభ్యురాలుగా, ప్రభుత్వంలో ఒక మంత్రి పదవి నుంచి కింది

స్థాయిలో సైన్యం, నేవీ, వాయుసేన, పాలనా యంత్రాంగం, పరిశ్రమలు, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, ఆరోగ్యం, ఇతర సార్వజనిక సేవలు అందించేంత వరకూ ఎదిగారు. పురుషులు చేసే అన్ని రకాల పనులనూ మహిళలు నిర్వహించారు. మహిళల్లో చాలా మంది ఆర్థిక స్వావలంబనను సాధించారు. సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం అమలైంది. ఉత్పత్తిలో భాగస్వామ్యం చేయడం, కుటుంబం కేంద్రంగా ఉండే భావజాలాన్ని పెకలించి వేయడం ద్వారా ఇంటిలో భార్యలుగా ఉండే మహిళల భూమికలో మార్పు తీసుకొని రావడంతో కుటుంబ సంబంధాలలో పరివర్తన ఆరంభమైంది.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం వల్ల ప్రపంచవ్యాప్తంగా విప్లవకారులకు పితృస్వామ్య ఆచరణ గురించి నూతన అవగాహన ఏర్పడింది. ముఖ్యంగా మహిళలు, తాము ఎదుర్కొనే అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడడంలో, రాజకీయ కార్యకర్తలుగా, విప్లవ సంస్థల నాయకురాళ్లుగా నాయకత్వ బాధ్యతలను నిర్వహించడంలో అభివృద్ధి వచ్చింది. సైద్ధాంతికంగానూ, ఆచరణలోనూ జరిగిన ఈ అభివృద్ధి భవిష్యత్తులో సోషలిస్టు సమాజాల్లో మహిళల అణచివేతకు సంబంధించిన అన్ని రకాల సంకెళ్లను తెంచేందుకు తోడ్పడతాయి.

## మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం – వైద్య రంగం :

వైద్య రంగంలో వికేంద్రీకరణ వైద్య, ఆరోగ్య విధానాన్ని సృజనాత్మకంగా ప్రవేశపెట్టారు. ఈ రంగం ఏదో ప్రత్యేకమైంది అనే తప్పుడు అవగాహనను తొలగించి, 'బేర్ ఫుట్ డాక్టర్' (పాదరక్షలు లేని వైద్యులు) విధానాన్ని అభివృద్ధి చేశారు. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన 'పాదరక్షలు లేని వైద్యులు' వేలు, లక్షల సంఖ్యలో తయారయ్యారు. 1976 నాటికి, గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి సుమారు 15 లక్షల మంది డాక్టర్లు ఉండేవారు. సార్వజనిక పారిశుధ్య కార్యక్రమాలు, పోషకాహారం ద్వారా వ్యాధులు గణనీయంగా తగ్గిపోయాయి. 7 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వరకూ వైద్య శాస్త్రం చదివే పాశ్చాత్య భావవాద వైద్య విధానానికి భిన్నంగా ప్రజల నుంచి ప్రాథమిక ఆరోగ్య రక్షణకు అవసరమైన వైద్యులను తక్కువ కాలపు శిక్షణతో తయారు చేసే పద్ధతి ఈ సాంస్కృతిక విప్లవ కాలంలో రూపొందింది. అలాగే ప్రపంచంలోని వివిధ దేశాలలోని వేల సంవత్సరాల ప్రజల అనుభవం నుంచి ముఖ్యంగా చైనా ప్రజల నిర్దిష్ట అనుభవం నుంచి సృజనాత్మకంగా రూపొందిన వైద్య, ఆరోగ్య చికిత్సలను అధ్యయనం చేసి పరిశోధించి వెలికి తీశారు. ఈ పద్ధతిని ఈ ఒక్క వైద్య విషయంలోనే కాదు, ఒక విధంగా జీవితంలోని అన్ని రంగాలకు అన్వయించారు.

సుదీర్ఘకాలంలో విస్తృత ప్రజానీకానికి శ్రమ, అనుభవం, అనేక ప్రయోగాలలో వచ్చిన జ్ఞానం వీటి సారంగా పొందే సృజనాత్మక సంశ్లేషణ నుంచి అభివృద్ధి చెందే జ్ఞానం. అదే ప్రజల సాంకేతిక విజ్ఞానం. చెట్లు, ఆకులు, వేర్లు, వన మూలికలు ఇత్యాది నుంచి ఆదివాసులు, రైతాంగం రూపొందించిన చికిత్సా విధానాన్ని వైద్య రంగంలో సృజనాత్మకంగా అమలు

చేశారు. చైనా అత్యంత ప్రాచీనమైన రైతాంగ దేశం కనుక వాళ్లకీ వివేకం అపారంగా ఉన్నది. దానిని వెలికి తీసి మొరటుగా, ముడి సరుకుగా ఉన్న దానిని శాస్త్రీయంగా అన్వయించేందుకు చేసిన పోరాట ఫలితంగా ఆక్యుపంచర్ అభివృద్ధి అయ్యింది. చైనాలో విస్తృత ప్రచారమైన ఆక్యుపంచర్ అటువంటి వైద్య విధానమే. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రజలకు సేవ చేసేందుకు డాక్టర్లు నగరాల్ని వదిలి గ్రామాలకు తరలి వెళ్లారు.

### మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం-కళలు, సాహిత్యం-పిఎల్ఏ :

సాహిత్య, కళా రంగాలలో కూడా కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే ఎన్నో కొత్త సృజనాత్మక అంశాలను ప్రవేశపెట్టారు. కన్ఫ్యూషియన్, బూర్జువా భావజాలం, సంస్కృతి, ఆచారాలు-అలవాట్లను విమర్శించడానికి ఇవ్వబడిన సాంస్కృతిక విప్లవ పిలుపు ద్వారా మల్టీమీడియాలో సంగీతం, నాటకాలు, నృత్య నాటికలు, చిత్ర లేఖనం, చిన్న కథలు, కవిత్వం పెద్దెత్తున ముందుకు వచ్చాయి. సోషలిజాన్ని నిర్మించేందుకు సేవ చేశాయి. ఈ నూతన సాంస్కృతిక కృషి కార్మికులు, రైతులు పొందిన అనేక గొప్ప అనుభవాలపై, సమిష్టి ప్రయోజనాల కోసం చేపట్టే గొప్ప కృషిపై ఆధారపడింది.

సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రజలకు విస్తృతంగా గోడ పత్రికలు వేసి ప్రచారం చేసే అవకాశాలు కల్పించారు. వేల, లక్షల సంఖ్యలో ప్రజలు కదిలి మహత్తర చర్చను నిర్వహించారు. అభివృద్ధి నిరోధక భావజాలానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. అవినీతి అధికారులను శిక్షించారు. పత్రికా స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడారు. స్వేచ్ఛగా మాట్లాడడం, స్వేచ్ఛగా భావాలను ప్రకటించడం, స్వేచ్ఛగా మహత్తర చర్చలో పాల్గొనడం, స్వేచ్ఛగా గోడ పత్రికలు ప్రచురించడం (పెద్ద అక్షరాల పోస్టర్లు వేయడం) అనే నాలుగు స్వేచ్ఛలు ప్రజలు అనుభవించారు.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా ప్రజా విముక్తి సైన్యం విప్లవ ప్రజాస్వామిక సైన్యంగా ప్రజలకు అండగా నిలబడ్డది. విప్లవ పంథాను బలపరచే విషయంలో ప్రజలకు తలొగ్గవలసిందేనని మావో ఇచ్చిన పిలుపును ప్రజా విముక్తి సైన్యం శిరసావహించింది. ప్రజా విముక్తి సైన్యం ఉత్పత్తిలో పాల్గొని, వివిధ కట్టడాలను నిర్మించడంలో, తుఫాన్లు, వరదలు నివారించడంలో, కాలువలు తవ్వడంలో, భూకంపాల సందర్భాలలో, ప్రకృతి వైపరీత్యాలలో రైతాంగానికీ, కార్మికులకూ సహకరించింది, సేవ చేసింది. ప్రజా విముక్తి సైన్యంలో ఎక్కువ, తక్కువ పదవుల అంతరాలను రద్దు చేశారు. రైతాంగానికీ, కార్మికులకూ అందించినట్లే సైన్యానికీ ఎంఎల్ఎం సైద్ధాంతిక అవగాహనను కలిగించారు. దేశ రక్షణలో ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమయ్యే రీతిలో సైన్యంలో అప్రమత్తతను పెంపొందించారు. దానికి అటువంటి చైతన్యాన్ని కల్పించారు.

మార్క్సిస్టు మహోపాధ్యాయులు మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సోషలిజం ద్వారా చైనాలో మూడు దశాబ్దాల లోపే ప్రపంచంలోనే గణనీయమైన అంతరాలు లేని సమాజాన్ని నిర్మించింది. మావో, చౌ ఎన్-లై లాంటి అనేక మంది ఉన్నత స్థాయి చైనా నాయకులు చైనా, ప్రపంచ ప్రజల కోసం కష్టించి పనిచేశారు. కానీ, ఒక ప్రొఫెసర్‌తో సమానమైన జీతమే వారికి లభించేది. వారు తమ జీవితంలో ఎన్నడూ వ్యక్తిగత ఆస్తిని సంపాదించుకోలేదు. అటువంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని చైనా ప్రజలు కష్టించి పనిచేసి తమ మాతృదేశాన్ని ఆధునిక పారిశ్రామిక దేశంగా, ప్రతి ఒక్కరూ ఉచిత వైద్యం, ఉచిత విద్య పొందగలిగిన అత్యంత పురోగామి రాజకీయ, సామాజిక వ్యవస్థగా పరివర్తన చెందించారు. మరీ ముఖ్యంగా నిజమైన విప్లవ కార్మికులు, రైతులు, సైనికులు ప్రభుత్వంలో భాగస్వాములై దాన్ని నడిపించడం. ఈ కార్మిక, కర్షక, సైనిక ప్రభుత్వ నాయకులు తాము ప్రభుత్వంలో ఉన్నత పదవులు చేపట్టిన తర్వాత కూడా రైతులతో, కార్మికులతో కలిసి పనిచేశారు. ఈ ప్రభుత్వ అధికార్లను నిర్దేశించే సూత్రం - ప్రజలకు సేవ చేయడం. ఇది నిజమైన ప్రజాస్వామ్యం, ఇది ప్రజలకు చెందిన, ప్రజల కోసం ఏర్పడిన, ప్రజల చేత నిర్మించబడిన ప్రభుత్వం. ఈ రైతు-కార్మిక ప్రభుత్వ అధికార్లు కేవలం ప్రభుత్వంలో రైతుల, కార్మికుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడం మాత్రమే కాదు, వారే స్వయంగా రైతులు, కార్మికులు. వారు రైతులుగా, కార్మికులుగా జీవించారు.

మొత్తం మీద, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం అసమానమైనది, ప్రపంచాన్ని కుదిపివేసిన ఒక ప్రయోగం. అది సోషలిస్టు మార్గానికి అనుగుణంగా పురోగమించేందుకై ప్రపంచ కార్మికవర్గం కోసం తగిన రూపాన్ని, పద్ధతిని అందించింది. సాంస్కృతిక విప్లవం ఒక ప్రభావశీలమైన శక్తి అయ్యింది. ఎందుకంటే, కోట్ల సంఖ్యలో ప్రజలు చైనా కమ్యూనిస్టు పార్టీలో కార్మికవర్గ నాయకత్వంలో సమీకృతులై కార్యాచరణలోకి దూకారు. చైనా ప్రజల ఎంఎల్ఎం విప్లవ అవగాహనకు తగినట్లుగానే అది తీవ్రమైన ప్రభావాన్ని వేసింది. సాంస్కృతిక విప్లవం తాత్కాలికంగానే అయినప్పటికీ అత్యంత తీవ్రమైన వర్గ పోరాటాన్ని కొనసాగించడం ద్వారా బూర్జువావర్గ నియంతృత్వ పునరుద్ధరణను నివారించింది. విప్లవ ప్రజలు రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడే క్రమంలో పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా పోరాడడమే కాక, రివిజనిజాన్ని ఎదుర్కొనేందుకై "స్వార్థానికి వ్యతిరేకంగా" కూడా "పోరాడారు." ప్రజల్లోని సోషలిస్టు స్పృహ మానవ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా గొప్ప ముందంజ వేసింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం - ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన అంశం. ప్రపంచాన్ని చైతన్యవంతంగా అర్థం చేసుకొని మార్చడానికి తద్వారా తమని తాము మార్చుకోవడానికి ప్రజల్ని సంసిద్ధుల్ని చేసే సైద్ధాంతిక ఆయుధమే ఈ మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం.

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ అనుభవాన్ని సంశ్లేషించుకుంటే ఏదో యథాలాప మార్గంలో, కష్టాలకు-కడగండ్లకు భయపడుతూ ఉంటే లేదా త్యాగాలు లేని మార్గంలో మనం

భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయలేము. వర్గ పోరాటాన్ని కొనసాగించడం, ధైర్యంగా మృత్యువును ధిక్కరించే స్ఫూర్తితో పని చేయడం, విప్లవ స్ఫూర్తి, విప్లవ ఉత్సుకతలపై ఆధారపడడం ద్వారానే దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని విజయవంతం చేయగలుగుతాం. కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడానికి, సోషలిజాన్ని నిర్మించడానికి కూడా గొప్ప క్రియాశీలతను, విప్లవ స్ఫూర్తి, విప్లవ ఉత్సుకతలను ప్రదర్శించాల్సి ఉంటుంది. మనం విశాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి, ప్రజలపై ఆధారపడినంత వరకూ, అదే విప్లవ ఉత్సుకతను నిలబెట్టుకుంటూ ముందుకు పురోగమించినంత వరకూ, సంవత్సరాల తరబడి విప్లవ యుద్ధంలో అదే ధైర్యంతో మృత్యువును ధిక్కరించే స్ఫూర్తితో పని చేసినంత వరకూ మనం తప్పకుండా మన లక్ష్యం వైపుగా వేగంగా పురోగమించగలుగుతాం.

## గుణపాఠాలు

ప్రపంచవ్యాప్తంగా సోషలిజం, కమ్యూనిజం విజయం సాధించే వరకూ కార్మికవర్గ పార్టీలకు 'అధికార సమస్యే' కీలక సమస్యగా ఉంటుంది. భవిష్యత్తులో కొనసాగే అన్ని విప్లవాలకూ చైనాలో సోషలిస్టు నిర్మాణానికి సంబంధించిన అనుభవం, దానికి దిశానిర్దేశం చేసిన మావో సిద్ధాంతాలు అమూల్యమైన జ్ఞాన సంపదగా నిలుస్తాయి. సోషలిస్టు నిర్మాణ దశలో చైనా విప్లవ అనుభవాన్ని నిరాకరించడం అంటే అనివార్యంగా రివిజనిస్టు ఆధిపత్యానికీ, యాదృచ్ఛికంగా బూర్జువా ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకూ దారితీస్తుంది.

సోషలిస్టు సమాజంలో విప్లవాన్ని కొనసాగించడం, ఆధునిక రివిజనిజంతో పోరాడడం, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించడానికి సంబంధించిన సిద్ధాంతాన్ని మావో అభివృద్ధి చేశారు. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో ఈ సిద్ధాంతం అన్వయించబడింది. తప్పులు పోగుబడి తిరిగి మితవాదం ఆధిపత్యం సంపాదించేంత వరకూ అది అనేక సంవత్సరాల పాటు కొనసాగింది. అనుకూల కోణాలను ఎత్తిపడుతూ, ప్రతికూల కోణాలను సరిదిద్దుకుంటే, సాంస్కృతిక విప్లవానికి సంబంధించి మావో అభివృద్ధి చేసిన ఈ సిద్ధాంతం సోషలిస్టు సమాజంలో విప్లవాన్ని కొనసాగించడానికి మౌలిక సూత్రాలు, పద్ధతులపై ఆధారపడిన గొప్ప జ్ఞాన సంపద కాగలదు.

అయితే భారతదేశంలో మనం ఇప్పటికీ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగిస్తున్నాం. అయినప్పటికీ లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ అంశాలతో కూడిన సాంస్కృతిక విప్లవాన్ని మనం ప్రోత్సహిస్తూ వస్తున్నాం. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత దిశానిర్దేశం కలిగిన కార్మికవర్గ విప్లవ క్యాడర్లు ఈ విప్లవకర సామూహిక మహత్తర క్రమానికి కేంద్ర భాగంగా ఉంటారు. నూతన ప్రజాస్వామిక రకానికి చెందిన మన సాంస్కృతిక విప్లవం సోషలిస్టు సాంస్కృతిక విప్లవానికి భిన్నమైంది, నక్సల్బరీ పోరాటం నుంచే ఇది కొనసాగుతున్నది. దీని విషయంలో

మన "భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు" డాక్యుమెంటు ఇలా చెప్పింది : "జనతా ప్రజాస్వామిక సంస్కృతి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక సంస్కృతి. అది, చరిత్ర తరతరాలుగా అందించిన పీడిత ప్రజారాశుల సుసంపన్న సాంస్కృతిక వారసత్వంలోని లౌకిక, నిజమైన, ప్రజాస్వామిక, శాస్త్రీయ అంశాలన్నింటికీ అది వారసురాలు."

"మావోయిజం పునాదిగా గల ప్రజల ప్రజాస్వామిక సంస్కృతిని విస్తృతంగా ప్రచారం చేయకుండా ప్రజలను భావజాలపరంగా సాయుధం చేయడమూ, వారిని చైతన్యవంతులను చేసి, ప్రజాయుద్ధం కోసం సంఘటితం చేయడమూ అసాధ్యం. మావో చెప్పినట్లు, *"ఒక రాజకీయాధికారాన్ని కూలదోయడానికి భావజాల రంగంలో పనిచేయడమూ, ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం అన్నదే మొదటి, రెగ్యులర్ కర్తవ్యం అవుతుంది."* దోపిడీ వర్గాలను, వారి రాజ్య యంత్రాంగాన్ని కూలదోయడానికి గాను నూతన ప్రజాస్వామిక విప్లవం పొడవునా చేపట్టవలసిన మొట్టమొదటి కర్తవ్యం భావజాలపరమైన పోరాటాన్ని సాగించడం, వ్యవసాయక విప్లవ యుద్ధానికి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం."

"రివిజనిజమే ప్రధాన ప్రమాదమని మావో చెప్పారు. మార్క్సిజం–లెనినిజం–మావోయిజానికీ, ప్రజల ప్రజాస్వామిక భావజాలానికీ, విప్లవానికీ ఆధునిక రివిజనిజం ముఖ్యమైన శత్రువుల్లో ఒకటి. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడకుండా సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాసంస్కృతిని నెలకొల్పలేము. ఈ విషయంలో ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మార్క్సిజం–లెనినిజం–మావోయిజం అత్యంత బలమైన ఆయుధం."

"అంతేకాక, భారతదేశంలో భూస్వామ్య ఆలోచనా సరళి లోతుగా వేళ్లూనుకుని ఉంది. అది పలు రూపాల్లో వ్యక్తమవుతూ ఉంటుంది. ప్రత్యేకించి, కులతత్వం, మత మైనారిటీల పట్ల అపోహలు, మతపరమైన సంకుచితత్వం, మతమౌఢ్యం, అంటరానితనం, పితృస్వామ్యం తదితర అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. ఇటువంటి ప్రజాస్వామ్య వ్యతిరేక విలువలు, సంస్కృతికి అంతటికీ వ్యతిరేకంగా ప్రజారాశులకు బోధన గరపాలి. వాటి స్థానంలో సమానత్వం, ఆత్మగౌరవం, లౌకికవాదం, శ్రమను గౌరవించడం, కార్మికవర్గ దృక్పథంపై ఆధారపడి ఉన్న విలువలు, సంస్కృతిని ప్రవేశపెట్టాలి."

"భారత విప్లవ విజయానికి గాను సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక సంఘటనను సంఘటితపర్చి దానిని నిరంతరాయంగా పటిష్టపరచాలి. జనతా ప్రజాస్వామిక సంస్కృతి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక విప్లవ ప్రజా ఐక్యసంఘటనలో విడదీయరాని ఒక భాగంగా ఉండాలి. కార్మికులను, రైతాంగాన్ని, శ్రామిక ప్రజారాశులను సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక వ్యవసాయక విప్లవం గురించి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం గురించి బోధన గరపడమనేది ఈ సాంస్కృతిక రంగపు కర్తవ్యాలలో ఒకటిగా ఉంటుంది."

"జనతా ప్రజాస్వామిక రాజ్యం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రం, సైనిక శాస్త్రం,

చరిత్ర, సంస్కృతి తదితర సకల సామాజిక విజ్ఞాన శాస్త్రాల రంగాల నుండి సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతిని తుడిచిపెట్టేసి, వాటి స్థానంలో జనతా ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పడమనే కర్తవ్యాన్ని చేపడుతుంది." (34వ పేజీ మొదటి పేరా నుంచి చివరి పేరా వరకు).

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించి ప్రపంచవ్యాప్తంగా సోషలిజం, కమ్యూనిజం విజయ సాధన కోసం ప్రపంచ కార్మికవర్గ పార్టీలన్నీ ఈ కింది గుణపాఠాలను తీసుకోవాల్సి ఉంటుంది :

1) కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం, బలోపేతం చేయాలి. పునాదిలోనూ, ఉపరితలంలోనూ రెండింటిలో విప్లవాన్ని అవిఘ్నంగా కొనసాగించడం కోసం భావజాల పరంగా, రాజకీయంగా ప్రజలను సమీకరించాలి, సన్నద్ధం చేయాలి. కార్మికవర్గ నియంతృత్వ స్థాపనకు ముందు నాటి కంటే, దాని స్థాపన తర్వాత కార్మికవర్గానికీ, బూర్జువా వర్గానికీ మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరం అవుతుందనీ, ఆశ్చర్యం గొలిపే రీతిలో బూర్జువా వర్గ ప్రతిఘటన ఉంటుందనీ కార్మికవర్గ పార్టీ తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి.
2) పెట్టుబడిదారీ మార్గీయులపై నిశితమైన నిఘా పెట్టాలి, మొండిఘటాలను ఒంటరి చేయాలి, పార్టీ లోపల బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను నిర్మాణం చేసేందుకై వారు చేసే ప్రతి ప్రయత్నాన్నీ ధ్వంసం చేయాలి. పార్టీ మరియు ప్రభుత్వం లోపల ఉండే ఈ దిగజారిన పెట్టుబడిదారీ మార్గీయులు ప్రతీఘాతుక విప్లవాన్ని నిర్వహించేందుకై చాలా జాగ్రత్తగా నాయకత్వ పాత్రను చేపడతారని దృష్టిలో పెట్టుకోవాలి. ఈ సెక్షనే ప్రజలను గందరగోళానికి గురి చేసి, ప్రతీఘాతుక విప్లవానికి అనుకూలంగా వారిని సమీకరిస్తారు.
3) పార్టీ లోపల అవిశ్రాంతంగా రెండు పంథాల మధ్య పోరాటాన్ని నిర్వహించాలి. ఇందులో విశాల ప్రాతిపదికన క్యాడర్లను భాగస్వామ్యం చేయాలి. ప్రజలతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండేలా చూసుకోవాలి. రెండు పంథాల మధ్య పోరాటాన్ని నిర్వహించేటప్పుడు విశాలమైన క్యాడర్లతో ఐక్యమయ్యేందుకూ, కొద్ది మందిని ఒంటరి చేసేందుకూ "ఐక్యత-విమర్శ(ఆత్మవిమర్శ)-ఐక్యత" విధానాన్ని అనుసరించాలి.
4) పార్టీని సంఘటితం చేసే సమయంలో అత్యంత నిఘాను కలిగి ఉండాలి. బూర్జువా ఏజెంట్లు కుదటపడేందుకు అవకాశాన్ని ఇవ్వకుండా వారి కుట్రలను ఓడించాలి.
5) రెండు పంథాల మధ్య పోరాటాన్ని విశాల ప్రాతిపదిక నిర్వహిస్తూనే, రెండు రకాల వైరుధ్యాలు, పద్ధతులను వేరుచేసి వాటి పట్ల వ్యవహరించడంలో ప్రజలకు రాజకీయంగా దిశానిర్దేశం చేయాలి. శత్రువులను ఒంటరి చేసేందుకూ, శత్రువులకు వ్యతిరేకంగా విశాల ప్రజానీకంతో మమేకమయ్యేందుకూ విప్లవకర దిశానిర్దేశాన్ని అందించడంలో

పార్టీ అత్యంత శ్రద్ధను ప్రదర్శించాలి. నాయకత్వంలో ఆత్మసంతృప్తిని, వైరుధ్యాలను సరిగ్గా పరిష్కరించడంలో బలహీనతలను నివారించేందుకై పార్టీ అత్యంత అధికంగా కృషి చేయాలి. ఎందుకంటే, ప్రజలను వెర్రివాళ్లను చేసేందుకు, తప్పుదారి పట్టించేందుకు, తప్పుడు మార్గంలో పోరాటాన్ని మళ్లించేందుకు, పార్టీని, ప్రభుత్వాన్ని, విప్లవ ప్రజలను సంఘటితం చేసే క్రమాన్ని అడ్డుకునేందుకు బూర్జువా ఏజెంట్లు వీటిని ఉపయోగించుకుంటారు.

6) అనేక సాంస్కృతిక విప్లవాలను నిర్వహించాలి. నూతన నిర్మాణ రూపాలను అభివృద్ధి చేయడం ద్వారా రాజకీయాధికారంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలి. ఆ పోరాట రూపాలు తగిన విధంగా ఉండేలా చూసేందుకు నిరంతరం శ్రద్ధ పెట్టాలి. ఉత్పత్తి సాధనాలపై ప్రజల నిజమైన యాజమాన్యాన్ని స్థాపించాలి.

7) అన్ని సెక్షన్ల ప్రజానీకమూ తమ భావాలను, అభిప్రాయాలను, విమర్శలను బహిరంగంగా వ్యక్తం చేయగలిగే విధంగా వారికి తగిన వేదికలను కల్పించడం ద్వారా కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని వారికి అందించాలి.

8) అన్ని రూపాల్లోని మితవాద, 'అతివాద' తప్పుడు పంథాలను బహిర్గతం చేయాలి, తిరస్కరించాలి, ఓడించాలి. ఒక తప్పుడు పంథాకు వ్యతిరేకంగా పోరాడేటప్పుడు మరో దానిపట్ల జాగరూకతతో ఉండాలి. బూర్జువా ఏజెంట్లు మితవాద పంథానే కాక, 'అతివాద' పంథాను కూడా, ప్రత్యేకించి విప్లవ పోరాటం అత్యంత తీవ్రరూపం దాల్చినప్పుడు ముందుకు తెస్తారు.

9) ప్రజల ముందు తప్పులను అంగీకరించాలి. వారిని బహిరంగంగా విమర్శించేందుకై ప్రోత్సహించాలి. ఈ విధానాన్ని పదే పదే చేపట్టడం ద్వారా పార్టీలో, ప్రభుత్వంలో పెత్తందారీతనం పెరగకుండా అడ్డుకోవాలి.

సోషలిజం నిర్మించడంలో జరిగిన వైఫల్యాల నుండి ప్రపంచ కార్మికవర్గం, పీడిత జాతులు, పీడిత ప్రజలు గుణపాఠాలు తీసుకుంటున్నారు. రెట్టింపు విశ్వాసంతో, నిబద్ధతతో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజాన్ని స్థాపించే వరకూ విప్లవాన్ని కొనసాగిస్తారు. సామ్రాజ్యవాద గొలుసులో మొదటగా అత్యంత బలహీనమైన లింకుల్ని తెగ్గొట్టడం ద్వారా పురోగమించే ప్రపంచ సోషలిస్టు విప్లవం, దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గాన్ని అనుసరించే నూతన ప్రజాస్వామిక విప్లవాల ఎగుడు దిగుడు మార్గాల్లో సోవియట్ యూనియన్, చైనా వంటి మునుపటి సోషలిస్టు దేశాల్లో సంభవించిన ఓటములు కేవలం తాత్కాలికమైనవేనని పీడిత ప్రజలు వేగంగా గుర్తిస్తున్నారు. సమీప భవిష్యత్తులో సామ్రాజ్యవాద సంపూర్ణ పతనాన్నీ సోషలిజం విజయాన్నీ సూచించే ఈ అప్రతిహతమైన ధోరణిని ప్రపంచంలోని ఏ శక్తీ అడ్డుకోలేదు. 21వ శతాబ్దం విప్లవాల శతాబ్దం, విప్లవిస్తే జయం ప్రజలదే. *

# మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంపై ఎం.ఐ.బి-33 సంపాదకీయ వ్యాసం

***(చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ 50వ వార్షికోత్సవం సందర్భంగా)***

'సాంస్కృతిక విప్లవం రాజకీయ ఆర్థిక విప్లవాల ప్రతిబింబంగా ఉండి వాటికి ఉపకరిస్తుంది' - మావో, 'నూతన ప్రజాస్వామ్యం', 1940.

సోషలిస్టు చైనాలో జరిగిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం (జీపీసీఆర్) 50వ వార్షికోత్సవ సంవత్సరం ఇది. అనేక సంవత్సరాల పాటు కొనసాగిన ఈ విప్లవం సాంస్కృతిక క్షేత్రంలో ప్రారంభమై 1966 మధ్య కాలానికి ప్రజా వెల్లువగా రూపం తీసుకుంది. 1969లో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) తొమ్మిదో కాంగ్రెస్ ఈ విప్లవ ఫలితాలను క్రోడీకరించి, ఆనాటి వరకూ దాని విజయాలను ప్రకటించేంత వరకు, ఇది మలుపులు మెలికల మార్గంలో, అనేక దశల గుండా సాగింది. ఆ తరువాత 1976లో పెట్టుబడిదారీ మార్గీయులు పార్టీ నాయకత్వాన్ని గుంజుకొని, సోషలిస్టు విప్లవాన్ని వెనక్కు తిప్పి, జీపీసీఆర్‌ను హఠాత్తుగా ముగించేంత వరకూ దీనిని అనేక రూపాలలో కొనసాగించారు. ఉపరితలంలో జరిగిన ఈ అద్వితీయ, అసమాన విప్లవం చైనా సమాజాన్ని వేళ్లతో సహా కుదిపేసింది. చైనా ప్రజల హృదయాలను తాకింది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం వేసింది. మావో నాయకత్వంలో సీపీసీలో వామపక్షం పిలుపు మేరకు చైనాలో లక్షలాది ప్రజలు బూర్జువా భావజాలానికీ రాజకీయాలకూ ఆచరణకూ వ్యతిరేకంగా, పార్టీ, సైన్యం, ప్రభుత్వాల మీద బూర్జువా నియంత్రణ, ప్రభావాలకు వ్యతిరేకంగా, చరిత్ర రథచక్రాలను వెనక్కు లాగే సమస్త పాత ప్రపంచ మురికికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వర్గ పోరాట క్షేత్రంలోకి ప్రవేశించారు. రెండు వర్గాల మధ్య, రెండు పంథాల, రెండు మార్గాల మధ్య జరిగిన ఈ భీకర పోరాట స్పర్శ, ప్రభావం లేని పార్టీ కమిటీ, ఫ్యాక్టరీ, కమ్యూన్, సమిష్టి, ప్రజా సంస్థ, సంఘం ఒక్కటి కూడా లేదు. విప్లవ ప్రజానీకం ప్రతీ ఒక్క రంగంలోనూ వర్గ శత్రువుతో తలపడ్డారు. ప్రతీఘాతుక వర్గాల కోటలను వణికించే ఒక పెద్ద కెరటంగా ఎగిసారు. ఇలా ప్రారంభమయిన పోరాటంలో విప్లవ ప్రజల అపరిమిత సృజనాత్మకత, శక్తి, ఉత్సాహం ఎన్నడూ ఎరుగని స్థాయిలో కార్యరూపం తీసుకుంది. సీపీసీ విప్లవ పంథా మార్గదర్శకత్వంలో పారిశ్రామిక వ్యవసాయ రంగాలలో, వాణిజ్య ఆర్థిక, రవాణా, కమ్యూనికేషన్, సైన్సు, సాంకేతిక, విద్యా, ఆరోగ్య, కళా సాహిత్య మొదలయిన సమస్త వర్గ పోరాట రంగాలలోనూ ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగ రంగాలలోనూ విస్తృతమైన నవీన ఆలోచనలను తీసుకువచ్చారు.

పాత ప్రపంచపు అతి హానికర, వంచక ప్రతినిధులు ఎవరంటే, కమ్యూనిస్టు పార్టీ, ప్రజా విముక్తి సైన్యం (పీఎల్ఏ), ప్రజా ప్రభుత్వాలలో ఉన్నత స్థాయిలలో ముసుగులో ఉన్న రివిజనిస్టులే. ప్రారంభం నుంచీ కూడా తన శ్రేణులలో ఉన్న రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సుదీర్ఘ చరిత్ర సీపీసీకి ఉన్నది. దేశ విముక్తి జరిగేంత వరకూ చెన్ టు షి, చూ చియు పాయ్, లీ లీ సాన్, లో చాంగ్ లంగ్, వాంగ్ మింగ్, చాంగ్ కువో టావోల రివిజనిస్టు పంథాలకు వ్యతిరేకంగా పార్టీలో ఆరు ప్రధాన రెండు పంథాల మధ్య పోరాటాలను విజయవంతంగా నడిపింది. ఈ పంథాలను ఓడించకపోయి ఉంటే, చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కాక పోయి ఉండేది.

విముక్తి జరిగిన దశాబ్ద కాలం లోపుగానే సీపీసీలో విప్లవకారులు మరోసారి కావో కాంగ్, పెంగ్ టె హువాయ్‌ల రివిజనిస్టు పంథాలకు వ్యతిరేకంగా పోరాటానికి దిగవలసి వచ్చింది. అయితే కార్మికవర్గ నియంతృత్వ పరిస్థితులలో రెండు పంథాల మధ్య పోరాటాలు విముక్తి పూర్వ కాలంలో జరిగిన వాటి కంటే గణనీయంగా భిన్నమైనవి. దేశవ్యాప్త అధికార స్వాధీనం, కార్మికవర్గ నియంతృత్వ స్థాపనల తరువాత రివిజనిస్టులు పార్టీలో తమ ఉన్నత స్థానాల అధికారాన్ని ఆ మేరకు ప్రజల నుంచీ అక్రమంగా గుంజుకున్న రాజ్యాధికారంతో బలపరచుకోవాలని ప్రయత్నించడంతో అంతర్గత పోరాటం మరింత తీవ్రతరమయింది. తమ అధికార స్థానాన్ని దుర్వినియోగం చేసి వాళ్లు మావో విప్లవ పంథాకు వ్యతిరేకంగా పోరాడారు. సోషలిస్టు నిర్మాణాన్ని వ్యతిరేకించారు. కార్మికవర్గం మీద నియంతృత్వం అమలు చేసారు. సోషలిస్టు విప్లవ తిరోగమనం వైపుగా పని చేసారు. ఆర్థిక పునాదిలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించడం ద్వారానూ ఉపరితలంలో బూర్జువా భావజాలాన్ని ప్రచారం చేయడం ద్వారానూ వాళ్లు ఈ పని చేయగలిగారు. సోషలిస్టు నిర్మాణ క్రమంలో మొలకలెత్తుతున్న సోషలిస్టు నూతన అంశాలను వాళ్లు అణగదొక్కారు.

అంతేకాకుండా, విముక్తి పూర్వ కాలంలో రివిజనిస్టులు విప్లవకారులకు వ్యతిరేకంగా ప్రధానంగా బహిరంగ పోరాట రూపాలు, పద్ధతులూ వినియోగించగా, విముక్తి అనంతర కాలంలో మరింతగా రహస్య, కుట్రపూరిత, మోసపూరిత రూపాలనూ పద్ధతులనూ అవలంబించారు. దీంతో వారి పంథా మరింత వినాశనకరంగా తయారయింది. సోషలిస్టు పారిశ్రామికీకరణ, వ్యవసాయం, చేతివృత్తులు, వ్యాపారం సోషలిస్టు పరివర్తన చెందే క్రమంలో ఈ ప్రతిఘటన మరింత బలపడింది. ఈ క్రమం 1956 నాటికి మౌలికంగా పూర్తయింది. మహత్తర ముందంజ ద్వారా సోషలిస్టు నిర్మాణ దశలోకి ప్రవేశించడానికి చైనా పూర్తిగా సంసిద్ధమయింది. అధికారం కోల్పోయిన ప్రతీఘాతుక వర్గాలు కార్మికవర్గ నియంతృత్వం నెలకొన్న తరువాత విప్లవం పట్ల మరెన్నో రెట్లు ప్రతిఘటనను పెంచుతారన్న లెనిన్ బోధనను ఇది రుజువు చేస్తుంది. తమ విప్లవ ప్రతీఘాతుక పంథా, ఆచరణతో సీపీసీలో రివిజనిస్టులు విప్లవ పార్టీని రివిజనిస్టు సోషల్ ఫాసిస్టు పార్టీగా రూపొందించడానికి, కార్మికవర్గ

నియంతృత్వాన్ని బూర్జువావర్గ నియంతృత్వంగా, సోషలిస్టు చైనాను పెట్టుబడిదారీ చైనాగా మార్చడానికీ ప్రయత్నించారు.

1956 తరువాత సీపీఎస్‌యూలో కృశ్చేవ్ రివిజనిస్టు ముఠా అధికారం స్వాధీనం చేసుకోవడం, సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణలతో చైనాలో రివిజనిస్టుల స్థానం మరింత బలపడింది. అందుకనే, విముక్తి పూర్వం సీపీసీలో జరిగిన రెండు పంథాల మధ్య పోరాటాలు గానీ, ఆ తరువాత కావో కాంగ్, పెంగ్ టె హువాయ్ పంథాలకు వ్యతిరేకంగా పోరాటాలు గానీ పార్టీలో అంతర్గత పోరాటాల ద్వారా పరిష్కరించుకోగలిగినప్పటికీ, జీపీసీఆర్ నాటికి రివిజనిస్టులు ఎంతో శక్తివంతంగా, ప్రభావయుతంగా తయారు కావడంతో పార్టీలో పాత పోరాట పద్ధతుల ద్వారా వారిని ఓడించడం సాధ్యం కాలేదంటే ఆశ్చర్యం లేదు. 1966 నాటికి పెట్టుబడిదారీ మార్గీయులు చైనా రాజ్యాధికారంలో మూడింట ఒక వంతు గుంజుకున్నారనీ విశాల ప్రజానీకం మీద విశ్వాసం, వర్గ పంథా, ప్రజా పంథాను అమలు చేస్తూ వారిని పెద్ద సంఖ్యలో సమీకరించడం ద్వారానే బూర్జువా వర్గం నుంచి రాజకీయాధికారం తిరిగి పొందగలమనీ, సోషలిస్టు విప్లవం పురోగమించగలదనీ మావో పేర్కొన్నారు.

1959లో పెంగ్ టె హుయే పంథాకు వ్యతిరేకంగా మితవాద వ్యతిరేక పోరాటం జరిగిన తరువాత ఆరు సంవత్సరాల కాలంలో రివిజనిస్టులు తమ స్థానాన్ని సంఘటితం చేసుకోగా, పార్టీ, దేశం రంగు మారకుండా చూసేందుకు మావో, సీపీసీ విశాల ప్రజల మీద విశ్వాసం ఉంచి పని చేశారు. అధికారంలో ఉండి పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన కొద్దిమంది పార్టీ నాయకులకు వ్యతిరేకంగా తిరగబడమనీ, వారి విప్లవ ప్రతీఘాతుక హెడ్‌క్వార్టర్స్ మీద దండెత్తమనీ వాళ్లు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలా ప్రారంభమయ్యింది మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం. ప్రజలు - ముందుగా విద్యార్థులు, మేధావులూ, వారి బాటలో ఆ తరువాత కార్మికులు, రైతాంగమూ అత్యంతగా స్పందించి, శత్రు బలమైన కేంద్రాలను తుఫానులా చుట్టుముట్టారు. ప్రజల సృజనాత్మకత, శక్తి, చొరవా, మిలిటెన్సీ, సంపూర్ణంగా వెలికి వచ్చాయి. ఇది కింది నుంచి అధికారం స్వాధీనం చేసుకోవడం అనే దాని కంటే అల్ప విషయమేమీ కాదు. అధికారంలో ఉన్న బూర్జువా ప్రతినిధులనూ, బూర్జువా రివిజనిస్టు ప్రాపంచిక దృక్పథాన్నీ ప్రశ్నించే, విమర్శించే, కూలదోసే క్రమంలో పార్టీ నాయకులు, కేడర్‌లు, ప్రజలూ తమ్ము తాము పరీక్షించుకున్నారు, స్వీయ విమర్శ చేసుకున్నారు, తమ ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చి దిద్దుకున్నారు. నిజానికి జీపీసీఆర్ లక్ష్యం ఇదే. మావో 1967లో వివరించినట్టుగా, 'పదవుల్లో ఉంటూ పెట్టుబడిదారీ మార్గం పట్టిన వారి పై పోరాటం చేయడం ప్రధాన కర్తవ్యమే. కానీ, ఏ విధంగా చూసినా అది లక్ష్యం కాదు. ప్రాపంచిక దృక్పథం సమస్యను పరిష్కరించడమే అసలు లక్ష్యం. అది రివిజనిజంను కూకటివేళ్ళతో తుడిచిపెట్టే సమస్య' (1967 మే 1వ తేదీన 'అల్బేనియా మిలిటరీ ప్రతినిధి వర్గానికి ఇచ్చిన

ఉపన్యాసం', మావో రచనలు, 9వ సంపుటి, పు.323). 'స్వార్థాన్ని విడనాడండి, రివిజనిజాన్ని తిప్పి కొట్టండి' అన్న నినాదంలో జీపీసీఆర్ ప్రధాన కర్తవ్యం, ప్రధాన లక్ష్యం సరిగ్గా ప్రతిబింబిస్తుంది. భావజాలపరంగా మలచడం ద్వారా ప్రజల ప్రాపంచిక దృక్పథంలో విప్లవ మార్పుని తీసుకురావడం కోసం, సోషలిజపు నూతన జీవిత పరిస్థితులకు అనుగుణంగా ప్రజల చైతన్యాన్ని మలిచి, నూతన సమాజాన్ని నిర్మించే విధంగా నూతన మానవులుగా రూపొందించడం కోసం చేసే విప్లవం ఇది.

దోపిడీ వర్గాలలోనే రివిజనిజం వేళ్ళూనుకుని ఉన్నది. చైనాలో విముక్తి తరువాత కూడా దీని అవశేషాలు కొనసాగాయి. పాత పాలక వర్గాలైన భూస్వాముల, నిరంకుశ పెట్టుబడిదారుల వ్యక్తిగత ఆస్తిని నూతన ప్రజాస్వామిక విప్లవం స్వాధీనం చేసుకుంది. అయితే ఈ వర్గాలకు చెందిన వారిని భావజాలపరంగా మలచడానికి ఇంకా ఎంతో కాలం పడుతుంది. అధికారం కోల్పోయిన వర్గాలలో మాజీ భూస్వాముల వంటి కొందరు భూసంస్కరణ ఉద్యమ కాలంలో బయటపడకుండా తప్పించుకున్నారు. వీరు పార్టీ, ప్రభుత్వం, సమిష్టి క్షేత్రాల వంటి చోట్ల నాయకత్వ స్థానాలలోకి కూడా రాగలిగారు. అంతేకాకుండా నూతన ప్రజాస్వామిక విప్లవం సామ్రాజ్యవాద, భూస్వామ్య బంధనాలను తొలగించడంతో, సమాజంలో బూర్జువా, పెటీ బూర్జువా శక్తులు, సమాజం పై వాటి భావజాలపర ప్రభావం పడడానికీ విస్తరించుకోవడానికీ అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ వర్గాల ప్రజలు సామ్రాజ్యవాద, భూస్వామ్య, నిరంకుశ పెట్టుబడిదారుల పీడనను ఎదుర్కొన్నారు కనక భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ దశలో పెద్ద ఎత్తున కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అయితే తమ కార్మికవర్గేతర ప్రాపంచిక దృక్పధాన్ని తిరిగి మలచుకోవడంలో విఫలం కావడం, ప్రజాస్వామిక విప్లవానికి మించి విప్లవ మార్గంలో కొనసాగడానికి సిద్ధంగా లేకపోవడంతో వాళ్లు సోషలిజం పరీక్షలో విఫలమై, సమాజాన్ని వెనక్కి లాగే బరువుగా మారారు. వీరిలో చాలా మంది ప్రజాస్వామిక విప్లవ దశ సోషలిస్టు దశగా పరివర్తన చెందడాన్ని ప్రతిఘటిస్తూ రివిజనిస్టు పంథాను అవలంబించారు. అంతేకాకుండా, మధ్య తరహా బూర్జువా వర్గం (అంటే గ్రామీణ బూర్జువా వర్గంగా ఉన్న ధనిక రైతుల) పై రాజ్య నియంత్రణ, ఆంక్షలను సడలించి కొంత మేరకు లాభం పొందనిచ్చే విధానాన్ని సీపీసీ అవలంబించవలసి వచ్చింది. దీంతో వాళ్లు సమాజం మీద భావజాల, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రభావం నెరపసాగారు. అలాగే చైనాలో భారీ గ్రామీణ పెటీ బూర్జువా వర్గం (మధ్య తరగతి రైతులు), పట్టణ పెటీ బూర్జువా వర్గం (మూడు స్థాయిల మేధావులూ కలిపి) కూడా గణనీయంగా ఉన్నాయి. వీరిలో అత్యధికులు సోషలిజాన్ని సమర్థిస్తూ సోషలిస్టు మార్గానికి మద్దతు ఇచ్చినప్పటికీ, చిన్న తరహా యాజమాన్యం నుంచి ఏర్పడే సంకుచిత వర్గ దృష్టి ఇంకా విడనాడనేలేదు. వారిని తీర్చి దిద్దడం అప్పుడే ప్రారంభమయ్యింది. కార్మికవర్గం, అర్ధ కార్మికవర్గం (కార్మికులు, పేద రైతాంగం) సోషలిస్టు మార్గానికి స్థిరంగా

కట్టుబడి ఉన్నప్పటికీ మార్క్సిజం గురించిన వారి అవగాహన వారిలో సాపేక్షికంగా తక్కువగా ఉండడం వల్ల వారు రివిజనిస్టుల కుట్రలకు ప్రభావితులయే పరిస్థితి ఉన్నది. వేలాది సంవత్సరాలుగా చైనా ప్రజల ఆలోచనలలో ఆచరణలో ఆధిపత్యంలో ఉంటూ వచ్చిన భూస్వామ్య భావజాలాన్ని, సంస్కృతినీ వేళ్ళతో సహా పెకిలించి మార్క్సిజాన్ని పెంపొందించడం, కార్మికవర్గ భావజాలాన్ని నెలకొల్పడం తేలిక పనేమీ కాదు. మార్క్సిజానికి వ్యతిరేకంగా చేసే ఘర్షణలో రివిజనిస్టులు తరచూ ప్రజలలో ఉన్న వెనకబడ్డ భావజాలాలనూ, ఆలోచననూ ఉపయోగించుకునేవారు.

వీటన్నింటికీ తోడుగా ఉత్పత్తి సాధనాల మీద వ్యక్తిగత యాజమాన్యం (భూస్వామ్య యాజమాన్యం గానీ, బూర్జువా యాజమాన్యం గానీ) యావత్తు ప్రజల సోషలిస్టు యాజమాన్యంగా పరివర్తన చెందడంలో అనేక మధ్యంతర దశలు ఉంటాయి. సాపేక్షికంగా సుదీర్ఘ కాలం పడుతుంది. ఈ పరివర్తనా కాలం కూడా యావత్తు ప్రజల ప్రయోజనాలకు మించి పాక్షిక, సంకుచిత స్వార్థ ప్రయోజనానికి, తద్వారా రివిజనిజానికీ రివిజనిస్టు వ్యతిరేక వర్గ పోరాటానికీ పునాదిగా కొనసాగింది. మావో పేర్కొన్నట్టుగా 1956 నాటికల్లా చైనాలో మౌలికంగా సోషలిస్టు యాజమాన్య వ్యవస్థ రూపొందడం పూర్తయినప్పటికీ,

'...కూలదోయబడిన భూస్వామ్య, దళారీ వర్గాల అవశేషాలు ఇంకా మిగిలి ఉన్నాయి, బూర్జువా వర్గం ఇంకా ఉంది, పెటీ బూర్జువా వర్గాన్ని తీర్చి మల్చుకోడం ఇప్పుడే ప్రారంభమయింది. వర్గ పోరాటం ఏ విధంగాను ఇంకా ముగియలేదు. శ్రామికవర్గానికీ పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య వర్గ పోరాటాలు, వివిధ రాజకీయ శక్తుల మధ్య వర్గ పోరాటాలు శ్రామికవర్గ సిద్ధాంతానికీ పెట్టుబడిదారీ వర్గ సిద్ధాంతానికీ మధ్య వర్గ పోరాటాలు ఇంకా దీర్ఘకాలం అనేక మలుపుల మెలికలతోను అపుడపుడు అతి నిశితంగాను కూడా కొనసాగుతాయి. తన ప్రాపంచిక దృక్పథానికి అనుగుణంగా ప్రపంచాన్ని రూపాంతరీకరించుకునేందుకు శ్రామిక వర్గం కృషి చేస్తుంది. బూర్జువా వర్గం కూడా అదే చేస్తుంది. ఈ విషయంలో సోషలిజమా, పెట్టుబడిదారీ విధానమా ఏది గెలుస్తుంది అన్న ప్రశ్న ఇప్పటికింకా నిజంగా పరిష్కృతమవలేదు. మొత్తం ప్రజలలోనూ, మేధావులలోనూ కూడ మార్క్సిస్టులు మైనారిటీగానే ఉన్నారు...బూర్జువా వర్గ ప్రభావం, పాత సమాజం నుంచి వచ్చే మేధావుల ప్రభావం, వారి వర్గ భావజాలాన్ని ఏర్పరచే ఈ ప్రభావం మన దేశంలో చాలా కాలం పాటు నెలకొని ఉంటుంది...' ('ప్రజల మధ్య వైరుధ్యాలను పరిష్కరించడం', 1957 ఫిబ్రవరి, మావో రచనలు, 5వ సంపుటి, పుట 530-531).

అంటే పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన పార్టీ నాయకులు విడి వ్యక్తులు కాదు. పాత, నూతన ప్రతీఘాతకుల సంఘటిత సామాజిక శక్తులకు ప్రతినిధులు. విముక్తి తరువాత సీపీసీలో సరైన పంథాను పరిరక్షించడానికీ, పెంపొందించడానికీ జరిగిన పోరాటం, రివిజనిజపు

భౌతిక, భావజాలపర పునాదులను నిర్మూలించి తద్వారా సోషలిస్టు నిర్మాణానికీ కార్మికవర్గ నియంతృత్వ సంఘటితీకరణకూ కమ్యూనిజం సాధించడం కోసం సోషలిస్టు విప్లవ పురోగమనానికీ చేసే పోరాటంతో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నది. ఇందుకోసం, ఆర్థిక పునాదిని, ఉపరితలాన్నీ పదే పదే విప్లవీకరించాలి. మావో నాయకత్వంలో సీపీసీలో వామపక్షం అవలంబించిన వ్యూహం ప్రకారం ఈ రెండు పరివర్తనలనూ నిరంతరాయ వరుస విప్లవాలుగా, ఆర్థిక రంగంలోనూ, భావజాల, రాజకీయ, సాంస్కృతిక రంగంలోనూ జిగ్ జాగ్ క్రమంలో ఒక దాని తరువాత ఒకటి నిర్వహించాలి. మావో 1958లో చెప్పినట్టుగా,

"నేను శాశ్వత విప్లవ సిద్ధాంతాన్ని సమర్థిస్తాను. దీన్ని ట్రాట్స్కీ శాశ్వత విప్లవ సిద్ధాంతంగా పొరపాటు పడవద్దు. విప్లవించడంలో ఇనుము కాక మీదున్నప్పుడే దెబ్బ కొట్టాలి - ఒక విప్లవం వెనువెంటనే తప్పనిసరిగా మరో విప్లవం కావాలి, విప్లవం నిరంతరాయంగా పురోగమించి తీరాలి. 'గడ్డి చెప్పులకు ఓ ఆకారం అంటూ ఏమీ ఉండదు - తయారవుతున్న క్రమంలోనే అవి ఏదో ఒక ఆకారాన్ని ధరిస్తాయి' అని హునాన్ వారు తరచుగా అంటుంటారు. ప్రజాస్వామిక విప్లవం పరిపూర్తి చేయబడక ముందే సోషలిస్టు విప్లవాన్ని మొదలు పెట్టాలని ట్రాట్స్కీ విశ్వసించాడు. మనం అలా అనుకోవడం లేదు. ఉదాహరణకు, 1949 విముక్తి అనంతరం భూ సంస్కరణ వచ్చింది. ఇది పూర్తి అయిన వెనువెంటనే పరస్పర సహాయ దళాలు వచ్చాయి, తదనంతరం దిగువ స్థాయి కో-ఆపరేటివ్‌లు, అటు పిమ్మట ఉన్నత స్థాయి కో-ఆపరేటివ్‌లు వచ్చాయి. ఏడేళ్ళ తర్వాత, కో ఆపరేటివైజేషన్‌ను పూర్తి చేశాం. ఉత్పత్తి సంబంధాలను రూపాంతరీకరించాము. అప్పుడు తప్పుల్ని సరిదిద్దుకునే ఉద్యమం వచ్చింది. తప్పుల్ని సరిదిద్దుకోవడం పూర్తయిన పిమ్మట, విషయాలు చల్లబడక ముందే, అపుడే సాంకేతిక విప్లవం వచ్చింది...('సుప్రీం రాష్ట్ర మహాసభలో ఉపన్యాసం', 1958 జనవరి 28, మావో రచనలు, 8వ సంపుటి, పుట 22)

విముక్తి తరువాత చైనా విప్లవ చరిత్ర చూస్తే, ఆర్థిక పునాదిలో పురోగమనం కోసం జరిగిన ప్రతీ పోరాటానికీ ముందూ తరువాతా ఉపరితలంలో పోరాటాలు జరిగాయి. ఇది తిరిగి ఆర్థిక పునాది పురోగమనానికి ప్రేరణనిచ్చింది. 1949 నాటి ప్రజాస్వామిక విప్లవ రాజకీయ విజయం తరువాత ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో విప్లవం వచ్చింది. అదే 1949-1952 నాటి సోషలిస్టు పారిశ్రామికీకరణ, భూసంస్కరణ ఉద్యమం. 1953-55ల మధ్య భావజాల రంగంలో జరిగిన షెన్‌ఫాన్/'మూడు వ్యతిరేకాలు, ఐదు వ్యతిరేకాలు' ఉద్యమం, కావో వ్యతిరేక, జావో వ్యతిరేక పోరాటాలు దీనిని సంఘటితం చేశాయి. ఆర్థిక పునాదిలో అభివృద్ధిలో ఆ తరువాత పెద్ద అడుగు వేయడానికి ఇది పునాదిని ఏర్పరచింది. ఇదే 1955-56 నాటి వ్యవసాయ సమిష్టీకరణ కోసం ఉద్యమం. దీని తరువాత 1957లో 'వంద పువ్వుల' ఉద్యమం, 'మితవాద వ్యతిరేక ఉద్యమం' పేర్లతో మరో భావజాలపర పోరాటం జరిగింది. ఉపరితలంలో జరిగిన ఈ ఉద్యమం సమిష్టీకరణ ఉద్యమాన్ని సంఘటితం

చేయడమే కాకుండా సోషలిస్టు పారిశ్రామికీకరణలో వ్యవసాయంలో సోషలిస్టు పరివర్తనలో చేతివృత్తులు, వాణిజ్యాలలో ఒక గెంతుకు దారి తీసింది. ఇదే 1958-59 నాటి గొప్ప ముందంజ, ప్రజా కమ్యూన్ ఉద్యమం. ఆర్థిక పునాదిలో ఈ అపారమైన అభివృద్ధిని మరో తాజా భావజాలపర పోరాటం సంఘటితం చేసింది. ఇది 1959లో పెంగ్ టె హుయే రివిజనిస్టు పంథాను తిప్పి కొట్టడానికి, 1963లో 'సోషలిస్టు విద్యా ఉద్యమం' ప్రారంభానికీ దారి తీసింది. జీపీసీఆర్‌కు ఇదే తక్షణ ప్రేరకమైంది. వర్గ పోరాటం ఈ జిగ్ జాగ్ పద్ధతిలో - ఉత్పత్తి శక్తుల, సంబంధాల అభివృద్ధి కోసం ఉపరితలాన్ని మార్చడం, ఉత్పత్తి శక్తులలో, ఉత్పత్తి సంబంధాలలో అభివృద్ధి పునాదిగా ఉపరితలాన్ని మరింత విప్లవీకరించడం - ఈ రకంగా నిరంతరాయ వరుస విప్లవాల ద్వారా పురోగమిస్తుంది. మార్క్సిస్టు సూత్రాలకూ సోషలిజంలో వర్గ పోరాట నియమాలకూ కట్టుబడి మావో వర్ణించిన శాశ్వత విప్లవ సారం ఇదే.

జీపీసీఆర్ ప్రారంభానికి పరిస్థితులు పరిపక్వం కాక ముందు చైనా సమాజంలో ఆర్థిక పునాదిలోనూ ఉపరితలంలోనూ సోషలిస్టు పరివర్తనలో దశలు దశలుగా విప్లవ పోరాటాలు జరిగాయి. నిజానికి, ప్రజాస్వామిక, సోషలిస్టు విప్లవాలలో జరిగిన భావజాలపర, రాజకీయ పోరాటాలలో సీపీసీ, చైనా ప్రజల గుణపాఠాలు, అనుభవాలు, సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు నిర్మాణంలో పాజిటివ్, నెగిటివ్ అనుభవాలూ, స్టాలిన్ నాయకత్వంలో సీపీఎస్‌యూలో జరిగిన సైద్ధాంతిక, రాజకీయ పోరాటాలూ సోవియట్, ఇటలీ, యుగొస్లావ్ రివిజనిస్టులకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర వాదోపవాదాల గుణపాఠాలూ ఇవన్నింటినీ జీపీసీఆర్‌లో ఉన్నత స్థాయిలో అన్వయించారు.

మావో, సీపీసీ అవలంబించిన విధానం, వ్యూహం దృష్టి నుంచీ జీపీసీఆర్ అనేక దశల గుండా సాగింది. మావో చెప్పినట్టుగా, జీపీసీఆర్ 1967 మధ్య నాటికే నాలుగు దశల గుండా సాగింది. యావో వెన్ యువాన్ 1965 నవంబరులో *'ఆన్ ది న్యూ హిస్టారికల్ ప్లే హాయ్ జుయీ డిస్‌మిస్డ్ ఫ్రమ్ ఆఫీస్'* (*హాయ్ జుయీని ఆఫీసు నుంచీ తొలగించారు* అన్న చారిత్రాత్మక నాటకం గురించి) పేరుతో పెకింగ్ డిప్యూటీ మేయర్ వూ హాన్‌ను విమర్శిస్తూ రాసిన వ్యాసం జీపీసీఆర్ ప్రారంభానికి సూచిక. అయితే అంతకు ముందే ఆ సంవత్సరం సెప్టెంబర్-అక్టోబర్‌లలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలోనే వూ హాన్ నాటకాన్ని విమర్శించి మావో ఈ పోరాటాన్ని రగిలింప చేశాడు. ఆనాటి నుంచీ 1966 ఆగస్టులో ఎనిమిదో సీపీసీ కేంద్ర కమిటీ పదకొండో ప్లీనం జరిగేంత వరకూ జీపీసీఆర్ మొదటి దశ. ఈ దశలో ప్రధానంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించారు, శక్తులను పెంపొందించారు. ఈ దశలో ముఖ్యమైన ఘటనల గురించి చెప్పుకోవాలంటే, పెకింగ్ మునిసిపల్ పార్టీ కమిటీ రివిజనిస్టు నాయకులను ఎండగడుతూ *లిబరేషన్ ఆర్మీ డైలీ*లో వరుసగా విమర్శనాత్మక వ్యాసాలు వచ్చాయి. కేంద్ర కమిటీ నియమించిన కల్చరల్ రివల్యూషన్ గ్రూప్ (సాంస్కృతిక

విప్లవ బృందం)ను పునర్నిర్మించారు. 'మే 16 సర్క్యులర్' వచ్చింది. పెకింగ్ విశ్వవిద్యాలయంలో మొదటి సోషలిస్టు పెద్దక్షరాల పోస్టర్‌ను మావో సమర్థించడం, దేశవ్యాప్త ప్రచారం, మావో స్వంత పెద్దక్షరాల పోస్టర్, 'బాంబార్డ్ ది హెడ్‌క్వార్టర్స్' (హెడ్‌క్వార్టర్స్ మీద దండెత్తండి) ఈ కాలంలోనే వచ్చాయి. విశ్వవిద్యాలయ, పాఠశాలల విద్యార్థులు రెడ్ గార్డ్స్ డిటాచ్‌మెంట్లలో పెద్ద ఎత్తున సమీకృతులయ్యారు. దేశమంతటా సాంస్కృతిక విప్లవం వ్యాపించింది.

పదకొండో ప్లీనం నుంచీ 1967లో 'జనవరి తుఫాను' వరకూ రెండో దశ. ఈ దశలోనే 'జీపీసీఆర్‌కు సంబంధించి సీపీసీ కేంద్ర కమిటీ నిర్ణయం' జారీ అయ్యింది. మావో సూచన మీద ఆధారపడి పార్టీ కేడర్‌లను స్థూలంగా నాలుగు రకాలుగా వర్గీకరించారు - 1. మంచి 2. సాపేక్షికంగా మంచి 3. తీవ్రమైన తప్పులు చేసినప్పటికీ పార్టీకి వ్యతిరేకంగా, సోషలిస్టు మితవాదులకు వ్యతిరేకంగా లేని వారు 4. తక్కువ సంఖ్యలో ఉన్న పార్టీ వ్యతిరేకులు, సోషలిస్టు మితవాదుల వ్యతిరేకులు. మొదటి మూడు రకాల వారిలో అత్యధికులను ఐక్యం చేస్తూ, ఆఖరి రకానికి చెందిన కొద్దిమంది కేడర్‌లను ఎండగట్టి, తొలగిస్తూ ఈ 16 సూత్రాల సర్క్యులర్ సోషలిస్టు నిర్మాణాన్ని పురోగమింపజేయడానికీ కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడానికీ మార్గం వేసింది. ఈ దశలో పారిశ్రామిక కార్మికులు పెద్ద సంఖ్యలో పోరాటంలోకి ప్రవేశించారు. ఇది విప్లవానికి లోతునూ వ్యాప్తినీ కల్పించింది. ఈ దశలో చెప్పుకోదగ్గ ఘటన 'జనవరి తుఫాను'. ఈ ఘటనలో షాంఘై విప్లవ కార్మికులు కింది నుంచీ అధికారం గుంజుకున్నారు. రివిజనిస్టు షాంఘై మునిసిపల్ పార్టీ కమిటీని కూలదోశారు. చైనాలో ఈ అతి పెద్ద కార్మికవర్గ నగరంలో కేంద్ర విప్లవ అధికార అంగంగా పని చేసే ఒక వర్కర్స్ రిబెల్ హెడ్‌క్వార్టర్స్ (కార్మికుల తిరుగుబాటు హెడ్‌క్వార్టర్స్)ను పారిస్ కమ్యూన్ నమూనాలో నెలకొల్పారు.

లీషావ్‌చీ రివిజనిస్టు భావాలను బహిరంగంగా విమర్శిస్తూ హాంగ్ క్యుయి (ఎర్ర జెండా) పత్రిక సంపాదకుడు చీపెన్‌యు రాసిన వ్యాసాల ప్రచురణ జీపీసీఆర్ మూడో దశ. ఈ దశలో రెండు పంథాల మధ్య పోరాటం మరింత తీవ్రతరమయింది. అధికారంలో ఉన్న బూర్జువా ప్రతినిధులు 'ప్రత్యర్థ ఫిబ్రవరి స్రవంతి'తో 'జనవరి తుఫాను' మీద ప్రతిదాడి చేయాలని ప్రయత్నిస్తే విప్లవ ప్రజానీకం దీనిని తిప్పి కొట్టారు. జీపీసీఆర్ ఊపు కొనసాగింది. దీని తరువాత కాలం నాలుగో దశ. ఈ దశలో దేశవ్యాప్తంగా రివిజనిస్టుల నుంచి తిరిగి రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం లక్ష్యంగా ప్రజలు పని చేశారు. అధికారంలో ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులను వ్యతిరేకించే ప్రజల గొప్ప మైత్రితో, పార్టీలో అత్యధిక కేడర్‌లూ ప్రజలను ఐక్యం చేసి సామూహిక విమర్శలు నిర్వహించారు. గత సమస్త దశల కంటే ఈ దశలో వర్గ పోరాటం సాపేక్షికంగా మరింత సుదీర్ఘంగా, సంక్లిష్టంగా, తీవ్రంగా సాగింది. జీపీసీఆర్ మొత్తంలో ఇది అత్యంత కీలకమైన దశ. ఈ కాలంలోనే లీ షావ్ చీ

నేతృత్వంలో ఉన్న బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను నాశనం చేశారు (1968 అక్టోబరులో జరిగిన సీపీసీ ఎనిమిదో కేంద్ర కమిటీ పన్నెండో ప్లీనం లీని విప్లవ ప్రతీఘాతకుడిగా ప్రకటించి పార్టీ నుంచి బహిష్కరించింది). అతని పంథా అనుచరులను ఆఫీసు నుంచి తొలగించారు. రివిజనిస్టుల అదుపులో ఉన్న పాత అధికార అంగాలను ధ్వంసం చేసి, వాటి స్థానంలో విప్లవ కమిటీలు ఏర్పాటు చేసుకుని మొత్తం 29 రాష్ట్రాలలో, మునిసిపాలిటీలలో స్వయం ప్రతిపత్తి ప్రాంతాలలో ప్రజలు రాజకీయాధికారం స్వాధీనం చేసుకున్నారు.

సీపీసీ చరిత్రలో, జీపీసీఆర్ కాలంలో లీ షావ్ చీ రివిజనిస్టు పంథాకి వ్యతిరేకంగా చేసిన పోరాటం ప్రధాన రెండు పంథాల మధ్య పోరాటాలలో తొమ్మిదవది. ఇందులో నుంచీ మరోసారి విప్లవ పంథాకు విజయం లభించింది. 1969 ఏప్రిల్‌లో జరిగిన తొమ్మిదో కాంగ్రెస్ నాటికి జీపీసీఆర్ మౌలికంగా పూర్తయింది. కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడంలో, పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించడంలో గొప్ప విజయాలు సాధించారు. సోషలిస్టు నిర్మాణంలో మరిన్ని పురోగమనాలకు మార్గం సుగమమయింది. కార్మికవర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్య, మార్క్సిస్టులకూ రివిజనిస్టులకూ మధ్య రాజకీయాధికార, నాయకత్వ కీలక సమస్యను ఇది పరిష్కరించింది. తొమ్మిదో కాంగ్రెస్ తరువాత 'విప్లవ ప్రతీఘాతకులను దెబ్బ కొట్టడం, లంచగొండితనాన్ని, దొంగతనాలనూ వ్యతిరేకించడం, వాటాలను వ్యతిరేకించడం, ఆడంబరాన్నీ వృధానూ వ్యతిరేకించడం' కోసం, లీ షావ్ చీ విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథా ప్రభావ అవశేషం మీద పోరాటం, విమర్శ, పరివర్తన, నిర్మూలనలను తీవ్రతరం చేయడం కోసం, ఉపరితలంలో సమస్త రంగాలలోనూ విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం జీపీసీఆర్‌ను కొనసాగించారు. ఇందులో భాగంగా మార్క్సిజం లెనినిజం మావో సే టుంగ్ ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేసే ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.

తొమ్మిదో కాంగ్రెస్ తరువాత 1971లో లిన్ పియావో పార్టీ వ్యతిరేక రివిజనిస్టు ముఠాను ఓడించడం జీపీసీఆర్ అతి పెద్ద విజయం. జీపీసీఆర్ తొలి మూడు సంవత్సరాల కాలంలో పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సీపీసీలో వామపక్ష నాయకులుగా లిన్ పియావో, చెన్ పో టాలు ప్రముఖంగా ముందుకు వచ్చారు. ఇది లిన్-చెన్‌ల పార్టీ వ్యతిరేక ముఠా పతనానికి దారి తీసింది. లీ షావ్ చీ ఓటమి తరువాత వారు 'వామపక్ష' ముసుగులో తమ మితవాద అవకాశవాద పంథాను ముందుకు తీసుకురాసాగారు. ఈ తప్పుడు పంథాకు వ్యతిరేకంగా మావో మరో భావజాల, రాజకీయ పోరాటం ప్రారంభింఈ పోరాట విజయాలను 1973లో జరిగిన సీపీసీ పదో కాంగ్రెస్‌లో క్రోడీకరించారు. యాభై సంవత్సరాల సీపీసీ చరిత్రలో ఇది పదో ప్రధాన రెండు పంథాల మధ్య పోరాటం. మావో నాయకత్వంలో ఉన్న విప్లవ నాయకత్వాన్ని తిరుగుబాటు ద్వారా తొలగించి, అధికారం గుంజుకుని భూస్వామ్య-దళారీ ఫాసిస్టు నియంతృత్వం నెలకొల్పడానికి అనేక మంది పార్టీ అగ్ర నాయకులు, పీఎల్ఏలో నలుగురు పెద్ద సైనికాధికారులతో కుమ్మక్కై లిన్ పియావో చేసిన విప్లవ ప్రతీఘాతుక కుట్రను ఇది విజయవంతంగా ఎండగట్టింది.

ప్రధానంగా జీపీసీఆర్ ద్వారా పార్టీలో, సైన్యంలో, ప్రజల్లో సైద్ధాంతిక రాజకీయ చైతన్యం, అప్రమత్తతా పెరిగినందు వల్లనే స్వదేశీ, విదేశీ ప్రతీఘాతుక వర్గాల ప్రయోజనాల కోసం లిన్ పియావో చేసిన విప్లవ ప్రతీఘాతుక కుట్రను ఎండగట్టగలిగారు, విమర్శించగలిగారు, సమయానికి ధ్వంసం చేయగలిగారు. సోషలిషజం చారిత్రక కాలమంతా వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటం కొనసాగుతున్నంతవరకు, బూర్జువా వర్గమా, కార్మికవర్గమా ఏది గెలుస్తుందన్న ప్రశ్న ఇంకా పరిష్కారం కానంతవరకు, ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం ఆధిపత్య వ్యవస్థగా ఉన్నంత వరకూ, రివిజనిస్టు పంథాలు పొడసూపే, కమ్యూనిస్టు పార్టీలో మావో విప్లవ పంథాను అనుసరించే ముసుగులో లిన్ పియావో వంటి బూర్జువా ప్రతినిధులు ముందుకు వచ్చే, సోషలిస్టు రాజ్యంలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరిగే నిజమైన ప్రమాదం ఉంటూనే ఉంటుందన్న గుణపాఠాన్ని ఈ నెగిటివ్ ఉదాహరణ మరోసారి నేర్పింది.

లిన్ పియావో 'అతివాద' అవకాశవాద పంథా ఆవిర్భావం, మావో పంథాను అనుసరించే వారిలో ఒక సెక్షన్ చేసిన 'అతివాద' ఒంటెత్తుపోకడ అతి చర్యలు, జీపీసీఆర్‌ను నాశనం చేయడానికీ, నిర్వీర్యం చేయడానికీ 'వామపక్ష' ముసుగులో, రివిజనిస్టులు తెలిసి తెలిసి బహిరంగంగా చేపట్టిన విచ్ఛిన్నకర కార్యక్రమాలూ కూడా అనేక మంది కరడు గట్టిన పెట్టుబడిదారీ మార్గీయులు, మితవాదులూ తిరిగి పార్టీ, సైన్యం, ప్రభుత్వాలలో అధికార స్థానాలలోకి రావడానికి తోడ్పడ్డాయి. ఈ ద్విముఖ ద్వంద్వ వ్యవహర్తలు తప్పుడు స్వయం విమర్శలు చేసుకుని, వారి పై పార్టీ, ప్రజలూ ఉంచిన నమ్మకాన్ని ఆసరా చేసుకుని తిరిగి అధికారాన్ని గెలుచుకున్నారు. ఈ ముఠాకు డెంగ్ సియావో పింగ్ నాయకుడు. ఇతన్ని లీ షావ్ చీ వ్యతిరేక పోరాట కాలంలో పదవి నుంచీ తొలగించి, భావజాలపర పునర్ చైతన్యం కోసం కేడర్ స్కూలుకు పంపారు. అతని స్వయం విమర్శను ఆమోదించిన సీపీసీ 1973లో తిరిగి అతన్ని పొలిట్ బ్యూరోలోకి తీసుకుంది. అయితే ఈ సంకుచిత పెట్టుబడిదారీ మార్గీయుడు మితవాద పెడధోరణిని ప్రేరేపించి, త్వరలోనే సోషలిస్టు విప్లవాన్ని ధ్వంసం చేసేందుకు విప్లవ ప్రతీఘాతుక శక్తులకు నాయకత్వం వహించసాగాడు. జీపీసీఆర్‌కు కొనసాగింపుగా 1975 నవంబరులో 'డెంగ్‌ను విమర్శించి, సరైన తీర్పులను వెనక్కి తీసుకుపోయే మితవాద పెడధోరణిని తిప్పి కొట్టేందుకు' మరో ప్రజా ఉద్యమం ప్రారంభమయింది. ముందు సిన్‌హువా విశ్వవిద్యాలయంలో ప్రారంభమయిన ఈ ప్రజా ఉద్యమం 1976 ఏప్రిల్‌లో డెంగ్‌ను పార్టీ లోపలా బయటా సమస్త పదవుల నుంచీ బహిష్కరించడంలో చెప్పుకోదగ్గ విజయం సాధించింది. అయితే తదుపరి కొద్ది సమయంలోనే ఛూటే, కాంగ్ షెంగ్, టుంగ్ పీ వు, చౌఎన్‌లై, మావోలతో సహా పార్టీలో అనేక మంది సీనియర్ నాయకుల మరణాన్ని అవకాశంగా తీసుకుని మరుగున ఉన్న రివిజనిస్టులు హువా కువో ఫెంగ్ నాయకత్వంలో 1976లో పార్టీ, సైన్యం, ప్రభుత్వాలలో ముఖ్యమైన స్థానాలు స్వాధీనం చేసుకున్నారు. చౌఎన్‌లై మరణంతో హువా కువో ఫెంగ్ తాత్కాలిక ప్రధాన మంత్రి, ప్రజా రక్షణ మంత్రీ అయ్యాడు. అప్పటి వరకూ బయటకు మావో విప్లవ

పంథాను అంటి పెట్టుకున్నవాడే అయినప్పటికీ హువా కువో ఫెంగ్, అతని ముఠాదారులూ త్వరలోనే మితవాదానికి లొంగిపోయి, మావో మరణానంతరం విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటును నిర్వహించడంలో క్రియాశీల భాగస్వాములయారు. హువా కువో ఫెంగ్ త్వరలోనే పార్టీ కేంద్ర కమిటీ చైర్మన్ పదవినీ సైన్యాధిపతి పదవినీ గుంజుకున్నాడు. అతని నాయకత్వంలో పెట్టుబడిదారీ మార్గీయులు విప్లవకారులను అణచిపెట్టారు. సోషలిస్టు రాజ్యాన్ని ధ్వంసం చేశారు. డెంగ్ సియావో పింగ్ వంటి తమ ముఠాదారులకు తిరిగి ఆశ్రయం కల్పించారు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను కూలదోసి పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించారు. జీపీసీఆర్‌ను కుఖ్యాతం గావించారు. డెంగ్-హువా విప్లవ ప్రతీఘాతుక ముఠా అధికారం గుంజుకోవడంతో పది సంవత్సరాల మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం అంతమయిపోయింది. చైనా విప్లవమూ చైనా ప్రజలూ మహత్తర తిరోగమనాన్ని చవి చూసారు.

ఈ వెనకడుగులు ఉన్నప్పటికీ జీపీసీఆర్ విప్లవ కార్యక్రమపు సమస్త రంగాలలోనూ చెప్పుకోదగ్గ విజయాలూ, సఫలతలూ అనేకం సాధించింది. లీషావ్‌చీ, లిన్ పియావో, డెంగ్ సియావో పింగ్‌ల నాయకత్వాలలో మూడు బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను ధ్వంసం చేయడం ద్వారా కార్మికవర్గం, ప్రజల చేతులలో నుంచీ రాజకీయాధికారం జారిపోకుండా నివారించింది. కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసింది. పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి, 1966 తరువాత మరో దశాబ్దం పాటు చైనా విప్లవాన్ని కొనసాగించేందుకు మార్గం సుగమం చేసింది. నిర్దిష్ట ఆచరణ ద్వారా సోషలిస్టు, కార్మికవర్గ నియంతృత్వ పరిస్థితులలో వర్గ పోరాట నియమాలను అభివృద్ధి చేసి భావజాల రంగంలో మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లింది. ఆర్థిక పునాది, ఉపరితల రంగాలలో నిరంతరాయ విప్లవాల తప్పనిసరి అవసరాన్ని స్పష్టం చేసింది. కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిజం బూర్జువా సిద్ధాంతానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తీకరణ అని మరోసారి నిరూపించింది. మార్క్సిజానికీ, విప్లవానికీ ఇది ప్రధాన ప్రమాదమనీ దీని పై నిరంతర సైద్ధాంతిక పోరాటం అవసరమనీ స్పష్టం చేసింది. సమస్త విప్లవ కార్యాచరణలోనూ 'ఒకటి రెండవుతుంది' అన్న గతితార్కిక, చారిత్రక భౌతికవాద పద్ధతిని అన్వయించడానికి ఉన్న ప్రాధాన్యతను పునరుద్ఘాటించింది.

రాజకీయ రంగంలో చూసుకుంటే, సోషలిస్టు సమాజంలో, పెట్టుబడిదారీ విధానం నుంచీ కమ్యూనిజంలోకి పరివర్తన జరిగే యావత్తు కాలంలోనూ కార్మికవర్గం వర్గ పోరాటాన్ని కొనసాగించాలనీ, సంపూర్ణ నియంతృత్వాన్ని అమలు చేయాలనీ, దేశ విదేశీ ప్రతీఘాతుక వర్గాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే వారితో ఐక్యమై, విప్లవ ప్రతీఘాతుకతకు ఉన్న అవకాశం పట్ల అప్రమత్తత కలిగి ఉండాలనీ బోధించింది. విశాల ప్రజానీకం మీద ఆధారపడుతూ వారిని పూర్తిగా సమీకరించి ప్రజా పంథాను స్థిరంగా అమలు చేయాలనీ తద్వారా వర్గ పంథాను సంపూర్ణంగా ఆచరించవలసిన అవసరాన్ని స్పష్టం చేసింది. అలాగే ప్రజలలో 95

శాతం మందిని ఐక్యం చేసి 5 శాతం మంది విప్లవ ప్రతీఘాతకులనూ, చెడు శక్తులనూ ఒంటరులను చేసి ఓడించవలసిన అవసరాన్ని కూడా స్పష్టం చేసింది. వర్గ పోరాటాన్ని ఎన్నడూ మరిచిపోకూడదనడంలోనూ, రాజకీయాలను ఎల్లప్పుడూ కమాండ్‌లో ఉంచాలనడంలోనూ సమస్త రంగాలలోనూ కార్మికవర్గ నాయకత్వాన్ని అమలు చేయలనడంలోనూ ఉన్న ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. 'చేయవలసిన మూడు, చేయకూడని మూడు' సూత్రాన్ని స్థిరంగా నెలకొల్పింది - "మార్క్సిజాన్ని ఆచరించండి, రివిజనిజాన్ని కాదు", "ఐక్యం కండి చీలిపోవద్దు", "విశాలంగా సూటిగా ఉండండి, కుట్రలు కుహకాలకు పాల్పడవద్దు", "స్వార్థాన్ని విడనాడండి, రివిజనిజాన్ని తిప్పి కొట్టండి".

సాంస్కృతిక రంగం విషయానికి వస్తే, బూర్జువా భూస్వామ్య భావజాలాల ప్రభావంలో పాత పాలక వర్గాలను మాత్రమే చిత్రీకరించడంలో మునిగిపోయి, శ్రామిక ప్రజానీకాన్ని వెక్కిరించే, తక్కువ చూసే, నిర్లక్ష్యం చేసే రివిజనిస్టుల ఆధిపత్యాన్ని జీపీసీఆర్ కూలదోసింది. పాత భూస్వామ్య బూర్జువా సంస్కృతిని ప్రోత్సహిస్తూ, నూతన సోషలిస్టు సంస్కృతిని ప్రోత్సహించేందుకు నిరాకరించిన సాంస్కృతిక మంత్రిత్వ శాఖను మావో విమర్శించాడు. అది మారడానికి నిరాకరిస్తే, ఆ మంత్రిత్వ శాఖను 'చక్రవర్తుల, రాజుల, సైన్యాధిపతుల, మంత్రుల శాఖ అనో, లేదా ప్రతిభలు, అందాల శాఖ అనో లేదా విదేశీ బొమ్మల శాఖగానో' పేరు మార్చాలని సూచించాడు. జీపీసీఆర్‌తో ప్రేరణ పొంది నాయటకం, చిత్రలేఖనం, సినిమా, సృజనాత్మక రచన మొదలయిన కార్మికవర్గ సాహిత్యం, కళలలో నూతన నమూనాలు ముందుకు వచ్చాయి. పాత రూపంలో ఉన్న పెకింగ్ ఒపెరాను నూతన, విప్లవాత్మక సారంతో మలిచి తెచ్చిన పరివర్తన ఇందుకు మంచి ఉదాహరణ.

విద్యలో, చైనా చరిత్రలో మొట్టమొదటిసారిగా కార్మిక, కర్షకుల పిల్లల కోసం విద్యా సంస్థల భారీ ఎత్తున తలుపులు బార్లా తెరిచింది. లక్షలాది మంది విద్యార్థులు జీపీసీఆర్ కాలంలో ఫ్యాక్టరీలకూ, పొలాలకూ వెళ్లి పని చేశారు. తద్వారా విద్యకూ, ఉత్పత్తికీ మధ్య, సైద్ధాంతిక, ఆచరణాత్మక విజ్ఞానానికీ మధ్య, తెలుసుకోవడానికీ చేయడానికీ మధ్య సన్నిహిత సమైక్యతను పెంపొందించారు. పాత సమాజంలో విద్యకు దూరం అయిన కార్మిక, రైతాంగ ప్రజలు వివిధ రకాల పాఠశాలలలో సృజనాత్మక పద్ధతులలో విద్యావంతులయ్యారు. ప్రజల సాక్షరత పెరిగింది. ప్రజల సాంస్కృతిక స్థాయి పెంపొందింది. మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానం సమిష్టి అధ్యయనంతో సహా విస్తారమైన భావజాల, రాజకీయ విద్య నడిచింది. ఇది సోషలిస్టు విద్యా ఉద్యమంలో మరింత ఉన్నత దశగా కొనసాగింది.

వైద్య, ఆరోగ్య శాఖ 'పట్టణ అధిపతుల శాఖ'గా ఉండడంతో, వైద్య ఆరోగ్య రంగాన్ని కూడా ప్రజా వైఖరితో, విశాల గ్రామీణ ప్రజలు కేంద్రంగా జీపీసీఆర్ విప్లవీకరించింది. బేర్‌ఫుట్ డాక్టర్‌ల దేశవ్యాప్త విస్తరణ, చైనీయ, విదేశీ వైద్యాల జోడింపు వంటి నూతన అంశాలు జీపీసీఆర్ కాలంలో జరిగాయి. ఇవి వైద్య రంగాన్ని విప్లవీకరించి, మొదటిసారిగా

దేశ ప్రజలకు మౌలిక ఆరోగ్య సేవను అందించాయి. దీంతో చైనాలో సగటు జీవిత కాలం, సాధారణ ఆరోగ్య ప్రమాణం మున్నెన్నడూ ఎరుగని స్థాయికి చేరుకుంది. నేటికి కూడా దీన్ని మించినది ఏర్పడలేదు.

శాస్త్ర సాంకేతిక రంగంలో విప్లవకర మార్పు తీసుకువచ్చింది. ప్రజల పాత్రను, ప్రయోగాన్నీ, నవీనత్వాన్నీ జీపీసీఆర్ ప్రోత్సహించింది. 'కమ్యూనిస్టు, నైపుణ్యం' సూత్రం అమలులో నూతన ఎత్తులకు ఎదిగింది. పాత కొత్తకూ, విదేశీ స్థానికానికీ సేవ చేసే పునాదిగా స్వావలంబనను నొక్కి చెప్పింది. సాంకేతికతను రూపొందించడంలో శ్రామిక ప్రజలు మూకుమ్మడిగా పాలు పంచుకోవడం మూలంగా సాంకేతికతను మెరుగుపరచడంలో, పట్టు సంపాదించడంలో, సంపూర్ణం చేయడంలో గొప్ప విజయాలు లభ్యమయ్యాయి. ఇవి ఉత్పత్తినీ ప్రజా సంక్షేమాన్నీ ప్రోత్సహించింది.

పరిశ్రమ, వ్యవసాయాలలో కూడా శ్రామిక ప్రజలలో జీపీసీఆర్ సోషలిస్టు పద్ధతిలోనూ శ్రమైక ఉత్సాహంలోనూ ఒక వెల్లువకు దారి తీసింది. 'వ్యవసాయంలో తాచాయ్ నుంచి నేర్చుకోండి, పరిశ్రమల్లో తాచింగ్ నుంచి నేర్చుకోండి' అన్న నినాదాలు దేశమంతటా అమలయ్యాయి. దీని ఫలితంగా మూడో, నాలుగో, ఐదో పంచవర్ష ప్రణాళికలు (1965-70లలోనూ 1970-75లలోనూ) పరిధికి మించి నెరవేరాయి. పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తి నూతన ఎత్తులకు చేరుకుంది. సోషలిస్టు మిగులు వేగంగా పెరిగి 1962 నుంచీ జీపీసీఆర్‌లో తిరుగుబాట్ల మధ్యనే వరుసగా పదమూడు సంవత్సరాల పాటు చక్కని పంటలు తీశారు. భౌతిక ప్రోత్సాహకాల ద్వారా ఉత్పత్తిని పెంపొందించాలన్న లీ రివిజనిస్టు పంథాను ఓడించిన 'విప్లవాన్ని అర్థం చేసుకోండి, ఉత్పత్తిని పెంపొందించండి' అన్న పంథాను అమలు చేసిన ఫలితం ఇది. జీపీసీఆర్ కాలంలో ఆర్థిక రంగంలో ఇవీ, ఇంకా ఇతర విజయాలూ చైనాలో ఉన్న ఎలభై కోట్ల ప్రజల మౌలిక అవసరాలను చాలా వరకూ తీర్చడమే కాకుండా, సోషలిజం మౌలిక నియమ అవసరమైన లక్షణాలు, అవసరాలైన 'ఉన్నత సాంకేతికతల పునాదిగా సోషలిస్టు ఉత్పత్తిలో నిరంతర విస్తరణనూ, సంపూర్ణత్వాన్నీ సాధించడం ద్వారా నిరంతరం పెరుగుతున్న యావత్తు సమాజ భౌతిక, సాంస్కృతిక అవసరాలను అత్యధికంగా సంతృప్తిపరచింది' - (స్టాలిన్, *'ఎకనామిక్ ప్రాబ్లమ్స్ ఆఫ్ సోషలిజం ఇన్ ది యూఎస్ఎస్ఆర్'*, 1953). ఈ విజయాలు జీపీసీఆర్ ఒక వినాశనం అనీ, చైనా ఆర్థిక అభివృద్ధిని విచ్ఛిన్నం చేస్తున్నదన్న దేశ విదేశ ప్రతీఘాతకుల వాదనలను తిప్పికొట్టాయి. నిజానికి, ఇరవయ్యో శతాబ్ది అంతానికల్లా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో అగ్ర శ్రేణిలోకి పురోగమింపజేయాలంటూ మావో సూచించిన పథకానికి కార్యరూపం ఇచ్చేందుకు చైనా ప్రజలు జీపీసీఆర్‌తో గొప్పగా కృషి చేశారు.

అలాగే పార్టీ, సైన్యం, ప్రభుత్వాల నిర్మాణ సూత్రాలలో జీపీసీఆర్ ముఖ్యమైన మార్పులు తీసుకువచ్చింది. సమస్త పార్టీ కమిటీలూ వృద్ధ, మధ్య వయస్కు, నూతన కేడర్‌ల త్రీ ఇన్

వన్ కలయికతో ఏర్పడ్డాయి. పార్టీ వ్యవహారాలలో ప్రజల భాగస్వామ్యాన్ని, పర్యవేక్షణనూ బలపరచడం కోసమూ, ప్రజా పంథాను మరింత ప్రభావవంతంగా అమలు చేయడం కోసమూ పార్టీ చర్చలలో స్వేచ్ఛా విధానాన్ని ప్రోత్సహించారు. సైనిక అధికారులకూ, సైనికులకూ మధ్య శ్రేణిని బట్టి ఉండే చిహ్నాలను రద్దు చేశారు. సైనిక సాంకేతికత, ఉత్పత్తి రంగంలో స్వావలంబనను సాధించారు. ప్రజా మిలీషియాను పునర్ నెలకొల్పారు. 'యావత్తు దేశం పీఎల్ఏ నుంచీ నేర్చుకోవాలి', 'పీఎల్ఏ ప్రజల నుంచీ నేర్చుకోవాలి' వంటి నినాదాలతో ప్రజా సైన్యాన్ని ప్రజలకు చేరువగా తీసుకువచ్చారు. ప్రజల గొప్ప మైత్రితోనూ, ప్రజలు, సైన్యం, పార్టీ ప్రతినిధుల ఒకటిలో మూడు కలయిక సూత్రాన్ని అనుసరించి విప్లవ ప్రజా కమిటీలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం ద్వారానూ కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేశారు. జీపీసీఆర్ కాలంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడడం, అభిప్రాయాలను పూర్తిగా వెల్లడించడం, పెద్ద అక్షరాల పోస్టర్‌లు రాయడం, వాద వివాదాలు నిర్వహించడం వంటి నూతన పోరాట రూపాలను విస్తృతంగా ఉపయోగించారు. విప్లవ ప్రజా కమిటీలు, రెడ్ గార్డ్స్, యాజమాన్యంలోనూ నిర్ణయాలలోనూ కార్మికుల భాగస్వామ్యం, ఉత్పత్తిలోనూ, రాజకీయాలలోనూ మహిళల సమాన భాగస్వామ్యానికి మార్గం వేసి ఒక నూతన కుటుంబ రూపాన్ని, పిల్లలను పెంచడం, విద్యావంతులను చేయడంలో నూతన రకం సంస్థలనూ నిర్మించుకున్నారు. కార్మికవర్గ ప్రజాస్వామ్యం, స్వావలంబన, కఠిన శ్రమ, నిరాడంబర జీవనం, ప్రజలకు సేవ చేయడం, వ్యక్తిగత ప్రయోజనాన్ని సమిష్టి ప్రయోజనానికి లోబరచడం వంటి నూతన విలువలను నెలకొల్పారు.

అంతర్జాతీయంగా, జీపీసీఆర్ లేవనెత్తిన రివిజనిస్టు వ్యతిరేక పోరాట బ్యానర్ ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని తీవ్రతరం చేసి, సోవియట్ రివిజనిస్టులను మరింతగా ఎండగట్టింది. సమస్త ఖండాలలో అనేక దేశాలలో రివిజనిజంతో సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా నిర్ణయాత్మకంగా విడివడడానికి దోహదం చేసి ఆయా దేశాలలో మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానం మార్గదర్శక సిద్ధాంతంగా విప్లవ పార్టీల ఏర్పాటుకు దారి తీసింది. మలేషియా, థాయ్‌లాండ్, మయన్మార్‌లతో సహా అనేక పీడిత దేశాలలో కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో ప్రజాయుద్ధాల నూతన వెల్లువను తీసుకువచ్చింది. ఈ రోజు భారతదేశం, ఫిలిప్పైన్స్, పెరు, టర్కీ, బంగ్లాదేశ్ వంటి దేశాలలో నూతన ప్రజాస్వామిక విప్లవాలకు నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీలన్నీ కూడా జీపీసీఆర్ కాలంలో ఏర్పడ్డాయి, లేదా పునర్నిర్మాణమయ్యాయి. ఐరోపా, ఉత్తర అమెరికాలలో ఎన్నో భారీ ప్రజా వెల్లువలను అది ప్రభావితం చేసింది. ఫ్రాన్స్ విద్యార్థుల, కార్మికుల మిలిటెంటు ఉద్యమం, అమెరికా వియత్నాంలో చేసిన యుద్ధానికి వ్యతిరేక ఉద్యమం, 1960లలో ఆఫ్రికా అమెరికన్ల ఉద్యమం వంటి ఎన్నింటినో ప్రభావితం చేసింది. ఈ రకంగా గడచిన అర్ధ శతాబ్ద కాలంలో, సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ నాటి నుంచీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి కొనసాగింపును

అందించడంలో జీపీసీఆర్ కీలక పాత్ర పోషించింది.

జీపీసీఆర్ గొప్ప విజయాలు, సఫలతలూ సంఘటితం కాలేకపోయాయన్నదీ, పార్టీ శీర్ష నాయకత్వంలో ఉన్న కొద్ది మంది పెట్టుబడిదారీ మార్గీయులు చైనాలో రాజకీయాధికారాన్ని గుంజుకోగలిగారన్నదీ నిజమే. చైనా సోషలిస్టు విప్లవం ఓటమితో సోషలిస్టు శిబిరం రద్దయిపోయి, సోషలిస్టు ప్రపంచ మార్కెట్ విచ్ఛిన్నమయిపోయి, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ, అంతర్జాతీయ బూర్జువా వర్గం మళ్లీ తాత్కాలికంగా జీవం పొందింది. సోవియట్ యూనియన్, చైనా, ఇతర ప్రజా రిపబ్లిక్కులలో బూర్జువా వర్గం అధికారంలోకి రావడంతో సామ్రాజ్యవాదులు, వారి స్వదేశీ కుమ్మక్కుదారులూ పీడిత దేశాలు, జాతులు, ప్రజల మీద నూతన దాడిని అమలు చేశారు. సైద్ధాంతిక, రాజకీయ, ఆర్థిక, దౌత్య, సైనిక సాంస్కృతిక, మొదలయిన అన్ని రంగాలలోనూ ఈ దాడి జరిగింది. ప్రపంచ పునర్విభజన కోసం ఎప్పటికీ నూతన దురాక్రమణ యుద్ధాలు చేస్తున్నారు. నూతన, మరింత తీవ్రతరమైన, మరింత మోసపూరిత రూపాలలో నయా వలస దోపిడీ పీడనలను అమలు చేస్తున్నారు. ఈ దాడిలో భాగంగా వాళ్లు మరింత దూకుడుగా విప్లవ, జాతీయ, ప్రజాస్వామిక, దేశభక్త పోరాటాలనూ పెట్టుబడిదారీ దేశాలలో కార్మికుల, కర్షకుల, విద్యార్థుల, మేధావుల, మహిళల, మైనారిటీల ఉద్యమాలనూ మరింత దూకుడుగా టార్గెట్ చేస్తున్నారు. కార్మికవర్గాన్నీ ప్రజలనూ నిరాయుధం చేసేందుకు క్షీణిస్తున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య భావజాలాన్నీ సంస్కృతినీ మరింత విస్తృతంగా, విషపూరితంగా ప్రోత్సహిస్తున్నారు. తమ దేశాలలో సోషలిస్టు విప్లవాలను తిరోగమింపజేయడానికి, మారుతున్న తమ శక్తి మేరకు పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సమైక్యం కావడానికీ, ప్రపంచ మార్కెట్ పునర్విభజన కోసం పోటీ పడడానికీ, కుమ్మక్కు కావడానికీ, ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, జాతి విముక్తి, ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేయడానికీ సోవియట్, చైనా నయా రివిజనిస్టులు సామ్రాజ్యవాదంతో కుమ్మక్కయ్యారు. అలాగే ఇవాళ యావత్తు ప్రపంచంలోనూ పాత, ఆధునిక రివిజనిస్టులు సామ్రాజ్యవాదానికి, స్వదేశీ ప్రతీఘాతుకతకూ సహాయం అందిస్తున్నారు. యథాస్థితిని పరిరక్షిస్తున్నారు. వారితో కుమ్మక్కై ప్రతీ దేశంలోనూ విప్లవాలను అణచివేస్తూ విప్లవ పురోగమనాన్ని నివారిస్తున్నారు. నేపాల్ తిరోగమనం స్పష్టంగా తెలిపినట్టుగా, కమ్యూనిస్టు ఉద్యమాలలో బూర్జువా భావజాలం, పంథా, ఆచరణలకు ఒక రూపంగా రివిజనిజం ఇంకా ప్రధాన ప్రమాదంగా కొనసాగుతున్నది.

లూటీ, దోపిడీ, బానిసత్వం పెరుగుతూండడంతో, సామ్రాజ్యవాద దేశాల బూర్జువా వర్గం కార్మికవర్గ, పీడిత ప్రజల ప్రతిఘటనను బలహీనపరచడానికి వారిని భావజాలపరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం వాళ్లు రాజ్యం, ప్రైవేటు రంగం, అంతర్జాతీయ సంస్థలు, ఎన్‌జీఓలు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా మొదలయిన వాటిని మరింత తీవ్రంగా వినియోగించుకుంటున్నారు. భారతదేశం వంటి

అర్ధ వలస, నయా వలస దేశాలలో దళారులు, స్థానిక ప్రతీఘాతకులూ తమ దేశాలలో ఇదే ముందుకు తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ విధానం అంతరించిపోకుండా కాపాడేందుకు సామ్రాజ్యవాదానికీ, దాని ముతాదారులకూ ఒక సాధనంగా ఉన్న రివిజనిజం అనేక రూపాలలో తన వికృత రూపాన్ని ముందుకు తెస్తున్నది. అందువల్ల మన దేశ నేపథ్యంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా, పార్లమెంటరీవాదం, ఆర్థికవాదం, సంస్కరణవాదం, రివిజనిజం, శాంతివాదం, ఆధునికానంతరవాదం, మతఛాందసవాదం, ఫాసిజం వంటి అన్ని రకాల కార్మికవర్గేతర భావజాలాలకూ వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయడం మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంతే కాకుండా జీపీసీఆర్ కాలం నాటి నుంచీ యావత్తు పీడిత దేశాలతో సహా ప్రతీ దేశంలోనూ పెటీ బూర్జువా వర్గం, ముఖ్యంగా మేధావులు విస్తృతంగా పెరిగారు. విప్లవంలో మేధావుల, పెటీ బూర్జువా వర్గ పాత్రా, ప్రాధాన్యతా కూడా పెరిగాయి. అయితే వారి వర్గ వైఖరి కారణంగా రివిజనిజంతో సహా బూర్జువా భావజాలానికి వారు తేలికగా ప్రభావితులవుతారు. ఇందుకోసమే కార్మికవర్గం, కార్మికవర్గ పార్టీ వారిని విప్లవం వైపు గెలుచుకోవాలి, వారి భావజాలాన్ని మలచాలి. జీపీసీఆర్ అనుభవం, గుణపాఠాలను రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటంలోనూ ప్రజలను భావజాలపరంగా మలుచుకోవడంలోనూ వినియోగించాలి.

1960 మధ్య కాలం వరకూ దాదాపు ఐదు దశాబ్దాల పాటు రివిజనిజం ప్రధాన ధోరణిగా ఉంటూ వచ్చిన భారత కమ్యూనిస్టు ఉద్యమంలో జీపీసీఆర్‌కు గొప్ప ప్రాధాన్యత ఉన్నది. మహత్తర వాదోపవాదాలు, జీపీసీఆర్ నేపథ్యంలోనే సీపీఐ రివిజనిజానికీ సీపీఐ(ఎం) నయా రివిజనిజానికీ వ్యతిరేకంగా కామ్రేడ్స్ సీఎం, కేసీల నేతృత్వంలో గట్టి సైద్ధాంతిక, రాజకీయ పోరాటం జరిగింది. ఇది నక్సల్బరీ రైతాంగ సాయుధ తిరుగుబాటుకూ, దేశంలో అనేక ప్రాంతాలలో రైతాంగ పోరాటాల ప్రారంభానికీ దారి తీసింది. వీటి ఫలితంగా కార్మికవర్గ విప్లవ పార్టీలు - సీపీఐ(ఎంఎల్), ఎంసీసీలు కామ్రేడ్స్ సీఎం, కేసీల నేతృత్వంలో ఏర్పడ్డాయి. అయితే రివిజనిజంతో ఈ నిర్ణయాత్మక ఎడబాటు తరువాత కూడా పార్లమెంటరీ పంథాను సమర్థించే ఆధునిక రివిజనిస్టు శక్తులు భారత విప్లవ పురోగమనానికి ప్రధాన ఆటంకంగానే ఉన్నాయి. ఈ అంతర్గత పోరాటం సరిగా జరిగినప్పుడు మన పార్టీకి ఉన్నత స్థాయి సైద్ధాంతిక, రాజకీయ స్పష్టత చేకూరింది. పార్టీ అవగాహన సుసంపన్నమయింది. ఐక్యత బలోపేతమై ఉద్యమ పురోగమనానికి దారి తీసింది.  డీవీ, టీఎన్, సీపీ, ఎస్ఎన్ఎస్, వీఎంల మితవాద అవకాశవాద పంథాలు, లిన్ పియావో అనుకూల 'అతివాద' అవకాశవాద పంథా, వేణు, ఎస్ఎం-వీఎస్ ముఠా, భరత్-బాదల్ ముఠా మొదలయిన విచ్ఛిన్నకర, దివాళాకోరు పంథాలను కఠినమైన రెండు పంథాల మధ్య పోరాటం ద్వారా ఓడించాం. సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటు తరువాత కూడా కర్నాటకలో శివప్రసాద్, ఒడిస్సాలో సవ్యసాచి పాండాల మితవాద అవకాశవాద, దివాళాకోరు పంథాలు తలెత్తాయి. వీటిని గట్టి పోరాటం ద్వారా ఓడించాం. పార్టీ లోపలా బయటా ఈ మితవాద, 'అతివాద' పంథాలను ఓడించడం ద్వారానే కాకుండా అంతర్జాతీయ

కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే భారత విప్లవం ప్రస్తుత దశకు పురోగమించింది. విప్లవ శ్రేణులలో రివిజనిజం మరోసారి ఏదో ఒక రూపంలో, ముఖ్యంగా ఉద్యమ కీలక మలుపులలో తలెత్తదని అనుకోలేం. భారతదేశం వంటి అర్ధ వలస అర్ధ భూస్వామ్య దేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద భావజాలాలు ప్రజలలో ఇంకా గణనీయంగా నాటుకుని ఉన్నాయి. విప్లవ శిబిరంలో కూడా వాటి గణనీయ ప్రభావం ఉండే అవకాశం ఉన్నది. భారత విప్లవంలో రివిజనిజం, పార్లమెంటరిజం, గాంధీవాదం, ఆధునికానంతరవాదం, కులతత్వం, మతోన్మాదం, పితృస్వామ్యం, జాతీయ దురభిమానం, ప్రాంతీయతత్వం మొదలయిన సమస్త కార్మికవర్గేతర భావజాలాలకూ వ్యతిరేకంగా జరిగే పోరాట క్రమంలో కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథం కోసం నిరంతర బోధన, భావజాలపర దిద్దుబాటులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నది.

రివిజనిజం, మార్క్సిజం ఒకే మొత్తంలో ఉన్న పరస్పర విరుద్ధ అంశాలని, రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం ద్వారానే మార్క్సిజం అభివృద్ధి చెందుతుందనీ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర స్పష్టం చేస్తున్నది. అందువల్ల సిద్ధాంతం, ఆచరణలలో జీపీసీఆర్ ముందుకు తెచ్చిన అభివృద్ధి నుంచీ కమ్యూనిస్టులు నేర్చుకోవడంలో విఫలం కారాదు. దానిని నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించాలి. కార్మికవర్గం అధికారం స్వాధీనం చేసుకున్న తరువాతనే కాకుండా ముందు కూడా ఇది అవసరం. అలాగే సోషలిస్టు విప్లవ కాలంలోనే కాకుండా ప్రజాస్వామిక విప్లవంలో కూడా అవసరం. తిరోగమనాల మాట ఎలా ఉన్నప్పటికీ మార్క్సిస్టు సిద్ధాంత, ఆచరణలలో జీపీసీఆర్ సాధించిన అభివృద్ధి, చైనా కార్మికవర్గానికీ ప్రపంచ కార్మికవర్గానికీ అందించిన సుసంపన్న అనుభవంతో అది కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. పారిస్ కమ్యూన్ నాటి నుంచీ వర్గ శత్రువు చేతుల్లో పొందిన గత ఓటములన్నీ మార్క్సిజం ఆయుధాగారానికి ఎలా అయితే నూతన ఆయుధాలుగా నిలిచి మరింత పురోగమనానికి పునాదిని ఏర్పరిచాయో, జీపీసీఆర్ కూడా కార్మికవర్గం సోషలిజం కోసం, కమ్యూనిజం కోసం చేసే పోరాటంలో నూతన విజయాలు సాధించడానికి ఒక పునాదిగా నిలిచిపోతుంది. జీపీసీఆర్ గుణపాఠాలను శ్రద్ధగా గ్రహించి అవగాహన చేసుకుంటే కార్మికవర్గమూ దాని అగ్రగామి పార్టీ రివిజనిజం ప్రమాదానికి వ్యతిరేకంగా మరింతగా సంసిద్ధం అవుతుంది, తన సైద్ధాంతిక రాజకీయ స్థాయిని పెంపొందించుకోగలుగుతుంది, సోషలిస్టు విప్లవ పురోగమన క్రమంలో ముందుకు వస్తున్న నూతన ప్రశ్నలనూ సమస్యలనూ పరిష్కరించగలుగుతుంది, వర్తమాన, నూతన, వస్తుగత పరిస్థితులలో శ్రామిక ప్రజలను విముక్తి బాటలో సరైన మార్గదర్శకత్వంతో నడిపించగలుగుతుంది. సోషలిస్టు విప్లవ ఈ ముఖ్య సమస్యలను పరిష్కరించడం ఏ ఒక్క దేశ కార్మికవర్గ కర్తవ్యంగానో కాకుండా, ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ కర్తవ్యంగా ఉంటుంది.

అందువల్ల, చైనా విప్లవ ఓటమి ప్రపంచ కార్మికవర్గ నూతన, మరింత పెద్ద విజయాలకు

ఒక ముందడుగే. వర్గ సమాజం నుంచి, దాని దోపిడీ పీడనల నుంచీ మానవాళి విముక్తి కోసం సుదీర్ఘ కాలం పాటు అనేక విప్లవాలు చేయవలసి ఉంటుందని మార్క్సిస్టు మహోపాధ్యాయులు మనకు బోధించారు. సోషలిస్టు విప్లవం కూడా అనేక ఎగుడు దిగుళ్లు, మలుపులు మెలికలు, విజయాలూ ఓటములతో అంతిమంగా ప్రపంచ స్థాయిలో విజయం సాధించే ఒక సుదీర్ఘ క్రమం. ఈ క్రమంలో శత్రువు తాత్కాలిక విజయాలు సాధించవచ్చు. కానీ బూర్జువా వర్గాన్ని సమూలంగా నిర్మూలించి, తన ప్రపంచ చారిత్రక కార్యక్రమాన్ని నెరవేర్చేంత వరకూ కార్మికవర్గం వర్గ పోరాటం కొనసాగిస్తుంది. ఇందుకోసం ఒకటో రెండో కాదు, అనేక సాంస్కృతిక విప్లవాలు నిర్వహించాల్సి ఉంటుంది. రానున్న కాలంలో ఈ సాంస్కృతిక విప్లవాలకు సోషలిస్టు చైనాలో జరిగిన జీపీసీఆర్ ఎప్పటికీ ఒక మార్గదర్శకంగా, వెలుగుగా నిలిచి ఉంటుంది.

ఈ సంవత్సరం జీపీసీఆర్ 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా దాని గొప్ప విజయాలు, సఫలతల నుంచీ, అలాగే దాని లోపాల నుంచీ నేర్చుకునేందుకు శక్తి మేరకు కృషి చేద్దాం. మాలెమాను అధ్యయనం చేద్దాం. వర్గ పోరాటంలో పాలు పంచుకుందాం. నిర్దిష్ట పరిస్థితులకు మాలెమాను సృజనాత్మకంగా అన్వయిద్దాం. ప్రజలతో సమైక్యమవుదాం. ఆచరణ నుంచీ నేర్చుకుందాం. మన పొరపాట్లను సరిదిద్దుకుందాం. 'ఐక్యత-విమర్శ-ఐక్యత' అనే మార్క్సిస్టు పద్ధతిలో మితవాద, 'అతివాద' అవకాశవాద పెడధోరణులకు వ్యతిరేకంగా పోరాడదాం. తద్వారా మన ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చి దిద్దుకుందాం. సైద్ధాంతిక, రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో మన పోరాట సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం కోసం, పార్టీనీ సైన్యాన్నీ ఐక్యసంఘటననూ ప్రజలనూ బోల్షివీకరించుకుందాం. ప్రస్తుత అర్ధ వలస, అర్ధ భూస్వామ్య రాజ్యాన్ని ధ్వంసం చేసి, తద్వారా, విప్లవ జాతీయ, ప్రజాస్వామిక కర్తవ్యాలను పరిపూర్తి చేసి మౌలిక సామాజిక పరివర్తనను తీసుకురావడానికీ, సోషలిస్టు సమాజాన్నీ, వర్గ వైరుధ్యాలను సరైన పద్ధతిలో పరిష్కరించి అంతిమంగా కమ్యూనిస్టు సమాజాన్నీ నెలకొల్పే దిశగా సాగడానికీ మన దేశ కమ్యూనిస్టు విప్లవకారులు నిశ్చయంగా, స్థిరంగా కార్మికవర్గ సిద్ధాంత ప్రాధాన్యతనూ కార్మికవర్గ నాయకత్వాన్నీ తమ అన్ని పనులలోనూ అన్ని కార్యక్షేత్రాలలోనూ ఎత్తిపట్టాలి.

భారత దేశంలో నూతన ప్రజాస్వామిక సోషలిస్టు విప్లవాల కార్యక్రమాన్ని అమలు చేయడం కోసం మన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తగిన కార్యక్రమాన్నీ వ్యూహం ఎత్తుగడలనూ అవలంబించింది. ఈ అంశాలు 'పార్టీ కార్యక్రమం', 'భారత విప్లవ వ్యూహం ఎత్తుగడలు' అన్న మన పార్టీ డాక్యుమెంట్లలో ఉన్నాయి. జీపీసీఆర్ గుణపాఠాలతో జోడించుకుని, వాటిని మన సమస్త విప్లవ కృషిలోనూ అన్వయించుకోవడం ద్వారా ఈ డాక్యుమెంట్ల పట్ల మనం మరింత లోతైన అవగాహనను పెంపొందించుకునేందుకు కృషి చేయాలి. తక్షణ లక్ష్యాలు, తక్షణ కర్తవ్యాలతో వర్గ పోరాట నిర్దిష్ట కార్యక్షేత్రాలు, నిర్దిష్ట సంస్థలకు నాయకత్వం వహిస్తున్న మన కామ్రేడ్స్ - కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్‌లు,

రైతాంగ సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు, కుల నిర్మూలనా సంఘాలు, సాహిత్య, కళా సంఘాలు, ఐక్య సంఘటన వేదికలూ మొదలయిన వాటి నాయకత్వం మొత్తంగా మన విప్లవోద్యమం, దాని గరిష్ట, కనిష్ట కార్యక్రమం, వ్యూహం ఎత్తుగడలు, అంతిమ లక్ష్యాల దృష్టిని విడనాడకూడదు. మన వివిధ సంఘాలు, పోరాటాలూ కర్తవ్యాలూ మన కార్యక్రమం, వ్యూహం ఎత్తుగడల సాధారణత్వపు వెలుగులో, వాటి పరస్పర సంబంధం, వాటి ఐక్యత, మొత్తం సారం గురించిన అవగాహన కలిగి ఉండాలి. ఈ రకంగా మాత్రమే మనం అన్ని రకాల కార్మికవర్గేతర ధోరణులు, పెడధోరణులలో కూరుకుపోకుండానూ విప్లవేతర, విప్లవ ప్రతీఘాతుక సిద్ధాంతాలనూ రాజకీయాలనూ ఎదుర్కొని మన తక్షణ కర్తవ్యాలను పరిపూర్తి చేయగలుగుతాం, మన పాక్షిక పోరాటాలను ముందుకు తీసుకువెళ్లగలుగుతాం. తద్వారా భారత విప్లవ పురోగమనానికి ప్రభావవంతంగా దోహదం చేయగలుగుతాం.

పార్టీ బోల్షివీకరణ క్యాంపెయిన్ కాలంలో ప్రస్తుత శక్తులను సంఘటితం చేసుకోవడానికీ, నూతన శక్తులను అభివృద్ధి చేసుకోవడానికీ, జాతి విముక్తి ఉద్యమాలతో సహా సమస్త ప్రజాస్వామిక స్రవంతులతో ఐక్యం కావడానికీ, యావత్తు ప్రజాస్వామిక శక్తులనూ గెలుచుకోవడానికీ జీపీసీఆర్ గుణపాఠాలను ఉపయోగించుకుందాం. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మార్గదర్శకత్వంలో, జీపీసీఆర్ నుంచీ ప్రేరణ పొంది అన్ని రంగాలలోనూ వర్గ శత్రువులకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడదాం. అన్ని రకాల రివిజనిజాన్నీ తిప్పి కొడదాం. కార్మికవర్గ సిద్ధాంతానికీ, రాజకీయాలకూ, సంస్కృతికీ, ప్రాపంచిక దృక్పథానికీ స్థిరంగా అంటి పెట్టుకుని ఉందాం. తద్వారా వర్గ పోరాటాన్ని తుది వరకూ కొనసాగించి భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్నీ, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్నీ పరిపూర్తి చేద్దాం. ఆరిపోని అంతర్జాతీయతా స్ఫూర్తిని అంతిమంగా ఎత్తిపట్టే కమ్యూనిజం వైపు అడుగులు వేద్దాం -

*సంప్రదాయ సంకెళ్ళు మనల్ని బంధించలేవు,*
*ఓ బానిసలారా లేవండి! బానిసత్వాన్ని అంతం చేయండి!*
*ఈ భూమి ఇప్పుడు నూతన పునాదుల మీద ఎగుస్తున్నది*
*మనకంటూ ఏమీ లేని మనమంతా కలుద్దాం*
*ఇది ఆఖరి పోరాటం*
*ప్రతీ ఒక్కరం అమరుల స్థానాన్ని పూరిద్దాం*
*అంతర్జాతీయ పార్టీ మానవ జాతిని ప్రతిబింబిస్తుంది.*

# మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంపై సి.పి.ఐ.(మావోయిస్టు) డాక్యుమెంట్ల నుండి ఉల్లేఖనలు

చైనా మహత్తర సాంస్కృతిక విప్లవం అన్ని రకాల స్వార్థాలు, ముఠా మనస్తత్వం, రివిజనిజం, బూర్జువా వర్గానికి తోకగా ఉండడం, బూర్జువా భావజాల ప్రశంసల మీద యుద్ధం ప్రకటించింది - ఈ విప్లవ ప్రకాశవంతమైన ప్రభావం భారతదేశం కూడా చేరుకుంది. ఈ విప్లవం ఇలా పిలుపునిచ్చింది - 'అన్ని రకాల త్యాగాలూ చేయడానికి నిశ్చయంగా సంసిద్ధులు కండి, ఒక దాని తరువాత ఒకటిగా మార్గంలో అవరోధాలను తొలగించండి, విజయం మనదే'. సామ్రాజ్యవాదం ఎంత ఘోరంగా కనిపించినప్పటికీ, రివిజనిజం ఉచ్చు ఎంత అసహ్యకరంగా ఉన్నప్పటికీ, ప్రతీఘాతుక శక్తుల రోజులు దగ్గరపడ్డాయి. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు మెరిసే సూర్యకాంతి చీకటినంతా పారదోలుతుంది.

***- చారు మజుందార్, 'రివిజనిజం మీద పోరాడుతూ రైతాంగ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లండి'***

అంతర్గత పోరాటం చేయడం మనం చేపట్టవలసిన కర్తవ్యం అని చైనా మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం మనకు బోధించింది. ఈ కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మన కృషి ఫలితాలు విప్లవ శత్రువులు గుంజుకుంటారని తప్ప మరొకటి కాదు.

***- చారు మజుందార్, 'ఐక్య సంఘటన, విప్లవ పార్టీ', 1968 జులై***

చైనాలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ విజయానంతరం ప్రజాయుద్ధ మంటలు మరింత భీకరంగా ఎగుస్తూ వలస, అర్ధ వలస ప్రపంచంలో మరింత పరివ్యాప్తమయ్యాయి. దీంతో అమెరికా సామ్రాజ్యవాదులకు, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులకూ దేశ విదేశాలలో కష్టాలు పెరిగాయి. రివిజనిజం తేటతెల్లమై, ప్రజలను మోసగించే దాని శక్తి రోజు రోజుకూ వేగంగా తగ్గిపోతున్నది.

***- చారు మజుందార్, 'చైనా చైర్మన్ మన చైర్మన్ - చైనా పంథా మన పంథా', 1969, నవంబర్ 6***

చైనాలో సోషలిజాన్నీ కార్మికవర్గ నియంతృత్వాన్నీ ప్రపంచ విప్లవ విశ్వసనీయ ఆధార క్షేత్రంగా సంఘటితం చేసిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో మన విప్లవం ఒక భాగం. గొప్ప, మహత్తర, సరైన సీపీసీ తొమ్మిదవ కాంగ్రెస్ - ఐక్యతా, విజయాల కాంగ్రెస్ - అంతర్జాతీయ కార్మికవర్గాన్ని అపారంగా ప్రేరేపించిన తరుణంలో మన విప్లవం జరుగుతున్నది.

***- 1970 మేలో పార్టీ ఎనిమిదవ కాంగ్రెస్‌లో రూపొందించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు), కార్యక్రమం***

ఇటీవలి అంతర్జాతీయ పరిణామాలలో జరిగిన ముఖ్యమైన ఘటనలలో సోషలిస్టు చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ ఒకటి.

మావో సే టుంగ్ మరణానంతరం, తమ సమాజంలో జరుగుతున్న వర్గ పోరాటాన్ని, దాని పరిణామాలనూ, ఆ విప్లవ లక్షణాన్ని కొనసాగించే విధానాన్నీ అర్థం చేసుకోవడానికి నాయకత్వానికి తగినంత అనుభవం లేకపోయింది. లీషావ్‌చీని పార్టీ నాయకత్వం నుంచీ తొలగించారే కానీ పార్టీ నుంచీ పూర్తిగా తొలగించలేదు. దాంతో తొమ్మిదో కాంగ్రెస్ నిర్ణయానికి అనుగుణంగా సాంస్కృతిక విప్లవ ఫలితాన్ని సంఘటితం చేయడంలో సీపీసీ విఫలమయింది. ఈ వైఫల్యాన్ని అవకాశంగా తీసుకుని డెంగ్ గ్జియావో పింగ్ నాయకత్వంలో విప్లవ ప్రతీఘాతుక శక్తులు అంతర్గత కుట్రతోనూ విదేశీ శక్తి సహాయంతోనూ పార్టీ నాయకత్వాన్నీ రాజ్యాధికారాన్నీ గుంజుకున్నాయి. సోషలిస్టు చైనాను పెట్టుబడిదారీ రాజ్యంగా మార్చివేసాయి. చైనాలో విప్లవ ప్రతీఘాతకులను అణిచిపెట్టడం తాత్కాలికంగా విజయవంతమయింది. కానీ చివరకు సీపీసీ నాయకత్వం బూర్జువా వర్గం పట్టులోకి పోయింది. ఇది చైనా విప్లవానికే కాకుండా ప్రపంచ సోషలిస్టు విప్లవానికే తీవ్రమైన వెనకడుగు.

***- కన్హయ్ భటర్జీ (ఎంసిసి, భారత విప్లవ వ్యూహం నుండి)***

ఇరవయ్యో శతాబ్దంలో అరవయ్యో దశాబ్దం యావత్తు ప్రపంచాన్నీ కుదిపివేసిన వెల్లువల దశాబ్దం అన్నది అందరికీ తెలిసినదే. అటువంటి నేపధ్యంలో నిజమైన విప్లవకారులు మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానం (ఇప్పుడు మావోయిజం)తో ప్రేరణ పొంది, రివిజనిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు శంఖారావం ఊదారు. మావో నేతృత్వంలో సీపీసీ కృశ్చేవ్ రివిజనిజానికి వ్యతిరేకంగా మహత్తర వాదోపవాదాలు నిర్వహించింది. దీని తీవ్ర ప్రభావంలో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఒక నూతన ప్రారంభం చేసింది.

ఈ పరిస్థితిలోనే రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట క్రమంలో కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీ వంటి అద్వితీయ, అగ్ర శ్రేణి నాయకత్వ కామ్రేడ్స్ ఉద్భవించారు. 1964లో సీపీఎం ఏడో కాంగ్రెస్‌లో రివిజనిజానికి వ్యతిరేక పోరాటం పార్లమెంటరిజానికీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికీ మధ్య పోరాటంగా స్పష్టంగా ముందుకు వచ్చింది. అలా ప్రపంచాన్ని కుదిపివేసిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం భారతదేశంలో ఉద్భవిస్తున్న కమ్యూనిస్టు ఉద్యమం మీద అపారమైన ప్రభావం వేసింది. 1967లో కామ్రేడ్ సీఎం నాయకత్వంలో జరిగి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు భారతదేశంలో వసంత మేఘగర్జనయింది. భారతదేశమంతటా రివిజనిజానికి వ్యతిరేకంగా ఒక నూతన వెల్లువ ప్రారంభమయింది. ఒక రాజకీయ మార్పు పరిస్థితిని సృష్టించింది.

***- ఎంసీసీఐ, బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ది మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా***

1956లో సీపీఎస్‌యూ పన్నెండో కాంగ్రెస్‌లో మహా స్టాలిన్ మీద ద్రోహి కృశ్చేవ్ తప్పుడు, ద్వేషపూరిత ప్రచారం, దాడులు చేయడంతోనూ 'శాంతియుత పరివర్తన', శాంతియుత పోటీ', శాంతియుత సహజీవనం' అనే మూడు విషపూరిత సిద్ధాంతాల అమలుతోనూ, 1961లో 22వ కాంగ్రెస్‌లో 'యావత్తు ప్రజల రాజ్యం', యావత్తు ప్రజల పార్టీ' వంటి సిద్ధాంతాలతోనూ ఆధునిక రివిజనిజం ముందుకు వచ్చింది. ఈ రివిజనిస్టు సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్త కమ్యూనిస్టు ఉ

ద్యమంలో పెద్ద చర్చకు కేంద్రమయ్యాయి. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను కాపాడడం కోసమూ మార్క్సిజం లెనినిజాన్ని రివిజనిజం నుంచీ పరిరక్షించడం కోసమూ కృశ్చేవ్ రివిజనిజాన్ని ఎండగట్టడానికి మావో సే టుంగ్ నాయకత్వంలో సీపీసీ బహిరంగ చర్చకు దిగింది. సోవియట్ యూనియన్‌కూ చైనాకూ మధ్య అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం గురించిన ఈ సైద్ధాంతిక చర్చ మహత్తర వాదోపవాదాలుగా పేరు పొందింది. మహత్తర వాదోపవాదాల ప్రభావంలో, సీపీఎస్‌యూ నాయకత్వంలో రివిజనిస్టు స్రవంతికీ సీపీసీ నాయకత్వంలో మార్క్సిజం లెనినిజం విప్లవ స్రవంతికీ మధ్య ప్రపంచవ్యాప్తంగా వర్గీకరణ ప్రారంభం అయింది. ఇదే మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంగా రూపు దిద్దుకుంది. ఇది యావత్తు ప్రాపంచిక స్థాయిలోనూ ఒక నూతన విభజనను ముందుకు తెచ్చింది. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం (ఇప్పుడు మావోయిజం) మార్గదర్శక సిద్ధాంతంగా అవలంబించిన నూతన మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు ఆవిర్భవించసాగాయి.

భారత కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా భావజాల, సైద్ధాంతిక, రాజకీయ పోరాటాన్ని, విప్లవ స్రవంతి ఆవిర్భావాన్ని, అభివృద్ధినీ మహత్తర వాదోపవాదాల, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కొనసాగింపు నేపథ్యంలో చూడాలి.

**- ఎంసీసీఐ, పార్టీ చరిత్రలో కొన్ని అంశాలు, భారతదేశంలో ఏకీకృత విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం గురించిన దాని వైఖరి**

వర్గపోరాటాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్ని మాత్రమే గుర్తించేవారు మార్క్సిస్టులు కారు.... ఎవరైతే వర్గపోరాటం, కార్మికవర్గ నియంతృత్వమే కాకుండా సాధ్యమైనంత త్వరలో ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని పూర్తి చేసి, కమ్యూనిస్టు వ్యవస్థను నిర్మించే లక్ష్యంతో ఉపరితలంలో నిరంతర విప్లవాన్ని కూడా గుర్తిస్తారో, వారే మార్క్సిస్టులు.

***- ''ఆధునిక రివిజనిస్టు డెంగ్ ముఠాకు వ్యతిరేకంగా పోరాడండి'' సి.పి.ఐ.(ఎం.ఎల్.)(పీపుల్స్‌వార్) కేంద్రకమిటీ తీర్మానం,(19-2-1983)పేజీ 14***

పార్టీ 9వ కాంగ్రెసు మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని కీర్తిస్తున్నది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం వర్గపోరాటపు సిద్ధాంత, ఆచరణలలో చోటుచేసుకున్న ఇతోధిక అభివృద్ధి. అది కార్మిక వర్గ నియంతృత్వం క్రింద కొనసాగిన వర్గ పోరాటం. పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికి జరిగే ప్రయత్నాన్ని ఓడించడానికీ, కార్మికవర్గ విప్లవాన్ని బలవత్తరం చేయడానికీ, సోషలిజానికి మార్గాన్ని సుగమమం చేయడానికీ తగిన రూపాన్ని, పద్ధతిని సాంస్కృతిక విప్లవం ముందుకు తెచ్చింది. సాంస్కృతిక విప్లవం కార్మికవర్గ శక్తి సామర్థ్యాలనూ, దృఢ సంకల్పంతో కూడిన ఆత్మవిశ్వాసాన్ని వెల్లడిచేసింది. ప్రపంచ బూర్జువా వర్గాన్ని భయకంపితం చేసింది; ప్రపంచ వ్యాపితంగా వున్న పీడిత ప్రజానీకాన్ని, కార్మికవర్గ విప్లవకారులనూ వుత్తేజపరిచింది. అది ప్రజా పంథాను అమలు చేసింది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో, ఆరోగ్యం, సంస్కృతి, మహిళల సామాజిక ప్రతిపత్తి, మానసిక శారీరక శ్రమల మధ్య సంబంధం, ఇలా జీవితంలోని సకల రంగాలలోకి చొరబడి పోయిన బూర్జువా భావనను తిప్పికొట్టడానికి గానూ కోట్లాది ప్రజలను సమీకరించడం

ద్వారా అది ప్రజా పంథాను ఒక నూతన శిఖరానికి కొనిపోయింది. అది ఉపరితలంలోనూ, పునాదిలోనూ కూడా విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది. తత్ఫలితంగా కార్మికవర్గం - బూర్జువా వర్గాల మధ్య తీవ్ర పోరాటంలో కొత్త కొత్త నిర్మాణ రూపాలు అభివృద్ధి చెందాయి. అది ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని ఖాయం చేయడానికై తగిన వివిధ నిర్మాణాలు వేదికల రూపాలను రూపొందించింది. రాజ్యకార్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని ఇంకా ఇంకా ఎక్కువ చేయడానికి హామీని కల్పించే నూతన రాజ్య వ్యవస్థ (స్టేట్ స్ట్రక్చర్) రూపాలు ఆవిర్భవించడానికి కూడా అది దోహద పడింది.

అది ప్రపంచాన్నే కుదిపివేసినటువంటి ఒక అపూర్వ ప్రయోగం. సోషలిస్టు చైనాలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరిగినప్పటికీ మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవపు చారిత్రక ప్రాధాన్యతను తక్కువ చేసి చెప్పజాలం. అది కార్మికవర్గ విప్లవ పథాన్ని సదా ప్రకాశవంతం చేస్తూనే వుంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణకోసం జరిగే ప్రతి ప్రయత్నాన్నీ వమ్ముచేసి ఆశించిన లక్ష్యాన్ని సాధించడానికి గానూ విప్లవ ఆచరణను కొనసాగించడంకోసం అంతర్జాతీయ కార్మికవర్గం చేతుల్లో వున్న శక్తివంతమైన ఆయుధం అది. చై.క.పా. 9వ కాంగ్రెసు మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవపు విజయానికి సంకేతంగా నిలిచి, కార్మికవర్గ నియంతృత్వాన్ని మరింతగా సుసంఘటితం చేసింది.

***– చైనాపై సి.పి.ఐ.(ఎం.ఎల్.)[పీపుల్స్‌వార్] 9వ కాంగ్రెస్ తీర్మానం (2001)***

'అంతర్జాతీయంగానూ, భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ రివిజనిజం ప్రధాన ప్రమాదం. మాలెమా పునాదిగానూ, ముఖ్యంగా డెంగ్-హువా రివిజనిజానికీ దాని మూడు ప్రపంచాల సిద్ధాంతానికీ వ్యతిరేకంగా పోరాటాన్ని గాఢతరం చేయడం, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ గుణపాఠాలను సంపూర్ణంగా గ్రహించడం ద్వారా అన్ని రకాల రివిజనిజానికీ, పిడివాదానికీ వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాలి'.

***- భాకపా (ఎంఎల్) నక్సల్బరీ, 'భాకపా (ఎంఎల్) నక్సల్బరీ మౌలిక వైఖరులు'***

'బూర్జువా ప్రజాస్వామిక దృక్పథంతో విడివడని వాళ్లు నూతన ప్రజాస్వామిక దశలో విప్లవకారులుగా ఎలా ఉన్నారో, అది పూర్తయిన తరువాత పెట్టుబడిదారీ మార్గీయులుగా ఎలా మారారోనన్న గుణపాఠాన్ని కూడా జీపీసీఆర్ అందిస్తుంది.

***- సీపీఎన్ (మావోయిస్టు)కు భాకపా (ఎంఎల్) నక్సల్బరీ రాసిన లేఖ నుంచి, డిసెంబర్ 2010***

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రపంచాన్నే కుదిపివేసిన ఒక సంఘటనగా రుజువైన చారిత్రాత్మక కార్మికవర్గ మహత్తర సాంస్కృతిక విప్లవాన్ని మావో సే-టుంగ్ ప్రారంభించి నాయకత్వం వహించారు. అది, కార్మికవర్గ నియంతృత్వాన్ని పరిరక్షించడంలో, కార్మికవర్గ నియంతృత్వాన్ని నెరపడంలో ఒక గుణాత్మకమైన గొంతుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది, ప్రధానంగా సోషలిస్టు సమాజంలో పుట్టుకొచ్చే పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో మావో సే-టుంగ్

“*తిరగబడ్డం సరైందే !*” “*ప్రధాన కేంద్రాన్ని దెబ్బతీయండి*” అనే చారిత్రాత్మకమైన, శక్తివంతమైన కొత్త నినాదాలను ఇచ్చారు. ఆ నినాదాలు చైనా అంతటా మారుమ్రోగిపోయి, పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా పూరించిన శంఖారావమే అయ్యాయి. కోట్లాది మంది ప్రజలను క్రింది నుండి పెద్దయెత్తున కదల్చడానికి అవి తోడ్పడ్డాయిఅంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రపంచాన్నే కుదిపివేసిన ఒక సంఘటనగా రుజువైన చారిత్రాత్మక కార్మికవర్గ మహత్తర సాంస్కృతిక విప్లవాన్ని మావో సే-టుంగ్ ప్రారంభించి నాయకత్వం వహించారు. అది, కార్మికవర్గ నియంతృత్వాన్ని పరిరక్షించడంలో, కార్మికవర్గ నియంతృత్వాన్ని నెరపడంలో ఒక గుణాత్మకమైన గెంతుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది, ప్రధానంగా సోషలిస్టు సమాజంలో పుట్టుకొచ్చే పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కాలంలో మావో సే-టుంగ్ “*తిరగబడ్డం సరైందే !*” “*ప్రధాన కేంద్రాన్ని దెబ్బతీయండి*” అనే చారిత్రాత్మకమైన, శక్తివంతమైన కొత్త నినాదాలను ఇచ్చారు. ఆ నినాదాలు చైనా అంతటా మారుమ్రోగిపోయి, పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా పూరించిన శంఖారావమే అయ్యాయి. కోట్లాది మంది ప్రజలను క్రింది నుండి పెద్దయెత్తున కదల్చడానికి అవి తోడ్పడ్డాయి........

కామ్రేడ్ మావో మార్క్సిజం-లెనినిజం సత్యాన్ని చైనా విప్లవపు నిర్దిష్ట ఆచరణతో సంలీనం చేసే క్రమంలో ఆ విజ్ఞాన శాస్త్రాన్ని ఒక నూతనమైన గుణాత్మకమైన ఉన్నత దశకు అభివృద్ధిపరిచారు. పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి సోషలిజాన్ని పటిష్టవంతం చేయడానికి ఉద్దేశించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ సిద్ధాంతం ఆ గుణాత్మకంగా ఉన్నతమైన నూతన సంశ్లేషణ యొక్క ఫలితమే. కార్మికవర్గ నాయకత్వం క్రింద సాగిన వర్గపోరాట చరిత్రలో దానితో పోల్చదగినదేదీ లేదు.

అందువల్ల మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతానికి మావో చేసిన గొప్ప, ఉన్నతమైన చేర్పు మాత్రమే కాదు. పెట్టుబడిదారీ పునరుద్ధరణను నివారించి ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు సమాజం కమ్యూనిజం దిశగా పురోగమించే చారిత్రాత్మక సిద్ధాంతంగా అది మరింత ప్రాధాన్యత కలిగినది కూడా.

**– *ఎం.ఎల్.ఎం. డాక్యుమెంట్, సి.పి.ఐ.(మావోయిస్టు)(2007)***

కార్మికవర్గ నియంతృత్వం కింద నిరంతరాయంగా విప్లవాన్ని కొనసాగించడం అనే మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు సూత్రాలకు అనుగుణంగా సోషలిస్టు సమాజంలో కూడా వర్గాలూ, వర్గ వైరుధ్యాలూ, వర్గపోరాటాలూ ఉంటాయి. అది కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని పురోగమింపజేస్తూ ఉంటుంది. తద్వారా పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు పెట్టుబడిదారీ మార్గీయులూ, సామ్రాజ్యవాదులూ, ఆధునిక రివిజనిస్టులూ చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఎదిరించి ఓడిస్తుంది. ఈ క్రమం ద్వారా సోషలిస్టు సమాజంలో ప్రవేశపెట్టే ఎటువంటి వక్రీకరణలనైనా అది ఎదిరించి పోరాడుతుంది. ముఖ్యంగా బ్యూరోక్రసీకి వ్యతిరేకంగా పోరాడుతుంది. తద్వారా ప్రజలు కార్మికవర్గ పార్టీ నుండి గానీ, సోషలిస్టు రాజ్యం నుండి గానీ పరాయీకరణ చెందకుండా చూసి, వాళ్లు రాజ్యంలో పాల్గొనేలా ఖాయం చేస్తుంది.

**– *పార్టీ కార్యక్రమం, సి.పి.ఐ.(మావోయిస్టు)(2007)****

# మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంపై చైనా కమ్యూనిస్టు పార్టీ

## సీపీసీ కేంద్ర కమిటీ సర్క్యులర్

### 1966 మే 16

కేంద్ర కమిటీ అన్ని ప్రాంతీయ బ్యూరోలకు, అన్ని రాష్ట్ర, మునిసిపల్, స్వయం ప్రతిపత్తి ప్రాంతీయ పార్టీ కమిటీలకు, కేంద్ర కమిటీ కింద ఉన్న సమస్త విభాగాలు, కమిషన్‌లకు, మొత్తం నాయకత్వ ప్రభుత్వ విభాగాలు, ప్రజా సంఘాలలో పార్టీ సభ్యుల గ్రూపులకు, పార్టీ కమిటీలకు, ప్రజా విముక్తి సైన్యం సాధారణ రాజకీయ విభాగానికీ –

1966 ఫిబ్రవరి 12వ తేదీన పంపిణీ కోసం ఆమోదం పొందిన, సాంస్కృతిక విప్లవానికి బాధ్యత వహిస్తున్న గ్రూప్ ఆఫ్ ఫైవ్ చేసిన వర్తమాన అకడమిక్ చర్చ మీద స్థూల రిపోర్ట్‌ను వెనక్కు తీసుకోవాలని, 'సాంస్కృతిక విప్లవ బాధ్యతలో ఉన్న గ్రూప్ ఆఫ్ ఫైవ్'నూ దాని కార్యాలయాలనూ రద్దు చేయాలని, పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ కింద నేరుగా ఒక నూతన సాంస్కృతిక విప్లవ గ్రూపును ఏర్పరచాలనీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. 'గ్రూప్ ఆఫ్ ఫైవ్' చేసిన స్థూల రిపోర్ట్‌గా చెబుతున్నది మౌలికంగా తప్పు. సోషలిస్టు సమాజంలో వర్గాలు, వర్గ పోరాట సమస్యకు సంబంధించి కేంద్ర కమిటీ, కామ్రేడ్ మావో సే టుంగ్ రూపొందించిన సోషలిస్టు సాంస్కృతిక విప్లవ పంథాకు, 1962లో పార్టీ ఎనిమిదో కేంద్ర కమిటీ పదో ప్లీనరీ సెషన్ రూపొందించిన మార్గదర్శక సూత్రాలకూ ఇది విరుద్ధం. ఆమోదం ఉన్నట్టుగా కనిపిస్తున్న ఈ రిపోర్ట్ నిజానికి, చైర్మన్ మావో సే టుంగ్ వ్యక్తిగతంగా ప్రారంభించి నాయకత్వం వహిస్తున్న మహత్తర సాంస్కృతిక విప్లవాన్ని, అలాగే 1965 సెప్టెంబర్, అక్టోబర్‌లలో కేంద్ర కమిటీ వర్కింగ్ కాన్ఫరెన్స్ (అంటే, కేంద్ర కమిటీ అన్ని ప్రాంతీయ బ్యూరోల నాయకత్వ కామ్రేడ్స్ హాజరయిన కేంద్ర కమిటీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సెషన్)లో వూ హాన్ మీద విమర్శకు సంబంధించిన ఆయన ఆదేశాలనూ వ్యతిరేకిస్తున్నది, బలంగా ప్రతిఘటిస్తున్నది.

'గ్రూప్ ఆఫ్ ఫైవ్' స్థూల రిపోర్ట్ నిజానికి పెంగ్ చెన్ ఒక్కడిదే. 'గ్రూప్ ఆఫ్ ఫైవ్' సభ్యుడు కాంగ్ షెంగ్‌కు, ఇతర కామ్రేడ్స్‌కు తెలపకుండా తన సొంత భావాలతో దీన్ని వక్రీకరించాడు. సోషలిస్టు విప్లవంలో మొత్తం పరిస్థితిని ప్రభావితం చేసే ఇటువంటి ముఖ్యమైన సమస్యల

గురించిన డాక్యుమెంటు రాస్తున్నప్పుడు 'గ్రూప్ ఆఫ్ ఫైవ్'లో ఎటువంటి చర్చ కానీ అభిప్రాయాలు ఇచ్చి పుచ్చుకోవడం కానీ పెంగ్ చెన్ చేయలేదు. ఏ స్థానిక పార్టీ కమిటీనీ అభిప్రాయం అడగలేదు. ఈ స్థూల రిపోర్ట్‌ను ఒక అధికార డాక్యుమెంటుగా పరిశీలన కోసం కేంద్ర కమిటీకి పంపుతున్నట్టుగా కూడా అతను స్పష్టం చేయలేదు. అసలు కేంద్ర కమిటీ చైర్మన్ కామ్రేడ్ మావో సే టుంగ్ ఆమోదమే తీసుకోలేదు. అత్యంత నిజాయితీ లేని పద్ధతులలో, అతను ఏకపక్షంగా వ్యవహరించాడు. తన అధికారాలను దుర్వినియోగ పరచి, కేంద్ర కమిటీ పేరు వాడుకొని ఈ స్థూల రిపోర్ట్‌ను హడావుడిగా యావత్తు పార్టీకీ జారీ చేశాడు.

ఈ స్థూల రిపోర్ట్‌లో ముఖ్యమైన పొరపాట్లు ఇలా ఉన్నాయి. –

**1.** బూర్జువా వైఖరితో బూర్జువా ప్రాపంచిక దృక్పథంతో ఈ రిపోర్ట్ ప్రస్తుత పరిస్థితిని గురించీ వర్తమాన అకడమిక్ విమర్శ స్వభావం గురించీ శత్రువునూ మనలనూ పూర్తిగా ఒకే గాటన కట్టి, ఒక దాని స్థానంలో మరొక దానిని ఉంచుతుంది. ప్రస్తుతం మన దేశం మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ వెల్లువలో ఉన్నది. బూర్జువా వర్గం ఇంకా పట్టుకు వేళ్లాడుతున్న పాత భావజాల, సాంస్కృతిక వైఖరుల మీదనూ, భూస్వామ్య అవశేషాల మీదనూ ఇది దెబ్బ మీద దెబ్బ తీస్తున్నది. విశాల కార్మిక, కర్షక ప్రజానీకం, సైనికులు, కార్మికవర్గ సంస్కృతి కోసం పని చేసే యోధులూ ముందుకు దూసుకు వెళ్లే విధంగా వారిని ధైర్యంగా జాగృతులను చేయడం కోసం యావత్తు పార్టీనీ ప్రోత్సహించడానికి బదులుగా ఈ రిపోర్ట్ ఈ ఉద్యమాన్ని మితవాదం లోకి తీసుకుపోవడానికి శక్తి మేరకు పని చేస్తుంది. గందరగోళమైన, పరస్పర విరుద్ధమైన, మోసపూరిత భాషతో సాంస్కృతిక, భావజాల రంగంలో జరుగుతున్న తీవ్రమైన వర్గ పోరాటాన్ని మరుగున పెడుతుంది. ముఖ్యంగా వూ హాన్‌ను, గణనీయ సంఖ్యలో ఉన్న పార్టీ వ్యతిరేక, సోషలిస్టు వ్యతిరేక బూర్జువా వర్గ ప్రతినిధులను (ఇటువంటి వారు కేంద్ర కమిటీలో, పార్టీ, ప్రభుత్వం, ఇతర కేంద్ర, రాష్ట్ర, మునిసిపల్, స్వయం ప్రతిపత్తి ప్రాంతీయ స్థాయిలలో ఎంతో మంది ఉన్నారు) విమర్శించి, తిప్పి కొట్టే లక్ష్యంతో జరుగుతున్న ఈ మహా పోరాటాన్ని మరుగుపరుస్తుంది. చైర్మన్ మావో పదే పదే పేర్కొన్న, హాయ్ జుయి డిస్మిస్డ్ ఫ్రమ్ ఆఫీస్ (హాయ్ జుయిని ఆఫీసు నుంచి తొలగించారు) అనే వూ హాన్ నాటకంలో ప్రధాన అంశం ఆఫీసు నుంచి తొలగించే అంశమేనన్న వాస్తవాన్ని ఎంతమాత్రం పేర్కొనదు. ఈ పోరాటానికి ఉన్న తీవ్ర రాజకీయ స్వభావాన్ని ఈ రిపోర్ట్ దాచి పెడుతుంది.

**2.** సమస్త వర్గ పోరాటాలూ రాజకీయ పోరాటాలేనన్న మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాన్ని ఈ రిపోర్ట్ ఉల్లంఘిస్తుంది. వూ హాన్ రాసిన హాయి జుయి డిస్మిస్డ్ ఫ్రమ్ ఆఫీస్ నాటకంలో ఉన్న రాజకీయ అంశాల గురించి ప్రెస్ తడమసాగడంతో, ఈ రిపోర్ట్ రాసిన వాళ్లు ఎంత వరకూ వెళ్లారో చూడండి – 'ప్రెస్‌లో చర్చ రాజకీయ అంశాలకు పరిమితం కాకూడదు. ఇందులో ఉ

న్న వివిధ అకడమిక్, సైద్ధాంతిక సమస్యలను పూర్తిగా చూడాలి'. వూ హాన్‌ను విమర్శించడం విషయానికి వస్తే, ఇందులో ప్రధాన విషయం గురించి, అంటే 1959లో లూషాన్ మీటింగులో మితవాద అవకాశవాదులను తొలగించడం, వూ హాన్, ఇతరులూ పార్టీనీ, సోషలిజాన్నీ వ్యతిరేకించడం గురించిన చర్చను అనుమతించరాదని వాళ్లు వివిధ సందర్భాలలో ప్రకటించారు. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం ఒక దీర్ఘకాలిక వర్గ పోరాటం అని, తొందరపాటు రాజకీయ నిర్ధారణలతో పరిష్కారం దొరకదనీ కామ్రేడ్ మావో సే టుంగ్ ఎన్నోసార్లు చెప్పి ఉన్నాడు. అయితే, రెండు నెలల తరువాత వూ హాన్ మీద విమర్శ గురించి రాజకీయ నిర్ధారణలకు రావాలని ఛైర్మన్ మావో భావించినట్టుగా అనేకమందికి చెబుతూ పెంగ్ చెన్ కావాలని పుకార్లు పుట్టించాడు. రెండు నెలల తరువాత రాజకీయ అంశాలు చర్చించవచ్చునని కూడా పెంగ్ చెన్ అన్నాడు. సాధారణంగా బూర్జువా వర్గం చేసినట్టుగా, సాంస్కృతిక రంగంలో రాజకీయ పోరాటాన్ని కేవలం అకడమిక్ చర్చ లాగా నిర్వహించాలన్నది అతని లక్ష్యం. ఇది బూర్జువా రాజకీయాలకు ప్రాముఖ్యత ఇస్తూ కార్మికవర్గ రాజకీయాలకు ప్రాముఖ్యతను ఇవ్వడాన్ని వ్యతిరేకించడమేనని స్పష్టమవుతున్నది.

**3.** 'విశాలంగా ఉండడం' అంటూ ఈ రిపోర్ట్ ప్రత్యేకంగా నొక్కి చెబుతుంది. అయితే 1957 మార్చ్‌లో ప్రచార పని గురించిన పార్టీ జాతీయ మహాసభలో కామ్రేడ్ మావో సే టుంగ్ వివరించిన 'విశాలంగా ఉండండి' అన్న విధానాన్ని తన టక్కరి జిత్తుతో తీవ్రంగా వక్రీకరిస్తుంది. 'విశాలంగా ఉండండి' అన్న దానిలోని వర్గ సారాన్ని వ్యతిరేకిస్తుంది. ఈ విషయం గురించి మాట్లాడుతూ కామ్రేడ్ మావో సే టుంగ్ ఇలా అంటాడు –

'బూర్జువా, పెటీ బూర్జువా భావజాలానికి వ్యతిరేకంగా మనం ఇంకా సుదీర్ఘ పోరాటం చేయవలసి ఉంది. ఇది అర్థం చేసుకోకపోవడం, భావజాల పోరాటాన్ని విడిచిపెట్టడం తప్పు. సమస్త తప్పుడు భావాలు, సమస్త విషపూరిత కలుపు మొక్కలు, సమస్త దెయ్యాలు, భూతాలను విమర్శించాలి. ఎటువంటి పరిస్థితిలోనూ వాటిని వ్యాపించనివ్వరాదు'.

కామ్రేడ్ మావో సే టుంగ్ ఇంకా ఇలా అన్నాడు. "*విశాలంగా ఉండడం* అంటే ప్రజలందరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం, ధైర్యంగా మాట్లాడడం, విమర్శించడం, వాదించడం...". అయితే ఈ రిపోర్ట్ బూర్జువా ప్రతీఘాతుక వైఖరిని కార్మికవర్గం ఎండగట్టడానికి వ్యతిరేకంగా 'విశాలంగా ఉండడం' గురించి మాట్లాడింది. 'విశాలంగా ఉండడం' అంటే ఈ రిపోర్ట్ చెప్పిన అర్థం బూర్జువా సరళీకరణ. దీని ప్రకారం బూర్జువా వర్గం మాత్రమే 'విశాలంగా ఉండాలి'. కార్మికవర్గం 'విశాలంగా ఉండరాదు'. బూర్జువా వర్గానికి ఎదురు చెప్పకూడదు. మరో మాటలో చెప్పాలంటే వూ హాన్ వంటి బూర్జువా వర్గ ప్రతీఘాతుక ప్రతినిధులకు ఇది ఒక కవచం. ఈ రిపోర్ట్‌లో 'విశాలంగా ఉండడం' మావో సే టుంగ్ ఆలోచనా విధానానికి

విరుద్ధమైనది. బూర్జువా వర్గ అవసరాలకు ఉపయోగపడేది.

**4.** బూర్జువా వర్గ తీవ్ర దాడులకు వ్యతిరేకంగా మనం ప్రతి దాడి ప్రారంభించినప్పుడే ఈ రిపోర్ట్ రాసిన వాళ్లు 'సత్యం ముందు అందరూ సమానులే' అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చారు. ఇది బూర్జువా నినాదం. సత్యానికి ఉన్న వర్గ స్వభావాన్ని పూర్తిగా వ్యతిరేకించే వీరు, బూర్జువా వర్గాన్ని పరిరక్షించి, కార్మికవర్గాన్ని వ్యతిరేకించడానికీ, మార్క్సిజం-లెనినిజాన్ని వ్యతిరేకించి మావో సే టుంగ్ ఆలోచనా విధానాన్ని వ్యతిరేకించడానికీ ఈ నినాదాన్ని ఉపయోగిస్తారు. కార్మికవర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్య పోరాటంలో, మార్క్సిస్టు సత్యానికీ బూర్జువా వర్గ, ఇతర సమస్త దోపిడీ వర్గాల బూటకానికీ మధ్య పోరాటంలో తూర్పు గాలి పశ్చిమ గాలిని మించుతుంది లేదా పశ్చిమ గాలి తూర్పు గాలిని మించుతుంది. కానీ సమానత్వం అనేది ఉండనే ఉండదు. కార్మికవర్గం బూర్జువా వర్గం మీద చేసే పోరాటం, బూర్జువా వర్గం మీద కార్మికవర్గ నియంతృత్వం, సమస్త సాంస్కృతిక రంగాలతో సహా ఉపరితలంలో కార్మికవర్గ నియంతృత్వం, ఎర్ర జెండాను వ్యతిరేకించడానికి 'ఎర్ర జెండాలు' ఊపే కమ్యూనిస్టు పార్టీలోకి చొచ్చుకువచ్చిన బూర్జువా వర్గ ప్రతినిధులను ఏరి పారేయడానికి కార్మికవర్గ నిరంతర కృషి వంటి మౌలిక అంశాలలో సమానత్వాన్ని అనుమతించగలమా? దశాబ్దాలుగా పాత రకం సోషల్ డెమోక్రాట్స్, పది సంవత్సరాలుగా ఆధునిక రివిజనిస్టులూ కార్మికవర్గాన్ని ఎన్నడూ బూర్జువా వర్గంతో సమానంగా ఉండనివ్వలేదు. వేన వేల సంవత్సరాల మానవ చరిత్ర వర్గ పోరాటాల చరిత్రేనన్నది వాళ్లు పూర్తిగా నిరాకరిస్తారు. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే వర్గ పోరాటాన్ని, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ విప్లవాన్ని, బూర్జువా వర్గం మీద కార్మికవర్గ నియంతృత్వాన్నీ వాళ్లు పూర్తిగా నిరాకరిస్తారు. పైగా వాళ్లు బూర్జువా వర్గానికీ, సామ్రాజ్యవాదులకూ విశ్వసనీయమైన ఏజెంటులు. బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదులతో కలిసి వాళ్లు కార్మికవర్గాన్ని పీడించే, దోపిడీ చేసే బూర్జువా భావజాలానికీ, పెట్టుబడిదారీ విధానానికీ అంటి పెట్టుకుని ఉంటారు. మార్క్సిస్టు-లెనినిస్టు భావజాలాన్నీ సోషలిస్టు వ్యవస్థనూ వ్యతిరేకిస్తారు. వాళ్లు కమ్యూనిస్టు పార్టీనీ ప్రజలనూ వ్యతిరేకించే విప్లవ ప్రతీఘాతకుల ముఠా. మనకు వ్యతిరేకంగా వాళ్ల పోరాటం జీవన్మరణ పోరాటమే. ఇక్కడ సమానత్వం సమస్య లేదు. అందుకని వాళ్లకు వ్యతిరేకంగా మన పోరాటం కూడా జీవన్మరణ పోరాటమే తప్ప మరొకటి కాదు. వాళ్లతో మన సంబంధం ఏ రకంగానూ సమానత్వం కాజాలదు. తద్భిన్నంగా, ఒక వర్గం మరో వర్గాన్ని పీడించే సంబంధం ఇది. అంటే బూర్జువా వర్గం మీద కార్మికవర్గ నియంతృత్వం. దోపిడీ చేసే వర్గాలకూ దోపిడీకి గురి అయ్యే వర్గాలకూ మధ్య సమానత్వ సంబంధంగా శాంతియుత సహజీవనంగా చెప్పుకునే లాంటి మరే ఇతర రకం సంబంధమూ, లేదా దయ, కరుణా ఉండజాలవు.

5. 'అవతలి పక్షాన్ని రాజకీయంగా దెబ్బ తీయడమే కాకుండా నిజంగా ఒక విశాలమైన అకడమిక్, వృత్తిపర ప్రమాణాలలో మించిపోయి, దెబ్బ తీయాలి' అని రిపోర్ట్ పేర్కొంది. అకడమిక్ వ్యవహారాలలో ఎటువంటి వర్గ వ్యత్యాసం చూడని ఈ సూత్రీకరణ కూడా చాలా తప్పు. అకడమిక్ సమస్యల గురించిన సత్యం మార్క్సిజం-లెనినిజం గురించిన సత్యం, మావో సే టుంగ్ ఆలోచనా విధానం గురించిన సత్యం-కార్మికవర్గం గ్రహించి ఇప్పటికే బూర్జువా వర్గాన్ని ఎంతగానో మించిపోయింది, ఓడించింది. ఈ రిపోర్ట్‌లో ఉన్న సూత్రీకరణ చూస్తే అది రాసిన వాళ్లు బూర్జువా అకడమిక్‌ల అధికారంగా చెప్పుకుంటున్న దానిని ప్రశంసిస్తూ తమ ప్రతిష్ఠను పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారనీ, అకడమిక్ రంగంలో కార్మికవర్గ ప్రతినిధులుగా ఉన్న మిలిటెంటు నూతన శక్తులను ద్వేషిస్తున్నారనీ అణచిపెడుతున్నారనీ అర్థం అవుతుంది.

6. విధ్వంసం లేకుండా నిర్మాణం లేదని చైర్మన్ మావో తరచూ అంటుంటారు. విధ్వంసం అంటే విమర్శ, ఖండన అంటే విప్లవం. ఇందులో విషయాలను చర్చించడం ఉంటుంది. అదే నిర్మాణం. ముందు విధ్వంసం చేయండి, ఈ క్రమంలో మీకు నిర్మాణం జరుగుతుంది. బూర్జువా సిద్ధాంతాన్ని ధ్వంసం చేసే పోరాట క్రమంలోనే మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం పుట్టి, నిరంతరం అభివృద్ధి చెందుతూ వచ్చింది. అయితే, 'నిర్మాణం లేకుండా నిజమైన, క్షుణ్ణమైన విధ్వంసం ఉండదు' అని ఈ రిపోర్ట్ వక్కాణిస్తుంది. దీని అర్థం, బూర్జువా భావజాలాన్ని విధ్వంసం చేయరాదు. కార్మికవర్గ భావజాలాన్ని నిర్మించరాదు. ఇది చైర్మన్ మావో ఆలోచనా విధానానికి పూర్తిగా విరుద్ధం. అలాగే బూర్జువా భావజాలాన్ని పెద్ద ఎత్తున ధ్వంసం చేయాలని సాంస్కృతిక రంగంలో మనం చేస్తున్న విప్లవ పోరాటానికి విరుద్ధం. కార్మికవర్గం విప్లవమే చేయరాదని అనడమే ఇది.

**7.** 'తమ అధికారంతో ప్రజలను కూలదోయడానికి ఎల్లప్పుడూ ఏకపక్షంగా వ్యవహరించే పరిశోధక నిరంకుశుల మాదిరిగా మనం ప్రవర్తించకూడదు' అని ఈ రిపోర్ట్ పేర్కొంది. అలాగే 'బూర్జువా నిపుణుల, పరిశోధక నిరంకుశుల మార్గం చేపట్టే వామపక్ష అకడమిక్ కార్యకర్తల ధోరణి పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి' అని రాసింది. ఈ 'పరిశోధక నిరంకుశులు' ఎవరు? కార్మికవర్గం నియంతృత్వం అమలు చేసి బూర్జువా వర్గాన్ని కూలదోయకూడదా? కార్మికవర్గ అకడమిక్ పని బూర్జువా వర్గ అకడమిక్ పనిని నిలిపివేయకూడదా? కార్మికవర్గ అకడమిక్ పని బూర్జువా వర్గ అకడమిక్ పనిని కూలదోస్తే దానిని 'పరిశోధక నిరంకుశుల' చర్యగా పరిగణిస్తామా? ఈ రిపోర్ట్ కార్మికవర్గ వామపక్షానికి వ్యతిరేకంగా దాడి ఎక్కుపెడుతుంది. మార్క్సిస్టు-లెనినిస్టులను 'పరిశోధక నిరంకుశులు'గా ముద్ర వేయడం, నిజమైన బూర్జువా పరిశోధక నిరంకుశులకు మద్దతునివ్వడం, అకడమిక్ రంగంలో పడిపోతున్న వీరి గుత్తాధిపత్య స్థానాన్ని ఎత్తి పట్టడం వారి ఉద్దేశ్యం అన్నది స్పష్టంగా అర్థం అవుతున్నది. నిజానికి, బూర్జువా

పరిశోధక నిరంకుశులనూ పార్టీలోకి చొచ్చుకు వచ్చిన బూర్జువా ప్రతినిధులనూ సమర్థించి, బూర్జువా పరిశోధక నిరంకుశులను పరిరక్షించే పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన పార్టీ నాయకులే పార్టీ పేరును వాడుకుంటున్న పెద్ద నిరంకుశులు. వాళ్లు పుస్తకాలు చదవరు. రోజువారీ పేపర్ చదవరు. ప్రజలతో సంబంధం ఉండదు. నేర్చుకోవడం అనేది ఉండనే ఉండదు. వాళ్లు 'ఏకపక్షంగా వ్యవహరించి, తమ అధికారంతో ప్రజల మీద పెత్తనం చేసేందుకు ప్రయత్నించడం' మీదనే ఆధారపడతారు.

**8.** తమ అంతిమ ప్రయోజనాల కోసం ఈ రిపోర్ట్ రాసిన వాళ్లు గందరగోళం సృష్టించడానికి, వర్గ సమీకరణలను మభ్య పెట్టడానికి, ప్రజలను పోరాట లక్ష్యం నుంచి పెడ తోవ పట్టించడానికీ, బలమైన వామపక్షానికి వ్యతిరేకంగా 'దిద్దుబాటు క్యాంపెయిన్' జరపాలని డిమాండ్ చేస్తారు. అంత త్వరపడి రిపోర్ట్‌ను తీసుకురావడంలో ప్రధాన లక్ష్యం కార్మికవర్గ వామపక్షం మీద దాడి చేయడమే. వామపక్షం గురించి వాళ్లు పద్ధతులు విడనాడి పత్రాల మీద పత్రాలు తయారు చేశారు. దాని మీద దాడి చేయడానికి అన్ని రకాల సాకులూ వెతికేందుకు ప్రయత్నించారు. 'దిద్దుబాటు క్యాంపెయిన్' ద్వారా మరిన్ని దాడులు చేయాలని ఆశించారు. ఈ రకంగా ఆ శ్రేణులను దిగజార్చడానికి విఫలయత్నం చేశారు. వామపక్షాన్ని పరిరక్షించి, మద్దతు అందించేందుకు, దాన్ని నిర్మించి తమ శ్రేణులను విస్తరించుకునేందుకూ గట్టిగా శ్రద్ధ పెట్టాలంటూ చైర్మన్ మావో స్పష్టంగా ముందుకు తెచ్చిన విధానాన్ని వాళ్లు బహిరంగంగా ప్రతిఘటిస్తారు. మరో పక్క, పార్టీలోకి చొచ్చుకు వచ్చిన బూర్జువా ప్రతినిధులు, రివిజనిస్టులు, రెనగేడ్‌లకు 'బలమైన వామపక్షం' అన్న బిరుదునిచ్చి వారిని కాపాడుతున్నారు. ఈ రకంగా వాళ్లు బూర్జువా మితవాదుల అహంకారాన్ని రగిలించేందుకు, కార్మికవర్గ వామపక్ష స్ఫూర్తిని నీరు కార్చేందుకూ ప్రయత్నిస్తున్నారు. కార్మికవర్గం అంటే వాళ్లకు నిండా ద్వేషం. బూర్జువా వర్గం అంటే ప్రేమ. ఈ రిపోర్ట్ రాసిన వారిలో సోదర భావం గురించిన బూర్జువా అవగాహన అలా ఉంది.

**9.** సరిగ్గా బూర్జువా వర్గ ప్రతినిధులకు వ్యతిరేకంగా కార్మికవర్గ నూతన, శక్తివంతమైన పోరాటం ప్రారంభం అయిన సమయంలో–అనేక రంగాలలో, ప్రదేశాలలో ఇంకా ప్రారంభం కాలేదు, ఒకవేళ ప్రారంభమయినా ఈ మహత్తర పోరాటంలో నాయకత్వ కర్తవ్యం గురించి సంబంధిత అనేక పార్టీ కమిటీలకు చాలా తక్కువ అవగాహన ఉన్నది, వారి నాయకత్వం చైతన్యవంతంగా, ప్రభావవంతంగా లేనే లేదు–ఇటువంటి సమయంలో, ఈ పోరాటాన్ని 'ఆదేశంతో', 'నిశితంగా', 'జాగ్రత్తగా', 'సంబంధిత నాయకత్వ సంస్థల ఆమోదంతో' నిర్వహించాలని ఈ రిపోర్ట్ పదే పదే నొక్కి చెబుతుంది. ఇదంతా కార్మికవర్గ వామపక్షం మీద ఆంక్షలు పెట్టడానికి, దాని చేతులు కట్టివేయడం కోసం సంప్రదాయాలూ ఆదేశాలూ విధించడానికి, కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ మార్గంలో అన్ని రకాల అడ్డంకులు కల్పించడానికే ఉ

పయోగపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ రిపోర్ట్ రాసిన వాళ్లు అడ్డం పడడానికీ, విషపూరితమైన ప్రతి దాడి చేయడానికీ ప్రయత్నిస్తున్నారు. ప్రతీఘాతుక బూర్జువా 'అధికారుల'ను ఖండిస్తూ కార్మికవర్గ వామపక్షం రాసిన వ్యాసాల విషయంలో, ఇప్పటికి అచ్చయిన వాటి పట్ల తీవ్ర ద్వేషం వ్యక్తం చేస్తారు. ప్రచురణ కావలసి ఉన్న వాటిని అణిచివేస్తారు. మరో పక్క, అనేక సంవత్సరాల పాటు మన ప్రెస్, రేడియో, పత్రికలు, పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వేదికలు, సాహిత్యం, సినిమా, నాటకం, బ్యాలే, కథలు, లలిత కళలు, సంగీతం, నాట్యం మొదలయిన వాటిలో నిండిపోయి ఉన్న సమస్త భూతాలు, ప్రేతాలను స్వేచ్ఛగా వదిలివేస్తారు. ఇలా చేయడంలో కార్మికవర్గ నాయకత్వాన్ని ఎన్నడూ సమర్థించరు, లేదా ఆమోదం తీసుకోరు. ఇందులో కనిపించే వ్యత్యాసం ఈ రిపోర్ట్ రాసిన వాళ్ళ అసలు వైఖరిని తెలియజేస్తుంది.

**10.** ప్రస్తుత పోరాటం సాంస్కృతిక విప్లవం గురించిన కామ్రేడ్ మావో సే టుంగ్ పంథాను అమలు చేయడమా లేక ప్రతిఘటించడమా అన్న దాని చుట్టూ జరుగుతున్నది. కానీ ఈ రిపోర్ట్ ఏమని రాసిందో చూడండి–'ఈ పోరాటం ద్వారా, మావో సే టుంగ్ ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో మనం ఈ సమస్య పరిష్కారానికి మార్గం వేయగలుగుతాం' (అంటే అకడమిక్ పని రంగంలో బూర్జువా భావాలను క్షుణ్ణంగా రూపుమాపడం). నూతన ప్రజాస్వామ్యం, సాహిత్యం, కళల గురించి యేనాన్ ప్రసంగాలు, *'డ్రివన్ టు జాయిన్ ది లియాంగ్‌షాన్ మౌంటెన్ రిబెల్స్'* (లియాంగ్‌షాన్ పర్వత తిరుగుబాటుదారులలో చేరే ఆలోచన) చూసిన తరువాత యేనాన్ పెకింగ్ ఒపెరా నాటక రంగానికి ఉత్తరం, ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించడం అన్న రచనలు, ప్రచార పని గురించి సీపీసీ జాతీయ మహాసభలో ఉపన్యాసం ద్వారా కామ్రేడ్ మావో సే టుంగ్ సాంస్కృతిక, భావజాల రంగంలో కార్మికవర్గానికి ఏనాడో మార్గం వేసాడు. కానీ ఈ రిపోర్ట్ ఇంకా మావో సే టుంగ్ ఆలోచనా విధానం మనకు మార్గం చూపించలేదని, ఇప్పుడు కొత్తగా వేయాలనీ అంటుంది. 'మావో సే టుంగ్ ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో' అన్న బ్యానర్ పేరుతో ఈ రిపోర్ట్ నిజానికి మావో సే టుంగ్ ఆలోచనా విధానానికి విరుద్ధంగా ఒక మార్గాన్ని వేయడానికి ప్రయత్నిస్తుంది. ఇదే ఆధునిక రివిజనిజపు మార్గం, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు మార్గం.

సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ రిపోర్ట్ సోషలిస్టు విప్లవాన్ని చివరి వరకూ కొనసాగించడాన్ని వ్యతిరేకిస్తుంది. కామ్రేడ్ మావో సే టుంగ్ నాయకత్వంలో పార్టీ కేంద్ర కమిటీ రూపొందించిన సాంస్కృతిక విప్లవ పంథాను వ్యతిరేకిస్తుంది. కార్మికవర్గ వామపక్షం మీద దాడి చేస్తుంది. బూర్జువా మితవాదాన్ని కాపాడుతుంది. తద్వారా పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు ప్రజాభిప్రాయాన్ని తయారు చేస్తుంది. ఇది పార్టీలో బూర్జువా భావజాలపు ప్రతిబింబం. ఇది పూర్తిగా రివిజనిజమే. ఇది ఎంత మాత్రం చిన్న విషయం కాదు. ఈ రివిజనిస్టు పంథాకు

వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ప్రాథమిక ప్రాధాన్యత ఉన్నది. ఎందుకంటే మన పార్టీ, రాజ్యం లక్ష్యం, భవిష్యత్తుల మీద, మన పార్టీ, రాజ్యం భవిష్యత్తు రూపం మీద, ప్రపంచ విప్లవం మీదా దీని ప్రభావం కీలకంగా ఉంటుంది.

అన్ని స్థాయిల పార్టీ కమిటీలూ తక్షణమే సాంస్కృతిక విప్లవ బాధ్యతలో ఉన్న గ్రూప్ ఆఫ్ ఫైవ్ చేసిన వర్తమాన అకడమిక్ చర్చ గురించిన స్థూల రిపోర్ట్‌ను కేడర్‌లలోకి తీసుకువెళ్లడం నిలిపివేయాలి. యావత్తు పార్టీ కామ్రేడ్ మావో సే టుంగ్ ఆదేశాలను అనుసరించాలి. కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ మహత్తర బ్యానర్‌ను ఎత్తిపట్టాలి. పార్టీనీ, సోషలిజాన్నీ వ్యతిరేకించే అకడమిక్ అధికారులుగా చెప్పుకుంటున్న వారి ప్రతీఘాతుక బూర్జువా వైఖరిని క్షుణ్ణంగా ఎండగట్టాలి. అకడమిక్ పని, విద్య, జర్నలిజం, సాహిత్యం, కళా, ప్రచురణా రంగాలలో ప్రతీఘాతుక బూర్జువా భావాలను క్షుణ్ణంగా విమర్శించాలి, ఖండించాలి. ఈ సాంస్కృతిక రంగాలలో నాయకత్వాన్ని స్వాధీనం చేసుకోవాలి. దీనిని సాధించడం కోసం, పార్టీ, ప్రభుత్వం, సైన్యం, సమస్త సాంస్కృతిక రంగాలలోకిచొచ్చుకువచ్చిన బూర్జువా వర్గ ప్రతినిధులను విమర్శించాలి, తిప్పి కొట్టాలి. అలాగే వారిని తొలగించాలి, లేదా కొందరిని వేరే స్థానాలకు బదిలీ చేయాలి. వీటన్నింటికీ మించి, మనం ఈ వ్యక్తులకు సాంస్కృతిక విప్లవ నాయకత్వ పనిని ఇవ్వరాదు. నిజానికి వీరిలో చాలా మంది ఇప్పటికే ఇటువంటి పని చేశారు, చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైనది.

పార్టీ, ప్రభుత్వం, సైన్యం, వివిధ సాంస్కృతిక రంగాలలోకి చొచ్చుకువచ్చిన ఈ బూర్జువా వర్గ ప్రతినిధులు ఒక విప్లవ ప్రతీఘాతుక గుంపు. పరిస్థితులు పరిపక్వం అయిన తరువాత వాళ్ళు రాజకీయాధికారం గుంజుకొని కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువావర్గ నియంతృత్వంగా మారుస్తారు. వీరిలో కొందరిని ఇప్పటికే చూశాం, కొందరిని చూడలేదు. కొందరిని ఇంకా మనం విశ్వసిస్తున్నాం, మన వారసులుగా శిక్షణనిస్తున్నాం. ఉదాహరణకు కృశ్చేవ్ వంటి వ్యక్తులు ఇంకా మనతో సన్నిహితంగా మెలుగుతున్నారు. అన్ని స్థాయిల పార్టీ కమిటీలు ఈ విషయం పట్ల పూర్తి శ్రద్ధ వహించాలి.

ఈ సర్క్యులర్‌ను, కేంద్ర కమిటీ 1966 ఫిబ్రవరి 12వ తేదీన జారీ చేసిన తప్పుడు డాక్యుమెంటును కలిపి కౌంటీ పార్టీ కమిటీలు, సాంస్కృతిక సంస్థలలో పార్టీ కమిటీలు, సైన్యంలో రెజిమెంట్ స్థాయి పార్టీ కమిటీల వరకు తీసుకువెళ్లాలి. ఈ రెండు డాక్యుమెంట్లలో ఏది తప్పో, ఏది సరైనదో, ఈ డాక్యుమెంట్ల పట్ల అవగాహనను, వాటి విజయాలు, పొరపాట్లను చర్చించాలని ఈ కమిటీలను కోరుతున్నాం.

**సీపీసీ కేంద్ర కమిటీ సర్క్యులర్, 1966 మే 16–ఎ గ్రేట్ హిస్టారిక్ డాక్యుమెంట్ (ఒక గొప్ప చారిత్రక పత్రం), ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, పెకింగ్, 1967***

## మహత్తర సాంస్కృతిక విప్లవం ఎప్పటికీ ప్రకాశిస్తూనే ఉంటుంది

## చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 1966 మే 16 'సర్క్యులర్' పదవ వార్షికోత్సవం సందర్భంగా

### రెన్‌మిన్ రిబావో, హొంకీ, జీఫాంగ్‌జున్ బావో సంపాదక విభాగాలు (పెకింగ్ రివ్యూ, నెం. 21, 1976 మే 21)

పది సంవత్సరాల క్రితం మన మహా నాయకుడు చైర్మన్ మావో వ్యక్తిగత మార్గదర్శకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ మే 16 సర్క్యులర్ రూపొందింది. ఈ అద్భుతమైన మార్క్సిస్టు డాక్యుమెంటు మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానికి నగారా మోగించి దాని విజయవంతమైన పురోగమన క్రమాన్ని ప్రకాశవంతం చేసింది. ఇవాళ టెంగ్ సియావో పింగ్‌ను విమర్శించే, సరైన నిర్ధారణలను తిరగరాసే మితవాద పెడధోరణి గాలిని తిప్పి కొట్టే పోరాటంలో గొప్ప విజయాలు సాధించిన సందర్భంలో మహత్తర సాంస్కృతిక విప్లవ పదో వార్షికోత్సవాన్ని హార్ధికంగా జరుపుకుంటున్నాం. ఈ సర్క్యులర్‌ను తిరిగి అధ్యయనం చేస్తున్నాం. ఈ విప్లవ అవసరం, దీర్ఘకాలిక ప్రాధాన్యతల పట్ల లోతైన అవగాహనను పొందుతున్నాం. కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని స్థిరంగా కొనసాగించేందుకు మరింత విశ్వాసం పెంపొందించుకుంటున్నాం.

చైర్మన్ మావో నేతృత్వంలోని కార్మికవర్గ హెడ్‌క్వార్టర్స్‌కూ, లీషావ్‌చీ ముఖ్యుడిగా ఉన్న బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌కూ మధ్య భీకరమైన పోరాటంలో ఈ సర్క్యులర్ రూపొందింది. లీషావ్‌చీ విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను నిశితంగా విమర్శించింది. 'ఫిబ్రవరి స్థూల రిపోర్ట్' (విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పెంగ్ చెన్ 1966 ఫిబ్రవరి 12వ తేదీన యావత్తు పార్టీకి పంపాలని నిర్ణయించిన 'సాంస్కృతిక విప్లవ బాధ్యతలలో ఉన్న గ్రూప్ ఆఫ్ ఫైవ్ రాసిన వర్తమాన అకడమిక్ చర్చ గురించిన స్థూల రిపోర్ట్ ఇది. ఈ రిపోర్ట్ పంపిణీని నిలిపివేస్తూ యావత్తు పార్టీకి కేంద్ర కమిటీ ఒక సర్క్యులర్ పంపింది. ఈ సర్క్యులర్ ఈ సంకలనంలో మొదటి పేజీలలో ఉన్నది) ప్రతీఘాతుక సారాన్ని ఎండగట్టింది. పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన పార్టీ నాయకులు మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం గురించి ప్రచారం చేస్తున్న అబద్ధాలను ఖండించింది. యావత్తు పార్టీని వర్గ పోరాటం, కార్మికవర్గ నియంతృత్వాల మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతంతో సాయుధం చేసింది. పార్టీలో ఉన్న బూర్జువా ప్రతినిధులను ఎండగట్టి, విమర్శించి, వాళ్లు గుంజుకున్న మేరకు నాయకత్వాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పిలుపునిచ్చింది. సర్క్యులర్ రూపకల్పన 'ఫిబ్రవరి స్థూల రిపోర్ట్' దివాళాకోరుతనాన్ని స్పష్టం చేసింది. ఆనాటి నుంచి మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం శక్తివంతంగా ముందుకు దూసుకుపోతున్నది.

'మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం లేకుండా మాకు సాధ్యం కాలేదు' అని చైర్మన్ మావో పేర్కొన్నారు. చాలా కాలంగా మసులుతున్న ఈ మహా విప్లవం రెండు వర్గాల మధ్య, రెండు మార్గాల మధ్య, రెండు పంథాల మధ్య తీవ్రమైన పోరాటానికి అనివార్యమైన ఫలితం. కొన్ని సంవత్సరాల

పాటు రెనగేడ్, దాగి ఉన్న ద్రోహి, మోసకారుడూ లీషావ్‌చీ, అతని అనుచరులూ విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను ముందుకు తీసుకురావడానికి వెర్రెత్తినట్టు ప్రయత్నాలు చేశారు. పెట్టుబడిదారీ మార్గానికి బలంగా అంటి పెట్టుకుని ఉన్నారు. చైర్మన్ మావో విప్లవ పంథాను అన్ని రంగాలలోనూ వ్యతిరేకించడానికి వాళ్లు చేయగలిగినంతా చేశారు. 'దోపిడీ కొనసాగించడంలో లాభాలున్నాయి' అంటూ పెట్టుబడిదారుల గురించి గొప్పలు చెప్పారు. 'నూతన ప్రజాస్వామిక వ్యవస్థను సంఘటితం చేయడం' అన్నారు. అనేక సహకార సంఘాలను వేగంగా దెబ్బ తీసి సాన్ జీ యీ బావో (ఈ పథకంలో వ్యక్తిగత ఉపయోగానికి ప్లాట్లను, అలాగే స్వేచ్ఛా మార్కెట్లనూ విస్తరించారు. లాభాలకూ నష్టాలకూ తాము మాత్రమే బాధ్యత పడే చిన్న సంస్థలను పెంచారు. వ్యక్తిగత కుటుంబాలకు దేనికి అదిగా వ్యవసాయ ఉత్పత్తుల కోటాలను నిర్ణయించారు)ను అమలు చేశారు. ఇన్‌సైడ్ స్టోరీ ఆఫ్ ది చింగ్ కోర్ట్ (చింగ్ కోర్టు లోపలి కథ), ది లైఫ్ ఆఫ్ వూ సున్ (వూ సున్ జీవితం) వంటి ప్రతీఘాతుక సినిమాలను ఆకాశానికి ఎత్తారు. హాయ్ జుయీ డిస్‌మిస్డ్ ఫ్రమ్ ఆఫీస్ (హాయ్ జుయీని ఆఫీసు నుంచీ తొలగించారు) నాటకం మీద విమర్శను వ్యతిరేకించారు. కొంత కాలం లీషావ్‌చీ బూర్జువా హెడ్‌క్వార్టర్స్ పార్టీ అధికారాన్ని, సాంస్కృతిక, ప్రచార రంగాలలో అధికారాన్నీ అనేక ప్రాంతాలలో అధికారాన్నీ తన చేతులలో ఉంచుకుంది. దాని ఆధీనంలో భావజాల, సాంస్కృతిక విభాగాలలో పెట్టుబడిదారీ విధానం, రివిజనిజం పెచ్చు మీరిపోయాయి. భూతాల, ప్రేతాల గుంపులు బహిరంగంగా వచ్చి మన ప్రెస్, రేడియో, పుస్తకాలలోను, సాహిత్య, కళా కార్యక్రమాలలోనూ నిండిపోయాయి. ఉపరితలంలో కొన్ని రంగాలలో కార్మికవర్గం మీద బూర్జువా వర్గం నియంతృత్వాన్ని అమలు చేసే తీవ్ర పరిస్థితి ఏర్పడింది. ప్రజలను పెట్టుబడిదారీ మార్గంలోకి ఆశ చూపించడానికి భౌతిక ప్రోత్సాహకాలు, 'బోనస్‌లు ఆధిపత్యంలో ఉండడం' విస్తృతంగా అమలు చేశారు. అత్యధిక ఫాక్టరీలు, సంస్థలలో నాయకత్వం నిజమైన మార్క్సిస్టుల, కార్మిక ప్రజానీకం చేతులలో లేకుండా పోయింది. మన సోషలిస్టు ఆర్థిక పునాది గట్టిగా లేదు. మహత్తర సాంస్కృతిక విప్లవం జరగకపోయి ఉంటే జాతీయ స్థాయిలో విప్లవ ప్రతీఘాతుక పునరుద్ధరణ తప్పనిసరిగా త్వరలోనే వచ్చి ఉండేది. మన పార్టీ రివిజనిస్టు పార్టీగాను, యావత్తు చైనా రంగూ మారిపోయి ఉండేవి.

పార్టీలో పెట్టుబడిదారీ మార్గీయులు కార్మికవర్గ నియంతృత్వాన్ని వెనక్కు తీసుకుపోయే ప్రమాదం ఉన్నదని చైర్మన్ మావో గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టు దృష్టితో సరైన సమయంలో గ్రహించారు. ఈ సర్క్యులర్‌లో చైర్మన్ మావో ఇలా అన్నారు – 'పార్టీలోకి, ప్రభుత్వం, సైన్యం, వివిధ సాంస్కృతిక రంగాలలోకీ చొచ్చుకు వచ్చిన బూర్జువా వర్గ ప్రతినిధులు విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టులు. పరిస్థితులు పరిపక్వం అయిన తరువాత వాళ్లు కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువా వర్గ నియంతృత్వంగా మార్చివేస్తారు'. సరైన నిర్ధారణలను తిరగరాసే మితవాద పెడధోరణి ప్రయత్నాన్ని ఓడించడానికి జరుగుతున్న ప్రస్తుత పోరాట క్రమంలో, చైర్మన్ మావో ఇంకా ఇలా అన్నారు – 'నువ్వు సోషలిస్టు విప్లవం చేస్తున్నాం. కానీ బూర్జువా వర్గం ఎక్కడ ఉన్నదో ఇంకా తెలియదు నీకు. వాళ్లు ప్రత్యక్షంగా కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారు. వాళ్లే పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన నాయకులు. పెట్టుబడిదారీ మార్గీయులు ఇంకా పెట్టుబడిదారీ మార్గంలోనే ఉన్నారు'. ఈ ముఖ్యమైన ఆదేశాలలో చైర్మన్ మావో సోషలిజం కాలంలో వర్గ సంబంధాలలో మార్పులను, వర్గ పోరాట లక్షణాలనూ స్పష్టంగా విశ్లేషించారు.

కమ్యూనిస్టు పార్టీలో బూర్జువా వర్గం ఉన్నదన్న శాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువెళ్లారు. మార్క్సిజం-లెనినిజాన్ని అభివృద్ధి చేశారు. కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవం కొనసాగించే మన దృష్టికి మరింత స్పష్టత చేకూర్చారు.

గడచిన దశాబ్ద కాలంలో మనం లీషావ్‌చీ, లిన్ పియావో, టెంగ్ సియావో పింగ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేశాం. కమ్యూనిస్టు పార్టీ లోపల బూర్జువా వర్గం ఉన్నదని ఈ పోరాటాలన్నీ రుజువు చేశాయి. పార్టీలో ఉన్న పెట్టుబడిదారీ మార్గీయులే కార్మికవర్గంతో బలాబలాలు తేల్చుకునే, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నించే బూర్జువా వర్గ ప్రధాన బలగం. ఈ పెట్టుబడిదారీ మార్గీయులు కార్మికవర్గ నియంతృత్వ వ్యవస్థలోకి చొచ్చుకు వచ్చిన నాయకులే కావడం ఇందులో కీలకమైన విషయం. పార్టీ, రాజ్యాధికారాలలో చాలా మేరకు రివిజనిస్టు పంథా ముఖ్యులయిన లీ షావ్ చీ, లిన్ పియావో, టెంగ్ సియావో పింగ్‌ల చేతులలో ఉన్నది. దాంతో వాళ్లు కార్మికవర్గ నియంతృత్వ సాధనాలను కార్మికవర్గం మీద నియంతృత్వాన్ని అమలు చేసే విధంగా మార్చగలిగే పరిస్థితిలో ఉన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో పార్టీ బయట ఉన్న బూర్జువా వర్గం కంటే వీళ్లు మరింత నిర్దాక్షిణ్యంగా ఉన్నారు. వీళ్లు తమ అధికారాన్ని ఉపయోగించుకుని విడిచి వెళ్లిన వారినీ, రెనగేడ్‌లనూ భర్తీ చేశారు. తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ముఠాలు కట్టారు. బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను తయారు చేశారు. రివిజనిస్టు పంథాను రూపొందించి పై నుంచీ కింది వరకూ అమలు చేశారు. బూర్జువా మితవాదాన్ని సంఘటితం చేసి విస్తరించగలిగారు. తమ ప్రయోజనాలను, అంటే, రివిజనిజం ఆచరించే, అవినీతిమయ, సామాజిక సంపదను పెద్ద మొత్తాలలో వృధాగా ఖర్చు చేసే పెట్టుబడిదారీ కార్యక్రమాలలో చురుకుగా నిమగ్నమయే, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను అగౌరవించే, విచ్ఛిన్నం చేసే 'ఉన్నత అధికారుల' ప్రయోజనాలను పరిరక్షించుకోగలిగారు. మార్క్సిజం-లెనినిజం ముసుగు వేసుకుని అన్ని రకాల సంకేతాలనూ గర్వంగా ప్రదర్శిస్తూ, వాస్తవ పరిస్థితి గురించిన అవగాహన లోపించి, ఉన్నత స్థాయి చైతన్యం లేని అనేక మందిని కొంతకాలం పాటు వాళ్లు తప్పు తోవ పట్టించగలిగారు, తమ రివిజనిస్టు పంథాను అనుసరించే విధంగా వారిని మోసపుచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్లు బూర్జువా వర్గ రాజకీయ ప్రతినిధులు. కార్మికవర్గంతో బలాబలాలు తేల్చుకోవడంలో వాళ్లు సమస్త సామాజిక శక్తుల కమాండర్‌లు. సోషలిస్టు విప్లవాన్ని వ్యతిరేకించే, సోషలిస్టు నిర్మాణాన్ని అణచివేసే ముఠాలు.

టెంగ్ సియావో పింగ్ పార్టీలో ఉన్న తిరుగులేని పెట్టుబడిదారీ మార్గీయుడు. అంతిమంగా తియన్ ఆన్ మెన్ స్క్వేర్‌లో విప్లవ ప్రతీఘాతుక రాజకీయ సంఘటనకు దారి తీసిన మితవాద పెదధోరణి గాలిని సృష్టించడంలో ఇతను కమాండర్ పాత్ర వహించాడు. మహత్తర సాంస్కృతిక విప్లవానికి ముందు అతను లీషావ్ చీ బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌లో నెంబర్ 2 ముఖ్యుడిగా ఉన్నాడు. మహత్తర సాంస్కృతిక విప్లవంలో లీషావ్ చీ, లిన్ పియావోల రెండు బూర్జువా హెడ్‌క్వార్టర్స్ ధ్వంసమయ్యాయి. టెంగ్ సియావో పింగ్‌ను ప్రజలు విమర్శించారు. ఆతని మాటల్లో 'నేను నా పద్ధతులు మార్చుకుంటాను', 'నేను ఎన్నడూ విజయాలను తెగనాడను' వంటి తెగ ఒట్లు పెట్టుకున్నాడు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత అతను తన ముసుగు తీసివేశాడు. పది రెట్లు ద్వేషంతో, వంద రెట్లు ఉన్మాదంతో తన అనుభవాన్నంతా కూడదీసి విప్లవ ప్రతీఘాతుక రాజకీయ పోరాటాన్ని

ముందుకు తెచ్చాడు. కార్యక్రమం తయారుచేశాడు. ప్రజాభిప్రాయం రూపొందించాడు. మన మహా నాయకుడు చైర్మన్ మావోను ఎక్కుపెడుతూ పార్టీ మీద దాడికి సమీకరించి పథకం పన్నాడు.

సరైన నిర్ధారణలను తిరగరాయడానికి, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికీ 'మూడు ఆదేశాలను కీలక లింకుగా తీసుకోండి' అన్నది టెంగ్ సియావో పింగ్ రాజకీయ కార్యక్రమం. వర్గ పోరాటం అంతరించి పోతున్నదన్న సిద్ధాంతాన్నీ ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్నీ బోధించే ఈ రివిజనిస్టు కార్యక్రమం వర్గ పోరాటాన్ని కీలక లింకుగా తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తుంది. పార్టీ మౌలిక పంథాను, మహత్తర సాంస్కృతిక విప్లవ అవసరాన్నీ నిరాకరిస్తుంది. దీనిని 'సమస్త పనికీ సాధారణ కార్యక్రమం'గా చేయడానికి, యావత్తు పార్టీ మీదనూ దేశవ్యాప్త ప్రజానీకం మీదనూ రుద్ది, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు మార్గం సుగమం చేయడానికీ చాలా కాలం పాటు టెంగ్ సియావో పింగ్ ప్రయత్నించాడు.

'సరైన నిర్ధారణలను తిరగరాసి, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే తన పథకానికి ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు టెంగ్ సియావో పింగ్ 'భావజాల స్థానాలను స్వాధీనం చేసుకోండి' అన్న చర్య తీసుకున్నాడు. అతను అధికారంలోకి వచ్చిన తరువాత, ముఖ్యంగా గత జులై, ఆగస్టు, సెప్టెంబర్, ఆ తరువాతా, ఇక్కడా అక్కడా, సమాజంలో అంతటా టెంగ్ సియావో పింగ్ నుంచీ రాజకీయ పుకార్లు వ్యాపించాయి, వింత కథలు ప్రచారమయ్యాయి. టెంగ్ పుకార్లు పుట్టించే కంపెనీ వాటిని అల్లింది. టెంగ్ సియావో పింగ్, అతను అనుచరులూ ప్రజలను మోసగించి, చీలికలు తీసుకురావడం కోసం వివిధ మూల మార్గాలలో తీవ్రంగా ప్రజాభిప్రాయాలను సృష్టించారు. చైర్మన్ మావో నేతృత్వంలో పార్టీ కేంద్ర కమిటీ మీద తమ దాడిని ఎక్కుపెట్టారు. పార్టీ నాయకత్వాన్ని గుంజుకోవడానికీ, రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికీ టెంగ్ సియావో పింగ్‌కు మార్గం సుగమం చేసేందుకు గొడవలు సృష్టించారు.

సరైన నిర్ధారణలను తిరగరాసేందుకు, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికీ టెంగ్ సియావో పింగ్ చేపట్టిన నిర్మాణపరమైన చర్య – 'మొట్టమొదటి విషయం నాయకత్వ సంస్థలను చేజిక్కించుకోవడం'. 'ఒక్కింటిలో మూడు' పద్ధతిలో విప్లవ నాయకత్వ సంస్థలను నెలకొల్పడాన్ని అతను వ్యతిరేకించాడు. చైర్మన్ మావో విప్లవ పంథాను ఎత్తిపట్టే వృద్ధ, మధ్య వయస్క, యువ కేడర్‌ల మీద దాడి చేసి వారిని పక్కకు పెట్టాడు. సరైన నిర్ధారణలను తిరగరాసే, పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో తిరుగులేని పెట్టుబడిదారీ మార్గీయులను కూడగట్టి వారిని ముఖ్యమైన స్థానాలలో పెట్టాడు. పునరుద్ధరణవాదుల గుంపులను జమ చేసాడు. భవిష్యత్తులో ఎప్పటికైనా తిరిగి పాత కాలం తేగలుగుతారన్న ఆలోచనతో మహత్తర సాంస్కృతిక విప్లవ కాలంలో రెనగేడ్‌లుగా ప్రత్యేక ఏజెంటులుగా గుర్తింపు పొందిన వారిని పార్టీలో ఉంచడానికి తన శక్తి మేరకు ప్రయత్నించాడు.

'మొత్తంగా దిద్దుబాటును నిర్వహించండి'–ఇదీ సరైన నిర్ధారణలను తిరగరాయడానికీ పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడానికీ టెంగ్ సియావో పింగ్ కార్యాచరణ పథకం. 'దిద్దుబాటు'కు అతను ఆదేశం ఇచ్చిన వెనువెంటనే సరైన నిర్ధారణలను తిరగరాసే దుష్ట గాలి వీయసాగింది. 'దిద్దుబాటు'తో అతను చైర్మన్ మావో విప్లవ పంథానూ విధానాలనూ, మహత్తర సాంస్కృతిక విప్లవ విజయాలను, సోషలిస్టు వ్యవస్థ ఆధిపత్యాన్నీ పూర్తిగా తుడిచిపెట్టేసేందుకు ఎక్కుపెట్టాడు. ఈ దిద్దుబాటు అన్నది

నిజానికి బూర్జువా వర్గం కార్మికవర్గం మీద దాడికీ, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకూ చేసిన ప్రయత్నం.

టెంగ్ సియావో పింగ్ ఈ చర్యలన్నీ ప్రతీఘాతుక 'ఫిబ్రవరి స్థూల రిపోర్ట్'కు కొనసాగింపు, అభివృద్ధి. ఈ సర్క్యులర్‌ను చైర్మన్ మావో ఇప్పటికే విమర్శించి ఉన్నారు. టెంగ్ సియావో పింగ్ 'మూడు ఆదేశాలను కీలకమైన లింకుగా తీసుకోవాలి' అన్నది రివిజనిస్టు పంథాకు కార్బన్ కాపీ. 'వేన వేల సంవత్సరాల మానవ చరిత్ర వర్గ పోరాట చరిత్రే అన్నది పూర్తిగా నిరాకరించడం' అని, 'బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ వర్గ పోరాటాన్నీ, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ విప్లవాన్నీ, బూర్జువా వర్గం మీద కార్మికవర్గ నియంతృత్వాన్నీ పూర్తిగా నిరాకరించడం'గా సర్క్యులర్ దీనిని అభివర్ణించింది. పోరాట లక్ష్యం నుంచి ప్రజలను పక్క తోవ పట్టించడానికి పెంగ్ చెన్ కావాలని పుకార్లు పుట్టించడాన్ని ఈ సర్క్యులర్ ఎండగడుతుంది. అతని దిద్దుబాటు క్యాంపెయిన్‌ను కార్మికవర్గ వామపక్షం మీద దాడి చేయడానికీ, బూర్జువా మితవాదులను రక్షించడానికీ మాత్రమేనని తెగనాడుతూ దూషించింది. టెంగ్ సియావో పింగ్ ఇంకా ముందుకు వెళ్లాడు. లీషావ్‌చీ, లిన్ పియావో ముందుకు తీసుకువచ్చిన విప్లవ ప్రతీఘాతుక పంథాకు కొనసాగింపే అతని పంథా. ఈ పంథాను అనుసరిస్తే, మహత్తర సాంస్కృతిక విప్లవ విజయాలనే కాక యావత్తు చైనా విప్లవ విజయాలను కూడా తక్కువ చేయడమే అవుతుంది. టెంగ్ సియావో పింగ్ తీసుకున్న పెట్టుబడిదారీ మార్గం చైనాను వెనక్కు పాత అర్ధ వలస, అర్ధ భూస్వామ్య పరిస్థితికి తీసుకువెళుతుంది. చైనాను సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదానికి తోకగా కుదిస్తుంది. బూర్జువా వర్గ ప్రతినిధులను విమర్శిస్తూ ఈ సర్క్యులర్‌లో చైర్మన్ మావో ఇలా అంటారు – 'వాళ్లు బూర్జువా వర్గానికీ సామ్రాజ్యవాదులకూ విశ్వసనీయ ఏజెంటులు. బూర్జువా వర్గంతోనూ సామ్రాజ్యవాదులతోనూ కలిసి వాళ్లు బూర్జువా వర్గ దోపిడీ పీడనల బూర్జువా సిద్ధాంతాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని పట్టుకు వేళ్ళాడతారు. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని, సోషలిస్టు వ్యవస్థనూ వ్యతిరేకిస్తారు. మనకు వ్యతిరేకంగా వారి పోరాటం జీవన్మరణ పోరాటం. అందులో సమానత్వానికి ఆస్కారమే లేదు. అందుకని వారికి వ్యతిరేకంగా మన పోరాటం కూడా జీవన్మరణ పోరాటమే'.

పార్టీ లోపల ఉన్న బూర్జువా వర్గాన్నీ, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణనూ నిశ్చయంగా సకాలంలో ధ్వంసం చేయడంలో, దాని విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను విమర్శించడంలో, ఆ వర్గం గుంజుకున్న మేరకు పార్టీ, రాజ్య నాయకత్వాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంలోనే చైర్మన్ మావో వ్యక్తిగతంగా ప్రారంభించి, నేతృత్వం వహించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ అపారమైన చారిత్రక విజయాలు ఉన్నాయి. తద్వారా మన దేశం చైర్మన్ మావో విప్లవ పంథాలో పురోగమించడం కొనసాగుతుందన్న హామీ ఇచ్చింది. కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేయడం, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణను నివారించడం ఎలా అన్న సమకాలిక అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ముఖ్యమైన సమస్యను సైద్ధాంతికంగానూ ఆచరణలోనూ పరిష్కరించడంలో కూడా మహత్తర సాంస్కృతిక విప్లవం విజయవంతమయింది. లక్షలాది మంది కార్మికులు, రైతాంగం, సైనికులు, విప్లవ కేడర్‌లు, విప్లవ మేధావులూ మహత్తర సాంస్కృతిక విప్లవం 'తప్పనిసరిగా అవసరం, ఇది సకాలమైనది' అని మరింత లోతుగా గ్రహించారు. 'మహత్తర సాంస్కృతిక విప్లవం అద్భుతమైనది!' అని ఎత్తిపడుతున్నారు.

టెంగ్ సియావో పింగ్ వంటి పెట్టుబడిదారీ మార్గీయులు మాత్రమే దాని పట్ల తీవ్ర ద్వేషాన్ని కలిగి ఉన్నారు. పాత గొడవలు తీర్చుకోవడానికీ మహత్తర సాంస్కృతిక విప్లవ సరైన అంచనాను వెనక్కు తిప్పడానికీ అతను మెజారిటీ ప్రజల మీద దాడి చేశాడు. వాళ్లు అతన్ని అంగీకరించరు, అతన్ని కొనసాగనివ్వరు. 'సరైన నిర్ధారణలను తిరగరాయడం ప్రజల అభీష్టానికి వ్యతిరేకమైనది'. ప్రజల్లో, పార్టీలో, పార్టీ సభ్యులలో విప్లవాన్ని కొనసాగించాలన్న, పునరుద్ధరణకూ తిరోగమనాన్నీ వ్యతిరేకించాలన్న అభీష్టమే ఉన్నది. సరిగ్గా ఇందుకోసమే సరైన నిర్ధారణలను తిరగరాసే ప్రయత్నం చేసిన మితవాద పెడధోరణిని తిప్పి కొట్టడానికి చైర్మన్ మావో ప్రారంభించి నాయకత్వం వహించిన మహా పోరాటం యావత్తు పార్టీ, యావత్తు సైన్యం, దేశవ్యాప్త ప్రజల హృదయపూర్వక మద్దతు గెలుచుకుంది. ఈ పోరాటం ప్రజల పూర్తి ఆమోదం పొందింది, వారిని ఎంతగానో సంతృప్తిపరచింది. సరైన నిర్ధారణలను తిరగరాసేందుకు ప్రయత్నించినవారు, పాత గొడవలు తీర్చుకోవాలని చూసిన వారు పూర్తిగా ఒంటరులయ్యారు, త్వరలోనే ఓడిపోయారు.

మనం గొప్ప విజయాలు సాధించాం, అయితే పోరాటం ఇంకా ముగియలేదు. టెంగ్ సియావో పింగ్ విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టు పంథాను విమర్శించే పోరాటాన్ని లోతుగా కొనసాగించాలి. మనం మన పోరాట స్ఫూర్తిని ఎన్నడూ కోల్పోరాదు. కొద్ది మందిగా ఉన్న వర్గ శత్రువులు తమ ఓటమితో రాజీ పడరు. తమ వైఫల్యాల నుంచి గుణపాఠాలు తీసుకుంటారు. మనతో ఎలా వ్యవహరించాలన్న ఎత్తుగడలు, పద్ధతులూ అధ్యయనం చేస్తున్నారు. విప్లవ ప్రజానీకం దీని గురించి స్పష్టంగా తెలుసుకోవాలి.

చైర్మన్ మావో ఇలా అన్నారు – 'బూర్జువా హక్కును పరిరక్షించే పెట్టుబడిదారులు లేని బూర్జువా రాజ్యాన్ని నిర్మించడం గురించి లెనిన్ మాట్లాడాడు. మనం సరిగ్గా అటువంటి రాజ్యాన్నే నిర్మించాం. ఇది పాత సమాజానికి అంతగా భిన్నమైనది కాదు. ఇందులో శ్రేణులు, గ్రేడ్‌లు, ఎనిమిది వేతన గ్రేడ్‌లు, పనిని బట్టి పంపిణీ, సమాన విలువలు ఇచ్చి పుచ్చుకోవడం ఉన్నాయి. ఈ పరిస్థితులు ఉన్నంత కాలం, వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటం ఉనికిలో ఉన్నంత కాలం, బూర్జువా వర్గ, అంతర్జాతీయ సామ్రాజ్యవాద, రివిజనిజం ప్రభావాలు ఉనికిలో ఉన్నంత కాలం, 'పెట్టుబడిదారీ మార్గీయులు ఇంకా పెట్టుబడిదారీ మార్గంలోనే ఉన్నారు' అన్న చారిత్రక అంశం ఇంకా సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతుంది. సర్క్యులర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా, చైర్మన్ మావో మనలను ఇలా హెచ్చరించారు – 'ప్రస్తుత మహత్తర సాంస్కృతిక విప్లవం ఇంకా మొదటిదే. భవిష్యత్తులో అనివార్యంగా మరిన్ని జరుగుతాయి'. సరైన నిర్ధారణలను తిరగరాసే మితవాద పెడధోరణి ప్రయత్నాన్ని తిప్పి కొట్టే ప్రస్తుత పోరాటంలో, చైర్మన్ మావో మరోసారి ఇలా అన్నారు – 'ప్రజాస్వామిక విప్లవం అనంతరం కార్మికులు, పేద, కింది–మధ్య రైతాంగం ఊరికే ఉండలేదు, వారికి విప్లవం కావాలి. మరో పక్క అనేక మంది పార్టీ సభ్యులకు ముందుకు పోవాలని లేదు. కొందరు వెనక్కు వెళ్లి విప్లవాన్ని వ్యతిరేకించారు. ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఉన్నతాధికారులు అయిపోయారు. ఉన్నతాధికారుల ప్రయోజనాలను వాళ్లు కాపాడాలనుకుంటున్నారు'. 'ఇప్పటికి వంద సంవత్సరాల తరువాత విప్లవం అవసరం ఉంటుందా? ఇప్పటికి వేల సంవత్సరాల తరువాత విప్లవం ఇంకా అవసరం అవుతుందా? విప్లవం ఎల్లప్పుడూ అవసరమే. పీడితులుగా భావించుకునే సెక్షన్‌ల ప్రజలు

ఎల్లప్పుడూ ఉంటారు–జూనియర్ అధికారులు, విద్యార్థులు, కార్మికులు, రైతాంగం, సైనికులు. పై వాళ్లు తమను పీడించడం వారికి ఇష్టం ఉండదు. అందుకనే వారికి విప్లవం కావాలి. ఇప్పటికి పది వేల సంవత్సరాల తరువాత ఇక వైరుధ్యాలనేవి లేకుండా పోతాయా? ఎందుకు ఉండవు? అవి ఇంకా ఉంటాయి'. అందుకనే మనం పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా, కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవం కొనసాగించడానికి, దీర్ఘకాలిక పోరాటం చేయడం కోసం మనలను మనం సైద్ధాంతికంగా సంసిద్ధం చేసుకోవాలి.

ఈ ఏడు ప్రారంభంలో చైర్మన్ మావో ఇలా అన్నారు – 'పోరాటం లేకుండా ప్రగతి లేదు'. 'పోరాటం లేకుండా 80 కోట్ల మంది ప్రజానీకం మనగలదా?!' పదేళ్ల పాటు జరిగిన మహత్తర సాంస్కృతిక విప్లవం మనం పోరాటం ద్వారా పురోగమించిన దశాబ్దం. ఈ విప్లవం మన దేశంలో అపారమైన మార్పులు తీసుకువచ్చింది. మార్క్సిజం–లెనినిజం–మావో సే టుంగ్ ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేస్తూ ఈ పోరాట క్రమంలో లక్షలాది మంది ప్రజలు రివిజనిజాన్ని ఎదుర్కొంటూ, నిరాకరిస్తూ, విప్లవాన్ని కొనసాగిస్తూ తమ చైతన్యాన్ని ఎంతగానో పెంపొందించుకున్నారు. చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ పంథా ప్రజల హృదయాలలోకి ఇంకా లోతుగా వేళ్ళూనుకుంది. కుళ్లును వదిలించుకొని కొత్తను స్వీకరించడంతో మన పార్టీ బలం పెరిగింది. ఎప్పటికంటే శక్తివంతమయింది. నూతన పరీక్షలకు గురై, 'పరిశ్రమకు మద్దతు, వ్యవసాయానికి మద్దతు, వామపక్ష విశాల ప్రజానీకానికి మద్దతు, సైనిక అదుపు అమలు, రాజకీయ సైనిక శిక్షణను అందించడం' వంటి ప్రజలకు చేసిన నూతన దోహదాలతో మన సైన్యం బలపడింది. మాతృభూమి పరిరక్షణ కోసం పోరాటంలోనూ, సమాజంలో వర్గ పోరాటంలోనూ పాలు పంచుకోవడం ద్వారా మిలీషియా కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసింది. వృద్ధ, మధ్య వయస్క, యువత అనే 'ఒక్కింటిలో మూడు' కలయికను అన్ని స్థాయిల నాయకత్వ సంస్థలలోనూ అవలంబించారు. చైర్మన్ మావో ముందుకు తెచ్చిన ఐదు అవసరాలకు అనుగుణంగా లక్షలాది మంది కార్మికవర్గ విప్లవ ఆశయ వారసులు పోరాట క్రమంలో తమ్ము తాము మలుచుకుంటున్నారు, పరిపక్వం అవుతున్నారు. రెండు పంథాల మధ్య తీవ్రమైన పోరాట క్రమంలో విద్య, సాహిత్యం, కళ, వైద్యం, ఆరోగ్య కృషి, శాస్త్ర సాంకేతికతలలో సోషలిస్టు విప్లవం గొప్ప అంగలలో పురోగమించింది.' చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఆత్రుతతో గ్రామీణ ప్రాంతంలో పని చేయడానికి వెళ్లారు. అన్ని స్థాయిల కేడర్‌లూ మే 7 మార్గాన్ని అవలంబించడంలో స్థిరంగా నిలబడ్డారు. వ్యవసాయంలో తాచాయ్ నుంచి నేర్చుకోవడం, పరిశ్రమలో తాచింగ్ నుంచి నేర్చుకోవడం కోసం ముందుకు సాగారు. వ్యవసాయం, పరిశ్రమ, యావత్తు జాతీయ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంటున్నాయి. మన గొప్ప మాతృభూమి సంపదలతో తులతూగుతున్నది. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం లక్షలాది మంది ప్రజల శక్తిని మరింతగా వెలికి తీసుకువచ్చింది. ఈ విప్లవ అపారమైన ప్రభావం ఇంకా ఇప్పుడే స్పష్టమవుతున్నది. విప్లవం గాఢతరం అయ్యే కొలదీ ఇది మరింత శక్తివంతంగా ప్రదర్శితమవుతుంది.

విజయవంతమైన మన పురోగమనాన్ని కొనసాగించాలి. అద్భుతమైన పరిస్థితిని ముందుకు తీసుకువెళ్లాలి. విశాల పార్టీ సభ్యులు, కేడర్‌లూ ఇతర ప్రజలూ మహత్తర సాంస్కృతిక విప్లవం గురించి, మితవాద పెడధోరణి ప్రయత్నాన్ని తిప్పికొట్టడం గురించిన చైర్మన్ మావో ముఖ్యమైన

ఆదేశాలను, కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించే సిద్ధాంతాన్నీ చైతన్యపూర్వకంగా అధ్యయనం చేయాలి. తద్వారా బూర్జువా వర్గాన్ని ఎలా కనిపెట్టాలి, బూర్జువా వర్గం మీద మొత్తంగా నియంతృత్వాన్ని అమలు చేయడం అనే సమస్యల పట్ల స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలి. రివిజనిజాన్ని ఎదుర్కోవడం, నివారించడంలోనూ, విప్లవాన్ని కొనసాగించడంలోనూ స్థిరంగా ఉండాలి. మహత్తర సాంస్కృతిక విప్లవ అద్భుతమైన విజయాలు, అపారమైన ప్రాముఖ్యతల గురించి మనం స్పష్టమైన అవగాహన సమకూర్చుకోవాలి. సోషలిస్టు నూతన అంశాలను హృదయపూర్వకంగా సమర్థించాలి. మహత్తర సాంస్కృతిక విప్లవ విజయాలను సంఘటితం, అభివృద్ధి చేయాలి. టెంగ్ సియావో పింగ్‌ను మరింత లోతుగా విమర్శించాలి. సరైన నిర్ధారణలను తిరగరాసే మితవాద పెడధోరణి ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలి. విప్లవ ప్రతీఘాతుక విచ్ఛిన్నకర కార్యకలాపాలను నిశ్చయాత్మకంగా దెబ్బ తీయాలి. టెంగ్ సియావో పింగ్‌ను విమర్శించే సాధారణ లక్ష్యంతో 95 శాతానికి మించి కేడర్‌లు, ప్రజలను ఐక్యం చేయాలి. ఉపరితలంలోనూ ఆర్థిక పునాదిలోనూ విప్లవంలో మంచి కృషి చేయాలి. మనం 'విప్లవాన్ని అర్థం చేసుకోవాలి, ఉత్పత్తిని, ఇతర పనినీ, యుద్ధానికి వ్యతిరేకంగా సంసిద్ధతనూ పెంపొందించాలి. సమస్త రంగాలలోనూ సోషలిస్టు నిర్మాణాన్ని నిరంతరం పురోగమింపజేయాలి.

కార్మికవర్గం సంపూర్ణ విప్లవ ఆశావాదంతో ఉన్నది. మనకు గతితర్కంలో విశ్వాసం ఉన్నది. 'పాత మీద కొత్త ఆధిపత్యం సాధిస్తుందన్నది ఒక సాధారణమైన, అనంతమైన, కాదనలేని విశ్వజనీన సత్యం' అని మనం స్థిరంగా నమ్ముతాం (మావో సే టుంగ్, 'వైరుధ్యాలు'). విప్లవ మార్గంలో ఎన్ని మలుపులు, మెలికలూ ఉన్నప్పటికీ అది ఎన్ని ఎగుడు దిగుడులు ఎదుర్కొన్నప్పటికీ మార్క్సిజం-లెనినిజం-మావో సే టుంగ్ ఆలోచనా విధానం అనివార్యమైనది. 95 శాతానికి పైగా ఉన్న ప్రజానీకానికి తప్పనిసరిగా విప్లవం కావాలి. విప్లవం ప్రతీఘాతుకత మీదను, నూతనంగా జన్మించినది శిథిలం అవుతున్న దాని మీదనూ అనివార్యంగా విజయం సాధిస్తుంది. ఇది చరిత్ర నియమం. మార్క్సిజం పుట్టి శతాబ్దం పైగా గడిచింది. పాత ప్రపంచం ముక్కలయింది. ఇవాళ పెట్టుబడిదారీ విధానం, రివిజనిజం 'పశ్చిమ గాలిలో అస్తమిస్తున్న సూర్యుడి' మాదిరిగా క్షీణిస్తున్నాయి. చరిత్ర ప్రవాహానికి వ్యతిరేకంగా వెళ్లే వెధవలు కొంత కాలం పాటు తమ మార్గంలో మనగలుగుతారే తప్ప క్రమంగా ప్రజలు వారిని చరిత్ర చెత్త కుప్పలోకి విసిరివేస్తారు. మార్క్స్, ఎంగెల్స్‌లు చెప్పినట్టు, 'అది (బూర్జువా వర్గం) కూలడం, కార్మికవర్గ విజయం అంతే అనివార్యమైనవి' (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక). సర్క్యులర్ పదవ వార్షికోత్సవం సందర్భంగా, వెనక్కి తిరిగి మహత్తర సాంస్కృతిక విప్లవ పోరాట క్రమాన్ని చూసుకుంటే, 'ఓరియోల్ పిట్ట పాడుతుంది, స్వాలో పిట్ట ఎగురుతుంది' అన్న అద్భుతమైన పరిస్థితిని వీక్షిస్తే, 'ప్రపంచం తల్లకిందులు అవుతున్నప్పుడు' సుందర భవిష్యత్తు మీద దృష్టి సారిస్తే, విప్లవ గర్వంతో నిండిపోతాం మనం. చైర్మన్ మావో నేతృత్వంలో ఉన్న పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వంలో మనం వర్గ పోరాటం కీలకమైన లింకుగా కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని చివరికంటా కొనసాగించేందుకు స్థిరంగా సాగడానికి నిర్ణయబద్ధులమై ఉన్నాం.

**చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ పంథా అజేయమైనది, మన పురోగమనాన్ని ఆపలేరు !**

**మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం నిరంతరం ప్రకాశిస్తూ ఉంటుంది !**

# మావో రచనల నుండి, ఉపన్యాసాల నుండి ఉల్లేఖనలు

సోషలిస్టు ఆశయ విజయాన్ని ఖరారు చేసేందుకు పార్టీ అంతటిలోనూ, అన్నిటి కంటే ముందరగా, జాతీయ స్థాయిలోని, బృహత్ పరిపాలనా ప్రాంతాలు, రాష్ట్రాలు, మునిసిపాలిటీల స్థాయిలలోని పార్టీ, ప్రభుత్వ, సైనిక, ప్రజాసంస్థలకు చెందిన నాయకత్వ సంస్థలన్నింటిలోనూ మనం తప్పుడువైన మితవాద పోకడలను, అంటే బూర్జువా భావాలను వ్యతిరేకించి పోరాడి తీరాలి. బృహత్ పరిపాలనా ప్రాంతాలు, రాష్ట్రాలు, మునిసిపాలిటీలు విమర్శను, చర్చలను ఆవిష్కరించడానికి, సోషలిస్టు బాట, దానికి వ్యతిరేకమైన పెట్టుబడిదారీ బాటల తాలూకు సమస్యను వివరించడానికి .....సమావేశాలను సరైన సమయంలో నిర్వహించాలి.

***– మావో ("పార్టీ లోని బూర్జువా భావాలతో పోరాడండి", ఆగస్టు 12, 1953, మావో రచనలు 5వ సంపుటి, పేజీ 127)***

సోషలిజం గ్రామీణ స్థానాల్ని ఆక్రమించుకోకపోతే, అనివార్యంగానే పెట్టుబడిదారీ విధానం ఆ పని చేస్తుంది. పెట్టుబడిదారీ మార్గంగానీ, సోషలిస్టు మార్గంగానీ కాకుండా మరే ఇతర మార్గాన్నయినా చేపట్టడం సాధ్యమా? పెట్టుబడిదారీ మార్గం కూడా అధికోత్పత్తికి దారితీస్తుంది. కానీ దానికి అవసరమయ్యే వ్యవధి చాలా దీర్ఘంగా ఉంటుంది. క్రమమేమో చాలా బాధాకరంగా ఉంటుంది. మనం పెట్టుబడిదారీ విధానాన్ని ఆచరించం. అది నిశ్చయమే. అయినప్పటికీ మనం సోషలిజం కోసం వెళితే తప్ప పెట్టుబడిదారీ విధానం తప్పనిసరిగా అదుపు లేకుండా వ్యాపిస్తుంది.

***– మావో ("వ్యవసాయంలో పరస్పర సహాయం, సహకారాలపై రెండు ప్రసంగాలు", అక్టోబర్ 15, 1953, మావో రచనలు 5వ సంపుటి, పేజీ 167)***

సోషలిస్టు సమాజ నిర్మాణంలో, దోపిడీదారులకూ, శ్రమజీవులకు ప్రతిఒక్కరికీ తీర్చిమల్చబడడం అనేది అవసరమే. కార్మికవర్గానికి తీర్చిమల్చబడడం అవసరం లేదని ఎవరన్నారు? దోపిడీదారులను తీర్చి మల్చుకోవడానికి, శ్రమజీవులను తీర్చి మల్చుకోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఈ రెంటిని ఖచ్చితంగా గందరగోళపరచకూడదు. వర్గపోరాటం లోనూ, ప్రకృతితో జరిపే పోరాటం లోనూ కార్మికవర్గం మొత్తం సమాజాన్ని తీర్చి మలుస్తుంది. ఆ క్రమంలోనే తన్నుతాను తీర్చిమల్చుకుంటుంది. పని క్రమంలోనే అది తప్పనిసరిగా నేర్చుకోవాలి, క్రమక్రమంగా తన లోటుపాట్ల నుండి బయటపడాలి. అలా చేయడాన్ని ఎన్నడూ మానకూడదు.

***– మావో ( "ప్రజల మధ్య వైరుధ్యాలతో సరైన తీరులో వ్యవహరించడం", ఫిబ్రవరి 27, 1957, మావో రచనలు 5వ సంపుటి, పేజీ 522)***

సోషలిస్టు సమాజం గణనీయంగా సుదీర్ఘ చారిత్రక కాలం సాగుతుంది. సోషలిస్టు చారిత్రక కాలంలో ఇంకా వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటమూ ఉంటాయి. సోషలిస్టు మార్గానికీ పెట్టుబడిదారీ మార్గానికీ మధ్య పోరాటం ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం వెన్నంటి ఉంటుంది. మనం ఈ పోరాట సుదీర్ఘ, సంక్లిష్ట స్వభావాన్ని గుర్తించాలి. మరింత అప్రమత్తంగా ఉండాలి. సోషలిస్టు విద్యను నడపాలి. వర్గ వైరుధ్యాలను, వర్గ పోరాటాన్నీ సరిగా అర్థం చేసుకోవాలి. మనకూ శత్రువుకూ మధ్య ఉన్న వైరుధ్యాలకూ, ప్రజల మధ్య వైరుధ్యాలకూ తేడా చూడగలగాలి. లేని పక్షంలో మన లాంటి సోషలిస్టు దేశం తద్విరుద్ధంగా తయారై దిగజారిపోతుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరుగుతుంది. ఇప్పటి నుంచీ మనం ప్రతీ సంవత్సరం, ప్రతీ నెలా, ప్రతీ రోజూ కూడా ఈ విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడు ఈ సమస్య గురించి ఒక అవగాహనను నిలుపుకోగలుగుతాం. మార్క్సిస్టు లెనినిస్టు పంథాను కలిగి ఉండగలుగుతాం.

***– మావో, (1962 ఆగస్టులో పీటాయ్‌హెూలో***
***కేంద్ర కమిటీ వర్కింగ్ కాన్ఫరెన్స్‌లో ఉపన్యాసం)***

వర్గ పోరాటాన్ని ఎన్నడూ మరువరాదు.

***– మావో (సీపీసీ ఎనిమిదో కేంద్ర కమిటీ***
***పన్నెండవ ప్లీనరీ సెషన్‌లో ఉపన్యాసం, 1962 సెప్టెంబర్)***

ఒపెరాలు పాత దాని నుంచీ కొత్తవాటిని అభివృద్ధి చేయాలే కానీ పాత దాని నుంచీ పాత దానిని కాదు. ఒపెరాలు కేవలం చక్రవర్తులు, రాజులు, జెనరళ్లు, మంత్రులు, ప్రతిభావంతులైన యువ గౌరవనీయులు, అందమైన స్త్రీలు, వారి చెలికత్తెలు, వారి పరిరక్షకుల గురించే పాడరాదు.

***– మావో (ఒపెరాలు, 1963 సెప్టెంబర్)***

చైనాను మేం ఏ స్థితిలో కనుగొన్నామో ఆ స్థితికి దానిని తెచ్చిన ఆలోచనలు, సంస్కృతి, సాంప్రదాయాలు తప్పనిసరిగా అంతరించిపోవాలి. ఇప్పటికింకా ఉనికిలోకి రాని కార్మికవర్గ చైనా తాలూకు ఆలోచనలు, సాంప్రదాయాలు, సంస్కృతి తప్పనిసరిగా రంగం పైకి రావాలి.

***– మావో ("ఆండ్రీ మాల్‌రాక్స్‌తో ఇంటర్వ్యూ", 1965, మావో రచనలు***
***9వ సంపుటి, రెండవ వాల్యూం, పేజీ 240)***

మనకు ప్రజారాశులపై విశ్వాసం ఉంది. ప్రజారాశులకు గురువులుగా కావాలంటే మనం ముందు తప్పనిసరిగా ప్రజారాశులకు శిష్యులమవ్వాలి. నేటి మహత్తర సాంస్కృతిక విప్లవం భూమ్యాకాశాలను కుదిపివేసే ఘటన. మనం సోషలిజం లోకి దారితీసే కనుమను దాటగలమా, దాటే సాహసం చేయగలమా? ఈ కనుమ వర్గాల అంతిమ వినాశానికి, మూడు మహావ్యత్యాసాల తగ్గింపుకు దారితీస్తుంది. ***– మావో ( "కేంద్రంలోని నాయకులతో సంభాషణ", జులై***

***21, 1966,  మావో రచనలు 9వ సంపుటి, రెండవ వాల్యూం, పేజీ 267)***

ఇతరులకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడగల్గి తమపై తాము పోరాడజాలని కామ్రేడ్స్ కొందరున్నారు. ఇలా అయితే వారు కనుమను ఎన్నడూ దాటలేరు.

***- మావో ( "కేంద్రంలోని నాయకులతో సంభాషణ", జులై 21, 1966, మావో రచనలు 9వ సంపుటి, రెండవ వాల్యూం, పేజీ 267)***

మనం ప్రజారాశులలో 95 శాతానికి మించిన వారిని తప్పనిసరిగా విశ్వసించాలి. అప్పుడు కేడర్లలో 95 శాతానికి మించిన వారు మనల్ని అనుసరిస్తారు. చైనాలో గణనీయమైన స్థాయిలోనే పెటీబూర్జువా వర్గం ఉంది. మధ్యతరగతి రైతుల సంఖ్య కొంచెం పెద్దదే. పట్టణ ప్రాంతాలో పెటీబూర్జువాలు, చిన్నపాటి వ్యాపారులతో కలుపుకొని చిన్నపాటి చేతి వృత్తుల వారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. మనం నాయకత్వం వహించడంలో నేర్పరులమని రుజువైతే వారు మనల్ని అనుసరిస్తారు. మనం అపార మెజారిటీని తప్పనిసరిగా విశ్వసించాలి.

***- మావో ("కామ్రేడ్స్ చాంగ్ చున్ చుయావో, యావో వెన్ యువాన్‌లతో మూడు సమావేశాలలో సంభాషణలు", ఫిబ్రవరి 1967,  మావో రచనలు 9వ సంపుటి, రెండవ వాల్యూం, పేజీ 316)***

మహత్తర సాంస్కృతిక విప్లవం యొక్క లక్ష్యం ఏమిటంటారు? పదవుల్లో ఉంటూ పెట్టుబడిదారీ మార్గం పట్టిన వారిపై పోరాటం చేయడం ప్రధాన కర్తవ్యమే. కానీ ఏ విధంగా చూసినా అది లక్ష్యం కాదు. ప్రాపంచిక దృక్పథం సమస్యను పరిష్కరించడమే అసలు లక్ష్యం. అది రివిజనిజాన్ని కూకటి వేళ్లతో తుడిచిపెట్టే సమస్య.

***- మావో ("ఆల్బేనియా మిలటరీ ప్రతినిధివర్గానికి ఇచ్చిన ప్రసంగం", మే 1, 1967,  మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 326)***

ప్రజలు తమంతట తామే విద్యావంతులు కావాలనీ, తమను తామే విముక్తి చేసుకోవాలనీ కేంద్రకమిటీ పదే పదే నొక్కి చెప్పింది. ఎందువల్లనంటే, ప్రపంచ దృక్పథాన్ని వారి మీద రుద్దడం సాధ్యం కాదు. భావజాలం మార్పు చెందడానికి గాను బయట ఉండే కారణాలు అంతర్గత కారణాల  ద్వారా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. అంతర్గత కారణాలే ప్రధానమైనవి అయినప్పటికీ అలా పనిచేయడం అవసరం. ప్రాపంచిక దృక్పథం మారకపోయినట్లయితే మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం విజయవంతమైందని ఎలా చెప్పగలం? ప్రాపంచిక దృక్పథం మారకపోయినట్లయితే, ఈ మహత్తర సాంస్కృతిక విప్లవం సందర్భంగా అధికారంలో ఉంటూ పెట్టుబడిదారీ మార్గం పట్టినవాళ్లు రెండు వేల మంది ఉంటే, వచ్చేసారికి వాళ్లు నాలుగు వేలు అవుతారు.

***- మావో ("ఆల్బేనియా మిలటరీ ప్రతినిధివర్గానికి ఇచ్చిన ప్రసంగం",***

***మే 1, 1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీలు 326, 327)***

మన శ్రేణుల్లో ఉన్న పెటీబూర్జువా భావజాలాన్ని మనం నేర్పుగా కార్మికవర్గ విప్లవ బాటకు మళ్లించాలి. మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ విజయానికి ఇదే కీలకం.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 25–6–1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 394)***

నేటి మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం కేవలం మొట్టమొదటిదే. భవిష్యత్తులో ఇంకా అనేకానేకం అనివార్యంగానే వస్తాయి. విప్లవంలో ఎవరు గెలుస్తారనే సమస్య దీర్ఘ చారిత్రక కాలం లోనే పరిష్కృతం కాగలదు. విషయాలను సరైన తీరులో నిర్వహించకపోతే భవిష్యత్తులో ఏ సమయంలోనైనా పెట్టుబడిదారీ పునరుద్ధరణకు అవకాశం ఉంది.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, ఆగస్టు 1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 396)***

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రజల అంతరాత్మలను తాకి, ప్రజల ప్రాపంచిక దృక్పథ సమస్యను పరిష్కరించే మహా విప్లవం.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 6–11–1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 397)***

మన పార్టీలో అధికారంలో ఉన్న వేళ్లమీద లెక్కించగల పెట్టుబడిదారీ మార్గీయులు మన పార్టీ లోపల బూర్జువాల ప్రతినిధులు.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 6–11–1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 397)***

స్వార్థపరత్వంతో పోరాడడం, రివిజనిజాన్ని విమర్శించడం – ఇదే మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ మౌలిక సిద్ధాంత కార్యక్రమం.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 6–11–1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 398)***

సాంస్కృతిక విప్లవం ప్రజారాశుల్ని ప్రజారాశులే విముక్తం చేసేదిగానే ఉండగలదు.

***– మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 6–11–1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 398)***

శ్రామికవర్గం, విప్లవ ప్రజానీకం ప్రపంచ రూపురేఖల్ని మార్చడానికై చేస్తున్న పోరాటం

భౌతిక ప్రపంచ రూపురేఖల్ని మార్చడంతో పాటు తమ స్వీయాత్మక ప్రపంచ రూపురేఖల్ని కూడా మార్చుకోవడం అనే కర్తవ్యాలతో కూడుకొని ఉంటుంది.

***- మావో (సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన ఆదేశాలు, 6-11-1967, మావో రచనలు 9వ సంపుటి, 3వ వాల్యూం, పేజీ 399)***

సైద్ధాంతిక రాజకీయ పంథా సరైనదా కాదా అన్నది అంతటినీ నిర్ణయిస్తుంది. పార్టీ పంథా సరైనది అయినప్పుడు అంతా సమకూరుతుంది. దానికి అనుచరులు లేకపోతే అనుచరులు తయారవుతారు. తుపాకులు లేకపోతే తుపాకులు లభ్యమవుతాయి. రాజకీయాధికారం లేకపోతే, రాజకీయాధికారం ఏర్పడుతుంది. కానీ దాని పంథా సరైనది కాకపోతే, దానికి ఏమున్నా కూడా వాటిని కోల్పోతుంది. పంథా వల తాడు వంటిది. తాడును లాగితే మొత్తమంతా బయటకు వస్తుంది.

***- మావో (రాష్ట్రాల పర్యటనలో వివిధ ప్రాంతాలలో బాధ్యతలలో ఉన్న కామ్రేడ్స్‌తో చర్చలు, 1971 ఆగస్టు-సెప్టెంబరు)***

మీరు రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరిస్తారని, చీలిపోకుండా ఐక్యమవుతారని, కుట్రలు, కుహకాలకు పాల్పడకుండా నిజాయితీగా, బహిరంగంగా ఉంటారనీ ఆశిస్తున్నాను.

***- పై దాని నుంచి***

## జి.పి.సి.ఆర్.పై సి.పి.సి. డాక్యుమెంట్ల నుండి ఉల్లేఖనలు

ప్రజా విముక్తి సైన్యం ఒక గొప్ప పాఠశాల మాదిరిగా ఉండాలి. ఈ పాఠశాలలో మన సైన్యం రాజకీయాలూ సైనిక వ్యవహారాలూ అధ్యయనం చేయాలి. తన విద్యా స్థాయిని పెంచుకోవాలి. వ్యవసాయంలోనూ ఇతర వృత్తులలోనూ పాలు పంచుకోవాలి. తన అవసరాల కోసం కానీ సమాన విలువలకు రాజ్యంతో ఇచ్చి పుచ్చుకోవడం కోసం కానీ చిన్న, లేదా మధ్య తరహా ఫాక్టరీలను నడపాలి. మన సైన్యం ప్రజలలో కూడా పని చేయాలి. ఫాక్టరీలు, గ్రామాలలో సోషలిస్టు విద్యా ఉద్యమంలో పాల్గొనాలి. సోషలిస్టు విద్యా ఉద్యమం పూర్తయిన తరువాత ఇక మళ్లీ ప్రజలలో పని ఉండనే ఉంది. తద్వారా అది ప్రజలలో ఒకటిగా మెలుగుతుంది. అలాగే సాంస్కృతిక విప్లవంలో బూర్జువా వర్గాన్ని విమర్శించడానికీ తిప్పి కొట్టడానికీ జరిగే పోరాటాలలో పాల్గొనేందుకు మన సైన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

***- చైర్మన్ మావో సే టుంగ్ ఇచ్చిన 'మే 7 ఆదేశం', 1966 మే 7.***

కార్మికవర్గానికీ బూర్జువా వర్గానికీ మధ్య పోరాటంలో, మార్క్సిస్టు సత్యానికీ బూర్జువా వర్గ, ఇతర సమస్త దోపిడీ వర్గాల బూటకానికీ మధ్య పోరాటంలో, తూర్పు గాలి పశ్చిమ గాలిని మించుతుంది, లేదా పశ్చిమ గాలి తూర్పు గాలిని మించుతుంది. కానీ సమానత్వం అనేది ఉ

ండనే ఉండదు. కార్మికవర్గం బూర్జువా వర్గం మీద చేసే పోరాటం, బూర్జువా వర్గం మీద కార్మికవర్గ నియంతృత్వం, సమస్త సాంస్కృతిక రంగాలతో సహా ఉపరితలంలో కార్మికవర్గ నియంతృత్వం, ఎర్ర జెండాను వ్యతిరేకించడానికి 'ఎర్ర జెండాలు' ఊపే కమ్యూనిస్టు పార్టీలోకి చొచ్చుకువచ్చిన బూర్జువా వర్గ ప్రతినిధులను ఏరి పారేయడానికి కార్మికవర్గ నిరంతర కృషి వంటి మౌలిక అంశాలలో సమానత్వాన్ని అనుమతించగలమా?

***- సీపీసీ సీసీ సర్క్యులర్, 1966, మే 16***

ఇప్పుడు ప్రారంభం అవుతున్న మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రజల హృదయాలను స్పృశించే ఒక గొప్ప విప్లవం. మన దేశ సోషలిస్టు విప్లవంలో ఒక నూతన దశ. ఒక లోతైన, మరింత విస్తారమైన దశ ఇది.

***- జీపీసీఆర్ గురించి సీపీసీ సీసీ నిర్ణయం, 1966 ఆగస్టు 8***

బూర్జువా వర్గాన్ని కూలదోసినప్పటికీ అది ఇంకా ప్రజలకు ఆశ చూపించి వారి మెదళ్లను స్వాధీనం చేసుకోవడానికీ తద్వారా తిరిగి అధికారంలోకి రావడానికీ దోపిడీ వర్గాల పాత భావాలను, సంస్కృతి, సంప్రదాయాలను, అలవాట్లనూ ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తుంది. కార్మికవర్గం సరిగ్గా ఇందుకు భిన్నంగా చేయాలి - భావజాల రంగంలో బూర్జువా వర్గం చేసే ప్రతి సవాలునూ అది ఎదుర్కోవాలి. యావత్తు సమాజ మానసిక దృక్పథాన్ని మార్చడానికి కార్మికవర్గ నూతన భావాలను, సంస్కృతిని, సంప్రదాయాలు, అలవాట్లను వినియోగించాలి. పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయడం, వారిని అణిచిపెట్టడం మన ప్రస్తుత లక్ష్యం. అలాగే ప్రతీఘాతుక బూర్జువా విద్యా 'అధికారుల'ను, బూర్జువా వర్గ, ఇతర సమస్త దోపిడీ వర్గాల భావజాలాన్నీ విమర్శించి దానిని తిప్పి కొట్టాలి.సోషలిస్టు ఆర్థిక పునాదికి సరిపడని విద్య, కళా సాహిత్యాలనూ ఇతర ఉపరితలాంశాలనూ మార్చివేయాలి. తద్వారా సోషలిస్టు వ్యవస్థను సంఘటితం చేసేందుకు, అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమం చేయాలి.

***- పై దానిలోదే***

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో ఏకైక పద్ధతి ప్రజలు తమ్ము తాము విముక్తి చేసుకోవడం. వారి తరపున పని చేసే ఏ పద్ధతినీ ఉపయోగించరాదు.

***- పై దానిలోదే***

ప్రజలలో విశ్వాసం ఉంచడం, వారి మీద ఆధారపడడం, వారిని ధైర్యంగా ముందుకు తీసుకురావడం, వారి చొరవను గౌరవించడం ఈ మహత్తర సాంస్కృతిక విప్లవ విజయానికి కీలకమైనవి. అందుకని 'ప్రజల నుంచీ ప్రజలకు' అన్న పంథాలో నిలబడడం అవసరం. ప్రజలకు ఉపాధ్యాయులవ్వాలంటే ముందుగా వారికి విద్యార్థులుగా ఉండాలి. విప్లవం చేయడానికి సాహసించాలి, మంచిగా చేయాలి. కల్లోలాలకు భయపడకండి. బూర్జువా వైఖరి తీసుకోవడాన్ని, మితవాదులను రక్షించడాన్ని, వామపక్షం మీద దాడులను, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక

విప్లవం మీద నిర్బంధాన్నీ వ్యతిరేకించండి. ప్రజల చేతులు బంధించి ఉంచేందుకు అనేక ఆంక్షలు సృష్టించడాన్ని వ్యతిరేకించండి. ప్రజల మీద పెత్తనం చేయకండి, వారిని మించిన వాళ్లమన్న భావనతో గుడ్డిగా ఆదేశాలు ఇవ్వకండి.

*- సీపీసీ ఎనిమిదో సీసీ పదకొండవ ప్లీనరీ సెషన్ వర్తమానం, 1966, ఆగస్టు 12*

స్వేచ్ఛగా సంఘర్షించుకునేలా, భావాలు వ్యక్తం చేసేలా, పెద్దక్షరాల పోస్టర్‌లు, మహత్తర వాదోపవాదాలూ జరిగేలా, అంటే విస్తృతమైన ప్రజాస్వామ్యం ఆచరించేలా గ్రామీణ ప్రాంతంలో మహత్తర సాంస్కృతిక విప్లవం నడపాలి.

*- గ్రామీణ ప్రాంతంలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం గురించి సీపీసీ సీసీ ఆదేశం (ముసాయిదా), 1966, డిసెంబర్ 15.*

చైర్మన్ మావో బోధనలు మదిలో నిలుపుకున్న మన విప్లవ తిరుగుబాటు కార్మికులు ఈ తిరోగమన ప్రవంతిలో గట్టిగా నిలబడ్డారు. విప్లవ బాధ్యత పట్ల మన ఉన్నత స్ఫృహను రుజువు చేశారు. అత్యంత కష్టభరిత పరిస్థితులలో మన ఫాక్టరీలు, ప్లాంట్‌ల ఉత్పత్తి కర్తవ్యాలను భుజాలకు ఎత్తుకున్నారు. తద్వారా పెట్టుబడిదారీ మార్గాన్ని చేపట్టిన కొద్ది మంది పార్టీ నాయకులకు వ్యతిరేకంగా గట్టి దెబ్బ ఇచ్చారు. ఉత్పత్తిని ధ్వంసం చేసి విప్లవాన్ని నిలిపివేయాలన్న వారి పెద్ద కుట్రను నాశనం చేశారు.

*- షాంఘై కార్మికుల విప్లవ తిరుగుబాటు జెనరల్ హెడ్‌క్వార్టర్స్, ఇతర పది విప్లవ ప్రజా సంఘాలూ కలిసి షాంఘై ప్రజలకు 1967, జనవరి 4న ఇచ్చిన సందేశం.*

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని చివరికంటా కొనసాగించమని చైర్మన్ మావో, పార్టీ కేంద్ర కమిటీల నుంచీ మీకు పిలుపునిస్తున్నాం. ఈ మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంలో, ఈ నూతన పరిస్థితిలో మీరు మరింతగా శక్తి మేరకు కృషి చేస్తారని, పెద్ద లక్ష్యాలతో పని చేస్తారనీ ప్రస్తుత దశలో యావత్తు విప్లవాన్ని గ్రహించడంలోనూ ఉత్పత్తిని ప్రోత్సహించడంలోనూ దేశ సమస్త కార్మిక ప్రజలకూ అద్వితీయ నమూనాలుగా ఉంటారని ఆశిస్తున్నాం.

*- సీపీసీ సీసీ 1967, మార్చి 18న దేశవ్యాప్తంగా పారిశ్రామిక, గని సంస్థల విప్లవ కార్మికులు, స్టాఫ్, విప్లవ క్యాడర్‌లకు రాసిన ఉత్తరం*

సాయుధ బలగాలలో రెండు పంథాల మధ్య - చైర్మన్ మావో ప్రాతినిధ్యం వహించే కార్మికవర్గ విప్లవ పంథా, బూర్జువా ప్రతీఘాతుక పంథాల మధ్య పోరాటం గురించిన అవగాహనను లోతుగా కల్పించాలి. చైర్మన్ మావో రచనల అధ్యయనాన్ని రెండు పంథాల మధ్య పోరాటానికి అన్వయించాలి. ప్రతీఘాతుక పంథాను, పెట్టుబడిదారీ మార్గం చేపట్టిన కొద్ది మంది పార్టీ ఉన్నత నాయకులనూ ఎండగడుతూ వివిధ నిర్దిష్ట సమాచారాన్ని విస్తృతంగా సేకరించండి.

*- సీపీసీ సీసీ సైనిక కమిషన్ ఆదేశం, 1967 ఏప్రిల్ 6*

మన మహా నాయకుడు కామ్రేడ్ మావో సే టుంగ్ వ్యక్తిగతంగా ప్రారంభించి, నేతృత్వం వహించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, మన దేశంలో కార్మికవర్గ నియంతృత్వంలో బూర్జువా వర్గానికీ సమస్త దోపిడీ వర్గాలకూ వ్యతిరేకంగా కార్మికవర్గం నడిపిన ఒక మహా రాజకీయ విప్లవం అని ఎనిమిదో కేంద్ర కమిటీ విస్తార పన్నెండవ ప్లీనరీ సెషన్ ఏకగ్రీవంగా భావిస్తున్నది.

***- ఎనిమిదో కేంద్ర కమిటీ విస్తార పన్నెండవ ప్లీనరీ సెషన్ వర్తమానం, 1968, అక్టోబరు 31***

చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవ పంథా మార్గదర్శకత్వంలో, చైర్మన్ మావో నాయకుడిగా, వైస్ చైర్మన్ లిన్ ఉప నాయకుడిగా కార్మికవర్గ హెడ్‌క్వార్టర్స్ నాయకత్వంలో, గడచిన రెండు సంవత్సరాలుగా అత్యంత సంక్లిష్టమైన, తీవ్రమైన వర్గ పోరాట క్రమంలో మున్నెన్నడూ లేనంత విశాల స్థాయిలో వందల లక్షల మంది ప్రజలు నలు మూలలా సమీకృతులయ్యారు. చైనా ప్రజా విముక్తి సైన్యం మద్దతుతో, పదే పదే వర్గ బల ప్రదర్శనలతో, వివిధ ప్రాంతాల నుంచీ ఏజెంట్లతో లీ షావ్ చీ నాయకత్వం వహించిన బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను అంతిమంగా ధ్వంసం చేశారు. పార్టీ, ప్రభుత్వం, సైన్యాలలో నాయకత్వాన్ని గుంజుకోవడానికి విఫలయత్నం చేసిన వీరు గుంజుకున్న మేరకు, ఆ అధికారాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. తైవాన్ రాష్ట్రం మినహా దేశమంతటా ఇరవై తొమ్మిది రాష్ట్రాలు, మునిసిపాలిటీలు, స్వయం పాలిత ప్రాంతాలలో విప్లవ కమిటీలు నెలకొల్పారు. నేడు ఈ ముఖ్యమైన కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం గొప్ప నిర్ణయాత్మక విజయం సాధించింది.

***- పై దాని నుంచే***

కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించాలన్న కామ్రేడ్ మావో సే టుంగ్ సిద్ధాంతానికి ఉన్న ప్రముఖ, దీర్ఘ దృష్టి కలిగిన ప్రాముఖ్యతను మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ అపారమైన విజయాలు మరింతగా స్పష్టం చేస్తున్నాయని ప్లీనరీ సెషన్ భావిస్తున్నది.

***- పై దాని నుంచే***

చైర్మన్ మావో వ్యక్తిగతంగా ప్రారంభించి నాయకత్వం వహించిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం గెలిచిన తరుణంలో ఈ కాంగ్రెస్ జరుగుతున్నది. ఈ గొప్ప విప్లవ తుఫాను రెనగేడ్, మరుగున ఉన్న విద్రోహి, ముసుగు వేసుకున్న లీ షావ్ చీ నేతృత్వంలో ఉన్న బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను నాశనం చేసింది. కొద్ది మందిగా ఉన్న రెనగేడ్‌లనూ శత్రు ఏజెంటులనూ పార్టీలో పెట్టుబడిదారీ మార్గం చేపట్టి, ఎంతమాత్రం పశ్చాత్తాపం లేని నాయకత్వంలో కొందరు వ్యక్తులనూ ఎండగట్టింది. లీ షావ్ చీ ప్రతినిధిగా పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించాలన్న వారి కుట్రను ధ్వంసం చేసింది. మన దేశంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని అది అపారంగా పటిష్టం చేసింది. మన పార్టీని కూడా ఎంతగానో పటిష్టం చేసింది. తద్వారా ఈ కాంగ్రెస్‌కు రాజకీయంగా సైద్ధాంతికంగా నిర్మాణపరంగా తగిన పరిస్థితులను

తయారు చేసింది.

***- సీపీసీ తొమ్మిదో కాంగ్రెస్ అధ్యక్షవర్గ సెక్రటేరియట్ ప్రెస్ వర్తమానం, ఏప్రిల్ 1, 1969***

సోవియట్ రివిజనిస్టు రెనగేడ్ ముఠా కేంద్రంగా ఉన్న ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా ఛైర్మన్ మావో ఎదురుదెబ్బ వంటి పోరాటం చేసి మార్క్సిస్టు లెనినిస్టు కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వ సిద్ధాంతాన్ని అందుకున్నాడు. పరిరక్షించాడు. అభివృద్ధి చేసాడు. కార్మికవర్గ నియంతృత్వం చారిత్రక అనుభవంలో అనుకూల, ప్రతికూల అంశాలను ఛైర్మన్ మావో సమగ్రంగా క్రోడీకరించాడు. పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణను నివారించడానికి కార్మికవర్గ నియంతృత్వం కింద విప్లవాన్ని కొనసాగించడం అన్న సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చాడు. **- పైదాని నుంచే**

మన పార్టీ చరిత్రలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం పార్టీని సంఘటితం చేయడం కోసం జరిగిన అతి విశాలమైన అతి లోతైన ఉద్యమం. వివిధ స్థాయిలలో పార్టీ నిర్మాణాలూ విశాల కమ్యూనిస్టు ప్రజానీకం రెండు పంధాల మధ్య తీవ్ర పోరాటాన్ని అనుభవించారు. పెద్ద ఎత్తున జరుగుతున్న వర్గ పోరాట పరీక్షను చవి చూసారు. పార్టీ లోపలా బయటా విప్లవ ప్రజానీకం పరిశీలనకు గురయారు. ఇలా పార్టీ సభ్యులూ కేడర్‌లూ ప్రపంచాన్ని ఎదుర్కొన్నారు. తుఫానును ధైర్యంగా ఎదుర్కొన్నారు. తమ వర్గ చైతన్యాన్ని, రెండు పంధాల మధ్య పోరాటం గురించిన చైతన్యాన్నీ పెంపొందించుకున్నారు. ఈ గొప్ప విప్లవం మనకు ఏం బోధిస్తున్నదంటే కార్మికవర్గ నియంతృత్వంలో మనం పార్టీ సభ్యులకు వర్గాలు, వర్గ పోరాటం, రెండు పంధాల మధ్య పోరాటం, విప్లవాన్ని కొనసాగించడం గురించి బోధించాలి. పార్టీ లోపలా బయటా రివిజనిజం మీద పోరాటం చేయాలి. పార్టీ నుంచీ రెనగేడ్‌లను, శత్రు ఏజెంటులనూ దోపిడీ వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇతర శక్తులనూ పారదోలాలి. గొప్ప తుఫానులో రాటు దేలిన నిజమైన కార్మికవర్గ పురోగామి శక్తులను పార్టీలోకి తీసుకోవాలి.

అన్ని స్థాయిలలోనూ పార్టీ నిర్మాణాల నాయకత్వం మార్క్సిస్టుల చేతులలో నిజంగా ఉండేట్టు మనం కృషి చేయాలి. పార్టీ సభ్యులు నిజంగా సిద్ధాంతాన్ని ఆచరణలో సమైక్యం చేసేట్టూ, ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకునేట్టూ, ధైర్యంగా విమర్శా స్వయం విమర్శా చేసేట్టుగా మనం చూసుకోవాలి. అలాగే పార్టీ సభ్యులు ఎల్లప్పుడూ నమ్రతగా, నిశితంగా, అహంకారం విసురూ లేకుండా, కఠిన పోరాటం, నిరాడంబర జీవిత శైలిని అవలంబించేట్టు చూసుకోవాలి. అప్పుడు మాత్రమే పార్టీ చివరి వరకూ సోషలిస్టు విప్లవాన్ని తీసుకువెళ్లడంలో కార్మికవర్గానికీ విప్లవ ప్రజానీకానికీ నాయకత్వం వహించగలుగుతుంది.

**- పైదాని నుంచే**

తొమ్మిదో కాంగ్రెస్ తరువాత కాలంలో లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠాను విచ్ఛిన్నం చేయడం మన పార్టీ అతి గొప్ప విజయం. ఇది దేశంలోనూ విదేశాలలోనూ శత్రువులకు గట్టి దెబ్బ ఇచ్చింది..... పార్టీలో అంతర్గత పోరాటం సమాజంలో వర్గ పోరాటానికి ప్రతిబింబం అని మార్క్సిజం లెనినిజం చెబుతుంది. లీషావ్‌చీ రెనగేడ్ ముఠా కూలిపోయి కార్మికవర్గంతో బలాబలాలు తేల్చుకోవడానికి లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠా ముందుకు వచ్చింది. తీవ్రమైన దేశీయ అంతర్జాతీయ వర్గ పోరాటాలకు ఇది బలమైన వ్యక్తీకరణ.

***- సీపీసీ పదో కాంగ్రెస్‌లో చౌ ఎన్ లై సమర్పించిన రిపోర్ట్, 1973, ఆగస్టు 24***

గడచిన యాభై సంవత్సరాలలో మన పార్టీ రెండు పంథాల మధ్య పది పెద్ద పోరాటాలు చేసింది. లిన్ పియావో పార్టీ వ్యతిరేక ముఠా కూలిపోయిందంటే ఇక పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం ముగిసిపోయినట్టు కాదు. కోటను లోపలి నుంచీ స్వాధీనం చేసుకోవడం అతి తేలికయిన పద్ధతని దేశ విదేశాలలో శత్రువులందరికీ తెలుసు. భూస్వాములు, పెట్టుబడిదారులూ స్వయంగా ముందుకు వచ్చే కంటే, పార్టీలోకి చొరబడ్డ పెట్టుబడిదారీ మార్గీయుల ద్వారా కార్మికవర్గ నియంతృత్వాన్ని లొంగదీయడం మరింత తేలిక. సమాజంలో భూస్వాములూ పెట్టుబడిదారులూ అప్పటికే తగినంతగా అసహ్యానికి గురయినప్పుడు దీనికి మరింత అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో, వర్గాలు మాయమయిపోయిన తరువాత కూడా, ఉపరితలానికీ ఆర్థిక పునాదికీ మధ్యనూ ఉత్పత్తి సంబంధాలకూ ఉత్పత్తి శక్తులకీ మధ్యనూ వైరుధ్యాలు ఉంటాయి. ఈ వైరుధ్యాలను ప్రతిబింబించే రెండు పంథాల మధ్య పోరాటాలూ ఉంటాయి. అంటే, పురోగామి, వెనుకబడిన వర్గాల మధ్యనూ సరైన దానికీ తప్పుడు దానికీ మధ్యనూ పోరాటాలు జరుగుతాయి. అంతేకాక, సోషలిస్టు సమాజం గణనీయంగా సుదీర్ఘ చారిత్రక కాలం పాటు సాగుతుంది. ఈ చారిత్రక కాలమంతటా వర్గాలు, వర్గ వైరుధ్యాలూ వర్గ పోరాటం ఉంటాయి. సోషలిస్టు మార్గానికీ పెట్టుబడిదారీ మార్గానికీ మధ్య పోరాటం ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం ఉంటుంది. సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదాల నుంచీ ఆక్రమణా, దురాక్రమణా ఉంటాయి. ఈ వైరుధ్యాలను ప్రతిబింబిస్తూ పార్టీలో చాలా కాలం వరకూ రెండు పంథాల మధ్య పోరాటాలు ఉంటాయి. అటువంటి పోరాటాలు పది, ఇరవై, లేక ముప్పై సార్లు జరుగుతాయి. లిన్ పియావోలు మళ్లీ మళ్లీ పుడతారు. అలాగే వాంగ్ మింగ్, లీషావ్ చీ, పెంగ్ టెహ్ హువాయ్, కావో కాంగ్ వంటి వ్యక్తులు ఉంటారు. దీనికి మనిషి ఇష్టాయిష్టాలతో సంబంధం ఉండదు. అందుకని మన పార్టీలో కామ్రేడ్స్ అందరూ రానున్న సుదీర్ఘ కాలంలో ఈ పోరాటాలకు మానసికంగా పూర్తిగా సిద్ధం కావాలి. పరిస్థితిని పూర్తిగా వినియోగించుకోవాలి. వర్గ శత్రువు తన ఎత్తుగడలు ఎలా మార్చుకున్నప్పటికీ కార్మికవర్గ విజయం కోసం పోరాటానికి మార్గదర్శకత్వం వహించాలి.

***- సీపీసీ పదో కాంగ్రెస్‌లో చౌ ఎన్ లై సమర్పించిన రిపోర్ట్, 1973, ఆగస్టు 24***

పార్టీ సభ్యులందరూ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, చైర్మన్ మావోల రచనలు నిశితంగా అధ్యయనం చేయాలి. గతితార్కిక భౌతికవాదానికీ చారిత్రక భౌతికవాదానికీ కట్టుబడి ఉండాలి. భావవాదాన్నీ పిడివాదాన్నీ ఎదుర్కోవాలి. తమ ప్రాపంచిక దృక్పథాన్ని మలుచుకోవాలి. ముఖ్యంగా సీనియర్ కేడర్‌లు నిశితంగా చదివి, అధ్యయనం చేసి, మార్క్సిజాన్ని చక్కగా అర్థం చేసుకోవడానికీ, మార్క్సిజం మౌలిక సిద్ధాంతాల మీద పట్టు సంపాదించడానికీ, పాత, కొత్త రివిజనిజానికీ అన్ని రకాల అవకాశవాదానికీ వ్యతిరేకంగా మార్క్సిజం చేసిన పోరాటాల చరిత్రను నేర్చుకోవడానికీ మార్క్సిజం లెనినిజం విశ్వజనీన సత్యాన్ని విప్లవ నిర్దిష్ట ఆచరణతో సమైక్యం చేసే క్రమంలో చైర్మన్ మావో మార్క్సిజం లెనినిజాన్ని ఎలా అంది పుచ్చుకుని, పరిరక్షించి, అభివృద్ధి చేసాడో అర్థం చేసుకోవాలి. నిరంతర కృషి ద్వారా మన విశాల కేడర్‌లూ ప్రజలూ మార్క్సిజం మౌలిక సిద్ధాంతాలతో సాయుధం అవుతారని ఆశిస్తాం.

*- సీపీసీ పదో కాంగ్రెస్‌లో చౌ ఎన్ లై సమర్పించిన రిపోర్ట్, 1973, ఆగస్టు 24*

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ విజయం మన దేశ కార్మికవర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసింది. సోషలిస్టు నిర్మాణాన్ని ప్రోత్సహించింది. మన దేశం ప్రపంచ పీడిత ప్రజల, పీడిత జాతుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేసింది. కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించడంలో నూతన అనుభవాన్ని అందించింది. అది గొప్ప చారిత్రక ప్రాధాన్యత కలిగినది. దాని ప్రభావం పరివ్యాప్తమయినది.

*- ప్రభుత్వ పని గురించిన రిపోర్ట్, చౌ ఎన్ లై, 1975, జనవరి 13*

సోషలిస్టు సమాజం గణనీయంగా సుదీర్ఘ చారిత్రక కాలం సాగుతుంది. సోషలిస్టు చారిత్రక కాలంలో ఇంకా వర్గాలు, వర్గ వైరుధ్యాలు, వర్గ పోరాటమూ ఉంటాయి. సోషలిస్టు మార్గానికీ పెట్టుబడిదారీ మార్గానికీ మధ్య పోరాటం ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం వెన్నంటి ఉంటుంది. మనం ఈ పోరాట సుదీర్ఘ, సంక్లిష్ట స్వభావాన్ని గుర్తించాలి. మరింత అప్రమత్తంగా ఉండాలి. సోషలిస్టు విద్యను నడపాలి. వర్గ వైరుధ్యాలను, వర్గ పోరాటాన్నీ సరిగా అర్థం చేసుకోవాలి. మనకూ శత్రువుకూ మధ్య ఉన్న వైరుధ్యాలకూ, ప్రజల మధ్య వైరుధ్యాలకూ తేడా చూడగలగాలి. లేని పక్షంలో మన లాంటి సోషలిస్టు దేశం తద్విరుద్ధంగా తయారై దిగజారిపోతుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరుగుతుంది. ఇప్పటి నుంచీ మనం ప్రతీ సంవత్సరం, ప్రతీ నెలా, ప్రతీ రోజూ కూడా ఈ విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడు ఈ సమస్య గురించి ఒక అవగాహనను నిలుపుకోగలుగుతాం. మార్క్సిస్టు లెనినిస్టు పంథాను కలిగి ఉండగలుగుతాం.

*- చాంగ్ చున్ చియావో, రాజ్యాంగ సవరణ మీద రిపోర్ట్, 1975, జనవరి 17*

# సి.సి. సి.పి.ఐ.(మావోయిస్టు)
# తీర్మానం, సర్క్యులర్లు

## పార్టీ వెటరన్ కామ్రేడ్స్‌పై

**- సి.సి. సి.పి.ఐ.(మావోయిస్టు), ఫిబ్రవరి 2017**

సి.సి. నాల్గవ సమావేశం పార్టీ వెటరన్స్ విషయంలో విధానపరమైన తీర్మానం చేసింది. ఈ తీర్మానం పార్టీ అంతటా వెటరన్స్ విషయంలో సరైన అవగాహనను కల్పించింది. అయితే శారీరకంగా, బౌద్ధికంగా పరిమితులు ఏర్పడిన కామ్రేడ్స్‌ను కమిటీలలో కొనసాగించాలా, లేదా అనే విషయాన్ని తదుపరి సమావేశంలో చర్చించాలని ఇదే సమావేశం అభిప్రాయపడింది.

సి.సి. నాల్గవ సమావేశం అందించిన అవగాహన దృష్టిలో పెట్టుకుంటూనే భారత విప్లవ దీర్ఘకాలిక స్వభావాన్నీ, ఆటుపోట్లను దృష్టిలో పెట్టుకొని వెటరన్స్‌కు సంబంధించిన మరికొన్ని నిర్దిష్ట సమస్యలను సి.సి. 5వ సమావేశం చర్చించి ఈ కింది నిర్ణయం తీసుకున్నది.

ముఖ్యంగా శారీరకంగా, బౌద్ధికంగా పరిమితులు ఏర్పడి తమ బాధ్యతలకు న్యాయం చేయలేని కామ్రేడ్స్‌ను సంబంధిత కమిటీలలో కొనసాగించే కంటే, వారిని ఆ కమిటీల నుండి రిలీవ్ చేసి, వారు నిర్వహించగలిగిన బాధ్యతను అప్పజెప్పి, వారి సుదీర్ఘ అనుభవాన్ని వివిధ కింది కమిటీల ద్వారా, ప్రజా నిర్మాణాల ద్వారా, వేదికల ద్వారా వివిధ పద్ధతుల్లో సంబంధిత పార్టీ కమిటీలు వారి సేవలను వినియోగించుకోవాలి. ఇటువంటి నిర్ణయాలు ఉద్యమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత వెటరన్ కామ్రేడ్ల ఆమోదంతో అమలు జరపాలి. ఇటువంటి నిర్ణయాలు సానుకూలంగా జరగాలంటే పార్టీలో శారీరకంగా, బౌద్ధికంగా పరిమితులు ఏర్పడిన కామ్రేడ్స్ విప్లవ చైతన్యాన్ని ప్రదర్శిస్తూ తమ పరిమితులను గుర్తించి స్వచ్ఛందంగా తమ కమిటీల నుండి స్టెప్‌డౌన్ అయి/వైదొలగి తాము న్యాయం చేయగలిగిన బాధ్యతలను నిర్వహించడానికి ముందుకు రావాలి. కేంద్ర, రాష్ట్ర నాయకత్వం తమ ఆచరణ ద్వారా పార్టీలో ఇలాంటి ఆదర్శాన్ని నెలకొల్పాలి. పార్టీలో కామ్రేడ్స్ ఏ

స్థాయి పని బాధ్యతలలో ఉన్నా వర్గపోరాట సిద్ధాంతాన్ని తమ జీవితసారంగా చేసుకొని శ్రమదోపిడీని, వర్గసమాజం అందించిన సకల రూపాల పీడనలను, స్వార్థాన్ని, ఇందుకు తోడ్పడే విలువలను, సంస్కృతిని, అలవాట్లను తొలగించడానికీ, మానవ సమాజం మరింత ఉన్నత స్థాయిలో పరివర్తన చెందుతూ కమ్యూనిజం చేరడానికి తోడ్పడేలా తుదివరకు పోరాడటం తమ కమ్యూనిస్టు నైతిక నియమావళిగా పార్టీలోనూ, సమాజంలోనూ ఉన్నత చేతనను పెంచాలి.

దేశంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి రోజురోజుకు తీవ్రతరమవుతున్నది. ఈ దాడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వెటరన్ కామ్రేడ్స్ రక్షణ సమస్య ముందుకు వస్తున్నది. దాడి తీవ్రంగా ఉండి రక్షణ ఇవ్వలేమనుకున్నప్పుడు సదరు కామ్రేడ్స్‌ను ఉద్యమ/ఉద్యమేతర గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు పంపి రక్షణ కల్పించటానికి కృషి చేయాలి. ఎంతటి కఠిన పరిస్థితులలోనైనా వారి శక్తియుక్తులను విప్లవం కోసం వినియోగించటానికి కృషి చేయాలి. ఈ విధంగా వీరికి రక్షణ కల్పించటానికి దీర్ఘకాలిక దృష్టితో ఆర్.బి.లు, రాష్ట్రకమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి కృషి చేయాలి. ఇలా సాధ్యమైన వివిధ పద్ధతుల్లో రక్షణ కల్పించబడిన కామ్రేడ్స్ దీర్ఘకాలిక దృష్టితో, ఓపికగా తమకు నిర్దేశించిన పని బాధ్యతలను పట్టుదలగా కొనసాగించాలి. ఇటువంటి కామ్రేడ్స్‌తో సంబంధిత పార్టీ కమిటీలు అత్యంత రహస్యంగా సంబంధాలు కొనసాగించాలి. సంబంధిత కమిటీలు ఇందుకవసరమైన ప్రత్యేక రహస్య యంత్రాంగం, సమన్వయ పద్ధతులు రూపొందించుకోవాలి. ఈ సంబంధాలు కొనసాగించేటప్పుడు రెండు కాంటాక్టుల మధ్య వ్యవధి సాపేక్షికంగా ఎక్కువ (కనీసం 6 నెలల నుండి ఒక సంవత్సరం)గానే ఉండాలి. ఏదైనా కారణాలతో బయట ఉన్న కామ్రేడ్స్‌కు పార్టీ కాంటాక్టు తెగిపోతే తిరిగి పార్టీ కాంటాక్టు ఏర్పడే దాకా నిబ్బరంగా ఉండి స్వతంత్రంగా తన కృషిని కొనసాగించాలి. ఇక్కడ చెప్పిన రెండు మార్గాలతో పాటు మరో మార్గంగా రాజకీయ పరిస్థితులు అనుకూలించినప్పుడు అవకాశం గల వెటరన్ కామ్రేడ్స్‌ను బహిరంగ జీవితం లోకి తీసుకువచ్చి వారి సేవలను విప్లవోద్యమానికి వినియోగించుకోవాలి.

వెటరన్ కామ్రేడ్స్ ఎదుర్కొంటున్న మరో సమస్య అనారోగ్య సమస్య. ఈ సమస్యకు అందుబాటులో ఉన్న వైద్యం అందించడం కొంతమేరకు పరిష్కారంగా ఉంటుంది. కానీ దీర్ఘకాలిక జబ్బులు, విషజ్వరాలు వచ్చినప్పుడూ, శరీర ముఖ్య (వైటల్) భాగాలు దెబ్బతిన్నప్పుడూ మనకు అందుబాటులో ఉన్న వైద్యం సరిపోదు. పట్టణాలకు పంపి

వైద్యం అందించాలి. అందుకు తగిన మెకానిజం (షెల్టర్స్ తదితర) ఉండాలి. కాని మనకు అలాంటి ప్రత్యేక యంత్రాంగం లేదనే చెప్పుకోవచ్చు. తగిన మెకానిజం లేని కారణంగా సరైన వైద్య సదుపాయం అందక కొద్దిమంది వెటరన్ కామ్రేడ్స్‌తో పాటు యువ కామ్రేడ్స్‌ను కూడా కోల్పోయాము. అనివార్య పరిస్థితుల్లో ఎక్కడైనా వైద్య సదుపాయం నిమిత్తం టౌన్స్‌కు పంపిన చోట వారిలో కొందరు శత్రు చేతిలో పడి అమరులు కావడమో, అరెస్టయి జైళ్లలో మగ్గడమో జరుగుతున్నది. కనుక ఈ సమస్యను వీలున్నంతగా పరిష్కరించుకునేందుకు తగిన మెకానిజం ఏర్పాటు చేసుకొనే దిశగా నాయకత్వ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

వయోభారంతో, సీరియస్ అనారోగ్యంతో బాధపడుతూ జైళ్ల నుండి విడుదలైన కామ్రేడ్స్‌ను బహిరంగ జీవితం గడుపుతూ వివిధ రూపాలలో బాధ్యతలు నిర్వహించమనడంతో పాటు వారి విప్లవ అనుభవాలు రాయమని సంబంధిత పార్టీ కమిటీలు కోరాలి. ఇక్కడ ఆయా కామ్రేడ్స్ విప్లవ అనుభవాలు అంటే పూర్తిగా విప్లవంతో తాదాత్మ్యం చెందిన అనుభవాలే కనుక, ఆ అనుభవాల ద్వారా ఆయా కాలాల్లో విప్లవోద్యమం తీసుకున్న మలుపులనూ, అది సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో తెచ్చిన మార్పులను నిర్దిష్టంగా అర్థం చేసుకోగలుగుతాం. తమ అనుభవాలను రాతలో పెట్టాలని బాధ్యతనిచ్చిన సంబంధిత కమిటీలకే వాటిని రాసిన తర్వాత అందించాలి. ఆ కమిటీలే వాటిని ఎడిట్ చేసి అవసరం అని భావించిన వాటిని ప్రచురించడంతో పాటు వివిధ రూపాలలో వినియోగించుకోవాలి. వెటరన్ కామ్రేడ్స్ జైళ్ల నుండి విడుదలైన సందర్భాలలో, వారు బహిరంగ జీవితం గడుపుతున్న క్రమంలో వారికి తగిన సహాయ సహకారాలు, గౌరవం అందేలా చూడాలి. ముఖ్యంగా బహిరంగ జీవితం గడుపుతున్న మన పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు, పార్టీ సానుభూతిపరులు వెటరన్ కామ్రేడ్స్‌కు షెల్టర్ ఇవ్వడం, వారి అనారోగ్యాన్ని పట్టించుకోవడం, ప్రయాణాలలో, రోజువారీ పనులలో సహకరించడం, ఆర్థిక వగైరా సహాయ సహకారాలతో వారికి పూర్తి మద్దతును అందించాలి.

పార్టీలో రహస్య జీవితం గడుపుతున్న వారిలోనే కాకుండా బహిరంగంగా పనిచేస్తున్న కామ్రేడ్స్‌లో కూడా చాలా మంది వెటరన్ కామ్రేడ్స్ ఉన్నారు. వీరిలో కొద్దిమంది వివిధ ప్రజాసంఘాలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో నేతృత్వం వహిస్తున్నారు. కొద్దిమంది కామ్రేడ్స్ నాయకత్వ స్థాయిలలో లేకపోయినప్పటికీ వివిధ విప్లవ కార్యకలాపాలలో పాల్గొంటూ తమ శక్తి మేరకు కృషి చేస్తున్నారు. ఇలాంటి కామ్రేడ్స్ అందరికీ సి.సి. 4వ సమావేశం

రూపొందించిన తీర్మానం ప్రకారం రహస్య జీవితం లోని వెటరన్ కామ్రేడ్స్‌లానే గౌరవం, సహాయ సహకారాలు అందించాలి. వారి ఆరోగ్య రక్షణ, రోజువారీ పనిలో సహాయ సహకారాలు అందేలా పర్యవేక్షించాలి. జైళ్లలోని వెటరన్ కామ్రేడ్స్ పట్ల కూడా ఇదే అవగాహనతో వ్యవహరించాలి. రహస్య, బహిరంగ జీవితంలోని, జైలు జీవితంలోని ఆయా కామ్రేడ్స్ యొక్క వయసు, ఆరోగ్యం, మానసికత, పని సామర్థ్యం తదితర విషయాలను దృష్టిలో ఉంచుకొని నాయకత్వ బాధ్యతలో ఎలాంటి మార్పులు చేయాలనే విషయాన్ని సంబంధిత పార్టీ కమిటీలు నిర్ణయించాలి. వయోభారం, శారీరక-మానసిక అనారోగ్యం, గాయపడడం, ఇతర కారణాల వల్ల క్రియాశీల రాజకీయ జీవితం గడపడానికి అశక్తులైన వెటరన్స్ తమ శేష జీవితం గౌరవప్రదంగా కొనసాగడానికి తోడ్పడేలా పై స్పిరిట్‌తో వారిని గౌరవించాలి. సహాయ సహకారాలందించాలి. ఈ బాధ్యత కేంద్రకమిటీతో పాటు అన్ని పార్టీ కమిటీలదీ, విప్లవ శ్రేణులదీ, యావత్తు పార్టీదీ, విప్లవ క్యాంపుదీ. పార్టీ ప్రజాసంఘాలను కూడా ఇదే దృష్టితో గైడ్ చేయాలి.

సుదీర్ఘ, విశేష అనుభవం కలిగిన మన వెటరన్ కామ్రేడ్స్ ఏ రంగంలో ఉన్నా, మన పార్టీకీ, విప్లవోద్యమానికీ గొప్ప సంపద. వారి సిద్ధాంత జ్ఞానం, దీక్ష పార్టీని మార్గం మరలకుండా కాపాడడానికి తోడ్పడతాయి. వారి అనుభవాలు పార్టీ కార్యాచరణను మరింత పురోగమింపజేయడానికి తోడ్పడుతాయి. కనుక వారిని గౌరవించడం, కాపాడుకోవడం, చివరి వరకు వినియోగించుకోవడం పార్టీకి ఒక ముఖ్యమైన కర్తవ్యంగా ఉంటుంది. అదే సమయంలో వెటరన్ కామ్రేడ్స్ కూడా పార్టీ క్రమశిక్షణ అమలుచేసే విషయంలో, ఇతర కామ్రేడ్స్‌తో సత్సంబంధాలు కొనసాగించే విషయంలో, తరాల అంతరాలను, ఉద్యమ ఆటుపోట్లను దృష్టిలో పెట్టుకొని పరిస్థితికి అనుగుణంగా కమ్యూనిస్టు స్పిరిట్‌తో ఆదర్శంగా ఉండేందుకు, తమ విలువైన అనుభవాలను విప్లవ పురోగమనానికి అందించేందుకు సిద్ధం కావాలి. కమ్యూనిస్టు చైతన్యంతో ఫలాపేక్ష లేకుండా నిస్వార్థంగా విప్లవంలో తమ వంతు పాత్ర నిర్వహించాలి. ఇదే వారి శేష జీవిత కర్తవ్యం. అప్పుడే ప్రాణంతో పాటు అన్ని రకాల స్వీయ ప్రయోజనాలను త్యాగం చేస్తూ విప్లవ పురోగమనంలో పార్టీ, పి.ఎల్.జి.ఏ., నూతన ప్రజాస్వామిక రాజకీయాధికార సంస్థలతో పాటు ప్రజానిర్మాణాల లోని అన్ని శ్రేణులకు, ప్రజలకు గొప్ప విప్లవ స్ఫూర్తిని నింపగలుగుతారు. ఉద్యమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సి.సి. తీసుకొంటున్న ఈ నిర్ణయాన్ని సంబంధిత వెటరన్ కామ్రేడ్స్ బోల్షివిక్ స్పిరిట్‌తో స్వీకరించాలి.*

*సిసి సర్క్యులర్, ఫిబ్రవరి 2017*

# ప్రస్తుత పరిస్థితి–మన కర్తవ్యాలు

2016వ సంవత్సరంలో దండకారణ్య, బీహార్–ఝార్ఖండ్(బీజే) ప్రాంతాల్లో విప్లవోద్యమాన్ని నిర్మూలించడం ద్వారా భారత విప్లవోద్యమాన్ని అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరం దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడుల్ని తీవ్రతరం చేశాయి. ప్రత్యేకించి మిషన్–2016 పేరుతో దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్‌లపై కేంద్రీకరిస్తూనే దేశవ్యాప్తంగా తీవ్రంగా కొనసాగిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడుల ఫలితంగా మన విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టాలు సంభవించాయి. ప్రస్తుతం మిషన్–2017 పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవ ప్రతీఘాతుక పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నాయి. ఈ మిషన్–2017లో ప్రధాన కేంద్రీకరణ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులను నిర్మూలించడంతోపాటు; డీకే, బీజేలపై కేంద్రీకరించి దాడులు చేయడం. 2019లో రానున్న పార్లమెంటరీ ఎన్నికలకు ముందే భారత విప్లవోద్యమాన్ని అణచివేయడానికి సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రెండున్నర సంవత్సరాల విప్లవ ప్రతీఘాతుక పథకాన్ని రూపొందించాయి.

భారత విప్లవోద్యమాన్ని త్వరగా నిర్మూలించాలని సామ్రాజ్యవాదులు, వారి దళారీలయిన భారత దోపిడీ వర్గాలు త్వరపడడానికి గల కారణాలను సరిగా అర్థం చేసుకోవడానికి ప్రస్తుత దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకోవడం అవసరం. కాబట్టి మొదట దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషించుకుందాం. ఆ తరువాత శత్రుదాడి పథకాన్ని, దాన్ని ఓడించడం కోసం మనం రూపొందించుకునే పథకాన్ని–మన కర్తవ్యాలను వరుస క్రమంలో పేర్కొందాం.

## I. దేశీయంగా, అంతర్జాతీయంగా తీవ్రతరమవుతున్న మౌలిక వైరుధ్యాల ఫలితంగా పెరుగుతున్న విప్లవానుకూల పరిస్థితులు :

### *అంతర్జాతీయ పరిస్థితి :*

అంతర్జాతీయ రంగంలోని మౌలిక వైరుధ్యాలు – సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులకు, ప్రజలకు మధ్యనున్న వైరుధ్యం; సామ్రాజ్యవాద దేశాల్లో/పెట్టుబడిదారీ దేశాల్లో–బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ నడుమ వైరుధ్యం; సామ్రాజ్యవాదుల నడుమ వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. వీటి ఫలితంగా అంతర్జాతీయ రంగంలో కొన్ని ముఖ్యమైన పరిణామాలు, ధోరణులు (ట్రెండ్స్) ముందుకు వస్తున్నాయి. అవి–

1. 1970ల నుండి స్టాగ్‌ఫ్లేషన్ రూపంలో కొనసాగుతున్న పెట్టుబడిదారీ సాధారణ

సంక్షోభంలో భాగంగా, క్రమంగా ఆర్థికంగా బలహీనపడుతూ వస్తున్న అమెరికాలో 2008లో ఏర్పడిన గృహ రుణాల సంక్షోభం వల్ల మరింత బలహీనపడడం; ఇప్పుడు రాజకీయ, సైనిక రంగాల్లో దానికి రష్యా, చైనాల నుండి మరింత పోటీ పెరగటం.

2. సామ్రాజ్యవాద దేశాల్లో, పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికరంగంలో రక్షణ విధానం(ప్రొటెక్షనిజం), రాజకీయ రంగంలో రేసిజం(జాత్యాహంకారం), ఫాసిజం పెరుగుతుండడం.

3. వెనుకబడిన దేశాల వనరులను, మార్కెట్లను కొల్లగొట్టడం కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ పెరుగుతుండడం.

4. ఇప్పటివరకు ఏకైక అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా సామ్రాజ్యవాదం తన పరిస్థితిని సంఘటితం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. రష్యా సామ్రాజ్యవాదం తన ప్రభావ పరిధులను నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది. **సామ్రాజ్యవాద దేశంగా ఎదిగిన చైనా ప్రపంచ పునర్విభజన కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుండడంతో అమెరికా అగ్రరాజ్యంతో దానికి వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ప్రపంచ పునర్విభజన కోసం అమెరికా-చైనాల మధ్య పెరుగుతున్న పోటీని అనుసరించి ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక-రాజకీయ సమీకరణలు (రీ అలైన్‌మెంట్) మారుతుండడం.** యూరప్‌లో ఆధిపత్యం కోసం జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య పోటీ పెరుగుతుండడం.

**సామ్రాజ్యవాదానికీ, పీడిత ప్రజలకూ, జాతులకూ మధ్య వైరుధ్యం :**

సామ్రాజ్యవాద దేశాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాకు చెందిన వెనుకబడిన దేశాల్లోని ప్రాకృతిక వనరులను, మార్కెట్లను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు వెనుకబడిన దేశాల్లో తమ తొత్తులైన దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, భూస్వాముల ద్వారా ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్నారు. తమ ఆదేశాలకు తలొగ్గని దేశాల్లో దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నారు. పశ్చిమాసియా/ మధ్యప్రాచ్య దేశాలయిన ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియాలలో; ఆఫ్రికా దేశాలయిన లిబియా, సోమాలియా, మాలి తదితర దేశాల్లో అమెరికా దురాక్రమణ యుద్ధాలను కొనసాగిస్తూనే ఉంది. అణ్వాయుధాల తయారీకి వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షల పేరుతో ఇరాన్, ఉత్తర కొరియాలను లొంగదీసుకునేందుకు తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తున్నది. అమెరికా, పశ్చిమ యూరఫ్ దేశాలు, రష్యా, చైనాలు ప్రపంచవ్యాప్తంగా ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తూనే ఉన్నాయి. ఈ వెనుకబడిన దేశాలంతటా అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా ప్రపంచంలో కనీసం 80 కోట్ల (800 మిలియన్ల) మంది ప్రజలు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. ఈ పేదరికం అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాల్లో అతి తీవ్రంగా ఉంది. అత్యంత పేదరికంలో బతుకుతున్న ప్రపంచ ప్రజలలో 75% పేద రైతాంగమే. ఏడున్నర లక్షల మందికి (750 మిలియన్ల ప్రజలు) పరిశుభ్రమైన నీరు అందుబాటులో లేదు. ఇరవైశాతం

మందికి విద్యుత్తు అందుబాటులో లేదు. వందల, లక్షల మంది (వందల మిలియన్ల) ప్రజలు సామ్రాజ్యవాద యుద్ధాలతో, బలవంతపు విస్థాపనతో, అంటు రోగాలతో, ఆకలితో, క్రూరమైన నిరుద్యోగంతో విలవిలలాడుతున్నారు.

సిరియాలో ఐదు సంవత్సరాలకు పైగా సామ్రాజ్యవాద దురాక్రమణతో 4,70,000 మంది ప్రజలు మరణించారు, దాదాపు 20,00,000 మంది గాయపడ్డారు. లక్షలాది మంది ఈ యుద్ధం వల్ల విస్థాపితులయ్యి పక్కనున్న దేశాలకు, యూరప్ దేశాలకు వలస పోయారు. గత దశాబ్దంన్నర కాలంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా తదితర దేశాల్లో సాగుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాల ఫలితంగా లక్షలాది మంది చనిపోయి, లక్షలాది మంది గాయపడి, లక్షలాది మంది పక్క దేశాలకు, యూరప్ దేశాలకు వలస పోవడం పెరుగుతోంది. లిబియా, సిరియా దేశాలు యూరప్ సరిహద్దుల్లో ఉండడంతో ఆ దేశాల నుండి యూరప్‌కు వెళ్ళుతున్న వలసలు పెద్దఎత్తున ప్రచారమవుతున్నాయి.

వెనుజులాలో హ్యూగో చావేజ్, క్యూబాలో ఫెడరల్‌కాస్ట్రో చనిపోవడం, క్యూబా మధ్యవర్తిత్వంతో కొలంబియాలోని గెరిల్లా పోరాట సంస్థ ఫార్క్ సాయుధ పోరాటాన్ని విరమించుకోవడం అనేవి సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికీ తాత్కాలికంగా కొంతమేరకు ఉపయోగపడినప్పటికీ, అవి వీటిని సంక్షోభం నుంచి ఎంతమాత్రమూ గట్టెక్కించలేవు. వాస్తవంగా కాస్ట్రో, చావేజ్ తదితర వామపక్ష, లిబరల్ పార్టీల నాయకులు లాటిన్ అమెరికా దేశాల్లో సోషలిజం పేరుతో అనుసరించిన విధానాలు నిజానికి సోషలిస్టు విధానాలు కావు. అవి ఆయా దేశాల్లో కార్మికులు, రైతాంగం, మధ్యతరగతిని సంతృప్తిపరుస్తూ, వారిని విప్లవం నుంచి పక్కదారి పట్టిస్తూ స్థానిక దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలకు తోడ్పడేవే. దీంతో అక్కడ తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాలు తలెత్తుత్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాలకు అనుకూల పరిస్థితులు పెంపొందుతున్నాయి. ఈ స్థితిని ఆసరా చేసుకుని ఒకవైపు అమెరికా, మరోవైపు చైనాలు ఆ దేశాలను తమ పక్షాన నిలబెట్టుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిణామాలు ఆయా దేశాల ప్రజలకు సామ్రాజ్యవాదంతో వైరుధ్యాన్ని మరింతగా పెంచుతున్నాయి.

### పెట్టుబడిదారీ దేశాల్లో బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ నడుమ వైరుధ్యం :

2008వ సంవత్సరంలో అమెరికాలో మొదలయి యూరప్ మీదుగా ప్రపంచానికంతటికీ విస్తరించిన ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిణామాలన్నీ ఈ సంక్షోభం ఫలితంగానే సంభవిస్తున్నాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా అమెరికాతో సహా జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర యూరప్ దేశాల్లో పాలకవర్గాలు ఈ సంక్షోభ పరిష్కారానికి అనుసరించిన ఆర్థిక, ద్రవ్య, రాజకీయ విధానాలన్నీ విఫలమయ్యాయి. ఫలితంగా ఈ దేశాలన్నింటా నిరుద్యోగం ప్రబలింది, ఆర్థికాభివృద్ధి

కుంటుపడింది, ప్రజా సంక్షేమ పథకాలపై, ఉద్యోగాలపై కోతలు విధించబడ్డాయి. దీంతో ఈ దేశాలన్నింటా ప్రజల్లోని అన్ని సెక్షన్లలో ప్రభుత్వాలపై తీవ్రమైన అసంతృప్తి పెరుగుతూ ఉంది. ఈ స్థితిలో దోపిడీ పాలక వర్గాలు తమతమ దేశాల్లో జాత్యాహంకారాన్ని (రేసిజాన్ని) రెచ్చగొడుతున్నాయి. జాత్యాహంకారం పునాదిగా ఫాసిస్టు భావజాలాన్ని పెంపొందిస్తూ అమెరికా, యూరప్ దేశాల్లో మితవాద, కన్జర్వేటివ్, ఫాసిస్టు పార్టీలు క్రమంగా బలం పుంజుకుంటూ అధికారంలోకి వస్తున్నాయి. జర్మనీలో గత సంవత్సరం అక్టోబర్-నవంబర్ నెలల్లో జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో ఏంజెలా మెర్కెల్ పార్టీ ఓటమి పాలయ్యి, ఫాసిస్టు పోకడలున్న పార్టీలు అధికారంలోకి వచ్చాయి. యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ వైదొలగడానికి (బ్రెగ్జిట్) కారణం కూడా ఆర్థిక సంక్షోభమే. యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, వలస విధానం (ఇమ్మిగ్రేషన్) వలన బ్రిటన్‌లో ఉద్యోగ అవకాశాలు కుదించబడుతూ తమ దేశ ఆర్థిక అభివృద్ధి కుంటుపడుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతూ వచ్చింది. ఈ స్థితిలో జాత్యాహంకార (రేసిస్టు) భావాల్ని దోపిడీవర్గ పార్టీలు పెంపొందించిన స్థితిలో ఆ దేశ ప్రజలు యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగాలని ఓటు వేశారు.

అమెరికాలో ఒబామా అనుసరించిన ఆర్థిక, రాజకీయ, సైనిక, విదేశాంగ విధానాలు ఏవీ అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేక ఘోరంగా విఫలమయ్యాయి. ఈ స్థితిలో అమెరికా శ్వేత జాతి అహంకారాన్ని విపరీతంగా రెచ్చగొట్టి డోనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చాడు. దీంతో అక్కడ నల్ల జాతీయులపై, ముస్లింలపై, అమెరికనేతర వలస ప్రజలపై జాతి ఉన్మాద దాడులు పెరుగుతూ ఉన్నాయి.

ఈ ఆర్థిక సంక్షోభం ఫలితంగా అమెరికా, యూరప్ దేశాలన్నింటా సామ్రాజ్యవాదులు తమతమ దేశాల్లో దిగుమతులపై అధిక సుంకాల్ని విధిస్తూ రక్షణ (ప్రొటెక్షనిస్టు) విధానాల్ని అనుసరిస్తున్నారు. మరోవైపు తమ పెట్టుబడుల, సరుకుల ఎగుమతులపై అధిక సుంకాల్ని విధించకూడదంటూ వెనుకబడిన దేశాలపై ఒత్తిడులు చేస్తున్నాయి.

అమెరికా, యూరప్ దేశాలు ఒకవైపు జాత్యాహంకారాన్ని, ఫాసిజాన్ని రెచ్చగొడుతూ, వలస నిబంధనల్ని కఠినతరం చేస్తూనే, మరోవైపు తమ దేశ కార్మికవర్గంపై శ్రమదోపిడీని మరింత తీవ్రతరం చేయడానికి వీలుకల్పించేలా ఔట్‌సోర్సింగ్ విధానాలను అమలు చేస్తున్నారు. వలస కార్మికులను అనుమతిస్తున్నారు. ఈ విధానాలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

ఈ రకంగా పెట్టుబడిదారీ దేశాల్లో బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ నడుమ వైరుధ్యం తీవ్రతరమవుతున్నది.

**సామ్రాజ్యవాద దేశాల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యం :**

2010 నుండి అమెరికా, తూర్పు యూరప్ దేశాల్లో కొన్నింటిని, పాత సోవియట్ రిపబ్లిక్ దేశాల్లో కొన్నింటిని నాటో కూటమిలోకి చేర్చుకుని రష్యాను ఆందోళనకు గురి చేసింది. అప్పటికీ

రష్యా తన ఆర్థిక వ్యవస్థను ఓ మేరకు సరిదిద్దుకొని, అంతర్జాతీయంగా తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం అమెరికాతో తీవ్రమైన ఘర్షణలోకి దిగింది. అందులోభాగంగా అమెరికా తొత్తు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌పై రిఫరెండం ముసుగుతో యుద్ధానికి దిగి క్రిమియాను కలుపుకొన్నది. అలాగే మధ్యప్రాచ్యంలోని తన ప్రయోజనాల్ని రక్షించుకోవడంలో భాగంగా సిరియాలో అధ్యక్షుడు అసద్ పక్షాన అమెరికా ప్రాయోజిత తిరుగుబాటుదార్లకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తోంది. మరోవైపు షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్, బ్రిక్స్ కూటములలో చైనాతో కలసి అమెరికాకు, నాటో కూటమికి వ్యతిరేకంగా రష్యా సైనిక సన్నాహాలు చేసుకుంటోంది. ఇదంతా అమెరికా, రష్యాల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యపు వ్యక్తీకరణే. డోనాల్డ్ ట్రంపు అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా, రష్యాల మధ్య కొన్ని విషయాల్లో సయోధ్య కనిపిస్తున్నప్పటికీ, అది తాత్కాలికమే గాక, రానున్న రోజుల్లో ప్రమాదకర స్థాయికి చేరే పోటీ, ఘర్షణకు ఇది సంకేతం మాత్రమే.

ఆర్థిక, రాజకీయ, సైనిక రంగాల్లో తమ ప్రత్యర్థి సామ్రాజ్యవాద దేశంగా ఎదుగుతున్న చైనాను దెబ్బతీసేందుకు అమెరికా 2011వ సంవత్సరంలోనే ఆసియా కేంద్రిత విధానాన్ని (ఆసియా-పివోట్ పాలసీ) రూపొందించుకుంది. ఒబామా స్థానంలో నూతన అధ్యక్షుడుగా అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ డోనాల్డ్ ట్రంప్ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ చైనా వ్యతిరేక దూకుడును పెంచుతున్నాడు. దక్షిణ చైనా సముద్ర జలాలపై చైనా అధికారాన్ని తిరస్కరిస్తూ, ఆ ప్రాంతంపై అధికారం కోసం, హక్కు కోసం ఫిలిపైన్స్ చేసిన వాదనల్ని సమర్థిస్తూ హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయాలయం వెలువరించిన తీర్పును సాకుగా చూపుతూ అమెరికా ఆ ప్రాంతంలోని తమ మిత్ర దేశాల తరపున యుద్ధ నౌకల్ని మోహరిస్తూ చైనాతో ఘర్షణల్ని తీవ్రతరం చేస్తోంది.

దక్షిణ చైనా, తూర్పు చైనా సముద్రంలోని చమురు, సహజవాయు నిక్షేపాలపై, జల మార్గాలపై పెత్తనం కోసం చైనా-అమెరికాల మధ్య పెరుగుతున్న పోటీ ఆసియా-ఫసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచుతూ ఉంది. ఈ ఉద్రిక్తతలు ఆసియా-ఫసిఫిక్ ప్రాంతంలో అమెరికా-చైనాల మధ్య సైనిక ఘర్షణలకు దారితీసే దిశగా సాగుతున్నాయి. అంతర్జాతీయ రంగంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల తీవ్రతకు ఈ ప్రాంతం ఒక ముఖ్యమైన రంగంగా మారుతున్నది.

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలం నుండి అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ యుద్ధ ఆర్థిక వ్యవస్థగా మారిపోవడం, నిరంతరం యుద్ధాలలో కూరుకొనిపోవడం వల్ల దాని వనరులన్నీ హరించుకుపోతుండడంతో అది రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా బలహీనపడింది. ఈ స్థితిలో అది తన మిత్ర దేశాలను రాజకీయంగా, సైనికంగా మునుపటి వలే తన పక్షాన నిలబెట్టుకోలేకపోతోంది. ఈ పరిణామంలో భాగంగానే గతంలో అమెరికాపై

ఆధారపడిన టర్కీ, ఫిలిప్పైన్స్ వంటి దేశాలు క్రమంగా దానికి దూరమవుతున్నాయి. ఆర్థిక రంగంలో అమెరికాకు, ఇయుకు మధ్య పెరుగుతున్న పోటీ రీత్యా, తన ఆర్థిక సంక్షోభ పరిస్థితుల రీత్యా నాటో కూటమి కోసం గతంలో లాగా తాను అత్యధిక నిధుల్ని కేటాయించలేకపోతున్నది. ఈ స్థితిలో అది నాటో కూటమిని సమైక్యంగా ఉంచలేకపోతోంది. మరోవైపు చైనా సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగి అమెరికాకు ఆర్థిక రంగంలో గట్టి ప్రత్యర్థిగా నిలబడుతోంది. ఆసియాలో తన పట్టును బిగించి ఆధిపత్యం నెలకొల్పుకునేందుకై చైనా ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకును ఏర్పాటు చేసింది. ఈ స్థితిలో ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక-రాజకీయ (జియో-పొలిటికల్) సమీకరణలు (రీ అలైన్‌మెంట్) మారుతున్నాయి. సైనిక రంగాన్ని అది బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటివరకు అమెరికా వ్యూహాత్మక మిత్రదేశంగా ఉన్న పాకిస్తాన్ ఇప్పుడు చైనాతో వ్యూహాత్మక రక్షణ-ఆర్థిక ఒప్పందాలు చేసుకుని, వ్యూహాత్మక మిత్ర దేశంగా మారిపోయింది. మరోవైపు 1991వ సంవత్సరపు సోవియట్ యూనియన్ పతనం వరకు ఆ దేశంతో అత్యంత సన్నిహిత భాగస్వామిగా ఉన్న భారతదేశం ఆ తరువాతి కాలం నుండి అమెరికాకు దగ్గరవుతూ గత సంవత్సరం ఆగష్టులో ఆ దేశంతో కుదుర్చుకున్న సైనిక ఒప్పందం (లాజిస్టిక్స్ ఎక్స్‌చేంజ్ మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్-లెమోవా) ద్వారా అమెరికాకు కీలక సైనిక భాగస్వామ్య దేశంగా మారింది. పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనిక శక్తిని ఎదుర్కోవడానికి అమెరికాతో ఈ సైనిక ఒప్పందం చేసుకోవడం ద్వారా భారతదేశం తన వ్యూహాత్మక మొగ్గు (స్ట్రాటజికల్ షిఫ్ట్)ను ప్రదర్శించింది.

సమీప భవిష్యత్తులో అమెరికా-చైనాల మధ్య ఆర్థిక, వ్యాపార, దౌత్య, సైనిక రంగంలోని పోటీ మరింత తీవ్రతరం అవుతుంది. దీనిని అనుసరించి సామ్రాజ్యవాద దేశాలతో వెనుకబడిన దేశాల ఆర్థిక, రాజకీయ సంబంధాల్లో అమెరికా, చైనాల పక్షం తీసుకుంటూ పునర్ సమీకరణలు జరుగనున్నాయి. ఈ పునర్ సమీకరణలు ప్రపంచాన్ని పునర్విభజన చేసుకోవడానికి సామ్రాజ్యవాద ముఠాల మధ్య పోటీనీ, ఘర్షణలనూ తీవ్రతరం చేస్తాయి. ఈ పునర్ సమీకరణలను అనుసరించి వెనుకబడిన దేశాల్లో రాజకీయ సంక్షోభాలు పెరుగుతాయి. ఈ పునర్ సమీకరణలను అనుసరించి ఆసియాలో చైనా, రష్యా, ఇరాన్, పాకిస్తాన్‌లు ఒకవైపు, అమెరికా మిత్రపక్షాలైన జపాన్, దక్షిణ కొరియా, ఇండియా తదితర దేశాలు ఒకవైపు నిలబడి సాగించే పోటీ, ఘర్షణల ఫలితంగా, ప్రపంచంలోని ఇతర రీజియన్‌లలో కూడా ఇలాంటి పునర్ సమీకరణల ఫలితంగా తలెత్తే పోటీ, ఘర్షణలు అంతర్జాతీయంగా మరింత తీవ్రతరం అవుతాయి.

పశ్చిమాసియా (మధ్యప్రాచ్యం)లో అమెరికా సామ్రాజ్యవాదులు, ఇజ్రాయెలీ జియోనిస్టులు, నాటో పెట్టిన యుద్ధచిచ్చు కనుచూపు మేరలో అంతమయ్యేలా కనపడడం లేదు. శాంతి ఒప్పందాలను ఉల్లంఘిస్తూ జియోనిస్టు ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై నిరంతరం చేస్తున్న దాడులకు, ఆక్రమిత భూభాగాల విస్తరణకు వ్యతిరేకంగా, వివిధ ఆఫ్రికా దేశాలపై సాగిస్తున్న

దురాక్రమణ దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనా, తదితర ప్రజల ప్రతిఘటనా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అంతర్జాతీయ రంగంలోని మౌలిక వైరుధ్యాల తీవ్రత వెన్నంటి ప్రపంచ వ్యాప్తంగా విప్లవాల వెల్లువ రావచ్చు.

## దేశీయ పరిస్థితి :

ప్రధానమంత్రి నరేంద్రమోది నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నీ సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను దూకుడుగా అమలు చేయడానికి ఉద్దేశించినవే. నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, దేశ వ్యతిరేక విధానాలతో దేశంలోని అన్ని సెక్టర్లపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దాడులు పెరిగాయి.

నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నీ మన దేశంలోని పీడిత వర్గాలకు, పీడిత జాతులకు, పీడిత సాంఘీక సముదాయాలకు వ్యతిరేకమైనవే. కాబట్టి దేశంలోని కార్మికులు, రైతులు, పెటీబూర్జువాలు, జాతీయ బూర్జువాజీ, పీడిత జాతులు, మతమైనారిటీలు, దళితులు, ఆదివాసులు, మహిళలు–అందరూ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే స్థితి నెలకొంది. **బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం పీడిత వర్గాలకు, జాతులకు, పీడిత సాంఘీక సముదాయాలకు ఉమ్మడిగా శతృవుగా నిలబడ్డ స్థితి ఏర్పడడం మన దేశీయ రాజకీయ పరిణామాల్లోని నూతన మార్పు.** ఈ పరిణామపు వ్యక్తీకరణ ఎలా ఉందో చూద్దాం.

గత రెండున్నర సంవత్సరాలుగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు గోసంరక్షణ పేరుతో దేశవ్యాప్తంగా దళితులపై, ముస్లింలపై చేస్తున్న దాడులు పెరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని దాదరి నుండి మొదలుకుని గుజరాత్‌లోని ఉనా వరకు సాగిన ఈ దాడుల నేపథ్యంలో మతోన్మాద శక్తులను ఎదుర్కోవడానికై దళితులు, ముస్లింలతోపాటు ఆదివాసీ, వెనుకబడిన తరగతులకు చెందిన శక్తులు ఉనాలో సమీకరించబడి హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కొనే కార్యాచరణ పథకాన్ని రూపొందించుకున్నాయి. రానున్న రోజుల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తులు, దళితులు, ముస్లింలు, అదివాసులు, ఇతర పురోగామి సెక్షన్లు మరింత సంఘటితపడి, సమరశీల పోరాటాలకు సిద్ధపడే పరిస్థితులు పెరుగుతున్నాయి.

దేశ, విదేశ కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను దూకుడుగా అమలు చేస్తూ దేశంలోని ఆదివాసీ ప్రాంతాల నుండి ప్రాకృతిక వనరుల లూటీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలలో ఆదివాసీ సమూహాలు తీవ్రమైన విస్థాపిత సమస్యను ఎదుర్కొంటూ తమ అస్థిత్వాన్ని, అస్మితను కోల్పోతున్నాయి.

విస్థాపిత సమస్యపై ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు మిలిటెంట్ పోరాటాలకు దిగుతున్నారు. ఝార్ఖండ్‌లో ఛోటా నాగపూర్ టెనన్సీ, సంథాలీ పెజంట్స్ టెనన్సీ (కౌలుదార్లు) చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆదివాసులు పెద్దఎత్తున వీధి పోరాటాలు కొనసాగిస్తున్నారు. తెలంగాణాలో 'హరిత హారం' పేరుతో ఆదివాసుల భూములను కబ్జా చేసుకునే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం బద్దలైంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో గత సంవత్సర కాలంలో అనేకచోట్ల ఆదివాసుల విస్థాపన వ్యతిరేక పోరాటాలు మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. విస్థాపన సమస్యపై మరెన్నో చోట్ల ఆదివాసేతర ప్రజలు సైతం మిలిటెంట్ పోరాటాలకు దిగారు. దీంతో రానున్న రోజుల్లో ఆదివాసీ, ఆదివాసేతర ప్రజల విస్థాపిత వ్యతిరేక ఉద్యమాలు మరింత సంఘటితపడి, సమరశీలంగా పోరాడే దిశగా సాగనున్నాయి.

రోహిత్ వేముల ఆత్మహత్య అనంతరం దేశవ్యాప్తంగా వందలాది విశ్వ విద్యాలయాల్లో, వేలాది కళాశాలల్లో దళిత, ఆదివాసీ, మత మైనారిటీ విద్యార్థులు హిందూ ఫాసిస్టు దాడులను ఎదుర్కోవడానికి నరేంద్రమోదీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా సమీకరించబడ్డారు. రానున్న రోజుల్లో ఇందులోని పురోగామి శక్తులు సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటంలో బలమైన శక్తిగా సంఘటితపడే అవకాశాలు పెరుగుతున్నాయి.

కేంద్రంలో మోడీ అధికారంలో వచ్చినప్పటి నుంచి దేశాన్ని పూర్తిగా సామ్రాజ్యవాద పెట్టుబడులకు దాసోహం చేస్తూ మరోవైపు జాతీయవాదం, దేశభక్తి, దేశద్రోహం అస్త్రాలను ప్రయోగించి ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులపై హిందూత్వ గ్యాంగులు విచ్చలవిడిగా దాడులు చేయడానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, నిజమైన దేశభక్తయుత శక్తులు పోరాడుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలతో దేశవ్యాప్తంగా రైతాంగం వేర్వేరు రూపాల్లో పోరాడుతున్నారు. సామ్రాజ్యవాద అనుకూల, రైతాంగ వ్యతిరేక విధానాల దుష్ఫలితాల వల్ల వ్యవసాయ సంక్షోభ తీవ్రత పెరిగి జాట్లు, పటేళ్ళు, మరాఠాలు, కాపులు లాంటి వ్యవసాయ ఆధారిత 'అగ్ర' కులాలు కూడా పోరాడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రిజర్వేషన్లను వ్యతిరేకించిన ఈ కులాలు ఇప్పుడు తమకు విద్య-ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు తలొగ్గి గత సంవత్సరం కేంద్రప్రభుత్వం రక్షణ, ఫార్మస్యూటికల్స్, సింగిల్‌బ్రాండ్ చిల్లర వ్యాపారం, బ్రాడ్‌కాస్టింగ్ (రేడియో ప్రసారాలు), పౌర విమానయానం తదితర రంగాల్లో 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించింది. దీంతోపాటుగా బహుళజాతి సంస్థలకూ, దేశీయ బడా కార్పోరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూరేలా, కార్మికుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కార్మిక చట్టాల్ని కేంద్రప్రభుత్వం

సవరించింది. ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో వామపక్ష ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలో దేశవ్యాప్తంగా 15 కోట్ల మందికి పైగా కార్మికులు సాధారణ సమ్మె జరిపి విజయవంతం చేశారు. 2015వ సంవత్సరంలో కూడా దాదాపు 14 కోట్ల మంది కార్మికులు సాధారణ సమ్మె చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న దేశవ్యాపితంగా 10 లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు కార్మిక చట్టాల సంస్కరణలతో పాటు ఔట్‌సోర్సింగ్ వంటి ఇతర ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బంద్ నిర్వహించారు. రానున్న రోజుల్లో కార్మికుల సమ్మెలు పెరగనున్నాయి. మోదీ ప్రభుత్వ విధానాలు కేవలం కార్మిక వ్యతిరేకమైనవే కాకుండా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను దివాళా తీయించేవిగా ఉండడంతో రానున్న రోజుల్లో చిన్న, మధ్యతరహా పెట్టుబడిదార్లు వేర్వేరు రూపాల్లో పోరాడే పరిస్థితులు నెలకొంటున్నాయి.

సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాజీ ప్రయోజనాల కోసం దేశాన్నంతటినీ ఒకే ఏకీకృత మార్కెట్‌గా తీర్చిదిద్దడం కోసం పరోక్ష పన్నుల విధానాన్ని సవరించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశ పెట్టారు. అవినీతిని నిర్మూలించడమనే మోసపు ప్రచారంతో పెద్దనోట్లను రద్దుచేసి ప్రజల సొమ్మునంతటినీ బ్యాంకుల్లో జమ చేయించారు. దీంతో రైతాంగం, చిన్న వ్యాపారస్థులు, చిన్న పెట్టుబడిదార్లు దెబ్బతిన్నారు. దీంతో వ్యవసాయిక, పారిశ్రామిక, సేవారంగాలు దెబ్బతిన్నాయి. ప్రజలు తమ మిగులును, పొదుపును స్వతంత్రంగా వినియోగించుకోవడానికి వీలులేకుండా ప్రజల సొమ్మునంతా బ్యాంకుల్లో జమ చేసేలా, తద్వారా వాటిని సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారులు ఉపయోగించుకునేలా డిజిటలైజేషన్, నగదురహిత ఆర్థిక వ్యవస్థ (కాష్‌లెస్ ఎకనామి) ఏర్పాటు కోసం చేస్తున్న ప్రయత్నాలతో రానున్న రోజుల్లో దేశంలోని మధ్యతరగతితో సహా అన్ని సెక్షన్లపై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడి దాడి మరింత పెరగనుంది.

దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని మోడీ ప్రభుత్వం ఊదరగొడుతున్నప్పటికీ దేశంలో పారిశ్రామిక రంగం, ఉత్పాదక రంగం (మాన్యుఫాక్చరింగ్)లో కునారిల్లుతున్న స్థితి నెలకొని నిరుద్యోగం పెరిగి, నిత్యావసర ధరలు పెరిగి, వ్యవసాయ సంక్షోభం పెరిగి ఈ 'అభివృద్ధి' డొల్లను బహిర్గతం చేస్తున్నాయి.

కశ్మీర్ జాతి విముక్తి పోరాటం గత సంవత్సరం నుండి తీవ్రతరమై కొనసాగుతూ ఉంది. హిజ్‌బుల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన బుర్హాన్‌వణిని భారత సైనిక బలగాలు కాల్చి చంపిన తరువాత ఆ పోరాటం మరోసారి వెల్లువెత్తింది. మరోసారి అక్కడి ప్రజలు సాయుధులయ్యి భారత సైనిక, పారామిలిటరీ బలగాలతో పోరాడుతున్నారు. ఈ పోరాటంలో నవతరం పెద్దఎత్తున పాల్గొనడం విశేషం. ఈ పోరాటానికి ఆ జాతికి చెందిన అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల సంపూర్ణ మద్దతు ఉంది. ఈ ప్రజాపునాదిపై ఆధారపడి, మరింత సంఘటితమై, సాయుధమై

ఆ పోరాటం దీర్ఘకాలంపాటు సాగనుంది. ఈ పోరాటం ఫలితంగా భారత సైనిక, పారామిలిటరీ బలగాలు దీర్ఘకాలంపాటు అక్కడే దిగబడిపోయే స్థితి నెలకొంది.

ఈశాన్య భారతంలోని జాతి విముక్తి పోరాట సంస్థలు తిరిగి సంఘటితపడి, సమైక్యంగా (ఐక్యసంఘటన ఏర్పాటు చేసుకుని) పోరాడుతున్నాయి.

దేశంలో నానాటికీ తీవ్రతరమవుతున్న వైరుధ్యాల వల్ల తీవ్రతరమయ్యే సామాజిక అశాంతిని దెబ్బతీయడానికి మోడీ ప్రభుత్వం మరిన్ని ఫాసిస్టు చట్టాలను తీసుకవచ్చే అవకాశం ఉంది. అలాగే రకరకాల పేర్లతో హిందూ ఫాసిస్టు గ్యాంగుల్ని కూడా నిర్మించే, ప్రజలపై చట్టవ్యతిరేక, ఫాసిస్టు దాడుల్ని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

పైన పేర్కొన్నవిధంగా ప్రముఖ వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా రానున్న రోజుల్లో దేశీయంగా, అంతర్జాతీయంగా పీడితవర్గాల, పీడిత జాతుల, పీడిత సెక్షన్ల ప్రజలు సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికీ, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా విస్తృతంగా పోరాటాల్లో కదలనున్నారు. ఈ పోరాటాల నుండే ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు పార్టీలు/విప్లవ పార్టీలు పుట్టుకొస్తున్నాయి. రానున్న రోజుల్లో మిగతా దేశాల్లో కూడా విప్లవ పార్టీలు పుట్టి, సంఘటితపడే అవకాశాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ స్థితి ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులతో సహా దోపిడీ పాలక వర్గాలకు ప్రమాదకరం. అందుకే ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదుల గైడెన్స్‌లో దోపిడీ పాలక వర్గాలు తమతమ దేశాల్లో ప్రజాస్వామిక పోరాటాలపై, విప్లవ పోరాటాలపై, జాతుల పోరాటాలపై ఫాసిస్టు దాడులను తీవ్రతరం చేస్తున్నారు. అందులోభాగంగానే మన దేశంలో మన విప్లవోద్యమంపై దోపిడీ వర్గాలు విప్లవ ప్రతీఘాతుక దాడిని తీవ్రతరం చేస్తున్నాయి. ఈ దాడికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన విప్లవ ప్రతీఘాతుక పథకం ఏమిటో చూద్దాం.

## II. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విప్లవ ప్రతీఘాతుక దాడిని ప్రతిఘటిస్తూ, నిలదొక్కుకుంటున్న విప్లవోద్యమం - భారత విప్లవోద్యమ సమూల నిర్మూలనకు మరింత ఫాసిస్టు దాడిని కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు :

గత సంవత్సరం శత్రువు దేశవ్యాప్తంగా కొనసాగించిన విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడుల ఫలితంగా అన్ని రాష్ట్రాల్లో/స్పెషల్ జోన్లల్లో/స్పెషల్ ఏరియాల్లో సాధారణంగా మన ఉద్యమానికి మరిన్ని ప్రతికూలతలు పెరిగాయి. ఉద్యమ ప్రాంతాలంతటా స్థానిక నాయకత్వం పెద్దఎత్తున అరెస్టయ్యి, అమరులయిన ఫలితంగా ఆ మేరకు స్థానిక నిర్మాణాలు బలహీనపడడం, ఏరియా కమిటీ నుండి కేంద్రకమిటీ సభ్యుల అరెస్టులు, అమరత్వాలు, రిక్రూట్‌మెంట్ తగ్గడం, దండకారణ్యంలో స్థానిక నిర్మాణాలు, జనతన సర్కార్లు బలహీనపడి, కొన్ని ఏరియాలు బలహీనపడడం, ప్రతిఘటనలో శత్రువుపై కలిగించే నష్టాలు సాపేక్షికంగా

తగ్గడం, దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్, ఏఓబీ, ఒడిశాలతో సహా కార్పెట్ సెక్యూరిటీ విస్తరించి, సంఘటితపడిన ఉద్యమ ప్రాంతాలంతటా మన మాస్‌వర్క్‌లో, ప్రతిఘటనలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటిరీత్యా దేశవ్యాప్తంగా ఉద్యమం గడ్డు స్థితిలోనే కొనసాగుతున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడుల ఫలితంగా పైన పేర్కొన్నవిధంగా విప్లవోద్యమానికి ప్రతికూలతలు పెరగడం ఒక పార్శ్వం/కోణం కాగా, ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడిని ప్రతిఘటిస్తూ మనం సాగించిన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ఫలితంగా లేదా ప్రజాయుద్ధం, ప్రజా పోరాటాల ఫలితంగా గడ్డుస్థితిని అధిగమించడానికి మరిన్ని అనుకూలతలు పెరిగాయి. గత సంవత్సర కాలంగా శత్రు దాడిని ప్రతిఘటిస్తూ మనం సాధించిన విజయాలను కూడా ఈ సందర్భంగా చూద్దాం.

విప్లవోద్యమ ప్రాంతాల్లో మనకు యుద్ధ సామాగ్రి అందకుండా శతృవు సప్లయి మార్గాలను మూసివేసిన స్థితిలో స్థానిక వనరులతో, పరిమిత వనరులతో గెరిల్లాయుద్ధాన్ని సాగిస్తూ కేవలం 2016 సంవత్సర కాలంలో వివిధ గెరిల్లా జోన్లల్లో, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల్లో పీఎల్‌జీఏ 317 గెరిల్లా చర్యలను నిర్వహించింది. (శతృ సాయుధ బలగాలపై-154, ప్రజా శతృవులపై-115, కార్పోరేట్ సంస్థలపై-48 చర్యలు). శతృ సాయుధ బలగాలపై నిర్వహించిన చర్యల్లో ఆరు పెద్ద చర్యలు, 19 మధ్యరకం చర్యలు, 292 చిన్నరకం చర్యలు. మొత్తం చర్యల్లో 40 చర్యలు బూబీట్రాప్ చర్యలే. ఈ మొత్తం చర్యల్లో 114 మంది పారా మిలిటరీ బలగాలను, పోలీసులను నిర్మూలించి, 230 మంది పోలీసులను గాయపరిచాం.

రాజ్య ప్రాయోజిత విప్లవ ప్రతీఘాతుక రహస్య ముఠాలను, పోలీసు ఇన్‌ఫార్మర్ల-కోవర్టుల నెట్‌వర్క్‌ను, ప్రజా వ్యతిరేక రాజకీయ నాయకులను, వర్గ శతృవులను నిర్మూలించడం కోసం పీఎల్‌జీఏ 115 చర్యలను నిర్వహించి 123 మందిని నిర్మూలించింది.

గెరిల్లాయుద్ధ చర్యల్లో అత్యధికం దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, పూర్వీ బీహార్-పూర్వోత్తర్ ఝార్ఖండ్, ఏఓబీల్లోనే జరిగాయి. మిగతా చోట్ల కూడా కొన్ని చర్యలు జరిగాయి.

రాజ్యం దన్నుతో సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడి వనరుల దోపిడీ కోసం సాగిస్తున్న ప్రయత్నాలను మనపార్టీ నాయకత్వంలో ప్రజలు, పీఎల్‌జీఏ కలిసి అనేక ప్రజా పోరాటాల, ప్రజా ప్రతిఘటన చర్యల ద్వారా, గెరిల్లాయుద్ధం ద్వారా వివిధ రూపాల్లో ప్రతిఘటించడం ద్వారా ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లోని ఉద్యమ ప్రాంతాల్లో అనేకచోట్ల గనుల, వివిధ రకాల ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మన పీఎల్‌జీఏ, ప్రజామిలీషియా, ప్రజలు కలిసి సుమారు 50 చర్యల్ని నిర్వహించి బహుళజాతి సంస్థల, దేశీయ కార్పోరేట్ సంస్థల కోట్లాది రూపాయల ఆస్తుల్ని ధ్వంసం చేశారు. కొన్నిచోట్ల సీబీబీ, ఎమ్ఎన్‌సీ సంస్థలు తమ ప్రాజెక్టులను రద్దు చేసుకున్నాయి.

మనం నిర్వహించిన ఈ చర్యలు దేశవ్యాప్త విస్థాపన వ్యతిరేక పోరాటాలకు సరైన మార్గాన్ని చూయించాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా వ్యతిరేక పోరాటాలను నడపడంలో ఇది మనకు మంచి అనుభవాల్ని అందించాయి.

**ఈ కాలంలో మనం సాధించిన విజయాలు సంక్షిప్తంగా ఇవి :**

1. గడ్డు పరిస్థితుల్లో పార్టీ కమిటీలు, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనా వేదికలు సమైక్యంగా నిలిచి కొనసాగించిన చిన్న, మధ్య, పెద్ద ఎత్తుగడల ఎదురుదాడుల ద్వారా పోలీసు, పారామిలిటరీ, వివిధ కమాండో బలగాలను ఒకమేరకు నష్టపరిచి వాటి దూకుడుతనాన్ని నిలువరించడం ద్వారా, ప్రజలను, ప్రజా మిలీషియాను వివిధ ఆర్థిక, రాజకీయ పోరాటాలలోకి, రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలలోకి సంఘటితం చేయడం ద్వారా విప్లవోద్యమాన్ని కాపాడుకోగలిగాం. శత్రు మానసిక యుద్ధాన్ని విప్లవ ప్రచారం ద్వారా తిప్పికొట్టేందుకు కృషి చేయడం.

2. పార్టీ, పీఎల్‌జీఏ, వివిధ స్థాయి ఆర్‌పీసీలను, విప్లవ ప్రజాసంఘాలను సాపేక్షికంగా బలోపేతం చేస్తూ విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడానికి చేపట్టిన బోల్షివీకరణ, ఫీల్డ్‌ట్రైనింగ్ క్యాంపెయిన్‌లను విజయవంతం చేయడం ద్వారా కొన్ని ప్రాంతాల్లో ఒకమేరకు పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్యసంఘటనలలోని స్వీయాత్మక శ్రేణులు, కాడర్లు, ఎర్ర కమాండర్లు, పోరాట యోధులు బోల్షివీకరణ కావడం.

3. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజాయుద్ధ ఎత్తుగడలను అభివృద్ధి చేసుకునే లక్ష్యంతో పార్టీ నాయకత్వ శ్రేణులు సామాజిక అధ్యయనానికి పూనుకోవడం, పీఎల్‌జీఏలో పార్టీ నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవడంలో భాగంగా రాజకీయ-సైనిక శిక్షణా క్యాంపులను నిర్వహించడం. గడ్డుస్థితిలో గెరిల్లాయుద్ధాన్ని నడిపే అనుభవాన్ని సంపాదించుకోవడం.

4. ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే లక్ష్యంతో రాష్ట్రస్థాయి నుండి ఏరియా స్థాయి వరకూ ప్లీనములు నిర్వహించి సరైన సంశ్లేషణలు చేయడం, పరిస్థితులపై సరైన అంచనాలకు రావడం, తగిన కర్తవ్యాలను రూపొందించుకోవడం. ఏరియా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కొంతమంది నూతనంగా బాధ్యతలు చేపట్టడం.

5. ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశలో తీవ్రస్థాయిలో సాగుతున్న వర్గయుద్ధంలో మన గెరిల్లాబేసులలో (దోపిడీ వర్గాల అధికారాన్ని కూలదోసి ప్రజా రాజ్యాధికార అంగాలుగా వివిధ స్థాయిల ఆర్‌పీసీలను స్థాపించుకున్న ప్రాంతాల్లో) దోపిడీ వర్గాలు తిరిగి తమ అధికారాన్ని పునరుద్ధరించుకునేందుకు అనేక కుట్రలకు పాల్పడుతున్నాయి. వాటిని తిప్పికొడుతూ వివిధ స్థాయిల ఆర్‌పీసీలను పరిరక్షించుకోవడం, పునర్నిర్మాణం చేయడం, ప్రజలు అధికారాన్ని

హస్తగతం చేసుకునేందుకు సిద్ధమైన చోట అది ఎంత చిన్న ప్రాంతమైనా ఆర్‌పీసీలను నిర్మాణం చేయడం, పని చేయించడం. వాటి నాయకత్వంలో వ్యవసాయం, విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాలలో సహకార ప్రాతిపదికన ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం, కొన్ని ప్రాంతాలలో ఆర్‌పీసీల నాయకత్వంలో భూ సమతలీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడం. కొన్ని ప్రాంతాలలో నూతన శక్తులను విప్లవోద్యమంలోకి, పీఎల్‌జీఏలోకి చెప్పుకోదగిన సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం.

6. ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో, గెరిల్లాజోన్లలో, గెరిల్లాబేసుల్లో వేలాది మంది ప్రజలు జల్-జంగల్-జమీన్-ఇజ్జత్-అధికారం కోసం, ఆర్థిక సమస్యలపై, రాజ్యహింసకు, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా, నిర్వాసిత సమస్యకు, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టడం.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశలో తీవ్రమైన నిర్బంధం అమలవుతున్నప్పటికీ, తీవ్రమైన నష్టాల మధ్యనే దాన్ని తిప్పికొడుతూ ప్రజాయుద్ధం ఎప్పటికప్పుడు నూతన ఎత్తుగడలతో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రచార రంగాలలో దోపిడీ పాలక వర్గాలను ఎదుర్కొంటూ నిలదొక్కుకుంటున్నది. దీని ఫలితంగా అవి తమ దాడి తీవ్రతను-విస్తృతిని పెంచుతూ మహా అభియాన్, మిషన్ 2016, సరండా యాక్షన్ ప్లాన్, ఆపరేషన్ ఆల్‌అవుట్ వంటి ఫాసిస్టు పథకాలతో విప్లవోద్యమంపై మరో భారీ దాడికి సన్నాహాలు పూర్తి చేసుకుని వాటిని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాయి.

మిషన్ 2016 ద్వారా దండకారణ్య, బీహార్-ఝార్ఖండ్ విప్లవోద్యమాల్ని నిర్మూలించి, 2017వ సంవత్సరంలో దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని ఓటమిపాల్జేసి నిర్మూలించాలనుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విప్లవ ప్రతీఘాతుక పథకాల్ని మనం గత సంవత్సరం సాగించిన రాజకీయ, సైనిక, నిర్మాణ కృషి ద్వారా విఫలం చేశాం. ఈ స్థితిలో, గత సంవత్సరం తాము సాగించిన విప్లవ ప్రతీఘాతుక దాడిలో సాధించిన విజయాలను సంఘటితం చేసుకుంటూ రానున్న రెండు-రెండున్నర సంవత్సరాల్లో (2018 సంవత్సరం చివరి వరకూ లేదా 2019లో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల వరకు) భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించేలా మరో దుష్ట పథకాన్ని సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించుకున్నాయి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన విప్లవ ప్రతీఘాతుక దాడి పథకంలోని, మిషన్ 2017 లోని కొన్ని ముఖ్యమైన ఎత్తుగడలను పేర్కొందాం.**

1. ***విప్లవోద్యమ ప్రాంతాల్లో పెద్దఎత్తున పారామిలిటరీ, కమాండో, పోలీసు బలగాల్ని మోహరించి, కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయడం***

ప్రస్తుతం 10 రాష్ట్రాల్లో (ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణా,

ఆంధ్రప్రదేశ్, పశ్చిమబంగ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్) 119 బెటాలియన్ల పారామిలిటరీ బలగాలు, 37 బెటాలియన్ల ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లు మొత్తం 156 పారా మిలిటరీ బెటాలియన్లను మోహరించారు. ఈ 10 రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, అసోం రాష్ట్రాల్లో దాదాపు 3,60,000 రాష్ట్ర పోలీసు బలగాలు విప్లవోద్యమ అణిచివేత–నిర్మూలన చర్యల్లో పాల్గొంటున్నాయి. వీటికి తోడుగా ఉద్యమ ప్రాంతాల్లోని పారిశ్రామిక సంస్థల రక్షణ కోసం 5 బెటాలియన్ల సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు)ను కూడా మోహరించారు. ఈ రకంగా దాదాపుగా 5,20,000 పారా మిలిటరీ, కమాండో, పోలీసు బలగాల్ని ఉద్యమ ప్రాంతాల్లో మోహరించారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో 106 జిల్లాల్ని మావోయిస్టు ప్రభావిత జిల్లాలుగా, ఇందులోనే 7 రాష్ట్రాల్లోని 35 జిల్లాలను అధిక ప్రభావిత జిల్లాలుగా కేంద్రం గుర్తించింది. దోపిడీ ప్రభుత్వ బలహీన యంత్రాంగం, మావోయిస్టు ఉద్యమ బలం/ప్రజా పునాది, టెర్రయిన్ తదితర అంశాల రీత్యా ఈ 7 రాష్ట్రాల్లోనే 24 జిల్లాలను అత్యంత తీవ్రంగా మావోయిస్టు ఉద్యమ ప్రభావం ఉన్న జిల్లాలుగా గుర్తించింది. దేశంలోని మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లోని అత్యధిక జిల్లాల్లో బిల్డ్(నిర్మాణం) ఫేజ్(దశ) ఆపరేషన్లు కొనసాగుతుండగా, మావోయిస్టు ప్రభావం అత్యధికంగా ఉన్న 24 జిల్లాల్లో క్లియర్, హోల్డ్ ఆపరేషన్లను ప్రధానంగా సాగిస్తూ వాటిలో సాధించే విజయాలను వెన్నంటి/ఆ మేరకు బిల్డ్‌ఫేజ్ ఆపరేషన్లు సాగుతున్నాయి. బలహీనంగా ఉన్న, ధ్వంసమయిన దోపిడీ ప్రభుత్వ యంత్రాంగాన్ని తిరిగి నిర్మించి, బలోపేతం చేస్తూ, వనరుల దోపిడీకి అవసరమైన మౌలిక సదుపాయాల్ని నిర్మించడమే బిల్డ్‌ఫేజ్ ఆపరేషన్ల కర్తవ్యం. ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురయిన జిల్లాల్లో డెవలప్ ఫేజ్ ఆపరేషన్లు సాగుతున్నాయి. డెవలప్ ఫేజ్‌లో దోపిడీ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ, మావోయిస్టు ఉద్యమం తిరిగి తలెత్తకుండా ప్రచార, అభివృద్ధి, నిఘా, దాడి ఆపరేషన్లు చేపడుతారు.

దండకారణ్య ఉద్యమ నిర్మూలన కోసం ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ సంభాగ్‌లో సీఆర్‌పీఎఫ్‌లో భాగంగా ఒక బస్తరియా బెటాలియన్‌ను, నాలుగు ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లను ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ 5 బెటాలియన్లను 2017 మధ్య భాగం నుండి ఆపరేషన్లలో మోహరిస్తారు.

కేంద్రప్రభుత్వం, నాలుగేసి ఇండియన్ రిజర్వు బెటాలియన్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేటాయించింది. అలాగే, బీహార్‌కు ఒకటి, ఛత్తీస్‌గఢ్‌కు రెండు, ఝార్ఖండ్‌కు ఒకటి, మధ్యప్రదేశ్‌కు ఒకటి, ఒడిశాకు మూడు, పశ్చిమబంగ్‌కు ఒకటి స్పెషలైజ్డ్ ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లను కూడా కేటాయించింది. రోడ్లను, బ్యారక్‌లను, పోలీస్ స్టేషన్లను/క్యాంపులను నిర్మించే రెండు ఇంజనీరింగ్ కంపెనీలను ఈ ప్రత్యేక ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లు కలిగి ఉంటాయి. వీటన్నింటిని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం చివరి వరకు నిర్మించవచ్చు.

### 2. స్థానిక స్థాయి నుండి మొదలుకుని కేంద్ర స్థాయి వరకున్న నాయకత్వ శక్తుల నిర్మూలనకు, ప్రత్యేకించి కేంద్ర, రాష్ట్ర నాయకత్వ శక్తుల నిర్మూలనకు ప్రాధాన్యతనీయడం

ఇందులో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ అండ్ కిల్ (చుట్టివేత, వెతకడం, చంపడం) ఆపరేషన్స్, లోతట్టు ఏరియా ఆపరేషన్స్ చేపట్టిన ప్రతిసారి స్థానిక నాయకత్వాన్ని బూటకపు ఎన్‌కౌంటర్లల్లో హత్య చేయడం రానున్న రోజుల్లో మరింతగా పెరగనుంది. కేంద్ర, రాష్ట్ర నాయకత్వ శక్తుల నిర్మూలనలో భాగంగా ఒక్కో నాయకత్వ కామ్రేడ్‌ను నిర్మూలించడం కోసం 7-8 ఐపీఎస్ అధికారులను, వారి ఆధీనంలో కొన్ని ప్రత్యేక బలగాలను కేటాయించారు. వీళ్ళు ఆయా నాయకత్వ కామ్రేడ్స్ ఆపరేట్ అయ్యే ప్రాంతాలను గుర్తించడం, ఆ ప్రాంతాల్లో ఇంటిలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం, నాయకత్వ కామ్రేడ్స్‌ను వెంటాడి, చివరికి నిర్మూలించే ప్రయత్నాలు చేస్తారు.

### 3. ప్రతి గ్రామం నుండి తమకు సమాచారం అందేలా ఇంటిలిజెన్స్ వ్యవస్థను విస్తృతం, బలోపేతం చేసుకోవడం; కోవర్టులను, స్పాటర్లను మరింత ఎక్కువ సంఖ్యలో తయారు చేసుకోవడం

ఇంటిలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో బహుళ ఏజెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇవి 24×7 ఆధారంగా (అంటే రోజుకు 24 గంటలు, వారానికి 7 రోజుల పద్ధతి) పని చేస్తాయి. ఇంటిలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే జగదల్‌పూర్‌లో జాయింట్ కమాండ్, కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ జాయింట్ కమాండ్, కంట్రోల్ కేంద్రం దండకారణ్య ఉద్యమ నిర్మూలనపై కేంద్రీకరిస్తూనే సెంట్రల్ రీజియన్ పరిధిలోని నాయకత్వ శక్తులను నిర్మూలించడానికి పథకాల్ని రూపొందించి, పారా మిలిటరీ, కమాండో, పోలీసు బలగాలను నడిపిస్తున్నాయి. వీటి ద్వారా టెక్నికల్, హ్యూమన్ (మానవ) ఇంటిలిజెన్స్‌ను బలోపేతం చేస్తున్నారు. పారామిలిటరీ బలగాల, జిల్లా పోలీసు, ఇంటిలిజెన్స్ సంస్థల మెరుగైన సమన్వయం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నాయకత్వ శక్తులపై, గెరిల్లా బలగాలపై దాడులు చేయడానికి తోడ్పడేలా తక్షణ ఇంటిలిజెన్స్ (రియల్ టైమ్ ఇంటిలిజెన్స్)పై కేంద్రీకరిస్తున్నారు. నాయకత్వాన్ని దెబ్బదీయడం కోసం మనకు బలమైన గ్రామాల్లో, స్థానిక నిర్మాణాల్లో, మన ప్రయాణ మార్గాల్లోని గ్రామాల్లో, మన సప్లయి ఛానల్స్‌లల్లో ఇంటిలిజెన్స్ వ్యవస్థను తయారు చేసుకుంటారు. టెక్నికల్ ఇంటిలిజెన్స్‌లో భాగంగా మనం వాడే సెల్‌ఫోన్, వాకీటాకీ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలపై వివిధ రకాల నిఘా (సర్వైలెన్స్) వ్యవస్థల ద్వారా నిఘా వేసి ఇంటిలిజెన్స్ సేకరిస్తారు.

### 4. కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్ తీవ్రతరం కావడం

ఏరియా డామినేషన్ ఆపరేషన్, లోతట్టు ప్రాంతాల ఆపరేషన్, ఎంచుకున్న టార్గెట్‌ను నిర్మూలించే ఆపరేషన్ తదితర పేర్లతో సాగుతున్న కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్ రానున్న రోజుల్లో మరింత తీవ్రం కానున్నాయి. స్థానిక లంపెన్ యువకులను, విప్లవాన్ని వదిలివెళ్ళిన విప్లవ

ద్రోహులను కలిపి ఏర్పాటు చేస్తున్న డీఆర్‌జీ లాంటి కౌంటర్ గెరిల్లా యూనిట్లను మరిన్నింటిని ఏర్పాటు చేసి ఇతర కమాండో బలగాలతో, పారా మిలిటరీ బలగాలతో కలిపి ఈ ఆపరేషన్స్‌ను మరింత తీవ్రతరం చేస్తారు.

### 5. సరిహద్దు రాష్ట్రాల సమన్వయంలో మెరుగుదల సాధించడం, జాయింట్ ఆపరేషన్స్‌ను తీవ్రతరం చేయడం

మన ఉద్యమం ఉన్న రాష్ట్రాల నడుమ వివిధ స్థాయిల్లో మెరుగైన సమన్వయాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యల్ని చేపట్టింది. ఇందులో భాగంగా సరిహద్దు రాష్ట్రాల, ఆ రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీసు, సివిల్ అధికారులతో తరచుగా సమన్వయ సమావేశాల్ని నిర్వహిస్తున్నారు. ఈ సమన్వయ సమావేశాల్లో జాయింట్ ఆపరేషన్స్ పథకాల్ని రూపొందించి సరిహద్దు జిల్లాల, సరిహద్దు రాష్ట్రాల నడుమ జాయింట్ ఆపరేషన్స్‌ను తీవ్రతరం చేయనున్నారు.

### 6. కౌంటర్ గెరిల్లా ఆపరేషన్స్‌లలో వైమానిక మద్దతును పెంచడం

ఉద్యమ ప్రాంతాల్లోని రాష్ట్రాలకు, పారా మిలిటరీ బలగాలకు వైమానిక మద్ధతును పెంచడంలో భాగంగా కేంద్రప్రభుత్వం డ్రోన్లను (యూఏవీ), హెలికాప్టర్లను మరిన్ని అందించనుంది. వైమానిక నిఘా వ్యవస్థను (ఎయిర్ సర్వైలెన్స్) మెరుగుపరిచి, మన బలగాలపై నిరంతరం నిఘాను, రెక్కీలను కొనసాగిస్తారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పుడు నందినిలో ఉన్న యూఏవీ బేస్ స్టేషన్‌ను జగదల్‌పూర్‌కు మార్చడంగానీ లేదా ఒకవైపు నందిని స్టేషన్‌ను అలాగే కొనసాగిస్తూ జగదల్‌పూర్‌లో కొత్త బేస్ స్టేషన్‌ను నిర్మించనున్నారు.

### 7. ఫోర్టిఫైడ్ పోలీసు స్టేషన్ల నిర్మాణం చేయడం

2010వ సంవత్సరంలో మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో 400 పోలీసు స్టేషన్లను ఫోర్టిఫైడ్ స్టేషన్లుగా నిర్మించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఇప్పటివరకు వేర్వేరు రాష్ట్రాల్లో 278 పోలీసు స్టేషన్లను ఫోర్టిఫైడ్ స్టేషన్లుగా నిర్మించారు. రానున్న రోజుల్లో మిగిలిన 128 స్టేషన్లతోపాటు, మరో 250 పోలీసు స్టేషన్లను ఫోర్టిఫైడ్ స్టేషన్లుగా నిర్మించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

### 8. రోడ్డు, రైలు మార్గాల విస్తరణ-అభివృద్ధి; కమ్యూనికేషన్-ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థల అభివృద్ధి

ఉద్యమ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రాకృతిక వనరులను కొల్లగొట్టుకుపోవడానికీ, ఉద్యమ అణిచివేతలో వేగవంతమైన బలగాల తరలింపుకు తోడ్పడే దృష్టితో కేంద్రప్రభుత్వం 2009 నుండే ఉద్యమ ప్రాంతాల్లో రోడ్డు, రైలు మార్గాల్ని విస్తరిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా కమ్యూనికేషన్-ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థలను కూడా అభివృద్ధి చేస్తూ ఉంది. 2009వ సంవత్సరంలో నిర్ణయించుకున్న 5477 కిలోమీటర్ల రాష్ట్ర, జాతీయ రహదార్లను నిర్మించే పథకంలో భాగంగా గత సంవత్సరం వరకు 3887 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇప్పుడు మావోయిస్టు ప్రభావిత 9 రాష్ట్రాల్లోని 44 జిల్లాల్లో కొత్తగా 5466 కిలోమీటర్ల పొడవైన రోడ్లను, 126

వంతెనల్ని నిర్మించే పథకాన్ని కేంద్రప్రభుత్వం చేపట్టింది. దల్లీ–రావుఘాట్–జగదల్‌పూర్ రైలు లైన్ పనుల్ని వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

మావోయిస్టు ప్రభావిత 10 రాష్ట్రాల్లో 2199 మొబైల్ టవర్లను నిర్మించాలనే కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం 2016వ సంవత్సరం మొదటి అర్ధభాగం నాటికే 1288 మొబైల్ టవర్లను నిర్మించింది. మిగిలిన 911 టవర్లతోపాటు కొత్తగా 175 మొబైల్ టవర్లను నిర్మించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బస్తర్ సంభాగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం 832 కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను నిర్మించనుంది. రిలయన్స్ సంస్థ చేపట్టిన 4వ తరం (4జి) మొబైల్ సేవల విస్తరణ పథకం ప్రకారం రానున్న రెండు సంవత్సరాల్లో ఉద్యమ ప్రాంతాలంతటా కమ్యూనికేషన్–ఇన్ఫర్మేషన్ వ్యవస్థలు విస్తరించనున్నాయి. రిలయన్స్‌కు పోటీగా ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా 4జి సేవల్ని విస్తరించనున్నాయి.

రోడ్డు–రైలు మార్గాల విస్తరణ–అభివృద్ధితో, కమ్యూనికేషన్–ఇన్ఫర్మేషన్ వ్యవస్థల విస్తరణ–అభివృద్ధితోపాటు బిల్డ్‌ఫేజ్ ఆపరేషన్లలో భాగంగా, డీకే, బీజే, పూర్వీ బీహార్–పూర్వోత్తర్ ఝార్ఖండ్, ఏఓబీ తదితర ఉద్యమ ప్రాంతాల్లో దెబ్బతిన్న, ధ్వంసమయిన, బలహీనపడ్డ దోపిడీ ప్రభుత్వ యంత్రాంగాన్ని తిరిగి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పడానికి సాగుతున్న ప్రయత్నాల వల్లా ఉద్యమ ప్రాంతాలంతటా గెరిల్లాయుద్ధాన్ని సాగించడంలో ప్రతికూలతలు పెరుగుతున్నాయి. కాబట్టి మనం గడ్డుస్థితిని అధిగమించడానికి సాగించే గెరిల్లాయుద్ధాన్ని, ప్రజాయుద్ధాన్ని ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన ఎత్తుగడలతో నడిపించాలి. అందుకోసం శత్రుదాడిని గట్టిగా ప్రతిఘటిస్తూ, గెరిల్లా జోన్లలో శత్రువు నిర్మిస్తున్న రోడ్డు, రైలు, కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ వ్యవస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ధ్వంసం చేయడాన్ని ప్రధానం చేయాలి. ఈ వ్యవస్థలన్నీ పీడిత ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేవి కావనీ, పీడితుల్లో అత్యధికుల జీవితాల్ని వినాశనం చేసి, పిడికెడు మందికి మాత్రమే ఉపయోగపడి, దోపిడీ వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడుతాయనే రాజకీయ ప్రచారాన్ని నిరంతరం కొనసాగిస్తూ ప్రజల్ని ఈ విధ్వంసంలో విస్తృతంగా సమీకరించాలి. మరోవైపు ప్రజారాజ్యాధికార అంగాల ద్వారా వీలైనమేరకు ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచడానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని కొనసాగించాలి.

### 2. విప్లవ ప్రతిఘాతుక మిలీషియా/ముఠాల ఏర్పాటు, ప్రజలపై, ప్రజాస్వామిక శక్తులపై దాడులు చేయడం

దండకారణ్యంలో సామాజిక్ ఏక్తా మంచ్, అగ్ని, మహిళా ఏక్తా మంచ్, టంగియా (గొడ్డలి) దళం/గ్రామ రక్షా సమితి, భూకాంల్ సేన పేర్లతో, బీహార్–ఝార్ఖండ్‌లో టిపిసి, జెజెఎంపి, పిఎల్ఎఫ్ఐ, జెపిసి, దల్మా ఆంచలిక్ సమితి, గ్రామీణ్ ఏక్తా మంచ్ వంటి 17 ముఠాలు, ఏఓబీలోని కోరాపుట్‌లో శాంతి కమిటీ, నక్సల్ హింసా ప్రతిరోధ్ మంచ్, ........ ఒడిశాలో

......., పశ్చిమ బంగ్‌లో భైరవ వాహిని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రకరకాల కోబ్రాలు, టైగర్ల పేర్లతో విప్లవ ప్రతీఘాతక సాయుధ ముఠాలను, శ్వేత మిలీషియాను ఏర్పాటు చేసి విప్లవ ప్రజానీకంపై, విప్లవోద్యమానికి మద్దతుగా నిలుస్తున్న ప్రజాస్వామిక శక్తులపై దాడులను తీవ్రతరం చేస్తున్నారు. టీజీ, ఏపీలో హంతక దళాలు ప్రజా నాయకులను బెదిరిస్తున్నాయి.

**10. సంస్కరణల్ని, మానసిక యుద్ధాన్ని, సరెండర్లను తీవ్రతరం చేయడం**

**11.** మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మనం నూతనంగా చేపట్టిన విస్తరణను దెబ్బదీయడానికి శత్రువు విప్లవ ప్రతీఘాతుక వ్యూహాత్మక పథకాన్ని రూపొందించాడు. దీని ప్రకారం బాలాఘాట్‌లో 10, ఛత్తీస్‌గఢ్‌లో 50 కొత్త పోలీస్ స్టేషన్ల నిర్మాణం తోపాటు ఇతరత్రా బహుముఖ ఎత్తుగడలు ఉన్నాయి.

**12.** విప్లవోద్యమంలో సమైక్యంగా, సమరశీలంగా కదులుతున్న ఆదివాసులను దెబ్బదీయడం కోసం వారి అస్థిత్వాన్ని, అస్మిత(ఐడెంటిని)ను రూపుమాపాలనే కుట్రలో భాగంగా దండకారణ్యంతో సహా ఆదివాసి ప్రాంతాలంతటా దౌర్జన్యపూరితంగా హిందూ మతాన్ని, తేనె పూసిన కత్తిలా క్రైస్తవ మతాన్ని విస్తృతంగా వ్యాపింపజేస్తున్నారు.

భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి స్వయంగా ప్రధానమంత్రి పర్యవేక్షణలో, ప్రధానమంత్రి కార్యాలయంలో ఒక కేంద్రం ఏర్పడి పని చేస్తోంది. ప్రధానమంత్రి రక్షణ సలహాదారు అజిత్ డోభల్, అంతర్గత రక్షణ సలహాదారు విజయ్‌కుమార్‌లు ఇందులో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నారు. వీరే దేశవ్యాప్త ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులను గైడ్ చేస్తున్నారు.

శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక దాడిని తిప్పికొట్టి ఓడించడానికై మనం బహుముఖ ప్రతిదాడి ఎత్తుగడలను రూపొందించుకోవాలి. దీనికై నేటి దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితుల్లోని విప్లవానుకూల అంశాలను వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకుంటూ, ప్రతికూలాంశాలను ఎదుర్కొనేలా మన ఎత్తుగడలు ఉండాలి.

### III. శత్రు బహుముఖ దాడిని బహుముఖ ప్రతిదాడి ఎత్తుగడలతో తిప్పికొడదాం-గడ్డుస్థితిని అధిగమిద్దాం:

దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రముఖ వైరుధ్యాలు తీవ్రతరమవుతున్న ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా విప్లవోద్యమంపైనా, ప్రజాస్వామిక పోరాటాలపైనా, జాతివిముక్తి పోరాటాలపైనా సామ్రాజ్యవాదులు, ఆయా దేశాల్లోని వారి దళారీలు ఫాసిస్టు దాడులను తీవ్రతరం చేస్తున్నారు. మన దేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా, దోపిడీ వర్గాలు మతోన్మాదాన్ని, జాత్యహంకారాన్ని, జాతీయ దురభిమానాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను విప్లవమార్గం నుండి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్పోరేట్ మీడియా ఈ భావాలతో ప్రజల మెదళ్ళను నిరంతరం కలుషితం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రజల సమరశీలతను, పోరాట చేవను దెబ్బతీసేందుకు సామ్రాజ్యవాద ప్రాయోజిత ఎన్‌జీఓలు తమ

కార్యకలాపాల్ని సాగిస్తూనే ఉన్నాయి. పీడిత వర్గాలను వర్గ ప్రాతిపదికన ఏకం కాకుండా చూసేందుకు పోస్టు మాడర్నిజం సైద్ధాంతిక దాడిని కొనసాగిస్తూనే ఉంది. పార్లమెంటరిజం, రివిజనిజం, ప్రచండ-అవకిన్‌ల నయా రివిజనిజంతోపాటు మన దేశంలో గాంధీయిజం కూడా ప్రజల్ని విప్లవ మార్గం నుండి పక్కదారి పట్టించడానికి వీలైన ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి.

శతృదాడిని ఓడించడానికిగానూ మనం బహుముఖ ఎత్తుగడల పథకం రూపొందించుకోవడం కోసం రాజకీయ పరిస్థితుల్లోని అనుకూల, ప్రతికూల అంశాలను గమనంలో ఉంచుకోవాలి. అంటే పీడిత వర్గాలు, పీడిత జాతులు తమతమ దేశాల్లోని దోపిడీ వర్గాలు సాగించే జాతీయ ఉన్మాదానికీ, యుద్ధోన్మాదానికీ, జాత్యాహంకారానికీ, మతోన్మాదానికీ బలవుతే విప్లవాలు విఫలమవుతాయి, అలాగే పోస్టుమాడర్నిజాన్ని, ఎన్‌జీఓల చట్టబద్ధ పోరాటవాదాన్ని ప్రజల్లో ఎండగట్టి, ఓడించకుంటే కూడా విశాల ప్రజానీకాన్ని సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా వర్గపోరాటంలో, ప్రజాయుద్ధంలో విస్తృతంగా సమీకరించలేము. కాబట్టి మన బహుముఖ ప్రతిదాడి ఎత్తుగడల్లో జాత్యాంహకారాన్ని, యుద్ధోన్మాదాన్ని, మతోన్మాదాన్నీ ఎండగట్టాలి. నిజమైన దేశభక్తికి దోపిడీ వర్గాల ప్రయోజనాలను ఈడేర్చడానికి తోడ్పడే జాత్యాహంకార/జాతీయ ఉన్మాదపూరిత 'దేశభక్తి'కీ గల తేడాను విప్పి చెప్పాలి. పోస్టు మాడర్నిజాన్ని, ఎన్‌జీఓల సిద్ధాంతాల్ని ఎండగట్టాలి. పార్లమెంటరిజాన్ని, రివిజనిజాన్ని, నయా రివిజనిజాన్ని, గాంధీయిజాన్ని కూడా నిరంతరం ఎండగట్టాలి.

మనం రూపొందించుకునే కార్యక్రమం, ఎత్తుగడల సాధారణ లక్ష్యం, గడ్డుస్థితిని అధిగమించి ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం. దీనిప్రకారం ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురయిన ప్రాంతాల్లో రివైవ్ (తిరిగి బలోపేతం చేయడం) చేయడం, కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలను నిర్మించడం, ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలను గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేయడం, ప్రధాన గెరిల్లా జోన్లలో విప్లవ ప్రజాకమిటీలను/ప్రజా రాజ్యాధికార అంగాలను శతృ దాడి నుండి కాపాడుకుంటూ గెరిల్లా బేసులను కాపాడుకోవడం/పటిష్టం చేసుకోవడం.

## సైద్ధాంతిక, రాజకీయ కర్తవ్యాలు-ఎత్తుగడలు

1. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ, యుద్ధం-శాంతి అనే లెనిన్ రచనల్ని, రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 3వ ఇంటర్నేషనల్ ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి రూపొందించిన కార్యక్రమాల్ని మరోసారి నాయకత్వ కాడర్లు అధ్యయనం చేయాలి. వీటి ఆధారంగా, ప్రస్తుతం భారతదేశ పాలకవర్గాలు పాకిస్తాన్, చైనాలకు వ్యతిరేకంగా జాతీయ ఉన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడాన్ని వాటి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల్ని ప్రజల్లో నిరంతరం ఎండగట్టాలి. సంఘ పరివార్‌తో సహా దోపిడీ పాలక వర్గాలు రెచ్చగొట్టే బూటకపు దేశభక్తిని ఎండగట్టాలి.

2. ఒకవైపు సామ్రాజ్యవాదానికి దాసోహం అంటూ దేశాన్ని తెగనమ్ముతూ, మరోవైపు దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడనలను సుస్థిరం చేయడానికి దూకుడుగా వస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా నిరంతరం భావజాల, రాజకీయ పోరాటాన్ని విస్తృతం, తీవ్రతరం చేయాలి.

3. పోస్టు మాడర్నిజాన్ని, ఎన్‌జీఓ (గైరుసర్కారీ సంస్థలు)లు ప్రచారం చేస్తున్న చట్టబద్ధ పోరాటవాదాన్ని, సంస్కరణవాదాన్ని, ఆర్థికవాదాన్ని ఎండగడుతూ ప్రజల్లో రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకునే చైతన్యాన్ని పెంపొందింపచేయాలి.

4. అన్ని రాష్ట్రాల్లో స్పెషల్ ఏరియాల్లో/స్పెషల్ జోన్లలో సామాజిక పరిశోధనను పూర్తిచేసి వ్యవసాయిక, పారిశ్రామిక, సేవారంగాల్లో అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి, దళారీ నిరంకుశ పెట్టుబడి, భూస్వామ్యం మిలాఖత్తయి ప్రజల శ్రమశక్తిని ఏరకంగా/ఏఏ రూపాల్లో కొల్లగొడుతున్నాయో పరిశీలించి, వాటికి వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని వర్గపోరాటంలో కదిలించాలి. ఈ వర్గపోరాటంలో విశాల ప్రజానీకాన్ని సమీకరించడానికి తోడ్పడేలా లీగల్, కవర్, ఐక్యసంఘటన వేదికల్ని నిర్మించాలి. గెరిల్లాజోన్లన్నింటిలో వర్గసంఘాలను కన్సాలిడేట్ చేసుకుంటూ స్థానిక స్థాయి నుండి వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయడంపై కేంద్రీకరించాలి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు అమలవుతున్న 1991 నుండి మనదేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కాంట్రాక్టు, కాజువల్ (దినసరి కూలీ ప్రాతిపదికన పనిచేసేవాళ్లు) పేర్లతో అసంఘటితరంగ కార్మికులు, ఉద్యోగులు పెరిగారు. వీరితోపాటుగా దేశవ్యాప్తంగా వలస కార్మికులు పెరిగారు. వీరు కూడా అసంఘటితరంగ కార్మికులే. ఈ అసంఘటితరంగ కార్మికుల్ని కూడగట్టి వారి సమస్యలపై పోరాటాలు చేపట్టాలి. ఇప్పటికే అసంఘటితరంగ కార్మికుల్ని కూడగట్టిన చోట కన్సాలిడేషన్‌కు ప్రాధాన్యతనీయాలి.

5. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా దళితులను, అదివాసులను, మతమైనారిటీలను, ప్రజాస్వామ్య శక్తులను సమీకరించి వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో ఐక్యసంఘటన వేదికల్ని నిర్మించాలి.

6. ప్రాథమిక పాఠశాలల నుండి మొదలుకుని విశ్వవిద్యాలయాల వరకు విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి వ్యతిరేకంగా, మనదేశంలో విదేశ విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా, విద్యను అమ్మకం సరుకుగా మార్చడానికి (కమర్షియలైజేషన్), విద్యారంగాన్ని ప్రైవేటీకరించడానికి (ప్రైవేటైజేషన్), కాషాయీకరణ చేయడానికి (సాఫ్రనైజేషన్) వ్యతిరేకంగా విద్యార్థులను, ప్రజలను కూడగట్టాలి.

7. విస్థాపన వ్యతిరేక ఉద్యమాలను, సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ (సీబీబీ) వ్యతరేక సమరశీల ఉద్యమాలుగా అభివృద్ధి చేయాలి. వ్యవసాయ సంక్షోభంతో తీవ్రమైన అసంతృప్తితో ఉన్న రైతాంగాన్ని కూడగట్టి సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక

వర్గ పోరాటాన్ని విస్తృతం చేయాలి.

8. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో దేశ ప్రజలపై దోపిడీ వర్గాలు సాగిస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా స్థానిక స్థాయి నుండి కేంద్రస్థాయి వరకు ప్రజాస్వామిక శక్తులను కూడగట్టి ఐక్యసంఘటన వేదికల్ని నిర్మించాలి, ఇప్పుడు ఉన్న వేదికల్ని క్రియాశీలంగా పని చేయించాలి.

9. ఇప్పుడున్న ఉద్యమ ప్రాంతాల పరిసరాల్లోని విశాల మైదాన ప్రాంతాల్లోకి వర్గపోరాటాన్ని విస్తరింపజేయాలి. దానికోసం శక్తుల ఎంపిక, తర్ఫీదు కార్యక్రమాల్ని చేపట్టి ప్రణాళికాబద్ధంగా పనిని ప్రారంభించాలి.

10. పట్టణోద్యమం దెబ్బతినడానికి గల కారణాల్ని లోతుగా అధ్యయనం చేసి, నూతన పద్ధతుల్లో పట్టణోద్యమాన్ని నిర్మించాలి. దానికోసం నూతన శక్తుల్ని సమీకరించి, తర్ఫీదు చేసుకోవాలి.

11. గడ్డుస్థితిని అధిగమించగలిగేలా పార్టీ కాడర్ల సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంచాలి. అన్ని స్థాయిల్లో నాయకత్వ శక్తుల తర్ఫీదు (ఎల్‌టీసీ) ఫీల్డ్‌ట్రైనింగ్ కార్యక్రమాల్ని చేపట్టాలి.

12. శతృవు చేసే మోసపు యుద్ధాన్ని, మానసిక యుద్ధాన్ని నిరంతరం బహిర్గతం చేస్తూ, ఎదిరిస్తూ ఓడించాలి.

## సైనిక, నిర్మాణ కర్తవ్యాలు–ఎత్తుగడలు

1. ఐక్యపార్టీ–మావోయిస్టు పార్టీ ఏర్పాటు అనంతర కాలం నుండి మావోయిస్టు ప్రజాయుద్ధ సిద్ధాంత అన్వయింపులో మన అనుభవాల్ని పార్టీ, మిలిటరీ కాడర్లు అధ్యయనం చేయాలి. గడ్డుస్థితిలో ఆయా ప్రాంతాల ఉద్యమ బలాబలాల, ఫార్మేషన్ల, టెర్రయిన్ ఆధారంగా గెరిల్లాయుద్ధాన్ని నడిపే ఎత్తుగడలపై మన బలగాలకు ఎడ్యుకేషన్ అందించాలి.

2. దేశవ్యాప్త ఉద్యమం గడ్డుస్థితిలోకి వెళ్ళినప్పటి నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా స్థానిక వనరులతో, పరిమిత వనరులతో గెరిల్లాయుద్ధాన్ని నడుపుతున్న దాంట్లోని పాజిటివ్ అంశాల ఆధారంగా గడ్డుస్థితిని అధిగమించే లక్ష్యంతో రానున్న రోజుల్లో గెరిల్లాయుద్ధాన్ని సాగించాలి. గత మూడు–నాలుగు సంవత్సరాలుగా కార్పెట్ సెక్యూరిటీ ప్రాంతాల్లో సాగించిన యుద్ధచర్యలను, అనుభవాల్ని సంశ్లేషించి ఆ ప్రాంతాల్లో సాగించే గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేసి, అభివృద్ధి చేయాలి.

3. మిలిటరీ రంగ రాజకీయ నాయకత్వ శక్తుల తర్ఫీదు కార్యక్రమాల్ని కొనసాగించాలి. శతృవు కొనసాగిస్తున్న ఎల్ఐసీ–కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ ఎత్తుగడలను తిప్పికొట్టగలిగేలా మన పీఎల్‌జీఏను తర్ఫీదు చేసుకోవాలి. ఎత్తుగడల సామర్థ్యాన్ని, వివిధ రకాల స్కిల్స్‌ను అభివృద్ధి చేయాలి. అన్ని స్థాయిల్లో కమాండ్లను క్రియాశీలంగా పని చేయించాలి, సంఘటితం చేయాలి.

4. శత్రుదాడిలో నష్టపోకుండా స్థానిక నాయకత్వాన్ని కాపాడుకోవాలి. దానికోసం అనుసరించాల్సిన పద్ధతులను రాష్ట్ర/స్పెషల్ జోనల్/స్పెషల్ ఏరియా కమిటీలు రూపొందించాలి.

5. కార్పెట్ సెక్యూరిటీ ప్రాంతాల్లో మాస్‌వర్క్ నడిపే పద్ధతులపై, గెరిల్లాయుద్ధాన్ని నడిపే ఎత్తుగడలపై మాస్‌వర్క్ యూనిట్లకు, కంబాట్ యూనిట్లకు స్పష్టత కలిగించాలి. తద్వారా మాస్‌వర్క్ యూనిట్లు, కంబాట్ యూనిట్లు శత్రుదాడిలో నష్టపోకుండా కాపాడుకోవాలి.

6. ఏరియా కమిటీ నుండి మొదలుకుని కేంద్రకమిటీ వరకు నాయకత్వ శక్తుల్ని శత్రుదాడిలో నష్టపోకుండా కాపాడుకునేలా పనిపద్ధతుల్ని, నిర్మాణాల్ని ఏర్పాటు చేసుకోవాలి.

7. అన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న ఏరియాలను తిరిగి బలోపేతం చేయాలి. ఉద్యమ బలాబలాల ఆధారంగా ఆ ప్రాంతాల్లో మాస్‌వర్క్, మిలిటరీ వర్క్ చేసే యూనిట్ల నిర్మాణం-పని పద్ధతుల్ని రాష్ట్ర కమిటీలు రూపొందించాలి.

8. ఉద్యమ ప్రాంతాలంతటా కార్పెట్ సెక్యూరిటీ విస్తరిస్తున్న పరిస్థితుల్లో, సమన్వయంలో ఎదురవుతున్న సమస్యల రీత్యా రాష్ట్ర కమిటీలు చొరవగా రాష్ట్ర ఉద్యమాలకు గైడెన్స్‌ను అందించాలి. రాష్ట్ర కమిటీలు/ఎస్‌జెడ్‌సీలు/ఎస్‌ఏసీలు, జిల్లా/డివిజనల్/జోనల్ కమిటీలు గతంలాగా రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించుకోలేని స్థితిలో డీకేలో సబ్‌జోనల్ బ్యూరోలు, బీజేలో ఆర్‌సిలు (ప్రస్తుతం యూనిఫైడ్ కమాండ్లు), అన్ని ప్రాంతాల్లోని డీవీసీ/జడ్‌సీలు, డికెలో సబ్ డివిజనల్ బ్యూరోలు చొరవగా, స్వతంత్రంగా ఉద్యమానికి గైడెన్స్ అందించాలి. లేనిచోట ఎస్‌జెడ్‌సీఎమ్‌లు, డీవీసీఎమ్‌లు టీములుగా పనిచేస్తూ ఉద్యమాల్ని గైడ్ చేయాలి. అలాగే గెరిల్లాయుద్ధ నియమాలను తమతమ నిర్దిష్టతలకు అనుగుణంగా అన్వయిస్తూ బలగాలను కేంద్రీకరణ-వికేంద్రీకరణ పద్ధతుల్లో నడిపించాలి. మాస్‌వర్క్-మిలిటరీవర్క్ యూనిట్లను సమన్వయించి నడిపించాలి. ఇందుకోసం అవసరమైన చోట ఏరియా కమిటీలను, ప్లాటూన్లను కలిపి ఒక కమాండ్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట ఎల్‌జీఎస్‌లను, ఎల్‌ఓఎస్‌లను కలిపి ఒకే యూనిట్‌గా మార్చడం, రెండేసి ఏసీలను ఒక ఏసీగా పునర్నిర్మాణం చేయడం తదితర నిర్మాణపరమైన మార్పులన్నింటిని చొరవ కోల్పోకుండా నిర్ణయాలు చేయాలి. ఈ నిర్మాణపరమైన మార్పులన్ని ఉద్యమ బలాబలాల్లో సంభవించే మార్పులను, ఆ మార్పుల దిశను సరిగా అంచనా వేస్తూ తీసుకోవాలి. ఇందులో స్వీయాత్మకతకు గురికాకుండా ఉండాలి. ఆయా ప్రాంతాల్లోని సీసీఎమ్‌ల గైడెన్స్‌లో ఎస్‌జెడ్‌సీఎమ్‌ల టీములు, సబ్‌జోనల్ బ్యూరోలు ఈ నిర్ణయాలు చేయాలి. మారుతూ ఉండే పరిస్థితులకు అనుగుణంగా చొరవగా నిర్ణయాలు చేయగలిగేలా కమిటీల పనిపద్ధతుల్లో మార్పు రావాలి.

9. బొట్టెం(డీకే-తెలంగాణ), రామగూడ(ఏఓబీ), ...(బీహార్-ఝార్ఖండ్) లాంటి ఘటనల్ని నష్టాల్ని నివారించేలా క్యాంపింగ్, మార్చింగ్, పెట్రోలింగ్, అబ్జర్వేషన్ పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలి. క్యాంపులపై జరిగే దాడులను తిప్పికొట్టేలా రెగ్యులర్‌గా డ్రిల్స్ ప్రాక్టీస్ చేయాలి.

క్యాంపుల చుట్టూ క్రియాశీల ఆత్మరక్షణ పద్ధతులను పెట్టుకోవాలి.

10. ఆయుధాలు, తూటాల స్వాధీనంలో, శత్రు నిర్మూలనలో ఫలితాలు సాధించేలా ప్రతిఘటనా చర్యలను, టీసీఓసీలను విజయవంతంగా నడపాలి. దానికోసం నిరంతరం ప్రజా ఇంటిలిజెన్స్ ద్వారా శత్రు బలహీనతలను కనిపెట్టాలి. మెరుగైన ప్లానింగ్‌ను రూపొందించడంలో, బలగాలను మోటివేట్ చేయడంతోపాటు యుద్ధచర్యల్లో నాయకత్వ శక్తులు భాగస్వామ్యం మరింత పెరగాలి, మెరుగు పరచుకోవాలి. నాయకత్వ శక్తులు, కాడర్లు, పీఎల్‌జీఏ సభ్యులందరూ సమైక్యంగా ధైర్యసాహసాలతో పోరాడాలి. ప్రతిఘటనలో, ఆయుధాలు, తూటాల స్వాధీనంలో ఫలితాలు సాధించడం కోసం ఫైర్ అండ్ మూవ్‌మెంట్ పద్ధతుల్లో, మన బలగాల అడ్వాన్స్-రిట్రీట్ పద్ధతుల్లో తగిన మార్పులు చేసుకుంటూ ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోవాలి. అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించడంలో అభివృద్ధి సాధించాలి.

11. కార్పెట్ సెక్యూరిటీని అడ్డుకోవడానికి, విఫలం చేయడానికి, ధ్వంసం చేయడానికి వీలుగా దాడి పద్ధతులను అభివృద్ధి చేయాలి.

12. కన్సాలిడేషన్-విస్తరణ ప్రక్రియ ద్వారా సీఆర్‌బీ, ఈఆర్‌బీ మధ్యనున్న ప్రాంతాల్ని విశాలమైన గెరిల్లాజోన్‌గా అభివృద్ధి చేసుకోవాలి. ఈ కర్తవ్యంలోని సఫలత గడ్డుస్థితిని అధిగమించడానికి, భారత విప్లవోద్యమ పురోగమనానికి ప్రాతిపదిక కల్పిస్తుంది.

13. పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటన రంగాల్లోని అన్ని స్థాయిల పార్టీ కేడర్లు మావోయిస్టు పనిశైలిపై పట్టు సంపాదించుకోవాలి.

**ప్రియమైన కామ్రేడ్స్ !**

విప్లవ ప్రతీఘాతుక శత్రుదాడి మన ముందు కీలకమైన సవాలును ముందుకు తెచ్చింది. గడ్డుస్థితిని అధిగమించగలుగుతామా? లేదా? అనేదే ఆ సవాలు. మరోవైపు దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులకు, వారి దళారీలైన దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు, బడా భూస్వాములందరికీ కూడా అత్యంత తీవ్రమైన సవాలునే ముందుకు తెచ్చింది. రోజురోజుకు తీవ్రతరమవుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభాలను తట్టుకోవడం ఎలా? రానున్న ప్రపంచవ్యాప్త విప్లవాల వెల్లువను ఎదుర్కోవడం ఎలా? అనేదే ఆ సవాలు. దోపిడీపాలక వర్గాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ప్రతికూలతలే మనకు అనుకూలాంశాలు. ఈ అనుకూలాంశాలను ఆధారం చేసుకుని సరైన ఎత్తుగడలు రూపొందించుకుని రాజకీయ, సైనిక, నిర్మాణ కృషిని సాగిస్తే మనం కచ్చితంగా నేటి గడ్డుస్థితిని అధిగమించడమే కాకుండా భారత విప్లవోద్యమాన్ని పురోగమింపజేయగలం. వ్యవసాయంపై ఆధారపడి బతకలేక, పట్టణాల్లో పనులు దొరకక తీవ్రమైన అసంతృప్తితో ఉన్న అశేష రైతాంగాన్నీ; సామ్రాజ్యవాద-భూస్వామ్య పీడన, అణిచివేతలతో తుకతుకలాడుతున్న విద్యార్థి-యువజనులను; విస్థాపిత సమస్యతో

తమ అస్థిత్వాన్ని, అస్మితను కోల్పోతున్న ఆదివాసీలను, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో బతుకుకు భద్రతలేని కార్మికులను, ఉద్యోగులను వర్గపోరాటంలో సమీకరించడానికి సంఘటితం చేయడానికి కృషి చేద్దాం. పరిమిత శక్తులతో పనిని ప్రారంభించి అపరిమిత శక్తులను తయారు చేసుకుందాం. నూతన తరాన్ని విప్లవంలోకి సమీకరిద్దాం. విశాల ప్రాంతాలను ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా, గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేద్దాం. ఈ క్రమంలో విశాలమైన, సంఘటితమైన, సమరశీలమైన ప్రజా పునాదిని పెంచుకుని, పీఎల్‌జీఏను సంఘటితం చేసుకుని ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. తద్వారా శత్రుదాడిని ఓడిద్దాం, గడ్డుస్థితిని అధిగమిద్దాం.

గడ్డుస్థితిని అధిగమించడానికి గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఫలితంగా ఈ స్థితిని అధిగమించడానికి ఏర్పడుతున్న అనుకూలాంశాలను మరింత సంఘటితం చేసుకుందాం. ఈ అనుకూలాంశాలు గడ్డుస్థితిని అధిగమించడానికి బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడుతాయి. ప్రతికూలాంశాలను ధైర్యంగా ఎదుర్కొని పట్టుదలగా అధిగమిద్దాం. మనలోని అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకుందాం. మాలెమా సైద్ధాంతిక నియమాలను, మావోయిస్టు ప్రజాయుద్ధ నియమాలను ఉద్యమ బలాబలాలకు అనుగుణంగా అన్వయిద్దాం. మారుతూ ఉండే పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ, సైనిక ఎత్తుగడలను మార్చుకుందాం. ఈ కృషిలో అన్ని స్థాయిల్లో సమిష్టి భావనతో టీములుగా పనిచేద్దాం. విశాల ప్రజారాశుల్లోని నవతరాన్ని విస్తృతంగా సమీకరించి, సంఘటితం చేసేలా ఎత్తుగడలను అభివృద్ధి చేసుకుంటూ మావోయిస్టు పనిశైలిపై పట్టు సాధిద్దాం.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో, మనదేశ విప్లవోద్యమ చరిత్రలో ఎన్నోసార్లు గడ్డుకాలాలు, ఓటములు ముందుకొచ్చాయి. వీటన్నింటినీ మనం అధిగమించాం. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో లెనిన్‌గ్రాడును హిట్లర్ ఫాసిస్టు మూకలు చుట్టుముట్టినప్పుడుగానీ, చైనాలో దక్షిణాదిలో విముక్తి ప్రాంతాలను కోల్పోయి సుదీర్ఘమైన లాంగ్‌మార్చ్‌ను చేపట్టినప్పుడుగానీ, మన దేశంలో నక్సల్బరీ, శ్రీకాకుళ ఓటమి తరువాతగానీ మనముందు అత్యంత తీవ్రమైన ప్రతికూలతలే ముందుకు వచ్చాయి. వీటన్నింటినీ మనం సరైన ఎత్తుగడలతో, అసమాన ధైర్యసాహసాలతో, ధృడసంకల్పంతో, సరైన పనిశైలితో అధిగమించాం. ఈ అనుభవాల ఆధారంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడిద్దాం, గడ్డుస్థితిని అధిగమిద్దాం.

**విప్లవాభినందనలతో,**

**కేంద్రకమిటీ**

**ఫిబ్రవరి 2017** **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

*సి.ఆర్.బి. సర్క్యులర్, ఫిబ్రవరి 2017*

# మార్క్సిజం - లెనినిజం - మావోయిజాన్ని ఆలోచనలో, ఆచరణలో, మరింతగా మెరుగుపర్చుకొని పార్టీ నాయకత్వాన్ని సుదృఢ పరుచుకుందాం !

సి.ఆర్.బి. నేతృత్వంలో 2013లో మధ్య రీజియన్‌లోని అన్ని రాష్ట్రాలు / స్పెషల్ జోన్‌లలో బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను చేపట్టాం. మూడున్నర సంవత్సరాలుగా సాగిన ఈ క్యాంపెయిన్ మంచి ఫలితాలను ఇచ్చిందనీ సి.ఆర్.బి. సమీక్షిస్తోంది. ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని, సెట్‌బ్యాక్‌ను అధిగమించడానికి ఈ కేంపెయిన్ వల్ల పార్టీలో, పీ.ఎల్.జీ.ఏ.లో పార్టీ శ్రేణుల్లో 1/3 వంతు మంది రాటు తేలడం; కేడర్లలో విప్లవోద్యమంపై విశ్వాసం పెరిగి సరెండర్‌లు తగ్గడం; వర్గ పోరాటం తీవ్రతరం కావడం; ప్రతిఘటనలో మెరుగుదల సాధించడం; ప్రజలతో సంబంధాలు బలోపేతం కావడం; కేడర్లలో సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెరగడంతో అవకాశాలు మెరుగైనాయి. పార్టీ అంతటా కొంతమేరకు నూతనోత్సహం ముందుకు వచ్చింది.

మార్క్సిజం - లెనినిజం - మావోయిజం సార్వజనీనతపైన, విప్లవోద్యమం అనేక ఆటు పోట్ల గుండా ప్రయాణించి అంతిమ విజయం సాధిస్తుందనే గతితార్కిక అవగాహనపైన; మూడు మహోత్తర పని శైలులపైన కేంద్రీకరించి మనం క్యాంపెయిన్‌ను నడిపాం. పార్టీనీ బోల్షివీకరించేందుకు సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ అవగాహనను పార్టీ అంతటా బోధన గరిపాం. ఈ విధానం వలన పార్టీ ఉన్నతస్థాయిలో బోల్షివీకరణ చేయడానికి సిద్ధం చేయబడింది. ఈ అవకాశాన్ని వుపయోగించుకొని పార్టీ నాయకత్వాన్ని మరింత సంఘటితం చేసే లక్ష్యంతో బోల్షివీకరణ చేపట్టాలని సి.ఆర్.బి. నిర్ణయించింది. అయితే పెరిగిన నిర్బంధం, పార్టీ చేపట్టాల్సిన ఇతర కర్తవ్యాల ప్రాధాన్యతల నేపథ్యంలో బోల్షివీకరణ కార్యక్రమాన్ని కాంపెయిన్‌గా కాకుండా, గత కాంపెయిన్‌లోని గుణపాఠాల సారాన్ని జోడించే విధంగా పార్టీ నాయకత్వ కమిటీలు జరుపుకునే సమావేశాల్లో ప్లాను చేసుకొని, ముఖ్యంగా ఈ సర్క్యులర్ వెలుగులో చర్చలు, లోతైన కార్యాచరణ, తిరిగి ఉన్నత స్థాయిలో చర్చలు, విమర్శ-స్వయం విమర్శ వివిధ స్థాయిలలో నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా నాయకత్వ కమిటీలు మొత్తం పార్టీ సిద్ధాంత స్థాయిని పెంచే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సర్క్యులర్‌ను శ్రద్ధ పెట్టి లోతుగా అధ్యయనం చేయాల్సిందిగా సి.ఆర్.బి. కోరుతోంది.

నాయకత్వ కేడర్లు తమ విప్లవ కర్తవ్యాలను సమర్థవంతంగా నెరవేర్చడానికి లోతైన సైద్ధాంతిక అవగాహన, పార్టీ చరిత్రపై గట్టి పట్టు; గతితార్కిక పద్ధతి; సమాజంలో నిరంతరం జరుగుతున్న మార్పులపై అధ్యయనం, రాజకీయ నిర్మాణ దక్షత, అన్యవర్గ ధోరణులను ప్రక్షాళనం చేసుకోవడం వంటి విషయాలపై నిరంతరం అమిత శ్రద్ధ వహించాల్సి ఉంటుంది.

**1. నాయకత్వ కేడర్లు తమ తాత్విక భావాలను గతి తార్కికంగా మలచుకోవాలి**

ఇక్కడ ముఖ్యంగా నాయకత్వ కేడర్ల తాత్విక అవగాహన ఎలా ఉందనేది చాలా ముఖ్యమైన విషయం. చైనాలో విప్లవం విజయవంతం అయిన తరువాత 1956 నాటి సోషలిస్టు నిర్మాణ దశలో చైనా కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన అంతరంగిక పోరాటాలు జరిగాయి. అందులో తత్వశాస్త్ర సమస్యలపై చర్చలు జరిగాయి. లిషావ్ చీ ముఠా మార్క్సిజం – లెనినిజం ముసుగులో అనేక తప్పుడు సిద్ధాంతాలను ముందుకు తెచ్చింది. చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు జరిగాయి. అందులో ఒకటి 'ఉనికి–ఆలోచనల మధ్య ఐక్యత ఉండదనే పేరుతో' గతితార్కిక భౌతికవాద సిద్ధాంతానికి వ్యతిరేకమైన చర్చను లేవదీశారు. ఈ చర్చను ఓడించడానికి మావో నాయకత్వంలోని విప్లవ కేంద్రం దృఢంగా పోరాడింది. మావో స్వయంగా లిషావ్ చీ ముఠా లేవనెత్తిన ఈ చర్చకు సమాధానంగా 'సరియైన భావాలు ఎక్కడి నుండి వస్తాయి' అనే రచన చేశాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో ఈ రచనకు ఉత్కృష్ట స్థానం ఉంది.

"సరియైన భావాలు మూడు రకాలైన సామాజికాచరణలు– ఉత్పత్తి కొరకు జరిపే పోరాటం, వర్గ పోరాటం, మరియు శాస్త్ర ప్రయోగం నుండే వస్తాయి."

సమాజంలో మానవుని ఉనికి, లేక అతని స్థానం అతని ఆలోచనను నిర్ణయిస్తుంది. అభివృద్ధి చెందిన వర్గాల లక్షణాలను గురించిన సరియైన భావాలను ప్రజానీకం గ్రహించగలిగినపుడు ఈ భావాలు భౌతిక శక్తిగా రూపొందుతాయి. ఈ భౌతిక శక్తే సమాజాన్ని, ప్రపంచాన్ని మార్చి వేస్తుంది. మానవులు తమ సామాజిక ఆచరణలో అనేక రకాల పోరాటాలు జరుపుతూ వుంటారు. ఆ సమయంలో తాము సాధించిన విజయాల నుండి మరియు పొందిన అపజయాల నుండి కూడ గొప్ప అనుభవాన్ని సంపాదించుకుంటారు.

మానవుని జ్ఞానం గెంతుల రూపంలో పెంపొందుతుందనీ, మొదటి గెంతు అంటే భౌతికమైన బాహ్య ప్రపంచాన్ని ప్రతిబింబించు క్రమంలో మనకు ఏర్పడ్డ భావాలు, (సిద్ధాంతాలు పాలసీలు, ప్లానులు, చర్చలు) సరియైనవా? కావా? అని రుజువు చేయగలిగినది రెండవ గెంతు మాత్రమే. వాస్తవాన్ని పరిశీలించుటకు యింతకంటే మరో సరైన మార్గం లేదు. అంతే కాకుండా శ్రామికవర్గం, ప్రపంచాన్ని తెలుసుకోవడంలో దాని ఏకైక లక్ష్యం, దాన్ని (ప్రపంచాన్ని) మార్చుట మాత్రమే.

పదార్థం నుండి చైతన్యానికి, మరల చైతన్యం నుండి పదార్థానికి, అంటే ఆచరణ నుండి

జ్ఞానానికి, మరల జ్ఞానం నుండి ఆచరణకు దారి తీసే క్రమంలో ఇది అనేక సార్లు పునరావృతి కావడం ద్వారా మాత్రమే సరియైన భావాలు ఉద్భవిస్తాయి. మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంత మైతేనేమి, గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత మైతేనేమి యిదే" అని కా. మావో జ్ఞాన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు.

లిషావ్ చీ మతాను విమర్శిస్తూ పదార్థం చైతన్యంగా, చైతన్యం పదార్థంగా చెందు మార్పులు నిత్య జీవితంలో కానవచ్చే సంఘటనే అయినప్పటికీ ఈ గెంతులను వారు గ్రహించలేరని అంటాడు.

మావో బోధించిన ఈ జ్ఞాన సిద్ధాంతం మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాల ఆధారంగా కొనసాగిన విప్లవాల్లో పదే పదే నిరూపింపబడింది. సమాజంలో మౌలికమైన మార్పులు గెంతుల రూపంలో ఉంటాయని, గ్రహించడం ఇందులో ముఖ్యమైన విషయం.

మన పార్టీకి చెందిన కొందరు నాయకత్వ కేడర్లు ఉనికి-ఆలోచనల మధ్య ఐక్యతను ఆమోదించినప్పటికీ, కామ్రేడ్ మావో చెప్పిన జ్ఞాన సిద్ధాంతాన్ని అన్వయించి వాటి మధ్య నిజమైన ఐక్యతను సాధించలేకపోవడంతో, వారిలో స్వీయాత్మకత ఒక ధోరణిగా కొనసాగుతున్నది. మరికొందరిలో ఉనికి-ఆలోచనలలో నిరంతరాయం కొనసాగే చలనాలను గుర్తించే విషయంలో యాంత్రిక భౌతికవాద దృక్పథం బలంగా కొనసాగుతోంది. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని శాశ్వతమని భావించడమో లేదా విప్లవోద్యమం ఈ పరిస్థితిని అధిగమించలేదనే నిరాశ నిస్పృహల్లో కొట్టు మిట్టాడడమో జరుగుతోంది. అందుకే కొందరి కార్యచరణలో చురుకుదనం తగ్గి పోతున్నది. 'గుంపులో గోవింద' లాగా వారు వ్యవహరిస్తారు. విప్లవోద్యమంలో ఆటు పోట్లు ఉంటాయనే సాధారణ అవగాహనను మరిచిపోయి అమాయకంగా ప్రవర్తిస్తారు. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిలోనే విప్లవం పురోగమించడానికి అవసరమైన అనుకూలాంశాలు నిబిఢీకృతమై ఉంటాయంటే వీరు నమ్మరు. అక్కడి నుండి వీరిలో చాల అనుమానాలు తలెత్తుతాయి. పార్టీ పంథాపైనే అనుమానాల స్థాయిలో అవి వారిని చుట్టు ముడుతాయి. మారుతున్న పరిస్థితుల్లో పార్టీ పంథాను అన్వయించలేక పోతారు. పాలకవర్గ భావజాల ప్రభావానికి, ఇతర కార్మిక వర్గేతర భావజాలాలకు కొట్టుకొనిపోతారు. ఫాసిస్టు నిర్బంధకాండలో ప్రజలు అత్యంత ధైర్య సాహసాలతో పోరాడే సంఘటనలను వీరు దృష్టిలోకి తీసికోరు. చిన్న సంఘటన నుండి సైతం ఉత్తేజం పొందాలనే విషయాన్ని అర్థం చేసుకోరు. సమాజంలో కొత్త తరహా పోరాటాలకు ఎలా భూమిక సిద్ధపడుతున్నదో వీరు అధ్యయనం చేయరు. వీరు చివరకు రాజ్య బలాన్ని ఎక్కువ అంచనా వేసి ప్రజల బలాన్ని తక్కువ అంచనా వేస్తారు. ఈ పరిస్థితి శాశ్వితమనుకుంటారు. పోరాటం ద్వారా ఈ బలాబలాల్లో మార్పును తలకిందులు చేయవచ్చు అనే విషయాన్ని మనసుకు పట్టించుకోరు. చివరికి 'సముద్రంపై అలిగిన నావికుడు ఎన్నటికీ గమ్యం చేరడు' అనేలా వీరు తయారవుతారు. పదార్థాన్ని చైతన్యంగా,

చైతన్యాన్ని పదార్థంగా మార్చగలమనే జ్ఞాన సిద్ధాంతం సారాన్ని అధ్యయనం ఇలాంటి ఆలోచనలకు చక్కటి విరుగుడుగా పని చేస్తుంది. మనం బోల్షివిక్ కావాలంటే తాత్విక రంగంలో మొదటగా మన ఆలోచనలను సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడంలో భాగంగా నాయకత్వం వర్గ పోరాటంలో ముందు వరుసలో ఉండాలి. వర్గ పోరాటంలో పాల్గొంటూ ప్రజలతో, కేడర్లతో ఐక్యం కావడం ద్వారానే మనలో కార్మికవర్గ తత్వం పెంపొందుతుంది. పురోగామి భావాలకు, ప్రాతినిధ్యం వహిస్తూ విప్లవోద్యమంలో నాయకత్వ పాత్ర వహిస్తాం. లేనిచో మనం పక్కదారి పట్టి బూర్జువా ప్రాపంచిక దృక్పథానికి కొట్టుకొనిపోతాం. సమాజంలో బూర్జువా వర్గం, కార్మికవర్గం పక్క పక్కనే జీవిస్తాయి. బూర్జువా వర్గం అధికారంలో ఉన్న సమాజంలో బూర్జువా వర్గం అధిపత్యంలో ఉండి దాని భావజాలాన్ని అన్ని రంగాల్లో వ్యాపింపజేస్తుంది. కార్మికవర్గాన్ని కూడా ప్రలోభ పెట్టడంలో అది అనేక కుయిక్తులకు పాల్పడుతుంది. మన పార్టీ వర్గ సంపుటిలో ప్రధానంగా రైతాంగ, పట్టణ, పెటీ బూర్జువా వర్గాల నుండే చేరుతున్నారు. తత్ఫలితంగా నాయకత్వ స్థానాల్లో వీరే ప్రధానంగా ఉంటున్నారు. కాబట్టి సొంత ఆస్థి పునాదిపై ఏర్పడే బూర్జువా తాత్విక ధోరణులు పార్టీ నాయకత్వంలోకి ప్రవేశిస్తాయి. వీటిని అరికట్టడానికి వర్గ పోరాటంలో తీవ్రంగా పాలుపంచుకోవడం తో పాటు మార్క్సిజం - లెనినిజం - మావోయిజాన్ని నిరంతరం అధ్యయనం చేయాలి.

### 2. పార్టీ క్రమశిక్షణ

బోల్షివీకరణ విజయానికి ఒక ముఖ్యమైన షరతుగా కార్మికవర్గంలో నిరవధికమైన కేంద్రీకరణ, కఠినమైన క్రమశిక్షణ అవసరమని కా. లెనిన్ పదే పదే బోధించాడు.

అయితే ఉక్కు క్రమశిక్షణ విప్లవ పార్టీ ఎలా సాధించగలుగుతుంది అనే ప్రశ్నలకు బోల్షివిజం ఈ విధంగా సమాధానం చెబుతోంది.

విప్లవ పార్టీ యొక్క క్రమశిక్షణ ఎలా నిలబెట్టబడుతుంది. కార్మికవర్గ అగ్రగామి దళం యొక్క వర్గ చైతన్యం ద్వార, విప్లవం పట్ల దాని అంకిత భావం ద్వార, దాని గట్టి పట్టుదల, స్వార్థ త్యాగం, వీరత్వంల ద్వార.

క్రమశిక్షణ ఎలా పరీక్షింపబడుతోంది- శ్రామిక ప్రజలలోకి విస్తారమైన జన సముదాయాలతో, ప్రాథమికంగా కార్మికవర్గంతో, కాని శ్రామిక ప్రజలలోని కార్మిక వర్గేతర జనాలతో కూడ లంకె పెట్టుకోవడానికి, సన్నిహిత సంబంధం నిలబెట్టుకోవడానికి, కొంతవరకు లీనం కావడానికి అగ్రగామి దళం యొక్క సామర్థ్యం ద్వారా.

విప్లవ పార్టీకి అదనపు బలం ఎలా సమకూర్చబడుతుంది- ఆ విప్లవ పార్టీ చలాయించిన రాజకీయ నాయకత్వం యొక్క నిర్దుష్టత్వం, దాని రాజకీయ వ్యూహం-ఎత్తుగడల యొక్క

నిర్దుష్టత్వం ద్వార అవే నిర్దుష్టమని జనాలు తమ స్వానుభవం ద్వార గ్రహించిన పక్షంలో; అయితే ఆ పరిస్థితులు ఊరికే ఉద్భవించవనీ, వాటి సృష్టికి పిడిసూత్రం గాక, నిర్దుష్టమైన విప్లవ సిద్ధాంతం తోడ్పడుతోందని, ఆ సిద్ధాంతం నిజంగా సామూహికమైన నిజంగా విప్లవకరమైన ఉద్యమం యొక్క ఆచరణాత్మక కార్యకలాపాలతో సన్నిహిత సంబంధంతో మాత్రమే రూపుదిద్దుకొంటుందనీ కా. లెనిన్ వివరించాడు. బోల్షివిక్ పార్టీ చరిత్ర ఈ విషయాన్ని నిరూపించింది.

విప్లవపార్టీ కార్మికవర్గ చైతన్యం, అంకితభావం; ప్రజలతో ఏర్పరుచుకొనే గరిష్ట సంబంధం; వ్యూహం, ఎత్తుగడలు వాటి నిర్దుష్టత్వం, వాటిని జనాలు స్వానుభవం ద్వార గ్రహించడం ద్వారానే పార్టీలో ఉక్కు క్రమశిక్షణ నెలకొల్పబడి విప్లవాన్ని విజయవంతంగా నడిపించగలుగుతుంది. ఈ చారిత్రక అనుభవాన్ని మనం అన్వయించుకోవాలి.

పార్టీని బోల్షివీకరించడంలోని ప్రధానమైన ఒక అంశం ఏమంటే, మూడు అద్భుత ఆయుధాలను నిర్మించుటకు అవసరమైన క్రమశిక్షణను పార్టీలో నెలకొల్పడం అత్యంత ఆవశ్యకమైనది. క్రమశిక్షణ లేని పార్టీ బలవత్తరమైన రాజ్యం ముందు నిరాయుధం అవుతుంది. కాబట్టి పార్టీతో పాటు ప్రజా సంఘాలు, జనతన సర్కార్లు, పి.ఎల్.జీ.ఏ.లలో కార్మికవర్గ క్రమశిక్షణను బలోపేతం చేసేందుకు పైన చెప్పిన విషయాలలో మెరుగుదల తెచ్చే విధంగా మన కృషిని కేంద్రీకరించాలి.

పార్టీలో క్రమశిక్షణ అమలు చేసే పేరిట బ్యూరోక్రసీని అమలు చేయరాదు. ఈ అంశాలు ఒక్కొ దానితో ఒకటి కన్‌ఫ్యూజన్ చేయరాదు. పార్టీలో క్రమశిక్షణను అమలు చేయడంలో కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిని అమలు చేయాలి. పార్టీలో, ప్రజల్లో నుండి వివిధ రకాలైన అభిప్రాయాలు ముందుకు వస్తుంటాయి. ఇలాంటి అభిప్రాయాలు చూసి భయపడకూడదు. చెల్లా చెదురుగా వున్న అభిప్రాయాలను లోతైన చర్చల ద్వారానే యిందులో ఏవి సరైనవో తేల్చుకొని స్వీకరించాలి. తప్పుడు భావాలను తిరస్కరించాలి. కాని వివిధ రకాలైన అభిప్రాయాలు రావడమే క్రమశిక్షణకు వ్యతిరేకమైనదని భావించరాదు. అలా అయితే పార్టీలో సజీవత్వం నశించడమే గాక పార్టీ సైద్ధాంతిక అభివృద్ధికి నష్టం కలుగుతుంది. మన పార్టీలో జరుగుతున్న ఈ లోపాలన్ని సరిదిద్దుకోవాలి.

### 3. రెక్టిఫికేషన్ క్యాంపెయిన్

మన పార్టీలో ఉక్కు క్రమశిక్షణ నెలకొల్పడానికి స్వీయాత్మకత, స్పాంటేనిటీ, ఉదారవాదం, సెక్టేరియనిజం, బ్యూరోక్రసీ, పితృస్వామ్యం మొదలైన కార్మికవర్గేతర ధోరణులు ఆటంకంగా వున్నాయని సమీక్షించుకొన్నాం.

మన పార్టీలో అన్యవర్గ ధోరణులు తలెత్తి బలంగా కొనసాగడానికి (మన పార్టీ ఐక్యతా 9వ

కాం(గెస్‌లో చర్చించి విడుదల చేసిన) దిద్దుబాటు ఉద్యమం సర్క్యులర్‌లో చెప్పుకొన్న మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అవి పార్టీలో అన్యవర్గ పొందిక, పాలకవర్గ భావజాల ప్రభావం, కేడర్లను సిద్ధాంత పరంగా తీర్చి దిద్దడంలో వైఫల్యత అనే మూడు ప్రధాన కారణాలుగా మనం చెప్పుకొన్నాం. పార్టీలో కింది స్థాయిలో, ప్రజా సంఘాల ఫ్రాక్షన్లలో పైన పేర్కొన్న కారణాల ప్రభావం బలంగా ఉంటుంది. కాని నాయకత్వ కేడర్ల విషయానికి వస్తే వీటిని మరింత లోతుగా విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది. అన్యవర్గ ధోరణుల ప్రభావానికి గురి కావడానికి పై కారణాలను మాత్రమే చూపడం సరిపోదు. పార్టీలో నాయకత్వ కేడర్లు మార్క్సిజం – లెనినిజం – మావోయిజం సిద్ధాంత వెలుగులో విప్లవ కార్యాచరణ కొనసాగిస్తూ కూడ ఈ ధోరణులు లోతుగా కొనసాగించడాన్ని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మన పార్టీలో అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా జరిపే పోరాటానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. కాని మనం ఆశించిన విధంగా ఫలితాలు రావడం లేదని కూడ ఎప్పటికప్పుడు సమీక్షించుకొంటున్నాం. మరి అలాంటప్పుడు దీనికి ఏ విధమైన సమాధానం చెప్పుకోవాలి? నాయకత్వ కేడర్లు వర్గ పోరాటం, ఇందులో ప్రజల జీవిత సంఘర్షణను అధ్యయనం చేయడంలో వెనకబడి ఉండడం, దీర్ఘ కాలిక ప్రజాయుద్ధంలో ఆటు పోట్లలోని అంతస్సారాన్ని (ఎస్సెన్స్) గతిశీలతను (డైనమిక్స్‌ను) అర్థం చేసుకోకపోవడం, తాత్విక, సిద్ధాంత, రాజకీయ విషయాల్లో తమను తాము చైతన్యయుతంగా మలచు ((ట్రాన్స్‌ఫామ్ చేసు) కోకపోవడం వలన నాయకత్వ కేడర్లలో అన్యవర్గ ధోరణుల ప్రభావం తగ్గడం లేదు. మార్క్సిస్టులు బయట వాస్తవ ప్రపంచాన్ని గుర్తించడమే గాక, దాన్ని దాని సూత్రాలకనుగుణంగా మారుస్తారు అనే గతితార్కిక భౌతికవాద దృక్పథానికి దూరమవుతూ, అచేతనంగా పరిస్థితుల వెంట కొట్టుకొని పోవడం జరుగుతున్నది.

నాయకత్వ కేడర్లు మార్క్సిజం – లెనినిజం – మావోయిజం సిద్ధాంత వెలుగులో తమను తాము మార్చుకోవడమే ఇందుకు పరిష్కార మార్గం. అంటే ముందు తమ స్వీయా ప్రపంచాన్ని మార్చుకోవాలి. అందుకు సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడంతో పాటు నిత్యం ప్రజలతో, కేడర్లతో సంబంధాల్లో ఉంటూ, వర్గ పోరాటంలో పాల్గొనడం తప్పని సరిగా అవసరం. లేనిచో వ్యక్తులు తమకు తాము మార్పుకు గురి చేసుకోవడానికి అవసరమైన భౌతిక పునాది లేకుండా పోతుంది. మార్పుకు గురి చేసే భౌతిక పునాదిని కల్పించుకోవడం ప్రారంభిస్తే తగిన ఫలితాలు వస్తాయి. స్వార్థం కేంద్రంగా ఉండే ఎన్నో రకాల పెటీ బూర్జువా వ్యక్తీకరణలను అరికట్టి పార్టీలో తలెత్తే చెడులను నివారించవచ్చు.

మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 2001లో చేపట్టిన దిద్దుబాటు ఉద్యమంలో నాయకత్వ పాత్ర ఎలా ఉండాలనే విషయంలో స్పష్టంగా అప్పటి సర్క్యులర్‌లో కింది విధంగా రాసుకొన్నాం.

"కమ్యూనిస్టులమైన మనం, మనం చేసే ఏ పనిలోనైనా రెండు పద్ధతులను తప్పనిసరిగా అవలంబించాలి. ఒకటి, సాధారణత్వాన్ని నిర్దిష్టత్వంతో జోడించడం, ఇంకోకటి ప్రజా

బాహుళ్యంతో నాయకత్వాన్ని జోడించడం.

"ఏ కర్తవ్యం విషయంలోనైనా సార్వత్రికమైన, విస్తృతమైన పిలుపు నివ్వక పోతే విశాల ప్రజారాశులను కార్యచరణలో కదిలించజాలరు. నాయకత్వ స్థానాల్లో ఉన్న కామ్రేడ్స్ సార్వత్రిక పిలుపుకే పరిమితమైతే, దేని కోసం పిలుపు నివ్వబడిందో ఆ నిర్దిష్ట లక్ష్య సాధనకై వారు వ్యక్తిగతంగా నైనా, నిర్మాణ పరంగానైనా ఆ పిలుపును ఆచరణలో అమలు చేయడానికి నిర్దిష్టంగా పనిలోకి దిగకపోతే, ఆ అనుభవాలను పొంది ఆ అనుభవాన్ని ఇతర యూనిట్లకు మార్గదర్శకత్వం వహించడానికి వుపయోగించకపోతే, సార్వత్రిక పిలుపు సరైనదో, కాదో పరీక్షించడానికి తన సార్వత్రిక పిలుపులోని సారాంశాన్ని సుసంపన్నం చేయడానికి వారికి వీలుండదు. దాని వలన ఆ పిలుపుకు సరియైన ఫలితం రాకపోయే ప్రమాదం కూడా ఉంటుంది."

**('నాయకత్వ పని పద్ధతులకు సంబంధించి కొన్ని సమస్యలు"- మావో రచనలు 3వ సంపుటి, పేజీ నం.146)**

పై విధంగా చెప్పిన మావో మార్గదర్శకత్వాన్ని అనుసరించి దిద్దుబాటు ఉద్యమంలో నాయకత్వ పాత్ర ఎలా ఉండాలో నిర్ణయించుకొన్నాం.

**a**. నాయకత్వం దిద్దుబాటు ఉద్యమంలో స్వయంగా పాల్గొనాలి. దానికి మార్గదర్శకత్వాన్ని అందించాలి. ఆ ఉద్యమ క్రమంలో తమను తాము పరివర్తన చెందించుకోవాలి. (అందుకు కేంద్ర, రాష్ట్ర కమిటీలు ఉద్యమ క్రమంలో దొర్లిన తప్పుల విషయంలో 1995 కంటే ముందుకు వెళ్లి సమీక్షించుకోవాలి.) అందులో నాయకత్వం క్రింది కమిటీలకు ఇచ్చిన నిర్దిష్ట మార్గదర్శకత్వాన్ని బేరీజు వేసుకోవాలి.

**b**. ప్రతి ప్రాంతంలో 5 గ్రామాలను ఎంపిక చేయడం జరిగింది. నాయకత్వం ఉద్యమానికి సంబంధించి 9 అంశాలను ఎంపిక చేసి నిర్దిష్టంగా అధ్యయనం చేపట్టింది.

పైన చేపట్టిన పద్ధతి ద్వార నాయకత్వం నుండి జరిగిన తప్పుల లోతు, స్వభావం అర్థమైంది. ఈ విధంగా ఉద్యమంలో ఒక మేరకు మంచి ఫలితాలను యిచ్చింది. అయితే ఈ విధానాలను పార్టీ అంతటా కంటిన్యూ చేయకపోవడం వలన ఆశించిన స్థాయిలో తగిన ఫలితాలను పొందలేకపోయాం. ఆచరణలో జరిగిన తప్పులను లోతుగా విశ్లేషించుకొని స్వయం విమర్శ చేసుకొని, ఆ తప్పులకు గల సైద్ధాంతిక, రాజకీయ సంబంధం ఏమిటి అని తరచి చూడడం ద్వార తప్పులనుండి బయట పడడమే గాక సైద్ధాంతిక అవగాహనకు పెంపొందించుకోవవడం సాధ్యం అవుతుంది.

### 4. కేంద్రీకృత ప్రజాస్వామ్యం

పార్టీ లోపల అభిప్రాయానికి సంబంధించిన ఐక్యత, ఆచరణకు సంబంధించిన ఐక్యత; పార్టీకీ

ప్రజలకు మధ్య ఐక్యత వుండాలనేది మౌలిక సూత్రం. కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికపై పార్టీని నిర్మించడం వర్గ పంథాను, ప్రజా పంథాను అనుసరిండం ద్వారానే పై వాటిని ఖాయం చేసుకోవచ్చు. పార్టీ ఐక్యతను ఖాయం చేసుకొని, దాని కేంద్రీకృత నాయకత్వాన్ని ఇంకా బలోపేతం చేసుకొని, దాని పోరాట సామర్థ్యాన్ని ఇనుమడింప జేసుకొని, పార్టీ జీవితాన్ని జవ జీవాలతో తొణికిసలాడేలా చేయడానికి చైతన్యవంతంగా కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడం అన్నది గొప్ప ప్రాముఖ్యతగల విషయమవుతుంది. యావత్తు సభ్యత్వపు చొరవకు ఉత్ప్రేరణ కల్గించడానికి కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని ఆచరించడం ద్వారా పార్టీని ఇంకా బలోపేతం చేయవచ్చు.

సమిష్టి నాయకత్వాన్ని పటిష్టం చేయడం పార్టీలో కేంద్రీకృ ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడానికి ఒక ముఖ్యమైన షరతుగా వుంటుంది. సమిష్టి నాయకత్వం, వ్యక్తిగత బాధ్యతల సమ్మేళనాన్ని ఆచరణలో పెట్టడానికి గాను పార్టీ కమిటీ వ్యవస్థను తప్పనిసరిగా బలోపేతం చేసుకోవాలి. (వ్యూహం-ఎత్తుగడలు పుస్తకం లోని 69వ పేజీ)

పై విషయాన్ని మనం పరిశీలిస్తే కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని ప్రతి కామ్రేడ్ చైతన్యయుతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నది. అలాంటప్పుడే పార్టీలో, పార్టీ ప్రజలకు మధ్య అభిష్టంగా ఐక్యత పెంపొందడంతో పాటు పార్టీ జీవితం జవ జీవాలతో తొణికిసలాడేలా రూపొందడం సాధ్యమవుతోంది.

నాయకత్వం చురుకైనదిగా, క్రింది పార్టీ శక్తులు బలహీనంగా ఉన్నప్పుడూ నాయకత్వం అత్యంత జాగరూకతతో కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని చైతన్యవంతంగా అమలు చేయాల్సి ఉంటుంది. అలా అమలు చేయనిచో కేంద్రీకృతం పేరిట బ్యూరోక్రసీ ధోరణులు అమలులోకి వస్తాయి. లేదా ప్రజాస్వామ్యం కోసం పోరాటం అని చెప్పి బూర్జువా ప్రజాస్వామ్యంకు నకలు అయిన అతి ప్రజాస్వామ్య ధోరణులు అమలులోకి వస్తాయి. ప్రస్తుతం మన పార్టీ ఈ రెండు సమస్యలను ఎదుర్కొంటున్నది. పార్టీలో ప్రజాస్వామ్యంపై ఆధారపడిన కేంద్రీకృతం అమలులో వుండాలి. అలాంటి కేంద్రీకృతం లేని పార్టీ విప్లవాన్ని విజయవంతం చేయజాలదు. ఉద్యమం కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పుడూ పార్టీ అలాంటి కేంద్రీకృతం పై ఆధారపడాలి.

మన పార్టీలో క్రమం తప్పకుండా జరుగుతున్న ప్లీనాలు, సమావేశాల్లో జరిగే చర్చల ద్వార పార్టీలో ప్రజాస్వామిక పద్ధతులకు గ్యారంటీ ఉంటున్నది. ప్రజాస్వామిక చర్చల ద్వారానే పాలసీలు, సమీక్షలు, కర్తవ్యాలు, తీర్మానాలు రూపొందుతున్నాయి. పార్టీని ఐక్యంగా ఉంచడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతున్నది. అయితే కమిటీల పని విధానంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడంలో పార్టీ కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నది. పార్టీ కమిటీల్లో తీర్మానాలు రూపొందించడంలో, వాటిని అమలు చేయడంలో కొన్ని సార్లు కేంద్రీకృత పద్ధతికి ప్రాధాన్యతను

ఇవ్వగా, కొన్ని సార్లు అతి ప్రజాస్వామిక పద్ధతిని పాటించడం జరుగుతున్నది. కమిటీ సభ్యుల బాధ్యతలు, హక్కుల్లో కేంద్రీకృత ప్రజాస్వామ్య సారాన్ని విడిచి తోచిన విధంగా వ్యవహరించడంతో కమిటీల్లో అనైక్యతకు దారి తీస్తున్నది. మన పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలుపై మరింతగా అధ్యయనం, చర్చ అవసరము.

పార్టీ కమిటీల్లో మనం తప్పులు జరగకుండా ఉండడానికి విమర్శ – ఆత్మ విమర్శ పద్ధతిని చేపడతాం. ఇది ఒక రకంగా పార్టీ కమిటీల్లో, ప్రజల్లో వైరుధ్యాలు పరిష్కరించడానికి అనుసరించే ఏకైక పద్ధతి. మరో పద్ధతి మనకు లేదు. అయినప్పటికీ పార్టీలో ప్రజాస్వామిక జీవితం లేనిచో నిజమైన అర్థంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయనిచో విమర్శ – ఆత్మ విమర్శ పద్ధతి అనేది అన్వయించడం పూర్తిగా కుదరదు అని అంటాడు కా. మావో.

**5. నాయకత్వ కేడర్ల పనిశైలి**

"బూర్జువా, రివిజనిస్టు పార్టీల నుండి కార్మికవర్గ పార్టీని స్పష్టంగా వేరు చేసే గీటు రాళ్లలో ఒకటిగా వుండే "పనికి సంబంధించిన మూడు మహత్తర శైలుల" ను మనం తప్పక అనుసరించాలి అవి: సిద్ధాంతాన్ని ఆచరణతో మమేకం చేయడం; ప్రజలతో సన్నిహిత సంబంధాలను కలిగి వుండడం, విమర్శ, ఆత్మ విమర్శలను ఆచరించడం."**(వ్యూహం-ఎత్తుగడలు-తెలుగు పేజి నం.69)**

పైన వివరించిన మూడు పని శైలులపైన బోల్షివీకరణపై సి.ఆర్.బి. విడుదల చేసిన మొదటి సర్క్యులర్‌లో వివరంగా చర్చించడం జరిగింది.

అందులో భాగంగా మన పని శైలిని సరిదిద్దుకోవడానికి బోల్షివీకరణలో భాగంగా ఫీల్డ్ ట్రెయినింగ్ కార్యక్రమాలు చేపట్టాం. ఫీల్డ్‌లో వచ్చిన సమస్యలను మన పంథా మార్గదర్శకత్వంలో పరిష్కరించుకొన్న అనుభవాలున్నాయి. దీన్ని సిద్ధాంతాన్ని ఆచరణలో అన్వయించడంలో భాగంగానే చూడాలి.

ఇక ఇక్కడ మరో కోణంలో పని శైలిని మనం చర్చించాల్సి ఉంది. మహత్తర శ్రామికవర్గ విప్లవంలో లభించిన అనుభవాల ఆధారంగా నాయకత్వ పని శైలిపై ఈ విధంగా సి.పి.సి. వ్యాఖ్యానించింది.

కమ్యూనిస్టులమైన మనం, మన అభిప్రాయాలను దాచుకోకూడదని కా॥ మావో వ్యాఖ్యానించాడు. అందుకని కపటం లేకుండా విశాలంగా ఉండాలి, మనలో గల రాజకీయ అభిప్రాయాలను బహిరంగపరచాలి. ముఖ్యమైన రాజకీయ విషయాలపైన అభిప్రాయాలను తెల్పాలి. ఏది సరియైనది కాదో, ఏది సరియైనదో అనే విషయంలో తమ తమ అభిప్రాయాలను స్పష్టపరచాలి. దీనినే పార్టీ పనిశైలి, పార్టీ స్పిరిట్‌కు సంబంధించిన విషయంగా చూడాలి అంటూ సి.పి.సి. చెప్పింది. అది ఆ పార్టీకి అంతర్గత పోరాటం ద్వారా లభించిన గొప్ప

అనుభవం. ఆ విషయాలనే సి.పి.సి. తన 10వ కాంగ్రెస్‌లో నొక్కి చెప్పింది.

మన పార్టీలో నాయకత్వ కేడర్లు తమ పని శైలిని సరిదిద్దుకోవడానికి పైన తెల్పిన గైడ్‌లైన్స్ స్వీకరించి అమలు చేయాలి. అప్పుడే మన పార్టీ నాయకత్వం సంఘటితపడడానికి అవకాశం వుంటుంది. కఠిన పరిస్థితుల్లో ఊగిసలాడే వారిని, పార్టీ పంథాపై అనుమానాలు తలెత్తే వారిని గుర్తించి వారితో అంతర్గత పోరాటం నిర్వహించడానికి వీలవుతుంది. తద్వారా పార్టీ కమిటీల్లో ఐక్యత పెంపొందించడానికి వీలవుతుంది. తప్పులు చేసే వారిని, విమర్శ-ఆత్మ విమర్శ పద్ధతిలో సరిచేసే అవకాశం ఉంటుంది. ఈ మధ్య కాలంలో మన పార్టీ చరిత్రలో పండా, జి.వి.కె. ప్రసాద్, శ్రీ రాముల శ్రీనివాస్ లాంటి విద్రోహులు పుట్టుకరావడం మనం ఎరిగిందే. వీరు మనకు నెగటివ్ గురువులు. కాబట్టి మనం మహత్తర శ్రామికవర్గ విప్లవం అందించిన గొప్ప అనుభవాలను అంది పుచ్చుకోవాలి.

### 6. పాత తప్పుల నుండి నేర్చుకొని భవిష్యత్తులో తప్పులను నివారించాలి

మన పార్టీ చరిత్రలో నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటం మొదలు ఏ.పి., ఎన్.టి., ఏ.వో.బీ. వుద్యమాలు సెట్‌బ్యాక్‌కు గురైన సందర్భాల్లో మనం తీసుకున్న గుణపాఠాలు మనకు మంచి అనుభవాలు. ఈ పది సంవత్సరాల కాలంలో దేశవ్యాప్త ఉద్యమంలో సంభవించిన పరిణామాలు కూడ మంచి అనుభవాలుగా ఉన్నాయి. ఈ అనుభవాలను అధ్యయనం చేసి, పాత తప్పుల నుండి నేర్చుకొని భవిష్యత్తులో మళ్లీ అవే తప్పులు చేయకుండా ఉంటే విప్లవోద్యమాన్ని మనం అభివృద్ధి పరచగలం. కాని మనం యిప్పటి వరకూ ఈ అధ్యయనం పై సీరియస్ కృషి జరప లేదు. ఎక్కడి అనుభవాలు అక్కడే ఉండిపోతున్నాయి. చాల వరకు ఈ అనుభవాలు లిఖిత రూపంలోనే వున్నాయి. వాటిని ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేయడం అవసరం. విప్లవోద్యమాన్ని అణచడంలో శత్రువుకు లభించిన అనుభవాలను వాడు సింథసైజ్ చేసి దేశవ్యాప్తంగా వాటిని అన్వయించి అణచివేత చర్యలు చేపడుతున్నాడు. మన పార్టీ నాయకత్వం ఒక మేరకు ఆ అనుభవాలను అధ్యయనం చేసినప్పటికీ పార్టీ అంతటా వాటిపై ఎడ్యుకేషన్ తక్కువగానే ఉంది. ప్రత్యక్ష అనుభవం పొందిన పార్టీ నాయకత్వం కూడ పదే పదే అవే తప్పులు చేస్తూనే ఉంది. బొట్టెం, రామగూడ ఎన్‌కౌంటర్లు అందుకు తాజా ఉదాహరణలుగా మనం చెప్పుకోవచ్చు. మనం తప్పులను నివారించడానికి శత్రు ఎత్తుగడలను అర్థం చేసుకోవడంతోనే సరిపోదు. పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏ.ను క్రమశిక్షణ, పోరాట నియమాలపై గట్టిగా తర్ఫీదు చేసుకోవాలి. పార్టీ ఉన్నత నాయకత్వం మొదలు క్రింది స్థాయి వరకు అన్యవర్గ ధోరణులను అరికట్టడానికి ఎప్పటికప్పుడూ విమర్శ – ఆత్మ విమర్శ పద్ధతిని చేపట్టాలి. నాయకత్వం ఈ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మార్పు తీసికొని రాకపోయినట్లైతే మనకు మళ్ళీ నష్టాలు జరుగుతాయి. శత్రువు ఎన్ని రకాల ఎత్తుగడలు ప్రయోగించినప్పటికీ యుద్ధాల్లో

మోసపు ఎత్తుగడలకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుంది. ఎల్.ఐ.సి. సిద్ధాంతంలో కూడ ఇది ముఖ్యమైన విషయమే. కాబట్టి శత్రువు ఉపయోగించే మోసపు ఎత్తుగడల్లో భాగంగా కోవర్ట్లను, ఇన్‌ఫార్మర్స్‌ను ఉపయోగించడం, మానసిక యుద్ధాన్ని కొనసాగించడానికి అవలంభించే తప్పుడు ప్రచారాలు వగైరా సాధారణంగా ఉంటాయి. కర్ర–కందా విధానాలు, వుద్యమ నిర్మూలన ఎత్తుగడలు ఉంటాయి. వాటిని సరిగా అర్థం చేసుకొని మనం వాటి పట్ల సరిగా వ్యవహరిస్తే చాల నష్టాలను నివారించుకోవచ్చు. అందుకోసం మనం నాయకత్వంగా గత గుణపాఠాలను సీరియస్‌గా అధ్యయనం చేయాలి. ఉద్యమంలో విజయాలు లభించిన దగ్గర ఈ విషయాలపై నాయకత్వం నిర్లక్ష్యంగా ఉండరాదు. నాయకత్వం ఎప్పుడూ ముందు చూపుతో వుండాలి.

### 7. సామాజిక, ఆర్థిక పరిశోధన

“సామాజిక, ఆర్థిక పరిశోధన లక్ష్యం ఏమిటంటే, వర్గ బలగాల గురించి సరైన అంచనాకు రావడం, ఆ తదుపరి పోరాటానికి సరైన ఎత్తుగడలను రూపొందించుకోవడం కోసం దానిని వుపయోగించుకోవడం”

“వాస్తవ పరిస్థితిని గురించిన పరిశోధన లేక పోతే, అప్పుడు వర్గాల గురించి భావవాద అంచనా, పనిలో భావవాద మార్గదర్శకత్వమూ విధిగా చోటు చేసుకుంటాయి. ఇవి అవకాశవాదానికి గాని, దుందుడుకు తత్వానికి గాని దారితీస్తాయి”

వాస్తవాత్మక పరిశోధనలు చేయకపోతే యధాతథా భావనలకు కొట్టుకొని పోతారని కా. మావో హెచ్చరిస్తాడు.

మన పార్టీ ప్రారంభం నుండి సామాజిక, ఆర్థిక, (వర్గ) పరిశోధనపై కేంద్రీకరించి పని చేసింది. వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవం జయప్రదం చేసే లక్ష్యంతో మనపార్టీ చేపట్టిన ఈ పరిశోధన మన పార్టీని వ్యవసాయ విప్లవంలో అగ్రగామిగా నిలబెట్టింది. సకాలంలో వివిధ వర్గాలను గుర్తించడం వలన గ్రామీణ ప్రాంతాల్లో మిత్రులు, శత్రువులు ఎవరో గుర్తించి వర్గ పోరాటాల్ని సరియైన దిశలో అభివృద్ధి చేయడానికి దోహదపడింది. దాదాపు పార్టీ నిర్వహించిన ఈ వర్గ పరిశీలన అంతా శత్రు తీవ్ర నిర్బంధం మధ్యలోనే అకుంఠిత దీక్షతో పార్టీ కేడర్లు నిర్వహించారు. పార్టీ కమిటీలు వివిధ సందర్భాల్లో చేపట్టిన వర్గ పరిశీలన రిపోర్టులను సంశ్లేషించి ఉద్యమ ఎత్తుగడలను రూపొందించారు. అయితే ఉద్యమం కలిగించిన ప్రభావం, వుద్యమాన్ని ఎదుర్కొవడానికి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో పాటు నూతన ఆర్థిక విధానాల వలన 90వ దశకం నుండి గ్రామీణ ప్రాంతాల్లో త్వర త్వరగా మార్పులు జరుగుతున్నాయి. ఈ మార్పులపై దేశవ్యాప్తంగా వివిధ రకాలుగా వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇందులో చాల వరకు మన పార్టీ పంథాపై దాడిని ఎక్కుపెట్టే వాదనలు ముందుకు వస్తున్నాయి. ఈ వాదనలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మన పార్టీపై ఉంది.

అట్లాగే మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేయనిచో ఉద్యమానికి దిశా నిర్దేశం చేయలేం. కాబట్టి వర్గ పరిశీలన అన్ని రాష్ట్రాల్లో చేపట్టాలని 2014లో తీర్మానించాం. దాని ప్రకారం అన్ని రాష్ట్రాల్లో వర్గ పరిశీలనపై కేంద్రీకరించి పని సాగుతున్నది. ఇది మంచి అంశంగా చెప్పవచ్చు. వర్గ పరిశీలనను పూర్తి చేసి, కేంద్ర, రాష్ట్ర కమిటీలు వీటిని సంశ్లేషించి నూతన ఎత్తుగడలను వెంటనే రూపొందించాలి. వర్గ పరిశీలన శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారానే మనకు వాస్తవమైన సమాచారం లభిస్తుంది. దానిపై ఆధారపడి సరియైన ఎత్తుగడలను రూపొందించడం వీలవుతుంది. వ్యూహాత్మక ప్రాంతాలు, మైదాన ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో కూడ వర్గ పరిశీలన చేయడం అవసరం. ఈ మొత్తం ప్రక్రియలో నాయకత్వం తప్పనిసరిగా పాల్గొనాలి. ఏ పద్ధతిలో వర్గ పరిశీలన చేయాలో కేడర్లకు గైడ్‌లైన్స్ ఇవ్వడంతో పాటు నాయకత్వం పాల్గొన్న దగ్గర స్వంత నోట్స్ కూడ తయారు చేసుకోవాలి. అప్పుడే నాయకత్వానికి మంచి పట్టు ఏర్పడుతుంది. సంశ్లేషణ కార్యక్రమాల్లో నాయకత్వం చురుకుగా పాల్గొనాలి. రూపొందించిన ఎత్తుగడలను అమలు చేసే ప్రక్రియలో కూడ నాయకత్వం పాల్గొనాలి. అలాంటప్పుడే నాయకత్వం మెరుగ్గా ఎడ్యుకేట్ కాగలుగుతుంది. మావోయిజాన్ని అన్వయించడమంటే ఇదే. అప్పుడే పార్టీ పంథాపై దాడి చేసే వారికి సమాధానంగా మైదాన, పట్టణ ప్రాంతాలతో సహా దేశవ్యాపితంగా విప్లవకర ప్రజా ఉద్యమాలను నిర్మించగలుగుతాం.

### 8. గెరిల్లా యుద్ధంలో-ప్రజాయుద్ధంలో క్రియాశీలంగా పాల్గొనడంలోని లోపాలను సరిదిద్దుకుందాం

మన రాజకీయ పంథా-మిలిటరీ పంథాలను విడదీయలేం. మన విప్లవంలో దోపిడీ వర్గాలను అధికారం నుండి కూలదోసి పీడిత వర్గాల అధికారాన్ని నెలకొల్పాలంటే యుద్ధం ప్రధాన పోరాట రూపమని, సైన్యం ప్రధాన నిర్మాణ రూపమని మనం స్పష్టంగానే నిర్దేశించుకున్నాం. గడ్డు స్థితిని అదిగమించాలంటే అది కేవలం పీ.ఎల్.జీ.ఏ. పని, బాధ్యత అనే తప్పుడు అవగాహన పార్టీలో అన్ని స్థాయిల్లో తరతమ తేడాలతో ఉంది. దీనికి తోడు త్యాగ సంసిద్ధత లోపించడం వల్ల అది ఎన్నో రూపాలుగా మన వర్గ పోరాటాన్ని-ప్రజా యుద్ధాన్ని నెగెటివ్‌గా ప్రభావితం చేస్తూ గడ్డుస్థితిని అధిగమించడానికి సాగించాల్సిన రాజకీయ-సైనిక కృషి చాల పరిమితులతో, బలహీనతలతో, లోపాలతో సాగుతున్నది. అందుకోసం ముఖ్యంగా మన నాయకత్వ శక్తుల్లో త్యాగ సంసిద్ధతను పెంచాలి. త్యాగానికి-స్వీయ రక్షణకున్న తాత్విక సంబంధాన్ని / గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకుని గెరిల్లా యుద్ధ నియమాలను పాటించేలా చేస్తే ప్రజాయుద్ధంలో అనవసరమైన నష్టాలను నివారించుకుంటూనే, అవసరమైన త్యాగాలు చేస్తూ ప్రజాయుద్ధంలో ధైర్య సాహసాలతో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయగలం. అపుడు మన పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. శక్తి ఎన్నో రెట్లు పెరుగుతుంది. అది గడ్డు స్థితిని అధిగమించడానికి ప్రాతిపదికగా నిలుస్తుంది. వీటికి తోడు శత్రువు

బలాన్ని-బలహీనతలను నిరంతరం అధ్యయనం చేయాలి. అందులో భాగంగా ఫీల్డ్ ఆపరేషన్‌లలో శత్రువు బలహీనతలను అధ్యయనం చేస్తూ, వాటిపై ఆధారపడి శత్రువును దెబ్బతీసేలా మన ఎత్తుగడలను రూపొందించుకొని గెరిల్లా యుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేయాలి.

## 9. ప్రజాసంఘాల పార్టీ ఫ్రాక్షన్లలో కార్మికవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుదాం

మన పార్టీ ప్రజాసంఘాల ఫ్రాక్షన్లలో స్వీయాత్మకత ఎమ్.ఎల్.ఎం సిద్ధాంతాన్ని నిర్లక్ష్యం చేయడం వలన వ్యక్తమవుతున్నది. చాలా మంది కామ్రేడ్స్ ఇతరేతర సిద్ధాంతాలు, సాహిత్యంపై పెట్టిన శ్రద్ధ మార్క్సిజం, లెనినిజం, మావోయిజంను అధ్యయనం చేయడంపై శ్రద్ధ పెట్టడం లేదు. ఫలితంగా వీరిలో మార్క్సిస్టు దృక్పథం స్థానంలో పెటీ బూర్జువా దృక్పథం అభివృద్ధి చెందుతున్నది. సమస్యలను అర్థం చేసుకోవడంలోనూ, పరిష్కరించడంలోనూ గతితార్కిక దృక్పథాన్ని, పద్ధతిని అనుసరించడం లేదు. భావవాద, అతి భౌతికవాద దృక్పథాలకు, పద్ధతులకు ప్రభావితులవుతున్నారు. ముఖ్యంగా సామ్రాజ్యవాదుల నుండి దిగుమతి అయిన ఆధునికానంతరవాదం (పోస్టు మోడర్నిజం) వంటి సిద్ధాంతాల వైపు కొట్టుకుపోవడం జరుగుతున్నది. దీంతో వారి ఆలోచనలు, కార్యాచరణ విప్లవోన్ముఖంగా వుండడం లేదు. ప్రస్తుత వ్యవస్థలోనే సంస్కరణలు కోరే విధంగా వుంటున్నాయి. సిద్ధాంత అధ్యయనంతో పాటు, నిర్దిష్ట అధ్యయనం వుండడం లేదు. ప్రజలలోకి వెళ్ళి సమస్యలను తెలుసుకొనే కృషి నామమాత్రంగా వుంటున్నది. ఈ బలహీనత కారణంగా ప్రజలను వుద్యమాలలోకి కదిలించే విధంగా సరైన నిర్మాణ, పోరాట రూపాలు చేపట్టలేకపోతున్నారు. ఏవైనా విషయాలను తెలుసుకోవాలన్నా, మార్చాలన్నా సిద్ధాంత అవగాహనతో పాటు, ఆచరణ కీలకమైనది అవుతుంది. అయితే మన ఫ్రాక్షన్‌లు/ప్రజా సంఘ నాయకత్వం లోతైన ఆచరణ కలిగి వుండడం లేదు. ఈ ధోరణితో పాటు ఉదారవాదం, యాధృచ్ఛికత, పెత్తందారీతనం, ఒంటెత్తు పోకడ, వ్యక్తివాదం, పితృస్వామ్యం కొనసాగుతున్నాయి. ఈ ధోరణుల వలన ప్రజాసంఘాల నాయకత్వంలో ఐక్యత కొరవడి ఉద్యమానికి నష్టం జరుగుతున్నది. నాయకత్వం ప్రధానంగా పెటీబూర్జువా వర్గం నుండి పార్టీలోకి వచ్చింది. వీరి వర్గ స్వభావాన్ని మార్చుకోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరగక పోవడం వలన పై పెథ ధోరణులు బలంగా వ్యక్తమవుతున్నాయి. కాబట్టి వీరంతా మార్క్సిజం- లెనినిజం- మావోయిజం అధ్యయనం చేయడంతో పాటు విప్లవ కార్యాచరణను రూపొందించుకొని ప్రధానంగా ప్రజల నుండి నేర్చుకోవాలి. తమ మౌలిక దృక్పథాన్ని మార్చుకొని మంచి కమ్యూనిస్టులుగా వారిని వారు తీర్చి దిద్దుకోవాలి.

## 10. పార్టీలో అంతరంగిర చర్చ

మావోయిస్టు పద్ధతిని అనుసరించి పార్టీలో తలెత్తే సమస్యలను (భిన్నాభిప్రాయాలను) గతి తార్కిక పద్ధతిలోనే పరిశీలించాలి.

“మన అనుభవాలను మదింపు చేసే ప్రక్రియ కూడ ఒకానొక్క విశ్లేషణ– సంశ్లేషణయే. మనుషులు తమ సామాజిక ఆచరణలో వివిధ రకాలైన పోరాటాల్లో పాల్గొనడం ద్వారా సంపద్వంతమైన అనుభవాలను సంపాదిస్తారు. అందులో కొన్ని విజయవంతమైనవి కాగా మరికొన్ని అపజయాలు ఉంటాయి. అనుభవాలను మదింపు చేసేటప్పుడు ఇందులో సరియైనవి ఏవో? తప్పులు ఏవో? గుర్తించి సరియైన వాటిని ఎత్తి పట్టాలి. తప్పులను తిరస్కరించాలి. దీని అర్థమేమంటే, మార్క్సిజం –లెనినిజం –మావోయిజం గైడెన్స్‌లో ఆచరణ నుండి లభించే సంపద్వంతమైన డేటా అభివ్యక్తి (data perception) పునర్నిర్మాణం చేయడం. “చెత్తను తొలగించడం మరియు అవసరమైన దాన్ని ఎంపిక చేయటం, వాస్తవాన్ని నిలిపి ఉంచటానికి తప్పులను తొలగించడం, ఒక దాని నుండి మరొక దాన్ని ఎంపిక చేయటం, బయట నుండి లొపలికి చేరటం” ద్వారా అభివ్యక్తి జ్ఞానం నుండి తార్కిక జ్ఞానానికి ఎదిగించడం ద్వారా వస్తువులోని అంతర్గత నియమాలను గ్రహించాలి. విరుద్ధ శక్తుల మధ్య చలనం – ఈ ప్రక్రియ గుండానే ఒకటి రెండుగా విభజింపబడుతుంది. ఈ విధానం ద్వారా మన అనుభవాలను మదింపు చేయుటం ద్వారానే మనం సత్యాన్ని ఎత్తిపట్టడంతో పాటు తప్పులను సరిదిద్దుకోగలుగుతాం.”

“మన విజయవంతమైన అనుభవాలను జనరంజకం చేయటంతో పాటు తప్పుల నుండి గుణపాఠాలను తీసుకోగలుగుతాం.”**(పెకింగ్ రివ్యూ పత్రిక వాల్యూం 16.నెం. ఆగస్టు 3–1973 నుండి)**

మన ఉద్యమం దేశవ్యాప్తంగా నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. అయితే వివిధ జోన్లలోని ఉద్యమ స్థాయిల్లో అసమానతలు ఉన్నాయి. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల కాలం నుండి నేటి వరకు మన విప్లవోద్యమంలో అనేక అనుభవాలను పొందాం. ఎప్పటికప్పుడు మనం వీటిని క్రోడీకరిస్తూ, వాటి ఆధారంగా ఉద్యమాన్ని పురోగమింప చేస్తున్నాం. ఈ ప్రక్రియను మనం ఎక్కడికక్కడ చేపట్టాలి. కాని ప్రస్తుతం సమీక్షల ద్వార ఒక ప్రాంతంలో పొందిన అనుభవాలను ఇతర ప్రాంతాల్లో అన్వయించడం గానీ, పోల్చి చూడడం గాని చేయడం లేదు. దీని వలన ఎక్కడి అనుభవాలు అక్కడే ఉండిపోయి తగిన ఫలితాలు పొందలేకపోతున్నాం. అందుకని దేశవ్యాప్త వుద్యమంలో వివిధ రాష్ట్రాల, ప్రాంతాల సమీక్షలను అధ్యయనంలో భాగం చేసుకొని చర్చించాలి. ఆ యా రాష్ట్రాల ఉద్యమ చరిత్రలను కేడర్లకు క్లాసుల రూపంలో విద్యాబోధన చేయాలి.

పార్టీలో మనం అంతరంగిక చర్చలో మావో బోధించిన పై గతితార్కిక పద్ధతిననుసరించటం వలన మన పాజిటివ్ అనుభవాలను మదింపు చేసుకొని ఉద్యమాలను ఉన్నత స్థాయికి తీసికెళ్ళటంతో పాటు పార్టీ సిద్ధాంత రాజకీయ స్థాయిని పెంపొందించగలం.

**డియర్ కామ్రేడ్స్,**

ఈ సర్క్యులర్‌లో చెప్పినట్లుగా మార్క్సిజం –లెనినిజం –మావోయిజం సిద్ధాంతంపై పట్టు సంపాదించాలి; మనం కార్యక్షేత్రాల్లో ప్రజలతో సజీవ సంబంధాలు పెంచుకొని వాస్తవ పరిస్థితులపై పరిశోధన జరపాలి; మనం సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయించడం, ఆచరణను మదింపు చేస్తూ మన సైద్ధాంతిక స్థాయిని అభివృద్ధి పరుచుకోవాలి; అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా నిరంతరాయంగా పార్టీలోనూ, మనలోనూ పోరాటం చేపట్టాలి. ప్రత్యేకంగా నాయకత్వ కామ్రేడ్స్ ఈ పోరాటాన్ని సాగించాలి. మొత్తం పార్టీ యొక్క సైద్ధాంతిక స్థాయిని పెంపొందించడం మన లక్ష్యంగా ఉండాలి. ఈ మొత్తం ప్రక్రియలో లీడర్ షిప్ బోల్సివైజేషన్ కావడం ఒక ముందస్తు షరతుగా ఉంటుంది.

బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో మనం సాధించుకున్న మంచి ఫలితాలు పైన చెప్పుకున్నాం. వాటిపై ఆధారపడి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకున్నాం. వీటిలో నాయకత్వం తన సిద్ధాంత, రాజకీయ స్థాయిని, నిర్మాణ దక్షతను పెంచుకోవడం ప్రధానంగా చెప్పుకున్నాం. ఈ మధ్య కాలంలో జరిగిన పార్టీ ప్లీనాలలో సైతం ఈ కర్తవ్యాన్ని చేపట్టి ఉన్నాం. ఇది ఈనాటి తక్షణ అవసరం. శత్రువు 2017లో, నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని వాడి దాడులను కేంద్రీకరిస్తాననీ బహిరంగంగా సవాళ్ళు విసురుతున్నాడు. మిషన్ 2016 చేపట్టి మధ్య రీజియన్‌లోని అన్ని రాష్ట్రాలలో మన పార్టీకి వివిధ స్థాయిలలో నష్టాన్ని కలిగించాడు. ఆ విషయాన్ని మన సి.సి. అందించిన 'వుద్యమ స్థితిపై అంచనాలు' సర్క్యులర్‌లో స్పష్టంగానే పేర్కొంది. రానున్న సంవత్సరాలు మనకు తీవ్ర పరీక్ష కాలం అన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. గత నాలుగు దశాబ్దాల ఉద్యమాన్ని నిలుపుకుంటూ పురోగమింపచేయడం అనేది వర్తమాన నాయకత్వ శక్తుల బోల్షివీకరణపైనే ఆధారపడి ఉంది. కాబట్టి గత క్యాంపెయిన్ అనుభవాలపై దృఢంగా నిలిచి మన విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి యావత్తు పార్టీ దృఢంగా, సమైక్యంగా సవాళ్ళను స్వీకరిస్తూ వాటిని ఓడించే లక్ష్యంతో బోల్షివిక్ పట్టుదలతో పోరాడుదాం.

**విప్లవాభివందనాలతో,**

**సెంట్రల్ రీజియన్ బ్యూరో**

**ఫిబ్రవరి 2017** **సి.పి.ఐ. (మావోయిస్టు)**

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ
యాభయ్యవ వార్షికోత్సవ సంపుటి

# మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం ఎన్నటికీ ప్రకాశిస్తూనే ఉంటుంది

దస్తావేజుల, వ్యాసాల, ఖండికల, ఉల్లేఖనల సంకలనం

మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ లక్ష్యం ఏంటంటారు?...

పదవుల్లో ఉంటూ పెట్టుబడిదారీ మార్గం పట్టిన వారిపై పోరాటం చేయడం ప్రధాన కర్తవ్యమే. కానీ, ఏ విధంగా చూసినా అది లక్ష్యం కాదు. ప్రాపంచిక దృక్పథం సమస్యను పరిష్కరించడమే అసలు లక్ష్యం. అది రివిజనిజంను కూకటివేళ్ళతో తుడిచిపెట్టే సమస్య - మావో

కేంద్రకమిటీ

సి.పి.ఐ(మావోయిస్టు), మార్చి 2017